

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 332

శనివారం 22-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

విమెన్ ఆఫ్ ది ఇయర్

'హర్‌గిలా కొంగలు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నాయి. వాటిని మనమే రక్షించుకోవాలి' అని ఊరూరు తిరుగుతూ ప్రచారం చేసేది పూర్ణిమాదేవి. 'అలాగే' అన్నవారి కంటే 'మాకేమీ పనిలేదనుకుంటున్నావా' అని ముఖం మీద చెప్పిన వాళ్లే ఎక్కువ. తాను భుజానికెత్తుకున్న పని ఎంత ముఖ్యమైనదో కాలక్రమంలో ప్రజలకు అవగాహన కలిగించడంలో పూర్ణిమాదేవి విజయవంతం అయింది. తాజా విషయానికి వస్తే... అస్సాంకు చెందిన జీవశాస్త్రవేత్త, వైల్డ్‌లైఫ్ కన్జర్వేషనిస్ట్ పూర్ణిమాదేవి బర్మాన్ 'టైమ్' మ్యాగజైన్ 'విమెన్ ఆఫ్ ది ఇయర్' జాబితాలో చోటు సాధించింది. ఈ జాబితా కోసం ప్రపంచ వ్యాప్తంగా ఎంపిక చేసిన 13 మంది మహిళలలో మన దేశం నుంచి ఎంపికైన ఏకైక మహిళ పూర్ణిమాదేవి బర్మాన్...



● పూర్ణిమ

గూడు కట్టుకున్న పక్షి ప్రేమ

బ్రహ్మపుత్ర నదికి దగ్గర్లోని అమ్మమ్మ వాళ్ల ఇంట్లో పెరిగింది పూర్ణిమ. 'ఈరోజు నీ స్నేహితులను చూపిస్తాను వస్తావా?' అని నవ్వుతూ అడిగింది అమ్మమ్మ.

'పద వెళదాం' అంటూ రెడీ అయిపోయింది పూర్ణిమ. అది తన జీవితాన్ని మార్చిన రోజు. పక్షుల ప్రపంచాన్ని పరిచయం చేసిన రోజు. ఆరోజు మొదలు ప్రతిరోజూ అమ్మమ్మతోపాటు పంట పొలాల్లోకి వెళ్లి పక్షులతో మాట్లాడడం నుంచి వాటి మధుర గానాన్ని వినడం వరకు ఎన్నో చేసేది.

జువాలజీలో మాస్టర్స్ చేసిన పూర్ణిమ గ్రేటర్ అడ్జటంట్ జాతికి చెందిన హర్‌గిలా కొంగలపై పీహెచ్‌డీ చేయాలనుకున్నప్పుడు అవి అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్నాయనే చేదునిజం తెలిసొచ్చింది. ఆ సమయంలో తనకు అకాడమిక్ ఆలోచనల కంటే ఉద్యమ స్థాయిలో ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది.

'పక్షులను రక్షించడం కోసం ఇప్పుడు ఒక సైన్యం కావాలి' అనుకుంది. ఎవరి ప్రపంచం వారిది అయిపోయిన ఈ ప్రపంచంలో తన కలల సైన్యంలోకి ఎవరు మాత్రం వస్తారు?

అయితే.. మనం ఒక మంచిపనికి నడుం బిగిస్తే అది విజయవంతం అయ్యేలా ప్రకృతి ఆశీర్వదిస్తుందట. అది నిజమేనేమో... ఒక్కరొక్కరుగా ఎంతోమంది మహిళలు 'హర్‌గిలా' సైన్యంలో చేరడం మొదలైంది. హర్‌గిలా ఆర్మీలో ఇప్పుడు ఇరవై వేల మంది మహిళా సైనికులు ఉన్నారు.



ఆరోజు ఎంతగా అవమానించారో!

ఆరోజు ఒక గ్రామానికి వెళ్లాను. ఒక వ్యక్తి తొమ్మిది గూళ్లు ఉన్న చెట్టును నరికివేయడం. పక్షి పిల్లలు చనిపోవడం చూశాను. నాకు చాలా బాధగా అనిపించింది. ఆ గ్రామస్థుడితో మాట్లాడే సాహసం చేశాను. అప్పుడు చుట్టుపక్కల వాళ్లు వచ్చారు. అంతమంది మగవాళ్ల మధ్య నేను ఒంటరి అయ్యాను. చెట్టు నరికిన వ్యక్తి తాను చేసింది తప్పు అనుకోలేదు. పైగా నాతో కోపంగా మాట్లాడాడు. నీకు పక్షులపై అంత ప్రేమ ఉంటే మా ఇంట్లో పనిమనిషిగా చేరు. పక్షుల మల మూత్రాలు శుభ్రం చేయడం లాంటి పనులు చెయ్యి అని అరిచాడు. అక్కడ ఉన్న వాళ్లు కూడా తిట్టడం మొదలుపెట్టారు. నువ్వు వచ్చింది హర్‌గిలాను రక్షించడానికి కాదు వాటి మాంసాన్ని తినడానికి అని ఒకరు తిట్టారు. హర్‌గిలాను రక్షించుకోవాలంటే ప్రయోగశాలలో శాస్త్రీయ పరిశోధనలు మాత్రమే సరిపోవు అనే విషయం అప్పుడు నాకు అర్థమైంది. ముందు ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు తీసుకురావాలి అనిపించింది. ఆ ఆలోచనే హర్‌గిలా ఆర్మీకి బీజం వేసింది.

– పూర్ణిమాదేవి బర్మాన్

హర్‌గిలా పక్షిని 'స్కావెంజర్' అని పిలుస్తారు. నీటికాలుష్యాన్ని నివారించడం నుంచి పరిసరాల శుభ్రత వరకు అవి ఎన్నో రకాలుగా మానవాళికి మేలు చేస్తాయి. 'హర్‌గిలాను రక్షించుకోవడం అంటే ప్రకృతిని రక్షించుకోవడమే' అనే నినాదంతో హర్‌గిలా ఆర్మీ ప్రజల్లోకి వెళ్లింది. గాయపడిన కొంగలకు చికిత్స చేయడం, గూడును ఏర్పాటు చేయడం, రకరకాల ఉత్సవాలు నిర్వహించడం... ఇలా ఎన్నో కార్యక్రమాల ద్వారా ప్రజలలో మార్పు తీసుకువచ్చింది. మూడు పదులు దాటని కొంగల సంఖ్య ఇప్పుడు నాలుగు వందలు దాటేలా చేసింది.

'కొంగలకు సోదరి' అంటూ పూర్ణిమాదేవిని ప్రజలు ప్రేమగా పిలుచుకుంటారు.

అస్సాం సంప్రదాయ దుస్తులపై హర్‌గిలా బొమ్మలు వేస్తూ పర్యాటకులకు విక్రయించడం అనేది స్థానిక మహిళలకు జీవనోపాధిగా మారింది. 'హర్‌గిలా' ఆర్మీ అస్సాంకే పరిమితం కాలేదు. దేశంలోని ఎన్నో ప్రాంతాలకు విస్తరించింది.

కంబోడియా, ఫ్రాన్స్ పాఠశాలల్లో పూర్ణిమ చేసిన విశేష కృషి గురించి పాఠాలుగా చెబుతున్నారు.

'సమాజంలో మార్పు తీసుకు వచ్చే శక్తి మహిళల్లో ఉంది' అంటుంది పూర్ణిమాదేవి బర్మాన్.

పురుషుల నుంచి అవమానాలు, తిట్లు, వెటకారాలు ఎదురైనప్పుడు ఆమెకు అండగా నిలబడింది మహిళలే. 'హర్‌గిలా' రూపంలో తన అసాధారణ కలను సాకారం చేసింది మహిళలే!

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం

చేతివృత్తులకు చేయూత

ఓనర్‌షిప్

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి ఉన్న పథకాలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెట్ మెలకువలు, అందుతున్న రుణాలు, వడ్డీ రేటు, సబ్సిడీలు, ఎక్కడ.. ఎలా దరఖాస్తు చేసుకోవాలి, అవసరమైన డాక్యుమెంట్లు, సక్సెస్ రేట్ వంటి వివరాలను "ఓనర్'షి'ప్" పేరుతో ప్రతి శనివారం అందిస్తున్నాం! ఈ వారం స్కీమ్ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం.



సంప్రదాయ చేతివృత్తులు చేసే వెనుకబడిన వర్గాల కోసం ప్రారంభించిన కేంద్రప్రభుత్వ పథకం ఇది. దీని కింద మూడు లక్షల రూపాయల వరకు రుణసదుపాయాన్ని పొందవచ్చు.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి

దగ్గరలోని మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. ఫోన్ నంబర్‌తో లింక్ అయిన ఆధార్‌కార్డ్, అడ్రస్ ప్రూఫ్‌గా రేషన్‌కార్డ్, రేషన్‌కార్డ్‌లోని కుటుంబ సభ్యులందరి ఆధార్‌కార్డ్‌లు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పాస్‌బుక్ సమర్పించాలి. వేలిముద్ర వేయాలి. అయితే రేషన్‌కార్డ్‌లోని కుటుంబ సభ్యులెవరైనా ఆదాయపన్ను కడుతున్నా, అంతకు ముందు ముద్రాలోన్స్ కానీ, పీఎమ్‌ఈజీపీ పథకాలేవైనా కానీ పొంది ఉన్నా ఈ పథకానికి అనర్హులు. ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నా ఈ పథకం వర్తించదు. దరఖాస్తులో పూర్తి వివరాలు నింపిన తరువాత మీ సేవాకేంద్రంలోనే వారే రుణాన్ని అందించే బ్యాంకును సూచిస్తారు. దరఖాస్తు సచివాలయానికి వెళ్తుంది. తనిఖీ పూర్తయ్యాక లోన్‌కి అనుమతి ఇస్తారు. అప్పుడా దరఖాస్తు కేంద్రప్రభుత్వానికి వెళుతుంది. వాళ్లు అప్రూవల్ సర్టిఫికెట్, ఐడీ కార్డ్‌ను మంజూరు చేస్తారు. ఈ ప్రక్రియ తర్వాత మండలకేంద్రంలోని ఫ్రీ ట్రైనింగ్ సెంటర్‌లో అయిదు రోజులు ట్రైనింగ్ తీసుకోవాలి. దానిపైన 15 రోజులు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్‌ను కూడా పొందవచ్చు. రోజుకు రూ. 500 చొప్పున శిక్షణాకాలంలో స్టైపండ్ ఉంటుంది. ఈ మొత్తాన్ని శిక్షణ ముగిసిన తరువాత అభ్యర్థుల బ్యాంక్ ఖాతాలో జమచేస్తారు. ట్రైనింగ్ పూర్తయిన వారికి 15 వేల రూపాయల టూల్ కిట్ లేదా రూ. 15 వేల 'ఈ – రూపీ' వోచర్‌ను ఇస్తారు. అభ్యర్థులు సంబంధిత షాప్స్‌లో 'ఈ-రూపీ' వోచర్‌ను ఇచ్చి టూల్ కిట్‌ను పొందవచ్చు.

లోన్ విషయానికి వస్తే తొలి విడతగా 40 పైసల వడ్డీతో లక్ష రూపాయలను ఇస్తారు.18 నెలల కాలంలో ఆ రుణాన్ని చెల్లించేశాక, మలి విడతగా 30 నెలల టెన్యూర్‌తో రెండు లక్షల రూపాయల రుణాన్ని పొందవచ్చు. అయితే అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ తీసుకున్నవారు మాత్రమే మలి విడత రుణసాయం పొందడానికి అర్హులు.

ఈ పథకం ద్వారా ప్రభుత్వం నిర్వహించే చేతివృత్తుల మేళాల్లో ఉచితంగా స్టాల్స్ పెట్టుకునే సౌకర్యాన్ని పొందవచ్చు. అయితే ప్రతి వ్యాపారీ తమ లావాదేవీలను క్యూఆర్ స్కానర్ ద్వారే నెరపాల్సి ఉంటుంది. దాని ద్వారానే బ్యాంక్ ఈఎమ్ఐ కట్ అవుతుంది కాబట్టి. ఈ విధానం వల్ల ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది శిక్షణ పొందారు, ఎంతమంది వ్యాపారాలు మొదలుపెట్టారు, తిరిగి చెల్లింపులు ఎలా ఉన్నాయి వంటి డేటా ఉంటుంది, ముమ్మందు పథకాల ప్రణాళికను రచించడానికి వీలవుతుంది. ఈ ప్రత్యేక పథకం ద్వారా రుణం పొందడానికి ప్రత్యేక విద్యార్హతలు అవసరం లేదు. కులధ్రువీకరణ పత్రం ఉంటే చాలు.

కమ్మరి, శిల్పకారులు, స్వర్ణకారులు, వడ్రంగి, పడవ తయారీదారులు, కవచ తయారీదారులు, తాళాల తయారీదారులు, సుత్తి.. సాధన కిట్ తయారీదారులు, రాళ్ల పగులగొట్టేవారు, చర్మకారులు, పాదరక్షల తయారీదారులు, తాపీ పనిచేసేవారు, బుట్టు.. చాపలు.. చీపుర్లు తయారుచేసేవారు, దండల తయారీదారులు, బొమ్మల తయారీదారులు, క్షురక, ధోబీ, దర్జీ, చేపల వలల తయారీదారులు ఈ పథకానికి అర్హులు. 2023-24లో మొదలైన ఈ పథకం 2027-28 వరకు అమలులో ఉంటుంది. ఇప్పటి వరకు దీని కోసం కేంద్రప్రభుత్వం 15 వేల కోట్ల రూపాయలను ఖర్చుచేసింది.



– బి.ఎస్. రత్న, బిజినెస్ కన్సల్టెంట్, దలీప్

మీ సందేహాలను పంపవలసిన మెయిల్ ఐడీ :
ownership.sakshi@gmail.com

నిర్వహణ : సరస్వతి రమ

✳ సెయిలింగ్

సముద్రమంత ఆత్మవిశ్వాసం

'ఎగిసే అలలతో పోరాటం.. అమ్మాయిలకు సాధ్యమయ్యే పనేనా' అనే చిన్నపాటి ఆలోచనలను కూడా దరిచేరనివ్వడం లేదు నవతరం. ఆకాశమే హద్దుగా నీటి మీదనే తమ కలలను సాకారం చేసుకుంటున్నారు. క్లిష్టమైన సెయిలింగ్ క్రీడా పోటీలలో తమ సత్తా చాటుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. హైదరాబాద్ వాసులైన ఈ యువ సెయిలర్ల సాహసం ఎంతోమందికి స్ఫూర్తిని కలిగిస్తుంది.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



మాన్య

హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉండే పూతన మాన్య రెడ్డి మొదట స్కూల్ స్థాయిలో స్విమ్మింగ్ నేర్చుకుంది. స్విమ్మింగ్ పోటీలో పాల్గొంటూ సెయిలింగ్‌పై ఆసక్తి కలిగి, శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. సెయిలింగ్‌కి అనుకూలమైన వాతావరణం కోసం గోవా, మైసూర్..లలో ప్రాక్టీస్ చేసింది. సీనియర్లు ఉపయోగించే బోటుకు మారి, జాతీయ స్థాయిలో ఇప్పటికే 5 పతకాలు సొంతం చేసుకుంది. షిల్లాంగ్ నేషనల్ ర్యాంకింగ్ రెగెట్టా, తెలంగాణ జాతీయ జూనియర్ రెగెట్టాలోనూ కాంస్యాలను సాధించింది. థాయ్‌లాండ్, పోర్చుగల్‌లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల మలేషియాలోని లంకాగ్వి అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలో పాల్గొని, బంగారు పతకాన్ని సాధించింది.

సాహసాలు చేసే శక్తిని ఇస్తుంది

ఈ క్రీడల్లో పాల్గొనడానికి చాలా శక్తి కావాలని, ఆరోగ్యసమస్యలు వస్తాయని, ఆడపిల్లలకు సరైనది కాదని చాలామంది నిరాశ పరిచారు. కానీ, సెయిలింగ్ ఎంత ఉత్సాహవంతమైన క్రీడనో, సాహసాన్ని ప్రదర్శించడమే కాదు సముద్రమంత ఆత్మవిశ్వాసాన్ని కూడా ఇస్తుందని తెలిసింది. అంతేకాదు భవిష్యత్తు ఎంతో ఉత్తమంగా మార్చుకునే అవకాశాలనూ ఇస్తుంది. ఒలింపిక్స్ సెయిలింగ్ పోటీలో పాల్గొని పతకాలని సాధించేందుకు కృషి చేస్తున్నాను. ట్రైనింగ్, పోటీలు.. అంటూ నీళ్లతోనే మా సావాసం కాబట్టి అందుకు తగిన వ్యాయామం, సమతుల ఆహారం పట్ల జాగ్రత్తలు తీసుకుంటాను. లెవన్త్ గ్రేడ్ చదువుతున్నాను. వాయిలెన్ మరో ఇష్టమైన హాబీ, స్కూల్ ఎన్జీవోలో యాక్టివ్ మెంబర్‌ని.

– పూతన మాన్యరెడ్డి

కల, ఆసక్తి ఉంటే పేదరికం అడ్డంకి కాదని నిరూపిస్తున్నారు 8, 10 క్లాసులు చదువుతున్న కొమరవెల్లి దీక్షిత, కొమరవెల్లి లహరి. ఈ ఇద్దరు అక్కాచెల్లెళ్లు. టాప్ సెయిలింగ్ సిస్టర్స్‌గా కితాబులు అందుకుంటున్నారు. జాతీయస్థాయి పోటీల్లోనే కాకుండా భారత్ తరఫున విదేశాల్లోనూ సెయిలింగ్ పోటీల్లో పాల్గొంటూ దేశ కీర్తిని చాటుతున్నారు.



దీక్షిత

నీళ్లు చూస్తే భయం వేసింది

నాలుగేళ్ల క్రితం మా స్కూల్లో 'సెయిలింగ్‌లో శిక్షణ ఇస్తున్నార'ని చెబితే, ఆసక్తితో నా పేరు ఇచ్చాను. మొదట నీళ్లను చూస్తే భయం వేసింది. కానీ, ఒక్కసారి నీటిలో ప్రయాణించాక, మరోసారి పాల్గొనేలా ఆసక్తి కలిగింది. సెయిలింగ్ ఖర్చుతో కూడుకున్న క్రీడ. యాట్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మాకు సపోర్ట్ చేస్తోంది. మా అమ్మ వంటలు చేస్తూ మమ్మల్ని చదివిస్తోంది. మా చదువుకు క్రీడలు కూడా తోడయితే మరిన్ని విజయాలు సాధించవచ్చు.. అని తెలుసుకున్నాం. అందుకే ధైర్యంగా నీటి అలలపై మమ్మల్ని మేం నిరూపించుకుంటున్నాం.

– కొమరవెల్లి దీక్షిత

అక్కను చూసి...



లహరి

అక్కను చూసి నేనూ సెయిలింగ్ స్పోర్ట్స్‌లోకి వచ్చేశాను. అండర్–15 కేటగిరీలో పాల్గొంటున్నాను. మలేషియాలో జరిగిన సెయిలింగ్ పోటీలో వివిధ దేశాల నుంచి వచ్చిన 102 మంది సెయిలర్స్ పాల్గొన్నారు. ఒమన్‌లో జరిగిన పోటీలో రజత పతకం సాధించాను.

– కొమరవెల్లి లహరి

భారత్‌తో పాటు సౌత్‌కొరియాలలో జరిగిన అంతర్జాతీయ సెయిలింగ్ పోటీలో పాల్గొని స్వర్ణ, రజిత పతకాలు సాధించిన ఈ అక్కాచెల్లెళ్లకు హైదరాబాద్‌లోని సెయిలింగ్ యాట్ క్లబ్ మద్దతునిస్తోంది.

హైదరాబాద్ ఈస్ట్‌మారేడ్‌పల్లిలో ఉంటున్న ప్రీతి కొంగర ఓపెన్ డిగ్రీ చేస్తూ సీనియర్ సెయిలింగ్ స్పోర్ట్స్‌లో సంచనాలు సృష్టిస్తోంది. చైనాలో జరిగిన ఏషియన్ క్రీడలో పాల్గొంది. హైదరాబాద్, ముంబైలలో జరిగిన నేషనల్ ఛాంపియన్‌షిప్‌లలో రజత, స్వర్ణ పతకాలు సాధించింది.



ప్రీతి

పేదరికం అడ్డుకాదు

'11 ఏళ్ల వయసులో సెయిలింగ్‌లోకి అడుగుపెట్టాను. సెయిలింగ్ అనేది చాలా ఓర్పుతో కూడుకున్న క్రీడ. దీనికి ఫిట్‌నెస్ చాలా అవసరం. ట్రైనింగ్‌లో భాగంగా రోజూ 4-5 గంటలు ప్రాక్టీస్ చేస్తాను. ఈ క్రీడలో అబ్బాయిలు ఎంత కష్టపడాలో, అమ్మాయిలూ అంత కష్టపడాల్సిందే. అన్ని స్పోర్ట్స్ కన్నా ఇది చాలా భిన్నమైంది. సవాల్‌తో కూడుకున్నది. అందుకే సెయిలింగ్‌ని ఎంచుకున్నాను. ఏప్రిల్‌లో జరగబోయే ఒలింపిక్ సెయిలింగ్‌లో పాల్గొనడానికి శిక్షణ తీసుకుంటున్నాను.

– ప్రీతి కొంగర

నాన్న చిట్కా



కీళ్లనొప్పులు ఉన్నవారు నాలుగైదు వెల్లుల్లిరెబ్బలను ముద్దగా నూరి, అరగ్లాసు పాలలో కలిపి పాలు చిక్కబడేవరకు మరిగించి రోజుకు ఒకసారి చొప్పున తీసుకుంటే మంచిది. పాలలో కలుపుకుని తాగడం ఇష్టపడనివారు వెల్లుల్లి రెబ్బలను ముద్దగా నూరి పూటకు చెంచాడు ముద్దను అరచెంచాడు నువ్వులనూనెతో కలిపి రెండుపూటలా అరకప్పు వేడినీటితో తీసుకోవచ్చు.



ముక్కు దిబ్బడగా ఉన్నప్పుడు పసుపును వేడినీళ్లలో వేసి ఆవిరి పడితే జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆవిరి పట్టేటప్పుడు ముక్కుతోనే కాదు, నోటితో కూడా పీల్చవచ్చు.

పుట్టనిండా రుచులు

వంటిల్లు

పుట్టగొడుగులు... అదేనండీ.. మష్రూమ్స్ పోషకాలకే కాదు... రుచికి కూడా పెట్టింది పేరు. కాస్త ఉప్పూకారం వేసి మరికాస్త మసాలా దట్టించామంటే ఆ టేస్ట్ అదుర్స్.. అందుకే పుట్టనిండా రుచులు... పొట్టనిండా విందు!



మష్రూమ్స్ మంచూరియా



కావలసినవి: మైదా – అర కప్పు; మష్రూమ్స్ – 250 గ్రాములు; కార్న్‌ఫ్లోర్ – 3 టేబుల్ స్పూన్లు; అల్లం, వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; నీళ్లు – కప్పు; ఉప్పు – తగినంత; పంచదార – అర టీ స్పూన్; పచ్చి మిర్చి – 3 (సన్నగా తరగాలి); అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; ఉల్లికాడల తరుగు – టేబుల్ స్పూన్; బెల్ పెప్పర్ – 1 (సన్నగా తరగాలి). **సాస్ కోసం:** నల్ల మిరియాల పొడి – చిటికెడు; పంచదార – చిటికెడు; సోయా సాస్ – టీస్పూన్

తయారీ: ● పుట్టగొడుగులను కడిగి, తుడిచి, సగానికి కట్ చేయాలి ● ఒక గిన్నెలో సాస్ మినహా పై పదార్థాలన్నీ తీసుకోవాలి ● తగినన్ని నీళ్లు పోసి పిండిని బాగా కలుపుకోవాలి ● స్టౌ పై బాణలి పెట్టి, తగినంత నూనె పోసి, వేడి చేయాలి. పుట్టగొడుగులను పిండిలో ముంచి, కాగుతున్న నూనెలో వేసి, గోధుమ రంగు వచ్చేవరకు వేయించి, తీసి, పక్కన పెట్టుకోవాలి ● అదే నూనెలో, కట్ చేసి పెట్టుకున్న ఉల్లి కాడలను వేసి, నిమిషం సేపు వేయించి, తీసి పక్కనుంచాలి ● నల్ల మిరియాలు, ఉప్పు, చక్కెర, సోయా సాస్ కలిపి పక్కనుంచాలి. ఈ సాస్‌లో వేయించిన పుట్టగొడుగులను వేసి, అన్నింటికీ సాస్ పట్టేలా బాగా కదిలించాలి. తరిగిన ఉల్లికాడలు, కొత్తిమీరతో అలంకరించి, సర్వ్ చేయాలి.

మష్రూమ్స్ పులావ్

కావలసినవి: నూనె – 3 టేబుల్ స్పూన్లు; బాస్మతి బియ్యం – ఒకటిన్నర కప్పు; మష్రూమ్స్ – 250 గ్రాములు; ఉల్లిపాయ – 1 (సన్నగా తరగాలి); టమోటా – 1 (ముక్కలుగా కట్ చేసుకోవాలి); బంగాళదుంప – 1; పచ్చిమిర్చి – 2; అల్లం వెల్లుల్లి పేస్ట్ – టీ స్పూన్; కొబ్బరి పాలు – కప్పు; నీళ్లు – 3 కప్పులు; ఉప్పు – తగినంత; మసాలా దినుసులు – (బిర్యానీ ఆకు, దాల్చిన చెక్క, యాలకులు -3, లవంగాలు -5, నల్లమిరియాలు – 6, జీలకర్ర – టీ స్పూన్)

తయారీ: ● బియ్యాన్ని కడిగి అరగంటసేపు నానబెట్టాలి. ● అన్ని కూరగాయలతో పాటు మష్రూమ్స్ కూడా కడిగి, కట్ చేసి పెట్టుకోవాలి ● ప్రెజర్ కుక్కర్‌లో, నూనె వేసి వేడిచేయాలి. జీలకర్రతో సహా మొత్తం మసాలా దినుసులు వేసి, సువాసన వచ్చే వరకు వేయించాలి ●ఉల్లిపాయ తరుగు వేసి, వేయించుకోవాలి ● అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి, పచ్చి వాసన పోయే వరకు వేయించాలి ● ఇప్పుడు తరిగిన టమోటాలు, బంగాళదుంప ముక్కలు వేసి ఉడికించాలి. తర్వాత పుట్టగొడుగులను కలపాలి. సన్నని మంట మీద పుట్టగొడుగులు సగం ఉడికేంత వరకు 5 నిమిషాలు ఉంచాలి. మధ్యమధ్యలో కలుపుతూ ఉండాలి. పచ్చిమిర్చి వేసి, వేగాక, బియ్యం పోసి కలపాలి ● దీంట్లో కొబ్బరి పాలు, నీళ్లు కలపాలి. ఉప్పు వేసి, రుచి సరిచూసుకొని, కుకర్ మూత పెట్టాలి. 3 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, స్టౌ ఆపాలి. 5-10 నిమిషాలు ఆగి, కుకర్ మూత తీసి, కొత్తిమీర, పుదీనా ఆకులతో అలంకరించాలి. గుండ్రంగా తరిగిన ఉల్లిపాయలతో సర్వ్ చేయాలి. దీనికి కాంబినేషన్‌గా రైతాను వడ్డించాలి.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 332

శనివారం 22-2-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



అదరగొట్టిన దక్షిణాఫ్రికా

తొలి మ్యాచ్‌లో భారీ విజయం.. 107 పరుగులతో అఫ్గానిస్తాన్ చిత్తు -15లో



ఇక వెండి.. కొండ

పసిడికి పోటీగా దూకుడు.. ఏడాదిలో రూ.1.25 లక్షలకు చేరే చాన్స్ -15లో



విజనరీ నాయకులు కావాలి

నేడు అన్ని రంగాల్లో ప్రపంచస్థాయి నాయకులు రావాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



హాని చేయాలనుకుంటే..

అమెరికన్లకు హాని చేయాలనుకునేవారి అంతు చూస్తామని ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్ కశ్యప్ పటేల్ (కాశ్ పటేల్) హెచ్చరించారు.

- వివరాలు 6లో



'మార్స్'పై నీటిరహిత కాంక్రీట్

ఐఐటీ మద్రాస్ నీటిరహిత కాంక్రీట్‌ను అభివృద్ధి చేసింది. 'మార్స్'పై ఇళ్ల నిర్మాణానికి ఈ కాంక్రీట్ చక్కగా సరిపోతుందట.

- వివరాలు 6లో



చైనాలో మరో మహమ్మారి!

'కోవిడ్-19' సృష్టించిన కల్లోలం గుర్తుంది కదా! అలాంటి మహమ్మారి మరొకటి చైనాలో పుట్టినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.

- వివరాలు 6లో

దమ్ముంటే రండి!

12 ఏళ్ల మోదీ పాలన, పదేళ్ల కేసీఆర్ పాలన.. 12 నెలల కాంగ్రెస్ పాలనపై చర్చిద్దాం..

'ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన'లో బీజేపీ, బీఆర్‌ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్

బండి సంజయ్, కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. ఎవరొస్తారో చెప్పండి..మీ బంట్లు, బంట్రోతులు ఎవరిని పంపుతారో తేల్చుకోండి

కళ్లలో నిప్పులు, కడుపులో కత్తులతో పంచాయితీ పెడుతున్నారు.. పాలమూరు జిల్లా ప్రాజెక్టులను ఎండబెట్టిన పాపం బీఆర్‌ఎస్‌దే..

ప్రగతిభవన్‌లో 'రాయలసీమ ప్రాజెక్టు పథకం పన్ని ద్రోహం చేశారు..తాము విజయవంతంగా కులగణన, ఎస్సీ వర్గీకరణ చేపట్టామన్న సీఎం

నారాయణపేట జిల్లాలో మెడికల్ కళాశాల, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభం

> 2014 ఎన్నికలకు ముందు బీజేపీ ఇచ్చిన హామీలు, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటి అమలుపై చర్చకు సిద్ధమా? అంబేడ్కర్ విగ్రహం సాక్షిగా నాతో చర్చకు రావాలి. మీ బంట్లు, బంట్రోతులను ఎవరిని పంపుతారో తేల్చుకోండి. ప్రధాని నరేంద్ర మోదీ స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనం తెచ్చి ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో.. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న గ్రామాల్లో మేం పోటీ చేస్తాం, డబుల్ బెడ్రూం ఇళ్లు ఉన్న గ్రామాల్లో మాత్రమే బీఆర్‌ఎస్ పోటీ చేయాలి. ఈ సవాల్‌ను స్వీకరించే దమ్ముందా?



అప్పక్‌పల్లిలో లబ్ధిదారు దేవమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పునాది తవ్వి పూలు చల్లుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు పొంగులేటి, జూపల్లి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, బీజేపీ ఎంపీ డీకే అరుణ తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్/ నారాయణపేట: దేశంలో 12 ఏళ్ల మోదీ పాలన, రాష్ట్రంలో పదేళ్ల కేసీఆర్ పాలన.. 12 నెలల కాంగ్రెస్ పాలనపై తనతో బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు.. ఎవరు వస్తారో, ఎక్కడికి వస్తారో చెప్పాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన బీఆర్‌ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో డిపాజిట్ గల్లంతు అయిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు కూడా దొరకని దుస్థితిలో ఉందని సీఎం విమర్శించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా అప్పక్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం రేవంత్ భూమి పూజ నిర్వహించారు. అనంతరం మెడికల్ కళాశాల, నర్సింగ్, పారామెడికల్ కళాశాలలకు ప్రారంభోత్సవం చేశారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా పెట్రోల్ బంక్ ప్రారంభించారు. అనంతరం మిగతా 2వ పేజీలో ▶



ఆర్థిక లోటుపాట్లు

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి ఏకంగా 8,758 శాతానికి చేరిక

ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.297 కోట్ల మిగులు ఉంటుందని అంచనా వేసిన సర్కార్

జనవరి నెలాఖరుకే రూ. 26,050 కోట్ల లోటు: కాగ్

రెవెన్యూ ఆదాయం రూ.1.23 లక్షల కోట్లు.. ఖర్చు రూ.1.49 లక్షల కోట్లు

వివరాలు 2లో▶



క్యాబ్ సేవలకు సర్కారు యాప్

ఐటీ శాఖ ఆధ్వర్యంలో యాప్ అభివృద్ధి!

క్యాబ్ చార్జీల మాయాజాలానికి చెక్

వివరాలు 16లో▶

'సెకీ' ఒప్పందం సక్రమమే

తేల్చి చెప్పిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

ఎలాంటి లోపాలు లేవు.. అంతా నిబంధనల మేరకే జరిగింది

కాబట్టి రద్దు చేయడం కుదరదు..

అంతర్రాష్ట్ర ప్రసార చార్జీలు వర్తించవు

డిస్కమ్‌ల విద్యుత్ సేకరణ ప్రణాళికకు ఆమోదం

సెకీ నుంచి ఈ ఏడాదే 4 వేల మెగావాట్ల కొనుగోలుకు అనుమతి

ఇన్నాళ్లూ ఒప్పందంపై విషం చిమ్మిన చంద్రబాబు, టీడీపీ కరపత్రం

అది రాష్ట్ర చరిత్రలోనే కారుచౌక ఒప్పందం

నాడు స్వయంగా లేఖ రాసిన సెకీ.. ఐఎస్‌టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు..

25 ఏళ్ల దూరదృష్టి ఒప్పందంతో ఖజానాకు రూ.1.10 లక్షల కోట్లు ఆదా

7 వేల మెగావాట్ల సోలార్ ఒప్పందం ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు

డిస్కమ్‌లు కూడా ఇలాంటి ఒప్పందాన్ని ఎన్నడూ కుదుర్చుకోలేదు

మూడో వ్యక్తి ప్రమేయం, లంచాలకు ఎక్కడా తావే లేదు..

13లో

> సెకీ విద్యుత్ కొనుగోలుకు అనుమతించాల్సిందిగా డిస్కంలు ప్రతిపాదించాయి. ఈ 7 వేల మెగావాట్లలో ఈ ఏడాది (2025-26)లో 4 వేల మెగావాట్లను విద్యుత్ సేకరణ ప్రణాళిక (పవర్ ప్రొక్యూర్‌మెంట్ ప్లాన్)లో చేర్చకపోవడానికి కమిషన్‌కు ఎటువంటి కారణం కనిపించడం లేదు. – ఏపీఈఆర్‌సీ

ఎల్లో కరపత్రమా.. ఇప్పుడేమంటావ్?



సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంపై నిస్సిగ్గుగా, నిరాధారంగా పచ్చి అబద్ధాలతో ఈనాడు ప్రచురించిన తప్పుడు కథనాల్లో కొన్ని..



గరిష్టానికి ఆర్థిక లోటు

తెలంగాణ రాష్ట్రంలో తొలిసారి ఏకంగా 8,758 శాతానికి చేరిక

- ప్రతిపాదిత బడ్జెట్ కంటే ఇప్పటికే రూ.9 వేల కోట్లు ఎక్కువగా అప్పుల సేకరణ
- జనవరి నెలాఖరుకే రూ.26,050 కోట్ల లోటు ఉందన్న కాగ్
- ప్రభుత్వానికి పెద్ద తలపోటు లాంటి పరిస్థితే అంటున్న ఆర్థిక నిపుణులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆర్థిక ముఖ చిత్రం వెలవెలబోతోంది. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారి నికర ఆర్థిక లోటు ఏకంగా 8,758 శాతానికి చేరింది. అంటే రాష్ట్ర ఖజానాకు వస్తున్న రెవెన్యూ ఆదాయానికి, ఖజానా నుంచి పెడుతున్న రెవెన్యూ ఖర్చుకు మధ్య ఆ మేరకు తేడా ఉందన్నమాట. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక ఈ విషయం వెల్లడించింది. 2025 జనవరి మాసాంతానికి గాను వార్షిక బడ్జెట్ స్థితిగతులపై కాగ్ ఇచ్చిన ఈ నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో నికర ఆర్థిక లోటు రూ.26,050 కోట్లకు చేరింది. జనవరి నెలాఖరుకు రెవెన్యూ ఆదాయం రూ.1,23,815.60 కోట్లు ఉండగా, రెవెన్యూ ఖర్చు రూ.1,49,866.10 కోట్లుగా నమోదయింది. ఆదాయం కంటే ఖర్చు రూ.26 వేల కోట్లకు పైగా ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాస్తవానికి 2024–25 వార్షిక బడ్జెట్‌లో రూ.297.42 కోట్ల మేర నికర ఆర్థిక మిగులు ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ ఈ అంచనాలను తలకిందులు చేస్తూ ఏకంగా 8,758 శాతం మేరకు నికర లోటు చేరుకోవడం గమనార్హం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఈ మేరకు నికర ఆర్థిక లోటు ఎప్పుడూ లేదని, ఇది రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక తలపోటు లాంటి పరిస్థితి అని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

ఆదాయ గణాంకాలివే..

రాబడి శాఖ	బడ్జెట్ అంచనా	జనవరి నాటికి వచ్చింది (రూ. కోట్లలో)
జీఎస్టీ	58,594.91	42,657.90
రిజిస్ట్రేషన్లు	18,228.82	5,821.88
అమ్మకపు పన్ను	33,449.21	26,725.57
ఎక్సైజ్	25,617.53	15,585.35
కేంద్ర పన్నుల్లో వాటా	18,384.19	15,336.44
పన్నేతర ఆదాయం	35,208.44	58,66.40
గ్రాంట్ ఇన్ ఎయిడ్	21,636.15	5,176.72

అంచనాల్లో ఇప్పటివరకు 56% ఆదాయమే..!

ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వానికి కటకట అంటే ఎలా ఉంటుందో చూపిస్తోంది. ప్రభుత్వ అంచనాలకు, రాబడులకు పొంతన లేకుండా పోవడంతో ఏం చేయాలో అర్థం కాక ఆర్థిక శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.21 లక్షల కోట్ల రెవెన్యూ ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేయగా, జనవరి మాసాంతానికి కేవలం రూ.1.23 లక్షల కోట్లు మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉండగా.. అంచనాల్లో 56 శాతమే ఆదాయం రావడం, ఇంకా రూ.లక్ష కోట్ల వరకు రావాల్సి ఉండడం గమనార్హం.

జీఎస్టీ ఓకే.. రిజిస్ట్రేషన్లు డౌన్

ఈ ఆర్థిక సంవత్సరంలో పన్ను రాబడులు రూ.1.64 లక్షల కోట్లు వస్తాయని 2024–25 వార్షిక బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించగా.. జనవరి మాసాంతానికి రూ.1,12,772 కోట్లు మాత్రమే (68 శాతమే) సమకూరాయి. ఆదాయార్జన శాఖల వారీగా చూస్తే ఎంతో కొంత వస్తు సేవల పన్ను (జీఎస్టీ) మాత్రమే ఆశాజనకంగా కనిపిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.58,594 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేయగా, అందులో 73 శాతం అంటే రూ.42,658 కోట్ల మేర సమకూరింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.18 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని ఆశలు పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం రూ.5,821 కోట్లు మాత్రమే రావడం గమనార్హం. అమ్మకపు పన్ను, కేంద్ర పన్నుల్లో వాటా లాంటివి కూడా ఓ మోస్తరుగా వచ్చినా, ఎక్సైజ్, పన్నేతర రాబడులు తగ్గిపోయాయి. ఇక కేంద్రం నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్ కూడా బడ్జెట్ అంచనాలతో పోల్చుకుంటే కేవలం 24 శాతమే రావడం గమనార్హం.

భారీగా పెరిగిన అప్పులు

ఆదాయం భారీగా తగ్గగా, మరోవైపు అప్పుల పద్దు భారీగా పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను బహిరంగ మార్కెట్‌లో రూ.49,225 కోట్ల రుణాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, జనవరి నెలాఖరుకే అప్పులు రూ.58 వేల కోట్లకు చేరాయి. మరో రెండు నెలల్లో ఇంకో రూ.20 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ఆర్‌బీఐ దగ్గర షెడ్యూల్ సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈసారి అప్పుల చిట్టా రూ.80 వేల కోట్లకు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందులో రూ.22 వేల కోట్లకు పైగా గతంలో తెచ్చిన అప్పులకు వడ్డీల కిందే చెల్లించాల్సి రావడం గమనార్హం.



గత ఐదేళ్లలో నికర లోటు అంచనాలు, వాస్తవ లోటు (జనవరి నాటికి) రూ.కోట్లలో..

సంవత్సరం	నికర మిగులు అంచనా	వాస్తవ లోటు	శాతం
2020-21	4,482.12	-23,770.57	-530.34
2021-22	6,743.50	-14,813.45	-219.67
2022-23	3,754.58	-,4202.57	-111.93
2023-24	4,881.74	-1,269.69	-26.01
2024-25	297.42	-26,050.50	-8,758.83

జనవరి నాటికి రెవెన్యూ ఖర్చు గణాంకాలు

	రెవెన్యూ	అప్పులకు వడ్డీలు	వేతనాలు	పింఛన్లు
అంచనా ఖర్చు	1,35,289.45	17,729.77	40,041.79	11,641.38
అయిన ఖర్చు (రూ.కోట్లలో)	66,796.43	22,056.20	35,555.87	14,153.85

సబ్సిడీలు: 16,242.42 । 11,303.75 ప్రణాళిక: 32,745.80 । 28,311.89

క్లుప్తంగా...

కీలక ఖనిజాల అన్వేషణ రంగంలోకి సింగరేణి

ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి పరిశోధన: సింగరేణి సీఎండీ బలరామ్



సాక్షి, హైదరాబాద్/గోదావరిఖని/సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా ఇకపై లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలక ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) అన్వేషణ, ఉత్పత్తి రంగాల్లో సైతం అడుగు పెట్టనుందని ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రకటించారు. ఇందుకోసం ఇప్పటికే ఐఐటీ హైదరాబాద్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. దేశాన్ని 2070 నాటికి 'నెట్ జీరో'(కాలుష్య రహిత) దేశంగా మార్చాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇది నెరవేరాలంటే దేశీయంగా క్రిటికల్ మినరల్స్ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరముందని అన్నారు. క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన జాతీయ సదస్సులో బలరామ్ మాట్లాడారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విడుదలయ్యే బూడిద, ఓపెన్ కాస్ట్ గనుల్లో ఉత్పత్తి అయ్యే ఓవర్ బర్డెన్ నుంచి అరుదైన ఖనిజాలను వెలికితీసే అంశంపై పరిశోధనలు ప్రారంభించినట్టు వెల్లడించారు. సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు చైతన్యమొయి గంగూలీ తదితరులు పాల్గొన్నారు.

టీఐఎఫ్ఆర్‌లో ముగిసిన రెండు రోజుల సదస్సు

ఆధునిక శాస్త్రీయ పరికరాలు, అనుబంధ వ్యవస్థలపై చర్చ

సాక్షి, హైదరాబాద్: పరిశోధన, మౌలిక వసతుల కల్పనలో శాస్త్ర, సాంకేతిక సిబ్బంది చేయాల్సిన కృషిపై హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్)లో 2 రోజుల సదస్సు శుక్రవారం ముగిసింది. దేశవ్యాప్తంగా ఉన్న టీఐఎఫ్ఆర్ సెంటర్ల నిపుణులు, సిబ్బంది హాజరైన ఈ సదస్సులో పరిశోధనను మెరుగు పరిచేందుకు అవసరమైన శాస్త్రీయ పరికరాలు, అనుబంధ వ్యవస్థల పాత్రపై చర్చించారు. శాస్త్ర పరిశోధనలకు కేంద్రంగా పనిచేస్తున్న టీఐఎఫ్ఆర్ సంస్థలో కాలానుగుణంగా అందుబాటులోకి తీసుకురావాల్సిన అధునాతన పరికరాల అభివృద్ధి, నిర్వహణ తదితరాల ఆవశ్యకతను వక్తలు ప్రస్తావించారు. టీఐఎఫ్ఆర్ కేంద్రాల సిబ్బందిని ఒక్కచోటికి చేర్చి, హైదరాబాద్ కేంద్రం ఈ సదస్సును నిర్వహించడాన్ని వక్తలు అభినందించారు. సదస్సులో టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ జయరాం చెంగలూర్, భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కృష్ణ ఎల్లా, ఈసీఐఎల్ డైరెక్టర్ అనురాగ్ కుమార్, ఆటమిక్ మినరల్స్ డైరెక్టర్ ధీరజ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ జగత్



ఒక్క భారత్ ఏంటి సార్! ప్రపంచంలో ఎక్కడ ఎన్నికలైనా మనం జోక్యం చేసుకుంటున్నాం!

దమ్ముంటే రండి!





మహిళా సంఘం సభ్యురాలితో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి ● సభకు హాజరైన మహిళలు

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన 'ప్రజా పాలన– ప్రగతి బాట' బహిరంగ సభలో సీఎం రేవంత్ మాట్లాడారు. సీఎం ప్రసంగం ఆయన మాటల్లోనే...

రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎన్నో పనులు చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎప్పుడో బ్రిటిష్ కాలమైన 1931లో చేసిన కులగణన తప్ప ఈనాటికీ ఎవరూ లెక్క చెప్పలేదు. బీసీలు చైతన్యం అవుతున్నారు. తమ లెక్క చెప్పాలని అంటున్నారు. దేశంలో మొదటిసారి ప్రతి కులం లెక్క తీసేందుకు కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచాం. 30ఏళ్లుగా పీటముడి పడిన ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపాం. ఏడాదిలోనే సాధించిన ఈ విజయాలు కేసీఆర్ కళ్లకు కనబడటం లేదా? ప్రభుత్వం ఏర్పడి 12 నెలలు కాకముందే దిగిపోవాలని చూస్తున్నారు. కళ్లలో నిప్పులు, కడుపులో కత్తులు పెట్టుకొని మన మధ్యనే పంచాయతీ పెట్టాలని చూస్తున్నారు. తాను కొడితే గట్టిగా వేరేలా ఉంటుందని కేసీఆర్ అంటున్నారు. ఆయన కొట్టాల్సి వస్తే ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీలు చేసిన కొడుకును, ఢిల్లీలో లిక్కర్ దందా చేసిన బిడ్డను, కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లు మింగిన అల్లుడిని కొడితే వాళ్లకు బుద్ధి వస్తుంది.

కేసీఆర్ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదు..

పాలమూరు నుంచి కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించినా ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదు. పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసే అవకాశం ఉన్నా ఈ ప్రాంతాన్ని ఎడారిగా మార్చిన పాపం బీఆర్ఎస్‌దే. అప్పుడే పూర్తిచేసి ఉంటే ఇప్పుడు చంద్రబాబుతో పంచాయతీ ఎందుకు వచ్చేది? పోతిరెడ్డిపాడు ద్వారా జగన్ ఏపీకి 40వేల క్యూసెక్కులు తరలించుకుపోతుంటే కేసీఆర్ ఊడిగం చేశారు. ఆనాడు మంత్రిగా ఉన్నది హరీశ్‌రావు కాదా? జగన్‌తో కలసి ప్రగతిభవన్‌లో రాయలసీమ ప్రాజెక్టుకు పథకం పన్నింది ద్రోహం కాదా? రాయలసీమ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 10 టీఎంసీల చొప్పున నెలలోనే శ్రీశైలం ఖాళీ అవుతుంది.

నిన్నేం అంటలేను అక్కా..

సీఎం రేవంత్, ఎంపీ డీకే అరుణ మధ్య సరదా సంభాషణ

నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగారం గేటు వద్ద మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, బీజేపీ నాయకురాలు, ఎంపీ డీకే అరుణ మధ్య సరదా సంభాషణ చోటుచేసుకుంది. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను ఒకచోటుకు చేర్చి, మహిళా శక్తిని చాటుతూ నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని కోరతామని సీఎం రేవంత్ పేర్కొనగా.. ఎంపీ డీకే అరుణ కలుగజేసుకుని కేంద్రం ఇప్పటికే నిధులను ఇస్తోందని చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. 'కేంద్రం ఇస్తుంది. ఇవ్వాలి. మిమ్మల్ని ఏమీ అనడం లేదు అక్కా. ప్రజలకు సేవ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలి. మీకు ఇక్కడ తల్లి గారిల్లు, అక్కడ అత్త గారిల్లు, పిల్లల కోసం ఎవరేం ఇచ్చినా వద్దు అనలేం. అవసరమైనప్పుడు అందరం ఒక్క తాటిపై నిలబడాలి..'' అని పేర్కొన్నారు.

మహిళలకు ఏడాదికి రెండు చీరలు..

దేశంలోనే మొట్టమొదటిసారిగా నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ప్రారంభించాం. ఇందిరా మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళల చేతికి పర్యవేక్షణ, మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో 600 బస్సుల కొనుగోలు, పావలా– జీరో వడ్డీ రుణాలతో మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నాం. రాష్ట్రంలోని మహిళా సంఘాల మహిళలకు ఏడాదికి 2 నాణ్యమైన చీరలు అందిస్తాం. పరిశ్రమల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇచ్చే బాధ్యత నాది. ఉద్దండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యకు పరిష్కారం చూపుతాం'' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యేలు పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరి, జి.మధుసూదన్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, చిక్కుడు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు మళ్లీ అధికారం కల: మంత్రులు

బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందన్నది కలగానే మిగులుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని అలాంటిది ఏడాది పాలనలో కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని వ్యాఖ్యానించడం హాస్యాస్పదమని చెప్పారు. రాష్ట్రంలో కులగణనతోపాటు ఎస్సీ వర్గీకరణకు పరిష్కారం చూపి చరిత్రలో నిలిచామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సామాజిక న్యాయం అందిస్తూ అసమానతలను తొలగిస్తామన్నారు.

డేటా ఇంజనీర్లకు శిక్షణ

తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు
- టాస్క్ కార్యాలయంలో 90 రోజులు పాఠాలు

సాక్షి, హైదరాబాద్: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా ఇంజనీరింగ్ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ శిక్షణ కార్యక్రమం వివరాలతో ఐటీ, పరిశ్రమల శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'నేటి డిజిటల్ యుగంలో డేటా ఇంజనీరింగ్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. డేటాను విశ్లేషించేందుకు, నిర్వహించేందుకు నైపుణ్యమున్న మానవ వనరుల కోసం పరిశ్రమలు అన్వేషిస్తున్నాయి. ఈ రంగంలోని ఉపాధి అవకాశాలను తెలంగాణ యువత అందిపుచ్చుకునేలా వారిని తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), శ్రీసత్యసాయి సేవాసంస్థ సంయుక్తాధ్వర్యంలో డేటా ఇంజనీర్ ట్రెనింగ్ ప్రోగ్రాం పేరిట ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నాం. ప్రోగ్రామింగ్ అండ్ డేటా అనాలసిస్, డేటా ఇంజనీరింగ్ టూల్స్, క్లౌడ్ టెక్నాలజీస్, డేటా విజువలైజేషన్, సాఫ్ట్ స్కిల్స్ తదితర అంశాలపై పట్టభద్రులకు 90 రోజులు శిక్షణ ఇస్తారు. ఈ కోర్సులో 25 ఏళ్ల కంటే ఎక్కువ అనుభవమున్న అధ్యాపకుల పర్యవేక్షణలో 120 గంటలు క్లాస్‌రూం కోచింగ్, 360 గంటల పాటు ప్రాక్టికల్ ట్రెనింగ్ ఉంటుంది. ప్రత్యేకంగా కెరీర్ కౌన్సెలింగ్ ఇస్తారు. కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారు. 2021–2024 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ ఉత్తీర్ణులైన పట్టభద్రులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులు. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని టాస్క్ ప్రధాన కార్యాలయంలో నిర్వహిస్తారు. ప్రవేశ పరీక్షకు మార్చి ఒకటోలోగా దరఖాస్తు చేసుకోవాలి' అని ప్రకటనలో వెల్లడించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇతర వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం https:// task. telangana. gov. in/ను సందర్శించాలని పేర్కొన్నారు.

'ఎలక్ట్రానిక్స్'కే రూ.320 కోట్లు

- సచివాలయంలో కంప్యూటర్లు, ఫోన్లు, టీవీల కొనుగోలుకు చెల్లింపు
- బిల్లుల్లేకుండానే నిధులు విడుదల చేసిన గత సర్కారు
- సర్కార్‌కు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయంలో ఏర్పాటు చేసేందుకు పలు ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.320 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి ఇచ్చిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. ఈ రూ. 320 కోట్ల విడుదలకు ఆధారాలు లేవని తేల్చింది. పరికరాల కొనుగోలులో నిబంధనలు పాటించలేదని, బిల్లులు లేకుండానే నిధులు విడుదల చేశారని పేర్కొన్నట్టు తెలిసింది. సచివాలయ నిర్మాణంలో అవినీతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించడం తెలిసిందే. దర్యాప్తు చేపట్టిన విజిలెన్స్.. ఐటీ విభాగంపై ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇచ్చింది. నిర్మాణ సంస్థకు ఇప్పటివరకు సెక్రటేరియట్ వర్క్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదు. గత ప్రభుత్వం సదరు సంస్థకు పరికరాల కొనుగోలు కోసమే రూ.500–600 కోట్ల వరకు విడుదల చేసినట్టు విజిలెన్స్ తేల్చింది.

మణిపూర్‌లో ఏం జరిగిందో మీకు తెలుసు!

- మైతేయిల కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు అల్లర్లకు దారితీసింది
- తెలంగాణ ఆరె కటిక సంఘం పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- జాతీయ స్థాయిలో ఎస్సీ హోదా కల్పించాలన్న ఆరె కటిక సంఘం పిటిషన్‌పై విచారణకు నో



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఆరె కటిక (ఖటిక్) కులస్తులను షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. మణిపూర్‌లో జరిగిన అల్లర్లను ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ప్రస్తావించింది. కులాల జాబితాలో సవరణలు చేసే అధికారం కేవలం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది కాబట్టి.. పార్లమెంట్‌నే ఆశ్రయించాలని సూచించింది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఆరె కటిక కులస్తులను ఎస్సీల జాబితాలో చేర్చాలని కోరుతూ తెలంగాణ ఆరె కటిక (ఖటిక్) అసోసియేషన్ జనవరి 8న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చింది. కొన్ని రాష్ట్రాల్లో ఆరె కటిక కులస్తులు ఎస్సీ సామాజిక వర్గంలో ఉండగా, మరికొన్ని రాష్ట్రాల్లో వెనుకబడిన తరగతుల (ఓబీసీ) వర్గంలో ఉన్నారని ఆరె కటిక అసోసియేషన్ కోర్టుకు తెలిపింది. దీంతో వేరే రాష్ట్రానికి చెందిన అమ్మాయి లేదా అబ్బాయితో పెళ్లి జరిగినప్పుడు రిజర్వేషన్ల విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయని పిటిషన్‌లో పేర్కొంది. శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. సీనియర్ న్యాయవాది రహీమ్, రాజు సోంకర్‌లు పిటిషనర్ తరఫున వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతుండగా.. 'అసలు మీ పిటిషన్ విచారణకు ఎలా సమర్థనీయం?' అని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు. 'మణిపూర్‌లో ఏం జరిగిందో మీకు తెలుసు కదా? అక్కడ మైతేయి కులస్తులకు సంబంధించిన కేసులో హైకోర్టు నిర్ణయం తర్వాత ఏం జరిగింది? మణిపూర్‌లో ఎలా అల్లర్లు జరిగాయో చూశారు కదా?'అంటూ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే రిట్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని, హైకోర్టుకు వెళ్లేందుకు అవకాశం కల్పించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనాన్ని కోరారు. అందుకు సైతం ధర్మాసనం అభ్యంతరం తెలుపుతూ..'కులాల జాబితాను సవరించడం, కొత్త చట్టాలను రూపొందించడం పార్లమెంట్ చేస్తుంది. హైకోర్టుకు వెళ్లినా మీకు పరిష్కారం దొరకదు. కాబట్టి పార్లమెంట్‌ను ఆశ్రయించండి' అని చెప్పింది. దీంతో పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు సీనియర్ న్యాయవాది రహీమ్ చెప్పగా కేసును ముగిస్తున్నట్టు ధర్మాసనం పేర్కొంది.

పోలేపల్లి ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న సీఎం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన రేవంత్‌రెడ్డి



అమ్మవారికి మొక్కుతున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు దామోదర, జూపల్లి, పొంగులేటి

బొంరాస్‌పేట: వికారాబాద్ జిల్లాలోని పోలేపల్లి ఎల్లమ్మతల్లికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వేడుకలకు హాజరైన సీఎంకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం అమ్మవారి పాట 'ఎల్లు ఎల్లమ్మ రావే'అనే పాట వీడియో ఆవిష్కరించారు. సీఎం వెంట మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, మనోహర్‌రెడ్డి తదితరులున్నారు. సాయంత్రం నిర్వహించిన సిడె ఊరేగింపు కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

రేపు యాదగిరి క్షేత్రానికి సీఎం రేవంత్‌రెడ్డి

స్వర్ణ దివ్యవిమాన గోపురాన్ని ఆవిష్కరించనున్న సీఎం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఈనెల 23న సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లనున్నారు. ఈ మేరకు ఆలయ ఈవో భాస్కర్‌రావు శుక్రవారం వెల్లడించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా రాష్ట్రప్రభుత్వం చేపట్టిన యాదగిరీశుడి స్వర్ణ దివ్య విమాన గోపురాన్ని సీఎం ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. బంగారు తాపడంతో తయారు చేసిన శ్రీనృసింహ అవతారాలు, కేశవ నారాయణమూర్తులు, గరుడమూర్తులు, తదితర దేవతామూర్తుల విగ్రహాలకు వానమామలై మఠం 31వ పీఠాధిపతులు శ్రీమధుర కవి రామానుజ జీయర్ స్వామీజీ ఆధ్వర్యంలో ఉదయం 11.54 గంటలకు మహా కుంభాభిషేక సంప్రోక్షణ పూజలు జరిపిస్తారని చెప్పారు. అనంతరం రామానుజ జీయర్ స్వామిజీతో కలిసి ముఖ్యమంత్రి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురాన్ని ఆవిష్కరించి శ్రీస్వామి వారికి అంకితమిస్తారని వెల్లడించారు. సీఎం 23న ఉదయం 10.30 గంటలకు హెలికాప్టర్ ద్వారా యాదగిరిగుట్టకు చేరుకుంటారని, అక్కడి నుంచి కొండపైన వీవీఐపీ గెస్ట్‌హౌస్‌లోకి వెళ్లి, సంప్రదాయ దుస్తులతో యాగశాలలో నిర్వహించే మహా పూర్ణాహుతి వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. తర్వాత ఉత్తర ద్వారం నుంచి ఆలయ విమాన గోపురం వద్దకు వెళ్లనున్నట్లు అధికారులు వెల్లడించారు.

నేడు బీసీ నేతలతో సీఎం రేవంత్ భేటీ

ప్రజాభవన్ వేదికగా సమావేశం.. హాజరుకానున్న టీపీసీసీ చీఫ్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ బీసీ నేతలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌తో కలసి ఆయన బీసీ నాయకులతో సమావేశం కానున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో కులగణన జరగడం, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల కోసం త్వరలో ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పార్టీ బీసీ నేతలకు కర్తవ్యబోధ చేసేందుకు గాను ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

మహాకుంభాభిషేక, సంప్రోక్షణకు కేసీఆర్‌కు ఆహ్వానం



కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యాదగిరి క్షేత్రం అర్చకులు, అధికారులు

సాక్షి, హైదరాబాద్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం స్వర్ణ విమాన గోపురానికి ఈనెల 23న జరిగే మహా కుంభాభిషేక, సంప్రోక్షణ మహోత్సవానికి రావాల్సిందిగా మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుకు ఆహ్వానం అందింది. ఈమేరకు యాదగిరిగుట్ట ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్‌శర్మ, ఆలయ అర్చకులు శుక్రవారం ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే మార్చి ఒకటో తేదీ నుంచి 11 వరకు జరిగే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరు కావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రాలతో కేసీఆర్‌కు ఆశీర్వచనం పలికారు. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరాచార్యులు, ముఖ్య అర్చకులు నరసింహమూర్తి, కిరణ్ కుమారాచార్యులు, పీఆర్వో రాజన్‌బాబు తదితరులున్నారు.



స్కూళ్లలో 'ఇంటర్నల్' దందా!

ఇంటర్నల్ మార్కుల కోసమంటూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల బాదుడు

- ఎక్కువ మార్కులు వేస్తేనే.. ఎక్కువ జీపీఏ వస్తుందంటూ వసూళ్లు
- ఒక్కో విద్యార్థి వద్ద రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు తీసుకుంటున్న వైనం
- రూ.కోట్లలో 'వ్యాపారం'... మార్కుల తనిఖీ బృందాలకు ముడుపులు..
- ఎంఈవోలు, డీఈవోలు, ఉన్నతాధికారుల దాకా వాటాలు వెళతాయనే ఆరోపణలు
- ప్రైవేటు స్కూళ్లలో 20కి 20 మార్కులు.. సర్కారీ స్కూళ్లలో గీచిగీచి మార్కులు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి అంతర్గత మార్కులపై ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు దందా మొదలుపెట్టాయి. ఎక్కువ ఇంటర్నల్ మార్కులు వేసే పేరిట అదనపు వసూళ్లు మొదలు పెట్టాయి. ఇలా ఎక్కువ మార్కులు వేస్తే, మొత్తంగా మార్కులు పెరిగి... జీపీఏ ఎక్కువగా వస్తుందని ఒత్తిడి చేస్తున్నాయి. ఇంటర్నల్ మార్కుల తనిఖీలకు వచ్చే బృందాలకు కొంత ముట్టజెబుతున్నాయి. జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకూ అందులో వాటాలు వెళుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'ఇంటర్నల్స్' వసూళ్ల దందా దాదాపు రూ.వంద కోట్ల వరకు ఉన్నట్టు అంచనా. విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయంలో ఓ అధికారి కనుసన్నల్లో ఇదంతా నడుస్తున్నట్టు విద్యాశాఖ వర్గాలే పేర్కొంటుండటం గమనార్హం. ప్రతీ జిల్లాకు టార్గెట్లు పెట్టి మరీ వసూలు చేస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాలతోపాటు గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ప్రైవేటు స్కూళ్లు పెద్ద ఎత్తున 'ఇంటర్నల్స్' ఖర్చు పెడుతున్నాయి. విద్యార్థుల జీపీఏ పెంచుకోవడం, దాన్ని ప్రచారానికి వాడుకోవడం, తద్వారా మార్కెట్ పెంచుకోవడమే దీని ముఖ్య ఉద్దేశంగా.. ఈ అక్రమాలకు విద్యాశాఖ అధికారులు సహకరిస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

మొత్తం మార్కులూ వేసుకుని..

టెన్త్ క్లాస్‌లో ఒక్కో సబ్జెక్టుకు వంద మార్కులుంటాయి. 80 మార్కులు థియరీ పరీక్షల ద్వారా వస్తాయి. ఇంటర్నల్ మార్కులు 20. విద్యార్థులకు ఈ మార్కులు వేయడానికి విద్యాశాఖ కొన్ని నిబంధనలు పెట్టింది. సంవత్సరంలో నిర్వహించే అంతర్గత పరీక్షలన్నింటినీ కొలమానంగా తీసుకోవాలి. స్లిప్ టెస్టులకు 5 మార్కులు, ప్రాజెక్టు వర్క్‌కు 5, టెక్స్ట్‌బుక్స్ రైటింగ్, రీడింగ్‌కు 5, పుస్తక సమీక్షకు 5 మార్కులు వేయాలి. ప్రతీ ప్రైవేటు పాఠశాల ఈ మార్కులను మొత్తం 20కి 20గా వేసుకుంటున్నాయి. నిజానికి ఈ మార్కుల శాస్త్రీయతను జిల్లా విద్యాశాఖ నేతృత్వంలోని కమిటీలు పరిశీలించాలి. డీఈవో నేతృత్వంలో ప్రతి మండలానికి కొన్ని కమిటీలను వేస్తారు. జిల్లావ్యాప్తంగా 60 నుంచి వంద కమిటీల వరకూ వేస్తుంటారు. ఒక్కో కమిటీలో ఒక గెజిటెడ్ హెచ్‌ఎం, నాన్-లాంగ్వేజ్, లాంగ్వేజ్ టీచర్ కలిపి ముగ్గురు ఉంటారు. వారు ప్రైవేటు స్కూళ్లకు వెళ్లి.. విద్యార్థులకు వేసిన ఇంటర్నల్స్ మార్కులు సరిగానే ఉన్నాయా? లేదా? పరిశీలిస్తారు. తర్వాత మార్కులను డీఈవో కార్యాలయానికి పంపుతారు. అక్కడ రాష్ట్రస్థాయి పోర్టల్‌లో ఈ మార్కులను ఫీడ్ చేస్తారు. థియరీ పరీక్షల్లో మార్కులను, ఇంటర్నల్ మార్కులను కలిపి తుది ఫలితాన్ని ఇస్తారు. ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు వేసిన మార్కులు సరైనవేనని తనిఖీ కమిటీలు నిర్ధారిస్తున్నాయి. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ఇంటర్నల్ మార్కులు 14కు మించని పరిస్థితి ఉంటే.. ప్రైవేటు బడుల్లో మాత్రం కనిష్టంగా 18 నుంచి గరిష్టంగా 20 వరకు వేసినా కమిటీలు ఆమోదం చెబుతున్నాయి.

జరుగుతున్న తంతు ఇదీ...

- ప్రైవేటు స్కూళ్లలో ఇంటర్నల్ అసెస్‌మెంట్‌పై తనిఖీ బృందాలే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఎక్కడా శాస్త్రీయత లేదని సభ్యులు పేర్కొంటున్నారు. అయినా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఉన్నతాధికారులపై ఒత్తిడి చేయడం వల్ల తామేమీ చేయలేపోతున్నామని అంటున్నారు. తనిఖీ బృందాలు ఇచ్చిన ఫీడ్ బ్యాక్ ప్రకారం కొన్ని ఉదాహరణలివీ..
- హైదరాబాద్‌లోని నాలుగు ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల ప్రాజెక్టు వర్క్ అందరిదీ ఒకే రకంగా ఉంది. దాన్ని గూగుల్ నుంచి కాపీ కొట్టినట్టు తెలుస్తోంది. ఒకరిద్దరు విద్యార్థులను ఆ ప్రాజెక్టు వర్క్‌పై ప్రశ్నిస్తే.. సమాధానం చెప్పలేకపోయారు.
- ఖమ్మంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో వంద మంది విద్యార్థుల రికార్డులు ఒకే రకంగా ఉన్నాయి. అవి కూడా ఎవరో రాసినట్టు తెలుస్తోంది. కొన్ని పదాలు పూర్తిగా ఆన్‌లైన్ నుంచి తీసుకున్నట్టుగా ఉంది. భాష కఠినమైన, పొంతనలేని తరహాలో ఉంది. దీనిపై విద్యార్థులకు ఏమాత్రం అవగాహన లేదు.
- నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో అంతర్గత పరీక్షలకు హాజరవని విద్యార్థులకూ ఇంటర్నల్ మార్కులు వేశారు. పరీక్ష పేపర్లు ఎక్కడో పోయినట్టు వారు పేర్కొనడం గమనార్హం. ఓ రాజకీయ నాయకుడి బంధువు స్కూల్ కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.



రూ.వంద కోట్ల దందా..

రాష్ట్రంలో ఈ సంవత్సరం 5,09,391 మంది టెన్త్ పరీక్షలు రాయనున్నారు. అందులో రెగ్యులర్‌గా రాసేవాళ్లు 4,97,341 మంది, గత ఏడాది ఫెయిలైన విద్యార్థులు మరో 12,050 ఉన్నారు. 11,544 ప్రైవేటు స్కూళ్ల నుంచి ఈ ఏడాది 2,36,674 మంది టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. వీరిలో చాలా మంది ఓ నాలుగైదు కార్పొరేట్ విద్యాసంస్థలకు చెందిన వారేనని అంచనా. ఇంటర్నల్ మార్కులు ఎక్కువ వస్తే జీపీఏ పెరుగుతుందని ఆ స్కూళ్లు చెబుతున్నాయి. ఇందుకోసం ఒక్కో విద్యార్థి నుంచి స్కూల్ స్థాయిని బట్టి రూ.5 వేలు మొదలు రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2 లక్షల మందికిపైగా విద్యార్థులు ఇంటర్నల్ మార్కుల కోసం అదనంగా డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని.. ఈ మొత్తం రూ.వంద కోట్ల వరకు ఉంటుందని అంచనా. ప్రతీ స్కూల్ కూడా తనిఖీ బృందాల్లో ముగ్గురికి రూ.లక్షల్లో ముట్టజెబుతున్నారని.. ఎంఈవోలు, డీఈవోలు, రాష్ట్ర విద్యాశాఖలోని ఉన్నతాధికారులకూ ముడుపులు వెళ్తున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో స్కూళ్లు వేసిన మార్కులు సరికాదని తెలిసినా.. కమిటీలు తూతూమంత్రంగానే తనిఖీ చేసి ఆమోదించాల్సి వస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

విచారణకు ఆదేశిస్తాం



"ఇంటర్నల్ మార్కుల తనిఖీ వ్యవహారంపై విచారణ జరిపిస్తాం. అనుమానమున్న జిల్లాలు, ప్రాంతాల్లోని పరిస్థితిని సమీక్షించాలని అధికారులకు ఆదేశిస్తాం. ఇంత వరకు ఈ వ్యవహారంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు. అయినా ఎక్కడైనా పొరపాట్లు ఉన్నాయేమో పరిశీలించి, అలాంటివి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటాం. – ఈవీ నర్సింహారెడ్డి, పాఠశాల విద్య డైరెక్టర్

దగ్గరుండి పరిశీలిస్తున్నాం



ప్రైవేటు స్కూళ్లలో అంతర్గత మార్కులను తనిఖీ బృందాలు పరిశీలించిన తర్వాత.. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మరోసారి పరిశీలన చేస్తున్నాం. ఎక్కడైనా అనుమానం వస్తే స్వయంగా వెళ్లి పరిశీలిస్తాం. బృందాలు ఇంకా మార్కులు ఫీడ్ చేయలేదు. చేసిన తర్వాత ఈ ప్రక్రియ ఉంటుంది. – సోమశేఖరశర్మ, డీఈవో, ఖమ్మం

ఇలా చేయడం దారుణం..



తనిఖీ బృందాలకు ముట్టజెప్పాలనే పేరుతో ప్రైవేటు స్కూళ్లు డబ్బులు వసూలు చేయడం దారుణం. దీనికి టీచర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాల్సి ఉంది. అంతర్గత మార్కులు పెంచేందుకు అన్యాయంగా అనుమతిస్తే.. సంబంధిత తనిఖీ బృందాల్లోని టీచర్లపై చర్యలు తీసుకోవాలి. – ఆర్.రాజగంగారెడ్డి, గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

రూ.10 వేలు అడిగారు

ఇంటర్నల్ మార్కులు జీపీఏ పెరగడానికి కీలకమని కరస్పాండెంట్ చెప్పారు. అధికారులను మేనేజ్ చేయాలని, అందుకోసం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇవ్వకుంటే మార్కులు తగ్గిస్తారని చెప్పారు. అందరూ ఇస్తున్నారు కాబట్టి భయంతో మేం కూడా ఇచ్చాం." – హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు స్కూల్ విద్యార్థి

క్లుప్తంగా...

పాఠాలు చెప్పిన కలెక్టర్



ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర ఉపాధ్యాయుడిగా మారారు. రాత్రి నిద్రలో భాగంగా ఆయన ములుగు మండలం జాకారం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో శుక్రవారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్ గణితం బోధించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. – ములుగు రూరల్

బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మాజీ ఎమ్మెల్యే కోనప్ప ప్రచారం



పెంచికల్‌పేట్(సిర్పూర్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో శుక్రవారం ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న ఆయన బీఎస్పీ అభ్యర్థికి మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల మధ్య వర్గపోరుతో కొద్దిరోజులుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఎంబీఏ ఎంట్రన్స్ మార్చి 9కి వాయిదా

బంజారాహిల్స్ (హైదరాబాద్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ఎంట్రన్స్ టెస్ట్‌ను మార్చి 9కి వాయిదా వేసినట్లు విద్యార్థి సేవల విభాగ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2న (ఆదివారం) జరగాల్సిన పరీక్షను సాంకేతిక కారణాలతో వాయిదా వేశామన్నారు. ఎంట్రన్స్ టెస్ట్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 4వ తేదీ వరకు అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు.

ఉమ్మడి గురుకుల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

రేపు 11 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష

లక్డీకాపూల్ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర గురుకులాల్లో ప్రవేశాలకు ఈనెల 23న నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా కోఆర్డినేటర్ వి.జయంతి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు 9.30 గంటల వరకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, పరీక్ష ప్యాడ్, బ్లూ లేదా బ్లాక్ పెన్, ఆధార్ కార్డు తప్పకుండా తీసుకురావాలన్నారు.

'కారు' ఇక పరుగు!



ఏడాది పొడవునా పార్టీ రజతోత్సవాలు..ప్రజా సమస్యలపై పోరు

మళ్లీ అధికారమే లక్ష్యంగా కొత్త వ్యూహాలకు పదును

- ఉద్యమకాలంలో కలిసి నడిచిన శక్తులకు తిరిగి చేరువయ్యే యోచన
- తెలంగాణ అస్తిత్వాన్ని గుర్తు చేస్తూ పార్టీ భావజాల వ్యాప్తికి నిర్ణయం
- ప్రజా సమస్యలపై పోరుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సారథ్యం
- హరీశ్‌కు సంస్థాగత నిర్మాణం, శిక్షణ, సిల్వర్ జూబ్లీ నిర్వహణ బాధ్యతలు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, ప్రజా సంఘాలతో సమన్వయం కవితకు
- పార్టీ భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు 30 మందితో కోర్ గ్రూప్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా ఆవిర్భవించిన భారత్ రాష్ట్ర సమితి ఈ ఏడాది ఏప్రిల్ 27 నాటికి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఏడాది పొడవునా పార్టీ రజతోత్సవాల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. మరోవైపు సంస్థాగత నిర్మాణంతో పాటు ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా కొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. ఈ క్రమంలోనే పార్టీ కీలక నేతల మధ్య పని విభజన ద్వారా అన్ని వర్గాల ప్రజలకు చేరువ కావడంపై దృష్టి సారించింది. ఉద్యమకాలంలో కలిసి నడిచిన శక్తులకు తిరిగి దగ్గర కావాలని నిర్ణయించింది. తెలంగాణ అస్తిత్వాన్ని మరోసారి గుర్తు చేస్తూ పార్టీ భావజాలాన్ని వ్యాపింపజేయాలనే అభిప్రాయంతో ఉంది. తద్వారా కొత్త తరాన్ని ఆకర్షించే ఎత్తుగడలకు పదును పెడుతోంది. ఈ నెల 19న జరిగిన బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి భేటీలో పార్టీ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఈ మేరకు సంకేతాలు ఇచ్చారు.

కీలక నేతలకు ముఖ్య బాధ్యతలు

పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడంతో పాటు అన్ని స్థాయిల్లో యంత్రాంగాన్ని సమన్వయం చేసేందుకు కీలక నేతల నడుమ పని విభజన చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీ రామారావుకు క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి అమలు బాధ్యతను అప్పగించనున్నారు. ఇప్పటికే ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన రైతు ధర్నాల్లో పాల్గొన్న కేటీఆర్.. ప్రభుత్వ వైఫల్యాలపై భవిష్యత్తులో జరిగే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు నేతృత్వం వహించనున్నారు. సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావుకు పార్టీ సంస్థాగత నిర్మాణ బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారు. ఏప్రిల్ 10న ప్రారంభమయ్యే పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు గ్రామ, వార్డు, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల కూర్పు, పార్టీ శిక్షణ కార్యక్రమాలు తదితరాలను హరీశ్ పర్యవేక్షిస్తారు. పార్టీ రజతోత్సవాల నిర్వహణ బాధ్యతలను కూడా హరీశ్‌రావుకే అప్పగించనున్నట్లు సమాచారం.

అనుబంధ సంఘాలపై కవిత దృష్టి

ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన అంశాలపై దృష్టి కేంద్రీకరించి పనిచేస్తున్న ఎమ్మెల్సీ కవిత.. పార్టీ అనుబంధ సంఘాలను బలోపేతం చేసే దిశగా ఇప్పటికే కార్యాచరణ అమలు చేస్తున్నారు. మహిళా రిజర్వేషన్లు, కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వంటి అంశాలపై కవిత వరుస సదస్సులు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

ఉద్యమ శక్తుల ఏకీకరణ.. యువతకు చేరువ

ఉద్యమ కాలంలో పార్టీతో కలిసి వచ్చిన వ్యక్తులు, శక్తులకు తిరిగి దగ్గర కావాలనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 27 నుంచి ఏడాది పొడవునా సాగే పార్టీ రజతోత్సవాల్లో ఉద్యమంలో కలిసి వచ్చిన కవులు, కళాకారులు, రచయితలు, వివిధ జేఏసీల్లో క్రియాశీలంగా పనిచేసిన వారితో కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తద్వారా తెలంగాణ అస్తిత్వాన్ని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేయడంతో పాటు కొత్త తరానికి తెలంగాణ నేపథ్యం, రాష్ట్ర సాధన ఉద్యమం తదితరాలను పరిచయం చేయాలని, పార్టీ భావజాలాన్ని వ్యాపింపజేయాలని కేసీఆర్ భావిస్తున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్‌ఎస్ పాత్ర, పదేళ్ల పాలనలో రాష్ట్ర అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేసేలా కార్యక్రమాలు రూపొందించనున్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ సమయంలో పుట్టిన పసికందులు ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తున్న యువతగా ఎదిగారు. వారిలో తెలంగాణ అస్తిత్వ స్ఫూర్తిని రగిలించేలా సదస్సులు, సమావేశాలు, సభలు నిర్వహించాలని బీఆర్‌ఎస్ భావిస్తోంది. ఈ కార్యక్రమాలకు రూపకల్పన బాధ్యతను పార్టీలోని కొందరు ముఖ్య నేతలకు అప్పగించనున్నారు.

కార్యాచరణ రూపకల్పనకు కోర్ గ్రూప్

పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చలు, ప్రణాళికల రూపకల్పనకు సుమారు 25 నుంచి 30 మంది సీనియర్ నేతలతో కోర్ గ్రూప్ ఏర్పాటు చేయాలని అధినేత భావిస్తున్నారు. ఈ గ్రూప్‌లో ఉద్యమ కాలం నుంచి పార్టీలో పనిచేసిన నేతలతో పాటు వివిధ సందర్భాల్లో పార్టీలో చేరిన సీనియర్లకు చోటు కల్పిస్తారు. ఎర్రవల్లి నివాసంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని కూడా భావిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలో భోజనశాల, పార్కింగ్ తదితర వసతుల కల్పన పూర్తయిన తర్వాత మినీ సభలను తలపించేలా ఈ సమావేశాలు జరగనున్నాయి.

మేడమ్.. మార్క్!



- జూమ్ సమావేశాల్లో పాల్గొంటున్న కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి
- బాధ్యతలు స్వీకరించకున్నా పని షురూ చేసిన మీనాక్షి
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుపై నేతలకు ఎప్పటికప్పుడు దిశానిర్దేశం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమితులైన మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ తనదైన శైలిలో ముందుకెళుతున్నారు. పార్టీకి, గాంధీ కుటుంబానికి అత్యంత విధేయురాలిగా గుర్తింపు పొందిన ఆమె తనదైన శైలిలో నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఏ నాయకుడికైనా పార్టీనే ముఖ్యమని, పార్టీ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మాత్రమే పనిచేయాల్సి ఉంటుందనే సంకేతాలిస్తున్నారు. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జిగా ఇటీవలే నియమితురాలైన ఆమె ఇంకా రాష్ట్రానికి వచ్చి బాధ్యతలు స్వీకరించలేదు. కానీ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నిర్వహిస్తున్న జూమ్ మీటింగ్‌లలో పాల్గొంటున్నారు. బుధ, గురువారాల్లో జరిగిన రెండు జూమ్ సమావేశాలకు హాజరైన ఆమె రాష్ట్ర నేతలకు కీలక ఆదేశాలిచ్చారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ నేతలను కార్యోన్ముఖులు చేసేందుకు అవసరమైన కార్యాచరణను ఈ సమావేశాల్లో ఆమె స్పష్టం చేశారు. ప్రతి 50 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకు ఒక ఇన్‌చార్జిని ఏర్పాటు చేయాలని సూచించిన మీనాక్షి.. ఆ 50 మందిని సదరు ఇన్‌చార్జి కలుస్తారో లేదో తాను స్వయంగా చెక్ చేస్తానని చెప్పినట్టు సమాచారం. ఓటర్లను వ్యక్తిగతంగా కలవడం ద్వారా వారిని పార్టీకి ఓటేసేలా చేయవచ్చని, పోలింగ్ శాతం పెంచేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. తాను హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాబోనని, నియోజకవర్గాలకు వచ్చి పార్టీ నేతల పనితీరును పరిశీలిస్తానని చెప్పినట్టు తెలిసింది.

ఎవరైనా 'లైన్'లో ఉండాల్సిందే..!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితురాలైన మీనాక్షి నటరాజన్‌ను తెలంగాణ ఇన్‌చార్జిగా నియమించడం వెనుక కారణమేదైనా, ఆమె రాక కచ్చితంగా పార్టీకి మేలు చేస్తుందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. నిరాడంబరతకు ప్రాధాన్యమిచ్చే మీనాక్షి ఎప్పుడూ పార్టీ లైన్ మేరకే వ్యవహరిస్తారని, నాయకులను సైతం లైన్‌లో ఉంచేలా ఆమె కార్యాచరణ ఉంటుందని చెబుతున్నారు. తామేదో చేసినట్టు చెప్పుకునే వారికన్నా పార్టీ కోసం పనిచేసే వారికి మాత్రమే ఆమె ప్రాధాన్యత ఇస్తారని, ఆమె హయాంలో పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం అయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో రూ. 50 వేల కోట్ల దోపిడీకి స్కెచ్

- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపణ
- ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని ఎన్నికల ప్రచారంలో రేవంత్ చెప్పలేదా?
- హామీ ఇచ్చినట్లు ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయకుంటే ప్రభుత్వం మెడలు వంచుతాం



పెద్దపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

సాక్షి, పెద్దపల్లి: లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) పేరుతో రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 వేల కోట్లు దోపిడీ చేసేందుకు స్కెచ్ వేసిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పెద్దపల్లిలో పర్యటించిన ఆయన మీడియాతో మాట్లాడారు. 'గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్, సీతక్క చెప్పిందేంటి? అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తాం.. పైసలు తీసుకోం... బీఆర్‌ఎస్ చేస్తానంటే చేయించుకోవద్దని చెప్పింది నిజం కాదా?' అని బండి సంజయ్ ప్రశ్నించారు. అందుకు సంబంధించి ఆధారాలు ఉన్నాయంటూ గతంలో కాంగ్రెస్ నేతల వీడియో క్లిప్పింగ్‌లను బండి సంజయ్ మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ పేరు చెప్పి పైసలు దండుకోవాలనుకుంటోందా అని ఆయన ప్రశ్నించారు. ఆ పైసలు చాలవని రేపు మనిషి పుట్టినా, చచ్చినా కూడా పైసలు కట్టాలని డెత్ రెగ్యులరైజేషన్ స్కీం, బర్త్ రెగ్యులరైజేషన్ స్కీం తెస్తారా?' అంటూ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇచ్చిన మాట ప్రకారం ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాల్సిందేనని.. లేకుంటే ప్రభుత్వం మెడలు వంచుతామని హెచ్చరించారు.

ముస్లింలను బీసీల్లో ఎలా కలుపుతారు?

కులగణన తప్పుల తడక అని, బీసీ జనాభాను తగ్గించే కుట్ర జరుగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. 'బీసీ జాబితాలో ముస్లింలను ఎట్లా కలుపుతారు? 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు ఇస్తామని చెబుతూ అందులో 10 శాతం ముస్లింలకు ఇస్తే ఇక బీసీలకు మిగిలేది 32 శాతమే. ముస్లిం రిజర్వేషన్లకు మేం వ్యతిరేకం. ముస్లింలను కలిపి బీసీ బిల్లు పంపితే కేంద్రం నుంచి మళ్లీ వెనక్కు పంపి తీరుతాం' అని ఆయన స్పష్టం చేశారు.

15 శాతం కమీషన్ ఇస్తేనే..

'ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,500 కోట్ల వరకు చేరాయి.. 15 శాతం కమీషన్ ఇస్తేనే ఫీజు బకాయిలు చెల్లిస్తామని కొందరు మంత్రులు చెబుతున్నారట. ఇంతకంటే దుర్మార్గం ఇంకేమైనా ఉందా?' అని సంజయ్ మండిపడ్డారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు తొలి పీఆర్సీ జాప్యంతో 21 నెలలు నష్టపోయారని.. రెండో పీఆర్సీని నేటికీ అమలు చేయకపోవడంతో 20 నెలలుగా వారికి నష్టం జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆయన విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయులంతా కాంగ్రెస్ నమ్మక ద్రోహాన్ని గమనించాలని.. బీజేపీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, పెద్దపల్లి బీజేపీ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించండి

- కలెక్టర్లకు సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశం
- ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్




సాక్షి, హైదరాబాద్: ఈనెల 27వ తేదీన జరగనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాల కల్పన, వెబ్‌క్యాస్టింగ్ ఏర్పాట్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, తగినన్ని బ్యాలెట్ బాక్సులను అందుబాటులో ఉంచడం, పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతా ఏర్పాట్లు, 24 గంటల సీసీ కెమెరాల పర్యవేక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి ఈ సందర్భంగా ఆయా జిల్లాల కలెక్టర్లు సీఈవోకు వివరించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ పోలింగ్ సిబ్బంది మధ్య సమన్వయం ముఖ్యమని, ఓటరు స్లిప్పుల పంపిణీ, మైక్రో అబ్జర్వర్ల నియామకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ తేదీన ఓటర్లకు సెలవు

ఒక పట్టభద్రుల స్థానం, రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు ఈ నెల 27వ తేదీన పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఆ రోజు ఓటర్లకు సెలవు ప్రకటించారు. ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల ఉద్యోగులకు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల కలెక్టర్లను సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు.

ఏపీ కేడర్‌కు ముగ్గురు ఐపీఎస్‌లు

అంజనీకుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను ఏపీలో రిపోర్టు చేయాల్సిందిగా కేంద్ర హోంశాఖ ఆదేశం



అంజనీకుమార్



అభిలాష బిస్త్



అభిషేక్ మహంతి

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతున్న ముగ్గురు ఐపీఎస్ అధికారులను వారి హోం కేడర్ అయిన ఏపీలో రిపోర్ట్ చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. సీనియర్ ఐపీఎస్ అధికారులు అంజనీ కుమార్, అభిలాష బిస్త్, అభిషేక్ మహంతిలను వెంటనే తెలంగాణ కేడర్ నుంచి రిలీవ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అంజనీకుమార్ తెలంగాణ రోడ్ సేఫ్టీ అథారిటీ డీజీగా, అభిలాష బిస్త్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా, ట్రెనింగ్స్ డీజీగా పనిచేస్తున్నారు. అభిషేక్ మహంతి కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇంతకుముందే తెలంగాణలో పనిచేసిన ఏపీ కేడర్ ఐఏఎస్ అధికారులు సోమేశ్‌కుమార్, వాకాటి కరుణ, వాణి ప్రసాద్, రోనాల్డ్ రోస్, ఆమ్రపాలిలను ఏపీ కేడర్‌కు పంపిన విషయం తెలిసిందే.

శోకింపతగని వాటిని గూర్చి నీవు శోకించుచున్నావు.
పండితులు గతులు కల్గిన, గతులు లేని వాటిని గూర్చి బాధపడరు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 22 ఫిబ్రవరి 2025

ఖైదీలపై ఇంత వివక్షా!

జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు శిక్షనుంచి మినహాయింపు (రెమిషన్) ఇవ్వడానికి సంబంధించిన విధానం ఉన్నప్పుడు దాన్ని అమలు చేయటం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతనీ, ఖైదీలు అడగటం లేదు గనుక ఆ మినహాయింపుపై ఆలోచించాల్సిన అవసరం లేదని భావించటం సరికాదనీ సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం ఇచ్చిన తీర్పు కీలకమైనది. ఒక చట్టం రూపొందటం వెనక ఎంతో కృషి ఉంటుంది. దాని అవసరాన్ని గుర్తించటం తొలి మెట్టయితే ఆ తర్వాత జరిగే ప్రక్రియ ఎంతో సుదీర్ఘమైనది. తొలుత చట్టం పూర్వరూపమైన బిల్లు ముసాయిదా రూపురేఖలపైనా, ఆ తర్వాత దాన్లో ఉండాల్సిన నిబంధనలపైనా, పరిహరించవలసినవాటిపైనా లోతైన చర్చలుంటాయి. చట్ట సభలోనూ, పౌర సమాజంలోనూ దాని మంచిచెడ్డలపై నిశిత పరిశీలన ఉంటుంది. తీరా చట్టం అయ్యాక ప్రభుత్వాలు దాన్ని నిర్లక్ష్యం చేస్తే ఈ కృషి మొత్తం వృథా అవుతుంది. కొన్ని ప్రభుత్వాల ధోరణి మరీ అన్యాయం. ఖైదీల శిక్ష మినహాయింపుపై వాటికంటూ విధానమే ఉండదు. ఆ బాపతు రాష్ట్రాలకు కూడా సుప్రీంకోర్టు చురకలంటించింది. ఇంతవరకూ శిక్ష మినహాయింపుపై విధానం లేని రాష్ట్రాలు రెండు నెలల్లో ఆ పని చేయాలనీ, అది వాటి బాధ్యతనీ ధర్మాసనం తేల్చిచెప్పింది. ఖైదీలు అడగలేదన్న సాకు చెల్లదన్నది తీర్పు సారాంశం.

నిన్న మొన్నటివరకూ నూటయాభైయేళ్ల నాటి నేర శిక్షాస్మృతి(సీఆర్‌పీసీ) ఉండేది. దాని స్థానంలో నిరుడు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) అమల్లోకొచ్చింది. సీఆర్‌పీసీలోని చాలా నిబంధనలు బీఎన్ఎస్ఎస్‌లోకి కూడా వచ్చాయి. కాకపోతే ఆ సెక్షన్ల క్రమసంఖ్యలు మారాయి. ఖైదీలకు శిక్షాకాలం నుంచి మినహాయింపునిచ్చేందుకు, ఆ శిక్షను తాత్కాలికంగా నిలిపి వుంచేందుకూ ప్రభుత్వానికి సీఆర్‌పీసీలోని సెక్షన్ 432 అధికారం ఇవ్వగా... బీఎన్ఎస్ఎస్‌లోని 473వ సెక్షన్ ఆ పని చేస్తోంది. చట్టం ఇంత స్పష్టంగావున్నా రాష్ట్ర ప్రభుత్వాలు దానిపై శ్రద్ధ పెట్టడం లేదు. ఈ సెక్షన్లకు అనుగుణంగా విధాన రూపకల్పన చేసిన ప్రభుత్వాలూ, అసలు దాని జోలికేపోని ప్రభుత్వాలూ కూడా శిక్ష మినహాయింపు ఇవ్వొచ్చన్న సంగతే తెలియనట్టు వ్యవహరిస్తున్నాయి.

జైళ్లంటే చాలామందికి చిన్నచూపు ఉంటుంది. అక్కడ నిర్బంధంలో ఉన్నవారంతా ఏదో తప్పు చేసేవుంటారన్న భావనలోనే చాలామంది ఉంటారు. జైళ్లలో ఉన్నవారంతా నేరస్తులు కాదు. నేరం రుజువై శిక్ష అనుభవిస్తున్నవారిలో కూడా చాలామందికి జరిగిన నేరంతో నిజంగా ప్రమేయం లేకపోవచ్చు. సకాలంలో తగిన న్యాయసహాయం అందకపోవటం వల్ల కావొచ్చు... ఆర్థిక స్థోమత లేకపోవటంవల్ల కావొచ్చు వారు ఈ ఉచ్చులో చిక్కుకుని ఉండొచ్చు. పలుకుబడి ఉన్నవారు తమ నేరాన్ని వేరేవారిపైకి నెట్టి వారు జైలుకు పోయేలా చేసిన సందర్భాలూ అప్పుడప్పుడు బయట పడుతుంటాయి. ఒకవేళ నిజంగా నేరంతో ప్రమేయం ఉన్న వ్యక్తికి సైతం అతడి హక్కులన్నీ హరించుకుపోవు. శిక్ష కారణంగా కొన్ని హక్కులు తాత్కాలికంగా నిలిచిపోతాయి. శిక్ష మినహాయింపు అర్హత పొందిన ఖైదీలకు ఆ వెసులుబాటును కల్పించకపోవటం అంటే ప్రభుత్వాలు వివక్ష ప్రదర్శించటమే, ఏకపక్షంగా వ్యవహరించటమే అవుతుంది. చట్టం ముందు పౌరులందరూ సమానులేనని, ఎవరి పట్లా వివక్ష ప్రదర్శించరాదని ప్రాథమిక హక్కుల్ని ప్రసాదించే రాజ్యాంగంలోని 14వ అధికరణ స్పష్టం చేస్తోంది. శిక్షలో మినహాయింపునకు అర్హత పొందినవారికి దాన్ని నిరాకరించటం అంటే ఈ అధికరణాన్ని ఉల్లంఘించటమే అవుతుంది. శిక్షకాలంలో మినహాయింపునివ్వటం కూడా విచక్షణా రహితంగా ఉండకూడదు. శిక్ష అనుభవిస్తున్న వ్యక్తి నేర స్వభావంలో మార్పు వచ్చిందో లేదో గమనించటం, సమాజంలో సాధారణ మనిషిగా జీవించ గలుగుతాడా అని చూడటం జైలు అధికారుల బాధ్యత. వారినుంచి నివేదికలు తెప్పించుకుంటూ తగిన నిర్ణయానికి రావాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగానికుంటుంది. ఈ తీర్పులో సుప్రీంకోర్టు మరో కీలకమైన అంశాన్ని గుర్తుచేసింది. శిక్ష మినహాయింపునకు రూపొందించే నిబంధనలు ఖైదీలు వినియోగించుకోవటం అసాధ్యమైన రీతిలో కఠినంగా ఉండరాదని... అవి అస్పష్టంగా కూడా ఉండకూడదని సూచించింది. ఒకవేళ మినహాయింపునకు అర్హత లేనట్టయితే అందుకు గల కారణాలేమిటో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీకి జైలు అధికారులు వివరించాల్సి వుంటుంది. అదే సమయంలో తన అనర్హతకు చూపిన కారణాలను సవాలు చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని ఖైదీకి చెప్పాల్సిన బాధ్యత కూడా వారిదే. ఒకవేళ బయటి కెళ్లాక ఖైదీ ప్రవర్తన సమాజానికి హాని కలిగే రీతిలో ఉన్నదని భావిస్తే శిక్ష మినహాయింపును రద్దు చేసే అధికారం ప్రభుత్వానికుంటుంది. అందుకుగల కారణాలను ఆ ఖైదీకి వివరించాలి.

చట్టాలు చేయగానే సరికాదు. వాటిని వినియోగించటానికి అవసరమైన విధానాలను కూడా రూపొందించాలి. చిత్తశుద్ధితో వాటిని అనుసరించాలి. ఆచరణకు అనువైన విధానం లేనట్టయితే చట్టాల ఉద్దేశమే నీరుగారుతుంది. 2022 నాటి నేషనల్ క్రైం రికార్డుల బ్యూరో గణాంకాల ప్రకారం దేశంలోని 1,300కు పైగా జైళ్లలో 5,73,200 మంది ఖైదీలున్నారు. ఈ జైళ్లలో వాస్తవానికి 4,36,266 మందికి సరిపడా వసతులు మాత్రమే ఉన్నాయి. జైళ్లు ఇలా కిక్కిరిసి ఉండటంవల్ల అవి సకల రుగ్మతలకూ నిలయాలవుతున్నాయి. నిస్సహాయుల పాలిట నరకాలవుతున్నాయి. చాలీచాలని సిబ్బందితో పర్యవేక్షణ అసాధ్యమై నిజంగా నేరం చేసినవారిని సంస్కరించటం మాట అటుంచి, అకారణంగా జైలుపాలైనవారు సైతం నేరగాళ్లుగా మారే ప్రమాదం పొంచివుంటోంది. తాజా తీర్పు ప్రభుత్వాల మొద్దునిద్ర వదిలించాలి.

నిజాల నిగ్గుతేల్చిన గణాంక నివేదిక

అభిప్రాయం



తన్నీరు హరీశ్‌రావు

అబద్ధపు వాగ్దానాలు, అబద్ధపు విమర్శలు, అబద్ధపు ప్రచారాలు, అబద్ధమే ఆత్మగా కొన సాగుతున్నది ఘనత వహించిన 'ఇందిరమ్మ రాజ్యం'. రేవంత్ సర్కారు దుష్ప్రచారం చూసి సమాధిలో ఉన్న జోసెఫ్ గోబెల్స్ సైతం నివ్వెరపోతున్నాడేమో! కాంగ్రెస్ ఎంత ప్రయత్నం చేసినా వారి అబద్ధపు తెరలను చీల్చుకొని సత్యం అనివార్యంగా బయటకు వస్తున్నది. అలా వచ్చినప్పుడల్లా అది కాంగ్రెస్ నాయకుల గుండెల్లో భూకంపం పుట్టిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వమే విడుదల చేసిన అభివృద్ధి గణాంకాల నివేదిక, బీఆర్ఎస్ పాలనపై కాంగ్రెస్ ప్రచారం చేస్తున్న అబద్ధాలను పటాపంచలు చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సాధించిన ప్రగతి వెలుగులను ప్రపంచానికి చాటింది.

సత్యం వెలుగును భరించలేని రేవంత్ సర్కారు నివేదికను అర్జెంటుగా ఇంటర్నెట్ నుంచి అదృశ్యం చేసింది. ఇది కాంగ్రెస్ నాయకుల చవకబారు చేష్టలకు పరాకాష్ఠ! నివేదికను ఇంటర్నెట్ నుంచి అదృశ్యం చేయగలరేమో గానీ, రాష్ట్ర ప్రజల జీవితాల్లో, వారి అనుభవాల్లో భాగమైన అభివృద్ధిని మరుగు పరచటం అసాధ్యం కదా! బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లోనూ తెలంగాణ అసాధారణ ప్రగతిని సాధించిందనేది దాచేస్తే దాగని సత్యం. ఇందుకు 'అభివృద్ధి గణాంక నివేదిక' ప్రబల సాక్ష్యంగా నిలిచింది. రేవంత్ సర్కారు చేస్తున్న దుష్ప్రచారాలను గణాంకాల సహితంగా తిప్పికొట్టింది. సుభిక్షంగా ఉన్న రాష్ట్రంపై దివాళా ముద్ర వేసి కాంగ్రెస్ గణాలు, గళాలు చేస్తున్న ప్రచారాలకు అభివృద్ధి నివేదిక చెంపపెట్టుగా నిలిచింది. రాష్ట్రం అప్పుల పాలైందని, కాళేశ్వరం కుప్ప కూలిందని, వ్యవసాయం వ్యర్థమైందని కాంగ్రెస్ చేసిన గడబిడ గగ్గోలు, గంటాపథంగా వెలువడిన గణాంకాల ముందు గడ్డిపరక లాగా తేలిపోయింది. స్వయాన ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తమ స్వహస్తాలతో విడుదల చేసిన అభివృద్ధి నివేదికలోని గణాంకాలను పరిశీలిద్దాం.

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రజలను పట్టి పీడించిన పెను భూతం విద్యుత్ సంక్షోభం. తరతరాలుగా బాధించిన కరెంట్ కోతల కథకు చరమగీతం పాడిన చరిత్ర కేసీఆర్‌కే దక్కింది. ఈ వాస్తవాన్ని అభివృద్ధి నివేదిక సుస్పష్టంగా చాటింది. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తలసరి విద్యుత్ వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2,349 యూనిట్లకు పెరిగిందనీ, ఇది భారత దేశ తలసరి విద్యుత్ వినియోగమైన 1,331 యూనిట్ల కంటే 76.4 శాతం ఎక్కువనీ నివేదిక పేర్కొంది. స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,872 మెగావాట్ల నుంచి 19,576 మెగావాట్లకు పెరిగింది. పదేండ్ల పరిపాలన... ఉత్పత్తి సామర్థ్యంలో 11,704 మెగావాట్లను అదనంగా చేర్చిందని నివేదిక తేల్చింది.

అద్భుతంగా ఆర్థిక వృద్ధి

రాష్ట్రం ఏర్పడినప్పుడు రూ. 5,05,849 కోట్లుగా ఉన్న జీఎస్‌డీపీ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 15,01,981 కోట్లకు చేరింది. ఇది 12.9 శాతం వృద్ధి రేటుకు సమానం. దేశంలో చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మినహాయిస్తే అత్యధిక జీఎస్‌డీపీ గల 7వ రాష్ట్రంగా తెలంగాణ రికార్డు నెలకొల్పింది. రూ. 1,24,67,959 కోట్ల జీడీపీలో రాష్ట్ర వాటా 4.1 శాతం నుంచి 5.1 శాతానికి పెరిగింది.



- బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తలసరి విద్యుత్ వినియోగం 1,356 నుంచి 2,349 యూనిట్లకు పెరిగింది. ఇది దేశ తలసరి విద్యుత్ వినియోగమైన 1,331 యూనిట్ల కంటే 76.4 శాతం ఎక్కువ.
- 2014-15లో 34,97,571 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంటే, 2023-24 నాటికి 1,18,10,992 ఎకరాలకు పెరిగింది. అంటే 83,13,421 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగిందన్నమాట.
- తలసరి ఆదాయం రూ. 1,24,104 నుంచి రూ. 3,56,564కు పెరిగింది. ఇది 12.4 శాతం వృద్ధి రేటుకు సమానం. ఇదే సమయంలో దేశ తలసరి ఆదాయం రూ. 86,647 నుంచి రూ. 1,84,205కు పెరిగింది. ఇది 9 శాతం వృద్ధి రేటుకు సమానం.

గడిచిన 5 ఏండ్ల జీఎస్‌డీపీ వార్షిక వృద్ధి (2018-19 నుంచి 2022-23) పరిశీలిస్తే, 14.32 శాతం నుంచి 16.7 శాతానికి పెరిగింది. ఇదే సమయానికి దేశ వృద్ధి రేటు 10.4 శాతం కావడం గమనార్హం. కాగా, 12.06 శాతంతో అత్యధిక సగటు వృద్ధి నమోదు చేసి, దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి తెలంగాణ రికార్డు నెలకొల్పడం గర్వకారణం. రూ. 1,24,104 తలసరి ఆదాయం రూ. 3,56,564కు పెరిగింది. అంటే 12.4 శాతం వృద్ధి రేటుకు సమానం. ఇదే సమయంలో దేశ తలసరి ఆదాయం రూ. 86,647 నుంచి రూ. 1,84,205కు పెరిగింది. ఇది 9 శాతం వృద్ధి రేటుకు సమానం. తెలంగాణ తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయం కంటే 1.9 రెట్లు ఎక్కువ అని నివేదిక స్పష్టం చేసింది. సిక్కిం, ఢిల్లీ సహా ఇతర చిన్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు మినహాయిస్తే తలసరి ఆదాయంలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది.

కేసీఆర్ పాలనలో వ్యవసాయం అద్భుతమైన అభివృద్ధిని నమోదు చేసింది. మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టులు నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేస్తే, 24 గంటల ఉచిత విద్యుత్, 'రైతు బంధు', 'రైతు బీమా' వంటి పథకాలు వ్యవసాయాన్ని పండుగగా మార్చాయని కాంగ్రెస్ నివేదిక ద్వారా ఒప్పుకున్నది. 2014-15లో 34,97,571 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం ఉంటే, 2023-24 నాటికి 1,18,10,992 ఎకరాలకు పెరిగింది. అంటే 83,13,421 ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగిందన్నమాట. ఇదే సమయానికి వరి ధాన్యం ఉత్పత్తి 68,17,273 టన్నుల నుంచి 2,60,88,127 టన్నులకు పెరిగింది. 2023-24 లెక్కల ప్రకారం, బియ్యం ఉత్పత్తి హెక్టారుకు 16,874 టన్నులతో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉంది. పత్తి ఉత్పత్తి 18.45 లక్షల టన్నుల నుంచి 26.34 లక్షల టన్నులకు పెరిగింది. గొర్రెల ఉత్పత్తిలో మొదటి స్థానంలో తెలంగాణ నిలిచింది. ఇవన్నీ మాయ చేస్తే, మంత్రం వేస్తే జరిగినవి కాదు.

వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు, చేనేత, గీత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళ, డయాలసిస్ పేషెంట్లు... ఇలా మొత్తం 11 విభాగాల్లో పింఛన్లు అందించి ఆసరా అందించింది గత ప్రభుత్వం. బీఆర్ఎస్ ప్రభుత్వం 2023-24 వరకు 44,10,320 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అందులోనూ కోతలు విధించింది.

హామీల ప్రస్తావన...

ఇదే నివేదికలో 'అభయహస్తం' మేనిఫెస్టో గురించి ప్రస్తావించారు. సగం సగం అమలు చేసిన ఫ్రీ బస్సు, సిలిండర్, గృహజ్యోతి గురించి మాత్రమే ప్రస్తావించారు. అసలు అభయహస్తం మేనిఫెస్టోలో మహాలక్ష్మి పేరిట ఇచ్చిన గ్యారెంటీలోని మొదటి హామీ ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 గురించి ప్రస్తావన లేదు. చివరి గ్యారెంటీ చేయూతలో చెప్పిన రూ. 4000 పింఛన్ గురించి ఒక్క మాట లేదు. ఆరు గ్యారెంటీల పేరిట ఇచ్చిన 13 హామీల్లో మూడింటి గురించి మాత్రమే చెప్పి మిగతా 10 హామీల గురించి ఊసు కూడా లేకపోవడం గమనార్హం. మొత్తంగా అభివృద్ధి నివేదిక చూసి కాంగ్రెస్ గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. మింగలేక కక్కలేక సతమతమైపోతున్నది.

బీఆర్ఎస్ పరిపాలన మీద నెపం పెట్టి తమ వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు కాంగ్రెస్ కపట నాటకం ఆడుతున్నదని అభివృద్ధి నివేదిక బయటపెట్టింది. మలిపేసేందుకు, చెరిపేసేందుకు కేసీఆర్ ఆనవాళ్లు కాగితాల మీద రాతలు కావు, అవి తెలంగాణ ప్రజల జీవితాల మీద పరుచుకున్న వెలుగు రేఖలు. కాంగ్రెస్ పాలకులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా... కేసీఆర్ రూపు దిద్దిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను కొనసాగించాలి. అంతేగాని సంకుచితంగా ఆలోచిస్తూ, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టకూడదు. దివాళా పేరిట ఆడుతున్న దిక్కుమాలిన నాటకాన్ని ఇకనైనా ఆపాలి. రాష్ట్ర పరపతిని దెబ్బతీస్తూ ప్రజల జీవితాలను ఆగం చేయకూడదు. 14 నెలల కాలంలో కాంగ్రెస్ చేసిందేమీ లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారని ఆ పార్టీ నేతలు గమనించాలి. లేకుంటే కాంగ్రెస్ పతనాన్ని చేతులారా కాంగ్రెస్ నాయకులే కొనితెచ్చుకున్న వాళ్లవుతారు. తస్మాత్ జాగ్రత్త!

వ్యాసకర్త మాజీ మంత్రి, ఎమ్మెల్యే

సోషల్ మీడియా

అన్నింటికీ విమర్శేనా?



సోషల్ మీడియా జనాలకు ఏమైంది? ఏఐ బాట్‌తో తొలి సారి మాట్లాడానని ఎవరైనా చెబితే అది పెయిడ్ ప్రమోషన్ అంటారు. ప్రధానిని ప్రశంసిస్తే భక్త్ అంటారు. గర్వించే హిందువునో, ఇండియన్‌నో అంటే అంధ భక్తులంటారు. జనాలు ఎలా ఉండాలని మనం అనుకుంటున్నామో కాకుండా, వాళ్లు ఎలా ఉన్నారో అలా స్వీకరించండి.
– ప్రీతీ జింటా, నటి

బెంగాలీ కోసం...



చరిత్రలో ఫిబ్రవరి 21: తమ మాతృభాష బెంగాలీ వాడకం కోసం ఢాకాలో నిరసన జరుపుతున్న విద్యార్థుల కాల్చివేత (బెంగాలీ భాషోద్యమం, 1952). కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగెల్స్ రూపొందించిన 'ద కమ్యూనిస్ట్ మేనిఫెస్టో' తొలి ప్రచురణ (1848).
– అరుణవ సిన్హా, అనువాదకుడు

వాళ్లకు ఇచ్చింది...



ఓటు శాతాన్ని పెంచడం కోసం ఇచ్చిన 21 మిలియన్ల యూఎస్ఎయిడ్ నిజానికి ఇండియాకు కాదు, బంగ్లాదేశ్‌కు వెళ్లిందని కథనం. ఇండియాలో ఢాకా భాగం కాదని తెలియకపోవడం ట్రంప్‌కే చెల్లింది.
– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

అసలు ఉత్సవం



మహాకుంభమేళాకు వ్యతిరేకంగా మాట్లాడే వారితో వాదించడంలో, ఒప్పించడంలో కాలయాపన చేసుకోవద్దు. నేను త్రివేణి సంగమం పూర్తి పరిక్రమ చేస్తూ 25 కిలోమీటర్లకు పైగా నడిచాను. మానవాళికి సంబంధించిన అతిపెద్ద సమూహం కొంతమంది విమర్శకులను పట్టించుకోదు.
– కిరణ్ కుమార్ ఎస్., వ్యాఖ్యాత

ముమ్ముందుకు...



'బ్రాండ్ ఫైనాన్స్' 2025 సూచి ప్రకారం, అత్యంత ప్రభావ వంతమైన సాఫ్ట్ పవర్ దేశంగా చైనా రెండో స్థానంలోకి వచ్చింది. (గ్లోబల్ సాఫ్ట్ పవర్' సూచిలో బ్రిటన్‌ను చైనా నెట్టేసింది. అమెరికా మొదటి స్థానంలో ఉంది. ఇండియా 29 నుంచి 30కి దిగింది.)
– మ ఫెయిహాంగ్
ఇండియాలో చైనా రాయబారి

ఇన్ బాక్స్

సేవకు మారుపేరు

సంత్ గాడ్గే బాబా గొప్ప సంఘసంస్కర్త. ఆయన 1876 ఫిబ్రవరి 23న అట్టడుగు రజక కులంలో జన్మించారు. అక్షరం తెలియని అతి సామాన్యమైన వ్యక్తి. సమాజంపై తార్కిక ఆలోచన విధానం, చైతన్య భావాలు కలిగిన ఆయన 29వ ఏట సాధువుగా మారారు. ఆధ్యాత్మిక బోధనలతో సామాజిక పరి వర్తనకు కృషి చేశారు. అభాగ్యులకు ఆహారం, నీరు, వస్త్రాలు అందించేవారు. పేదలకు నాణ్యమైన విద్య, రోగులకు వైద్యం, నివాసం, జంతువులకు రక్షణ కల్పించిన మానవతావాది. పేద యువతీ యువకుల వివాహాలకు తోడ్పాటునందించేవారు. భక్తులను ప్రోత్సహించి, వారి విరాళాలతో మహారాష్ట్ర వ్యాప్తంగా 150 పాఠశాలలు, ధర్మశా లలు, శరణాలయాలు, గోశాలలు, ఆస్పత్రులు, విద్యార్థినుల వసతి గృహాలు నిర్మించారు.



సంత్ గాడ్గే బాబా

సంచార సన్యాసిగా ఏ గ్రామానికి వెళ్తే ఆ గ్రామంలోని మురికిని, చెత్తను చీపురుతో శుభ్ర పరిచేవారు. గ్రామాలలో అపరిశుభ్రతను రూపు మాపేందుకు 'చీపురు దండు'ను నెలకొల్పారు. అప్పట్లో ఆలయ ప్రవేశార్హత లేని దళితుల ఇక్కట్లను తీర్చడానికి గాడ్గే బాబా భక్తులు, ప్రజల సహకారంతో ఆలయాల దగ్గర 'చొక్క మేళా' పేరుతో ధర్మశాలలను నిర్మించారు. ఆసరా లేని వృద్ధుల కోసం వృద్ధాశ్రమాలు నిర్మించారు. సమాజంలో వివక్షను అనుభవిస్తున్న కుష్ఠు రోగులకు సేవచేసేందుకు 'సేవాశాలలు' నిర్మించారు. చైతన్యవంతమైన కీర్తనలతో మద్యపానం, ధూమ పానం, జూదం వంటి దుర్వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్య పరిచారు.

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్. అంబేడ్కర్ సంత్ గాడ్గే బాబా కార్య కలాపాలకు, వ్యక్తిత్వానికి, భావ జాలానికి ప్రభావితులై ఆయనను గురువుగా సంబోధించే వారు. గాడ్గే బాబా స్ఫూర్తిని ప్రభుత్వాలు కొనసాగించాలి.

– సంపతి రమేష్ మహారాజ్,
ధర్మ టీచర్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు
(రేపు సంత్ గాడ్గే బాబా జయంతి)

రైతులపై జులుం... కార్పొరేట్లకు సలాం

అభిప్రాయం



దేవీందర్ శర్మ

బ్యాంకులు ప్రదర్శిస్తున్న ఈ అసమానత వింత గొలుపుతుంది. ఒక ఆర్టీఐ అభ్యర్థనకు ప్రతిస్పందిస్తూ, 2014 ఏప్రిల్ 1 నుండి కార్పొరేట్ ఇండియాకు సంబంధించి రూ.16.61 లక్షల కోట్ల మొండి రుణాలను బ్యాంకులు మాఫీ చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియజేసింది. మరుసటి రోజు రాజస్థాన్ ఎంపీ హనుమాన్ బేనీవాల్ పార్లమెంటులో మాట్లాడుతూ, దేశంలో బకాయి ఉన్న వ్యవసాయ రుణాలు ఇప్పుడు రూ. 32 లక్షల కోట్లు దాటాయని అన్నారు. 18.74 కోట్లకు పైగా రైతులు తమ రుణాలతో సతమతమవుతున్నారు. వాస్తవానికి, మొత్తం బకాయి ఉన్న వ్యవసాయ రుణాలు వార్షిక వ్యవసాయ బడ్జెట్ వ్యయం కంటే 20 రెట్లు ఎక్కువ అని బేనీవాల్ అన్నారు. రైతులకు వ్యవసాయ రుణ మాఫీ పథకం గురించి బడ్జెట్‌లో ఎందుకు ప్రస్తావించలేదని ఆయన ప్రశ్నించారు.

దీనికి విరుద్ధంగా, గత 11 ఏళ్లలో ఇండియా కార్పొరేట్లు చేసిన మొత్తం రూ.16.61 లక్షల కోట్ల నిరర్థక రుణాలను (కేవలం 16 శాతం రికవరీతో) రద్దు చేశారు. ఈ మొండి బకాయిలలో 50 శాతం పెద్ద కంపెనీలకు చెందినవని నివేదికలు చెబు తున్నాయి. అదే కర్ణాటక, శివమొగ్గలోని ఒక రైతు కేవలం తన రూ. 3.46 పైసల బకాయి చెల్లించేందుకు సాధారణ బస్సు సర్వీస్ లేకపోతే, 15 కిలోమీటర్లు నడిచివెళ్లాల్సినంతటి ఆత్రుతను బ్యాంక్ ప్రదర్శించింది.

2023-24 ఆర్థిక సంవత్సరంలోనే బ్యాంకులు రూ. 1.7 లక్షల కోట్లు మాఫీ చేశాయి. ఒక సంవత్సరం క్రితం, 2022-23లో రూ. 2.08 లక్షల కోట్లు మాఫీ చేశాయి. కానీ వ్యవసాయ రుణాలను మాఫీ చేసే విషయానికి వస్తే, కేంద్రం రెండుసార్లు మాత్రమే ఆ పని చేసింది: 1990, 2008లో. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా వ్యవసాయ రుణాల మాఫీ చేశాయి. కానీ మాఫీ చేసిన మొత్తాన్ని బ్యాంకులకు రాష్ట్రాలు చెల్లిస్తున్నందున అది బ్యాంకులపై భారం కాదు.

ఇప్పుడు రాజస్థాన్‌లోని పీలీబంగాకు చెందిన ఒక రైతును చూడండి: ఆయన ఒక ఫైనాన్స్ కంపెనీ నుండి రూ. 2.70 లక్షల రుణం తీసుకొని రూ. 2.57 లక్షలను తిరిగి చెల్లించాడు (మహమ్మారి సమయంలో రాష్ట్రం నుండి అందుకున్న రూ. 57,000 మద్దతుతో సహా). మిగిలిన మొత్తాన్ని తిరిగి చెల్లించలేకపోయాడు. ఆయన ఒక రోజు ఇంటికి వచ్చే సరికి ఇంటికి తాళం వేసి ఉంది.

ఈ దురదృష్టకర సంఘటనను మరొకదానితో పోల్చి చూద్దాం. తూర్పు ప్రాంతంలోని ప్రముఖ మిశ్రమ లోహ, ఉక్కు తయారీదారు అయిన 'ఆధునిక్ మెటాలిక్స్'... 2018 జూలైలో నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) కోల్‌కతా శాఖ తన పరిష్కార ప్రణాళికను ఆమోదించిన తర్వాత, తమ బకాయిలు రూ. 5,370 కోట్లకుగానూ కేవలం రూ. 410 కోట్లు చెల్లించడానికి ఒప్పుకుంది. అంటే 92 శాతం రుణమాఫీ!



- ఒక పెద్ద కంపెనీకి పెద్ద 'రుణమాఫీ' అవసరమైనప్పుడు, ఒక చిన్న రైతు అలాంటి ప్రయోజనం ఎందుకు పొందకూడదు?

అయితే, పెద్ద ప్రశ్న మిగిలే ఉంది. పెండింగ్‌లో ఉన్న రూ. 20,000 మొత్తాన్ని తిరిగి పొందలేక పోయినందుకు రాజస్థాన్ రైతు ఇంటికి తాళం వేయగలిగినప్పుడు, పెండింగ్‌లో ఉన్న బకాయిలలో 92 శాతం మాఫీ చేసి రాజమార్గాన పంపడానికి బదులుగా, ఆధునిక్ మెటాలిక్స్ వంటి సంస్థల ప్రాంగణాన్ని ఎన్‌సీఎల్‌టీ ఎందుకు తాళం వేయలేకపోయింది?

ఒక పెద్ద కంపెనీకి ఇంత పెద్ద 'రుణమాఫీ' అవసరమైనప్పుడు, రైతులు ఇలాంటి విధానంతో ప్రయోజనాన్ని ఎందుకు పొందకూడదు? ఆర్థికవృద్ధి పేరుతో కంపెనీల మొండి బకాయిలను మాఫీ రూపంలో తమ సొంతం చేసు కోవాల్సిన అగత్యాన్ని బ్యాంకులు ఎంత కాలం సమర్థించుకోగలవు?

పంజాబ్, హరియాణా రాష్ట్రాలలో నిటారుగా నిలబడి ఉన్న తమ కాలీఫ్లవర్, క్యాబేజీ పంటలను తిరిగి దున్నడానికి ట్రాక్టర్లను నడుపుతున్న రైతుల బాధాకరమైన వీడియోలను సోషల్ మీడియాలో చూసినప్పుడు తీవ్రంగా బాధపడ్డాను. టమోటా, ఉల్లిపాయ, బంగాళాదుంపల ధరలను స్థిరీకరించడానికి రూ. 500 కోట్ల వ్యయంతో 2018-19 బడ్జెట్‌లో ప్రారంభించిన ఆపరేషన్ గ్రీన్స్ పథకం నాకు ఇలాంటి సందర్భాల్లో గుర్తుకు వస్తుంది. కోల్డ్ చైన్స్ నెట్‌వర్క్‌తో సహా వ్యవసాయ మౌలిక సదుపాయాలలో తగినంత పెట్టుబడి పెట్టడం అనేది నష్టాలను తగ్గించడంలో సహాయపడుతుందని అందరూ అంగీకరిస్తున్నారు. కానీ వాస్తవికత ఏమిటంటే, కూరగాయల ధరలను స్థిరీకరించడంలో ఆపరేషన్ గ్రీన్స్ పథకం ఘోరంగా విఫలమైంది. తగిన నిధుల మద్దతు లేకపోవడం ఒక కారణం కావచ్చు.

రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఆర్‌సీఐఎల్) దివాళా తీసిన తీర్మానాన్ని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) 2023 డిసెంబర్‌లో ఆమోదించింది. ఈ సంస్థ క్లెయిమ్ చేసిన రుణంలో 99 శాతాన్ని మాఫీ చేయడం జరిగింది. చూడండి విచిత్రం: 2018-19లో ఆపరేషన్ గ్రీన్స్ కోసం కేటాయించిన రూ. 500 కోట్లతో పోలిస్తే, ఆర్‌సీఐఎల్ రూ. 47,251.34 కోట్ల క్లెయిమ్‌కు బదులుగా కేవలం రూ. 455.92 కోట్లు చెల్లించి బయటపడింది. మాఫీ చేసిన ఆ మొత్తాన్ని తిరిగి పొంది ఆపరేషన్ గ్రీన్స్‌లో పెట్టుబడి పెడితే, పండ్లు, కూరగాయల ధరలను స్థిరీకరించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడానికి ఆర్థిక వనరుల కొరత ఏమాత్రం ఉండేది కాదు.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ నిపుణులు
hunger55@gmail.com

ధనము – ధర్మము

బృహస్పతి మతానుసారం... ఒక మనిషికి నాలుగు విధాలుగా సంపద సిద్ధిస్తుంది. వంశపారంపర్యంగా, దైవానుకూలత కలగడం వలన, సమయానికి చేయబడిన సత్ప్రయత్నం వలన, స్నేహితుల సహాయ సహకారాలు సమృద్ధిగా లభించడం కారణంగా – అనేవి ఆ నాలుగు విధాలు. ధర్మయుక్తమైన ధనానికి, ధనంతో సంపన్నమైన ధర్మానికి మించినవి ఈ లోకంలో మరి లేవు. ఈ రెండూ మనిషికి అమృతంతో సమానమైనవిగా పరిణమిస్తాయి. సుఖము, దుఃఖము – ఈ రెండింటిలో ఏది సంభవించినప్పటికీ మనస్సు వికారానికి లోను కాకుండా వ్యవహరించడాన్ని 'ధృతి' అంటారు. ధర్మార్థముల సాధన కోసం, మనిషి ఏ ఏ కష్టాలను సహిస్తాడో, ఆ సహనం అంతా ఆ వ్యక్తి యొక్క 'తితిక్ష'గా పరిగణించబడుతుంది. తోటి వ్యక్తుల సమక్షంలో సాత్వికుడిగా గుర్తించబడడానికి మనిషి చేసే ప్రయత్నం, ఆ సహనశీలత వల్లే సఫలమవుతుంది. సదా ధర్మాచరణం వలన మాత్రమే ఒక మనిషి ఆ స్థితికి చేరుకోగలడని విజ్ఞులు చెప్పారు. తాను కష్టం చేసి సంపాదించినవి, ధర్మబద్ధంగా తనకు చెందినవి తప్ప, ఇతరులకు చెందిన వస్తువులను సొంతం చేసుకోవాలనే ఆలోచన లేకుండా ఉండడం; ఎల్లప్పుడూ స్థిరచిత్తంతో ధీరుడై ఉండడం, భయాన్ని వీడడం, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, సదా శాంతుడై ఉండడం – ఇవి 'దమము' యొక్క లక్షణాలుగా పరిగణించబడ తాయి. కనుక ఇంద్రియాలు బుద్ధికి లోబడి ఉండే సంయమనాన్ని సాధించడాన్ని 'దమము' అంటారు. 'జ్ఞానంతోనే ఆ ఉన్నత స్థితిని మనిషి సాధించగలడు' అని వ్యాసమహర్షి మాటలలో మహాభారతం, శాంతిపర్వం, 36వ అధ్యాయంలోని ఈ క్రింది శ్లోకం నొక్కి చెప్పింది.

జ్యోతిర్మయం

అదత్తస్యానుపాదానం దానమధ్యయనం తపః
అహింసా సత్యమక్రోధఇజ్యా ధర్మస్య లక్షణమ్.

ఎవరిచేతనైనా ఇవ్వబడని వస్తువులను తీసుకోకుండా ఉండడం; దానము, అధ్యయనము, తపస్సులందు కోరిక కలిగి ఉండడము; మరో ప్రాణి సౌఖ్యానికి, మనుగడకు ముప్పు కలిగే పని చేయకుండా ఉండడము, ఎల్లవేళల నిజమునే మాట్లాడడము, కోపం తెచ్చుకోవడం అనే లక్షణాన్ని పూర్తిగా వదిలివేయడము – ఇవి ధర్మయుక్తమైన జీవితాన్ని గడిపి సద్గతి పొందాలని కోరుకునే వ్యక్తికి ఉండవలసిన లక్షణాలని పై శ్లోకం ద్వారా అర్థమౌతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.నవమి ఉ.9.37 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** జ్యేష్ఠ ప.2.31 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** రా.10.59 నుండి 12.27 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.33 నుండి 8.02 వరకు, **అమృతఘడియలు:** లేవు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 6.00.

క్లుప్తంగా...

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం



యోగ నందిని

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం(ఎంపీసీ) చదువుతున్న విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాకకు చెందిన యోగ నందిని (16) ఖమ్మంలోని ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతూ కాలేజీ హాస్టల్‌లోనే ఉంటోంది. ఆమె ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలుస్తుండగా సంక్రాంతి సెలవులకు వెళ్లి చాన్నాళ్ల తర్వాత కాలేజీకి తిరిగి వచ్చినట్లు తెలిసింది. ఆపై మళ్లీ ఇంటికి వెళ్లగా గురువారమే హాస్టల్‌కు చేరుకుంది. శుక్రవారం ఉదయం ప్రత్యేక తరగతులకు హాజరైన నందిని ఆపై రెగ్యులర్ తరగతులకు కూడా వెళ్లింది. మధ్యలో తన ఆరోగ్యం బాగాలేదని హాస్టల్ గదికి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో హాస్టల్ సిబ్బంది వెళ్లి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. పిలిచినా పలకకపోవడంతో తలుపులు పగలగొట్టి చూడగా ఉరికి వేలాడుతోంది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, నందిని మృతి సమాచారం తెలుసుకుని వచ్చిన ఆమె తల్లిదండ్రులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. కాగా, యోగనందిని కుడి చేతికి సర్జరీ కావడం, ఆ బాధతో పరీక్షలు రాయలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

బాలికపై అత్యాచారం.. నిందితుడికి 20 ఏళ్ల జైలు

గణపురం: బాలికపై అత్యాచారం చేశాడన్న నేరం రుజువు కావడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరు గ్రామానికి చెందిన నిందితుడు పున్నం రంజిత్‌కు 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ భూపాలపల్లి సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు గురువారం తీర్పు చెప్పారు. గణపురం ఎస్‌ఐ రేఖ అశోక్ శుక్రవారం తెలిపిన వివరాలివి. చెల్పూరు గ్రామానికి చెందిన పున్నం రంజిత్ 2022, జూలై 4వ తేదీన.. ఒక బాలికపై లైంగిక దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి డీఎస్పీ రాములు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత డీఎస్పీ ఎ.సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేశ్, గణపురం ఎస్‌ఐ అశోక్, కోర్టు కానిస్టేబుల్ శ్వేత.. సాక్షులను కోర్టులో సకాలంలో ప్రవేశపెట్టగా లీగల్ సపోర్టర్‌గా కల్వాల అఖిల సహకరించారు. పీపీ విష్ణువర్ధన్ రావు బాధితురాలి తరపున వాదించారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి నారాయణబాబు.. నిందితుడు రంజిత్‌పై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలుశిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పు చెప్పారు.

కంటిపాపను కాటేసిన తండ్రికి కటకటాలు

- 20 ఏళ్ల జైలు.. రూ.10 వేల జరిమానా

రామగిరి(నల్లగొండ): కన్న కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ ఫాస్ట్ ట్రాక్ కోర్టు తీర్పుచెప్పింది. కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన అక్కెనపల్లి ఆంజనేయులు 2023 సంవత్సరం డిసెంబర్ 13న తన పదకొండేళ్ల కూతురిపై అత్యాచారం చేసి ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడు. ఈ విషయం చిన్నారి తల్లికి తెలియడంతో మర్నాడు కట్టంగూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆంజనేయులుపై కేసు నమోదు చేసి విచారించి కోర్టులో హాజరుపరిచారు. వాదనలు విన్న నల్లగొండ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కులకర్ణి విశ్వనాథ్ దిలీప్‌రావు.. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించి నిందితునికి పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. దీంతోపాటు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ద్వారా చిన్నారికి రూ.2 లక్షల పరిహారం అందించాలని తీర్పులో పేర్కొన్నారు.

వెయ్యి కోళ్లు మృత్యువాత



చనిపోయిన కోళ్లు

కరీంనగర్ రూరల్: దుర్శేడ్‌లోని ఒక పౌల్ట్రీఫామ్‌లో శుక్రవారం సుమారు వెయ్యి వరకు కోళ్లు మృతి చెందాయి. స్థానికుల కథనం మేరకు.. కరీంనగర్‌కు చెందిన ఒక చికెన్ సెంటర్ నిర్వాహకుడికి దుర్శేడ్‌లో పౌల్ట్రీ ఫామ్స్ ఉన్నాయి. శుక్రవారం ఒక పౌల్ట్రీఫామ్‌లోని వెయ్యి వరకు కోళ్లు ఆకస్మికంగా మృతి చెందాయి. వీటిని సమీపంలో జేసీబీతో గుంత తవ్వి పూడ్చి వేయించారు. ఇవి బర్డ్‌ఫ్లూ సోకి మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు. చనిపోయిన కోళ్లను ఇక్కడే పూడ్చివేయడంపై స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.

మా సహనాన్ని పరీక్షించొద్దు

'మేడిగడ్డ'పై కేసులో ప్రభుత్వ న్యాయవాదిపై హైకోర్టు ఆగ్రహం

- ఫిర్యాదుదారు మృతి చెందినా ఎలా విచారణ చేపడతారు?
- విచారణ సాధ్యమా, కాదా.. అన్నదే పరిశీలిస్తున్నాం
- జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాల్లో మెరిట్స్‌లోకి వెళ్లడం లేదు
- ప్రజాప్రయోజనం ఉంటే మరొకరు వ్యాజ్యం వేయవచ్చు
- విచారణ సాధ్యం కాదని స్పష్టం చేసిన న్యాయమూర్తి
- ఈ నెల 24 వరకు అవకాశం ఇవ్వాలని కోరిన పీపీ
- తదుపరి విచారణ సోమవారానికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు (సెషన్స్ జడ్జి)లో మేడిగడ్డ బరాజ్ కుంగుబాటుపై ప్రైవేటు ఫిర్యాదు దాఖలు చేసిన రాజలింగమూర్తి మృతి చెందిన నేపథ్యంలో ఆ పిటిషన్‌పై విచారణ సాధ్యంకాదని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసు మెరిట్స్‌లోకి తాము వెళ్లడం లేదని, చట్టప్రకారం చెబుతున్నామని స్పష్టం చేసింది. ఫిర్యాదుదారు మృతి చెందినా ప్రజాప్రయోజనం ఉన్న నేపథ్యంలో విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) పల్లె నాగేశ్వర్‌రావు వాదించగా.. తమ సహనాన్ని పరీక్షించొద్దని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కొంత సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరగా.. విచారణను ఈ నెల 24కు వాయిదా వేసింది.

మరణించిన వ్యక్తి తరపున ఎలా వాదిస్తారు?

మేడిగడ్డ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని, సమగ్ర విచారణ జరిపేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావుతోపాటు మరో ఆరుగురిపై భూపాలపల్లి జిల్లా కోర్టులో సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి ప్రైవేట్ పిటిషన్ దాఖలు చేశారు. దానిపై సెషన్స్ జడ్జి విచారణ చేపట్టి.. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ సహా ఇతర ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు. దీనిపై కేసీఆర్, హరీశ్ హైకోర్టును ఆశ్రయించగా.. సెషన్స్ జడ్జి నిర్ణయాన్ని తప్పుబడుతూ, నోటీసులను నిలిపివేసింది. తాజాగా శుక్రవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ మరోసారి విచారణ చేపట్టారు. ప్రైవేటు పిటిషన్ వేసిన రాజలింగమూర్తి జీవించి లేనప్పుడు దానిపై విచారణ అనవసరమని అభిప్రాయపడ్డారు. ''సీఆర్‌పీసీ సెక్షన్ 200 కింద ప్రైవేట్ ఫిర్యాదు చేశారు. ఆయన మృతిచెందిన నేపథ్యంలో జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను అనుమతిస్తే.. విచారణ ఎలా సాధ్యం? కోర్టు ఎవరి స్టేట్‌మెంట్ నమోదు చేస్తుంది? ఎవరిని విచారిస్తుంది?''అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఈ సందర్భంగా పీపీ జోక్యం చేసుకుని.. ఫిర్యాదులో ప్రజాప్రయోజనాలు ఉన్నందున విచారణ జరపాలని కోరగా.. న్యాయమూర్తి తప్పుబట్టారు. ''కావాలంటే మరో ఫిర్యాదు చేయవచ్చు.. కానీ, రాజలింగమూర్తి ఫిర్యాదు మేరకు విచారణ కోరడం చట్టసమ్మతం కాదు. తెలంగాణలో రాజలింగమూర్తి ఒక్కరే లేరు. నాలుగు కోట్ల మందిలో ఎవరైనా పిల్ దాఖలు చేయవచ్చు. కావాలంటే.. ఈరోజే ఇదే హైకోర్టులో పిల్ దాఖలు చేసుకోవచ్చు'అని స్పష్టం చేశారు.

న్యాయమూర్తి అభ్యంతరం..

రూ.లక్షల కోట్లతో చేపట్టిన నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ రాజలింగమూర్తి ఫిర్యాదు చేశారని పీపీ ప్రస్తావించగా.. తాను మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని, ఒకవేళ వెళ్లినా సెషన్స్ జడ్జి నిర్ణయం సరికాదని న్యాయమూర్తి స్పష్టం చేశారు. ప్రస్తుతానికి ఫిర్యాదుదారు మృతి చెందినందున విచారణ సాధ్యమా? కాదా? అన్న అంశానికే పరిమితమవుతున్నట్టు చెప్పారు. అయితే సీఆర్‌పీసీలోని 256 ప్రకారం.. సమన్లు జారీ అయ్యాక ఫిర్యాదుదారు విచారణకు హాజరుకాకున్నా, మృతిచెందినా విచారణను మరో తేదీకి వాయిదా వేసేందుకు మేజిస్ట్రేట్‌కు అధికారం ఉందని పీపీ ప్రస్తావించారు. దీనిపై న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం తెలుపుతూ.. తమ సహనాన్ని పరీక్షించొద్దని పేర్కొన్నారు. ఇక కేసీఆర్, హరీశ్ తరఫు న్యాయవాది టీవీ రమణారావు వాదనలు వినిపిస్తూ.. కింది కోర్టు ఉత్తర్వులపై జిల్లా కోర్టు, హైకోర్టు సమీక్ష జరపాలంటే అసాధారణ పరిస్థితులు ఉండాలని.. ఇక్కడ అలాంటి అవకాశాలు లేవని వివరించారు. ఫిర్యాదుదారు మరణించినందున విచారణ కొనసాగింపునకు ఆస్కారం లేదని.. జిల్లా జడ్జి ఉత్తర్వులను కొట్టివేయాలని అభ్యర్థించారు.

సుప్రీంకోర్టు తీర్పులున్నాయి.. గడువు ఇవ్వండి

ఫిర్యాదుదారు మరణించినా కేసు విచారణ చేయవచ్చంటూ గతంలో సుప్రీంకోర్టు, కర్ణాటక హైకోర్టుల తీర్పులు ఉన్నాయని.. ఆ తీర్పుల కాపీలను న్యాయస్థానం ముందు ఉంచుతామని, సమయం ఇవ్వాలని ప్రభుత్వ న్యాయవాది విన్నవించారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి.. విచారణను ఈ నెల 24కు వాయిదా వేశారు. జిల్లా కోర్టు ఉత్తర్వులను నిలిపివేస్తూ గతంలో జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

మావోయిస్టు పార్టీ కమాండర్ కేషా లొంగుబాటు

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్ క్రైం: నిషేధిత మావోయిస్టు పార్టీ గొత్తికోయ ఏరియా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా అలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామెడ్ మండలం రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం జైలులో ఉన్నాడు) మావోయిస్టు పార్టీలో పనిచేసేవారు. ఈ నేపథ్యంలో కేషా బాల్యంలో చైతన్య నాట్య మండలిలో పనిచేయడం.. తర్వాత మావోయిస్టు పార్టీ సభ్యులతో పరిచయాలు ఏర్పడటంతో 2017లో ఆమె పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టి కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరారు. రెండేళ్ల తర్వాత కేషాను పార్టీ నాయకత్వం అబూజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసిన కేషా, మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యుడు రమేశ్‌ను (ప్రస్తుతం మహారాష్ట్ర జైలులో ఉన్నారు) వివాహం చేసుకుని ఉత్తర బస్తర్ డివిజన్‌లో కొద్ది కాలం పనిచేశారు. తర్వాత ఆమె 2024లో కడారి సత్యనారాయణరెడ్డి ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టారు.

రెండు సంఘటనల్లో నిందితురాలు

మావోయిస్టు పార్టీ సభ్యులతో కలసి కేషా, కొహిలబేడా ప్రాంతంలో పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో అధికారి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతోపాటు అబూజ్‌మడ్ ప్రాంతంలో మరో ఘటనలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించారు. ఈ రెండు సంఘటనల్లో వంజెం కేషా నిందితురాలిగా ఉన్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు ఆకర్షితులు కావడంతోపాటు, ఆ పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో కేషా లొంగిపోయినట్టు సీపీ తెలిపారు. కేషాపై రూ.4 లక్షల రివార్డు ఉన్నట్లు ఆయన చెప్పారు.

1,200 మెగావాట్లకు 'సౌర' దరఖాస్తులు

- ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చిన 850 మంది రైతులు
- నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ టాప్
- రైతులకు 3,000 మెగావాట్ల వరకు అనుమతి
- మార్చి 2 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు 850 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. రైతులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో 4,000 మెగావాట్ల సామర్థ్యం మేరకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) దరఖాస్తులు ఆహ్వానించిన విషయం తెలిసిందే. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 22వ తేదీ తుది గడువుగా నిర్ణయించగా, గురువారం నాటికి 1,200 మెగావాట్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. దీంతో దరఖాస్తుల గడువును మార్చి 2వ తేదీవరకు పొడిగించారు. 4,000 మెగావాట్లలో వెయ్యి మెగావాట్లు మహిళా సంఘాలకు, 3,000 మెగావాట్లు రైతులకు కేటాయించారు. ప్లాంట్లు నెలకొల్పి విద్యుత్ ఉత్పత్తి చేసే రైతులు, మహిళా సంఘాల నుంచి పవర్ పర్చేజ్ ఒప్పందాలు (పీపీఏ) కూడా చేసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో భారీగా దరఖాస్తులు వస్తాయని భావించినా, 40 శాతం సామర్థ్యం మేరకే అందాయి. వీటిలో రైతులు వ్యక్తిగతంగా చేసుకున్న దరఖాస్తులే అధికంగా ఉన్నాయి. 0.5 మెగావాట్ల నుంచి 2 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పడానికి దరఖాస్తుదారులు ఆసక్తి కనపర్చారు. దరఖాస్తుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచే మూడొంతులు రావటం విశేషం. విద్యుత్ సరఫరా సరిగా లేని సబ్‌స్టేషన్ల పరిధిలో ప్లాంట్ల ఏర్పాటుకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు.

మెగావాట్‌కు 3.5 ఎకరాలు..

ఒక మెగావాట్ సామర్థ్యంగల సౌర విద్యుత్ యూనిట్ ఏర్పాటుకు 3.5 ఎకరాల భూమి అవసరం. ఒక మెగావాట్ ప్లాంటు స్థాపనకు దాదాపు రూ.3.25 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. రైతులు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకునే ప్లాంటు నుంచి సబ్‌స్టేషన్ విద్యుత్ సరఫరా కోసం వారే 11 కేవీ లైన్‌ను వేయాల్సి ఉంటుంది. ప్లాంటుకు ఒకటి రెండు కిలోమీటర్లలోపు సబ్‌స్టేషన్ ఉంటే రైతులకు ఎక్కువ భారం పడదని, అంతకంటే ఎక్కువ దూరం ఉంటే వ్యయం పెరుగుతుందని చెబుతున్నారు. స్త్రీ శక్తి సంఘాలు ఏర్పాటుచేసే ఒక్కో మెగావాట్ ప్లాంటుకు రూ.2.90 కోట్ల వ్యయం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. వీరి ప్లాంటు నుంచి సబ్‌స్టేషన్‌కు వేసే 11 కేవీ విద్యుత్ లైన్ వ్యయాన్ని సంబంధిత డిస్కమ్‌లు భరిస్తాయి.



యూనిట్‌కు రూ.3.13

ఒక్కో యూనిట్‌ను రైతులు, స్త్రీ శక్తి సంఘాల నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్)లు రూ.3.13 చెల్లించి కొనుగోలు చేస్తాయి. ఒక మెగావాట్ యూనిట్‌లో కనీసం 19 శాతం సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి చేసే, రోజుకు 4,500 యూనిట్ల వరకు ఉత్పత్తి వస్తుందని చెబుతున్నారు. సౌర పలకలపై నేరుగా సూర్యరశ్మి ఎంత సమయం పడుతుందన్నదానిపై ఈ ఉత్పత్తి ఆధారపడి ఉంటుంది. దరఖాస్తు చేసుకున్న రైతులకు ఇప్పటికే బ్యాంకుల నుంచి రుణం పొందడానికి అవసరమైన పత్రాలు ఇస్తున్నారు.

గార్ల ఆశ్రమ పాఠశాలకు ఆ ముగ్గురు టీచర్లు

సాక్షి ఎఫెక్ట్

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం వెంకటాపురం తండా, సర్వన్‌తండా, కేశోత్‌తండాల్లోని ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు చేరకపోవడంతో ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నారంటూ.. 'పాఠాలు చెబుదామన్నా.. పిల్లలు లేరు...' శీర్షికతో శుక్రవారం సాక్షి ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి మహబూబాబాద్ జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దేశీరాంనాయక్ స్పందించారు. గార్ల గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ జోగయ్యను తన కార్యాలయానికి పిలిపించారు. మూడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు లేనందున.. ఆ ముగ్గురు ఉపాధ్యాయులను విద్యార్థులు ఎక్కువగా ఉన్న గార్ల ఆశ్రమ పాఠశాలకు కేటాయించాలని ఆదేశించారు.

పెళ్లి మంటపంలో కుప్పకూలిన వధువు తండ్రి

- కాళ్లు కడిగిన కాసేపట్లోనే గుండెపోటుతో మృతి
- కామారెడ్డిలో ఘటన



కూతురు కాళ్లు కడుగుతున్న బాల్‌చంద్రం దంపతులు

భిక్కనూరు: మంగళ వాయిద్యాలు మోగుతుండగా వేదపండితులు పెళ్లి తంతు నిర్వహిస్తున్నారు. బంధువులు, స్నేహితులంతా పెళ్లి మంటపానికి చేరుకున్నారు. అల్లుడు, కూతురు కాళ్లు కడిగిన వధువు తండ్రి ఆనందంగా అందరినీ పలకరిస్తున్నారు. మరోవైపు భోజనాలు కూడా మొదలయ్యాయి. ఇంతలోనే ఆ తండ్రి గుండెపోటుతో కుప్పకూలిపోయారు. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లికి చెందిన కుడిక్యాల బాల్‌చంద్రం (55) కామారెడ్డి పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో నివసిస్తున్నారు. చిన్నచిన్న కాంట్రాక్టు పనులు చేసేవారు. ఆయనకు భార్య రాజమణి, కూతుళ్లు కనకమహాలక్ష్మి, కల్యాణలక్ష్మి ఉన్నారు. పెద్ద కూతురు కనకమహాలక్ష్మి పెళ్లి కుదిరింది. శుక్రవారం భిక్కనూరు మండలం బీటీఎస్ చౌరస్తా వద్ద ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో పెళ్లి జరిగింది. ఈ సందర్భంగా స్నేహితులు, బంధువులను బాల్‌చంద్రం ఆనందంగా పలకరించారు. అందరూ అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది చిన్న కూతురు పెళ్లి కూడా చేస్తానని చాలా మందితో బాల్‌చంద్రం చెబుతూ సంతోషంగా ఉన్నారు. ఇంతలోనే ఒక్కసారిగా ఆయన గుండెపోటుతో కుప్పకూలిపోయారు. బాల్‌చంద్రంను వెంటనే కామారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. కూతురు పెళ్లిలో తండ్రి కన్నుమూయడం ఆ కుటుంబానికి తీరని విషాదం మిగిల్చింది. పెళ్లి కోసం వేసిన పందిరిలో విగతజీవిగా పడిపోయిన తండ్రిని చూసి ఆ కూతురు రోదించిన తీరు అందరినీ కలచివేసింది. సాయంత్రం కామారెడ్డి పట్టణంలో బాల్‌చంద్రం అంత్యక్రియలు నిర్వహించారు.



మంథని వద్ద ఎడారిని తలపిస్తున్న గోదావరి నది

గోదావరి.. ఎడారి

మంథని: కాళేశ్వరం ప్రాజెక్టు జలాలతో కళకళలాడిన గోదావరి నది నేడు నీళ్లలేక ఎడారిని తలపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో సుమారు వంద కిలోమీటర్ల పొడవున ప్రవహించే గోదావరి నదిలో ప్రస్తుతం నీటిధార లేక ఇసుక తిన్నెలు దర్శనమిస్తున్నాయి. గోదావరికి అటు, ఇటు చివరన సన్నటి ధార పారుతుండటంతో రైతులు ఆ నీటిని పొలాలకు మళ్లించుకుని పంటలను కాపాడుకుంటున్నారు. అలాగే గోదావరిఖని, సిరిపురం, మంథని తదితర ఘాట్ల వద్ద శుభ, అశుభ కార్యకలాపాలు సాగిస్తూ, స్నానాలు ఆచరిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో తలెత్తిన లోపాలతో బరాజ్‌ల్లో నిల్వ ఉన్న నీటిని విడుదల చేశారు. దీంతో బ్యారేజీలు నిండుకున్నాయి. అయితే ఈ వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. గోదావరి నదిలోకి పెద్దగా వరదనీరు వచ్చి చేరలేదు. పైగా ఎండకాలం ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో ఉన్న కాస్త నీటి ధార ఇంకిపోయి గోదావరి ఎడారిని తలపిస్తోంది. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో గోదావరిలో చుక్కనీరు కూడా కనిపించక చెలమ నీరే ఆధారమయ్యే పరిస్థితులు ఉంటాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

విజనరీ నాయకులు కావాలి

'సోల్' సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

- అన్ని రంగాల్లో గ్లోబల్ లీడర్ల అవసరం నేడు ఎంతో ఉంది
- సమర్థ నాయకత్వంతో దేశాభివృద్ధి సాధ్యం
- 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు మానవ వనరుల నిర్మాణం కీలకం



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా ఎదురవుతున్న సమస్యలు, సవాళ్లను పరిష్కరించేలా నేడు అన్ని రంగాల్లో ప్రపంచస్థాయి నాయకులు రావాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ ప్రయోజనాలను, అవసరాలను దృష్టిలో పెట్టుకొని పనిచేసే అత్యుత్తమ నాయకులు సమాజానికి కావాలని అన్నారు. శుక్రవారం ఢిల్లీలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్(సోల్) సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం అన్ని రంగాల్లో ఉత్సాహవంతులైన సారథుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో సోల్ లాంటి సంస్థలు గేమ్‌ఛేంజర్ అవుతాయని వ్యాఖ్యానించారు. వేర్వేరు రంగాల్లో అంతర్జాతీయ స్థాయి ఆలోచనా దృక్పథంతో వ్యవహరిస్తూ స్థానికంగా అభివృద్ధికి పాటుపడే నేతలు తయారు కావాలని పిలుపునిచ్చారు. నేడు మన దేశం 'గ్లోబల్ పవర్‌హౌస్'గా ఎదుగుతోందని, ఈ నేపథ్యంలో భారతీయ దార్శనికతను ప్రతిబింబించే నాయకత్వం అవసరం చాలా ఉందని పేర్కొన్నారు. దేశానికి విజనరీ నాయకులు కావాలని వివరించారు. కీలక రంగాల్లో దేశం మరింత వేగంగా ముందుకు పరుగెత్తాలని, సమర్థ నాయకత్వం వల్లే అది సాధ్యమవుతుందని స్పష్టంచేశారు. సోల్ లాంటి సంస్థల అవసరం నేడు ఎంతో ఉందన్నారు.

రాజకీయ అధికారానికే పరిమితం కావొద్దు

'గ్లోబల్ అప్రోచ్, లోకల్ మైండ్‌సెట్' కలిసిన నాయకులు సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో, సంక్షోభాలను పరిష్కరించడంలో, భవిష్యత్తు పట్ల సరైన ఆలోచనలు చేయడంలో సమర్థులైన వ్యక్తులను దేశం కోరుకుంటోందని పేర్కొన్నారు. భవిష్యత్ నాయకత్వం కేవలం రాజకీయ అధికారానికే పరిమితం కావొద్దని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్లు, వేదికలపై మన దేశం పోటీ పడాలంటే అంతర్జాతీయ పరిణామాలపై పూర్తి అవగాహన కలిగిన నాయకులు కావాలన్నారు. డీప్-టెక్, అంతరిక్షం, బయోటెక్, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలతోపాటు క్రీడలు, వ్యవసాయం, తయారీ, సామాజిక సేవ వంటి రంగాల్లో నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని ఉద్ఘాటించారు.

ఆ స్ఫూర్తిని మననం చేసుకోవాలి

అన్ని రంగాల్లో అత్యున్నత ఫలితాలు సాధించాలని కేవలం కోరుకుంటే సరిపోదని, ఆచరణలో సాధించి చూపాలని ప్రధానమంత్రి తేల్చిచెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన సంస్థలను అభివృద్ధి చేసే సమర్థుల అవసరం నేడు దేశానికి ఎంతగానో ఉందని అభిప్రాయపడ్డారు. మన దేశంలో పురుడు పోసుకున్న ఎన్నో సంస్థలు ప్రపంచ స్థాయిలో విజయాలు సాధించాయని గుర్తించారు. ఆ స్ఫూర్తిని మరోసారి మననం చేసుకోవాలన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధన దిశగా మనమంతా ముందుకు సాగుతున్నామని, ఈ తరుణంలో జాతి నిర్మాణం కోసం మానవ వనరుల నిర్మాణం అత్యంత కీలకమని వివరించారు. ఉత్తమమైన పౌరులతోనే దేశం ముందంజ వేస్తుందన్నారు. మానవ వనరుల విషయంలో గుజరాత్ అనుభవాన్ని ప్రధానమంత్రి మోదీ ప్రస్తావించారు. మహారాష్ట్ర నుంచి విడిపోయినప్పుడు గుజరాత్‌లో సహజ వనరులేవీ లేవన్నారు. గుజరాత్ భవిష్యత్తుపై అప్పట్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. సమర్థవంతమైన మానవ వనరులను, నాయకులను తయారు చేసుకోవడంతో గుజరాత్ నేడు అభివృద్ధి పథంలో నడుస్తోందని వెల్లడించారు. గుజరాత్‌లో వజ్రాల గనులు లేవని, అయినప్పటికీ ప్రపంచంలో ప్రతి పది వజ్రాల్లో తొమ్మిది వజ్రాలు గుజరాతీల చేతుల్లోనే సానపెట్టుకొని అందంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

మోదీ నాకు పెద్దన్న: భూటాన్ ప్రధాని

గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీ సమీపంలో విశాలమైన 'సోల్'క్యాంపస్ త్వరలో సిద్ధం కాబోతోందని నరేంద్ర మోదీ చెప్పారు. బలమైన నాయకత్వాన్ని తయారు చేసుకోవడంపైనే మన దార్శనికత, భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. 'సోల్' నుంచి సమర్థులైన నాయకులు బయటకు రావాలని ఆకాంక్షించారు. మనమంతా ఉమ్మడి లక్ష్యం, సమ్మిళిత ప్రయత్నాలతో ముందుకు కదిలితే అద్భుతమైన ఫలితాలు వస్తాయని వెల్లడించారు. 21వ శతాబ్దంలో జన్మించినవారు భారతీయ సమాజాన్ని తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. యువశక్తితో దేశం నవ్య పథంలో పయనించబోతోందని అన్నారు. 'సోల్'సదస్సులో భూటాన్ ప్రధానమంత్రి దాషో త్సెరింగ్ తాబ్గే సైతం పాల్గొన్నారు. మోదీ గొప్ప నాయకుడు అని ప్రశంసించారు. ఆయన తనకు పెద్దన్న లాంటివారని చెప్పారు.

కట్నం డిమాండ్ చేయడం క్రూరత్వం కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: భార్య నుంచి భర్త కట్నం డిమాండ్ చేయడాన్ని క్రూరత్వంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టంచేసింది. భర్త, అత్తమామల నుంచి వివాహిత మహిళలకు రక్షణ కల్పించేందుకు 1983లో ప్రవేశపెట్టిన ఐపీసీ సెక్షన్ 498ఏ ప్రకారం.. కట్నం డిమాండ్ చేయడాన్ని క్రూరమైన నేరంగా భావించలేమని వెల్లడించింది. సెక్షన్ ప్రకారం 498ఏ ప్రకారం క్రూరత్వం అనేపదానికి విస్తృతమైన అర్థం ఉంది. కట్నం కింద ఆస్తులు గానీ, విలువైన వస్తువులు గానీ ఇవ్వాలని డిమాండ్ చేయడం చట్టవిరుద్ధమే. అయితే, కట్నం కోసం మహిళను శారీరకంగా, మానసికంగా వేధించడం క్రూరత్వం అవుతుంది. కేవలం కట్నం డిమాండ్ చేశారని 498ఏ సెక్షన్ కింద కేసు పెట్టకూడదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్న బి.వరాలీతో కూడిన ధర్మాసనం గత ఏడాది డిసెంబర్ 12న ఆదేశాలు జారీ చేసింది.

యూఎస్ ఎయిడ్ సమాచారం తీవ్ర ఆందోళనకరం: భారత్


న్యూఢిల్లీ: భారత్‌లో కొన్ని కార్యకలాపాల కోసం యూఎస్‌ఎయిడ్ ద్వారా నిధులందజేస్తున్నట్లు వస్తున్న వార్తలపై విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆందోళన కలిగిస్తోందని పేర్కొంది. విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. అమెరికా యంత్రాంగం వెల్లడించిన సంబంధిత యూఎస్ కార్యకలాపాలు, నిధుల వ్యవహారం సమాచారాన్ని వివిధ విభాగాలకు చెందిన మన అధికారులు విశ్లేషిస్తున్నారని చెప్పారు. ఈ దశలో దీనిపై బహిరంగ వ్యాఖ్యలు చేయడం సబబు కాదన్నారు. దీనిపై ముందుముందు మరింత సమాచారం అందుతుందని ఆశిస్తున్నామని జైశ్వాల్ తెలిపారు. గురువారం అమెరికా అధ్యక్షుడు మియామీలో మాట్లాడుతూ.. యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్స్‌భారత్‌లో ఓటింగ్ శాతాలను పెంచేందుకు 2.1 కోట్ల డాలర్లను వెచ్చించినట్లు వెల్లడించారు. ఎవరినో గెలిపించడానికే ఈ మొత్తాన్ని వ్యయం చేయడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేయడం తెలిసిందే.

చైనా విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

న్యూఢిల్లీ: భారత విదేశాంగ మంత్రి జై శంకర్ శుక్రవారం చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో సమావేశమై రెండు దేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా వీరిద్దరు భేటీ అయ్యారు. సరిహద్దుల వెంబడి శాంతిభద్రతల పరిస్థితులతోపాటు కైలాశ్ మానససరోవర్ యాత్రను తిరిగి ప్రారంభించడం వంటి అంశాలు వీరి మధ్య ప్రస్తావనకు వచ్చాయని శుక్రవారం విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సుమారు అర గంటపాటు సాగిన ఈ సమావేశంలో విమానాల రాకపోకలు, ప్రయాణ సౌకర్యాలపైనా చర్చ జరిగిందని వివరించింది. వీరిద్దరూ గత ఏడాది నవంబర్‌లో చివరిసారిగా భేటీ అయ్యారని గుర్తు చేసింది.

చైనాలో మరో మహమ్మారి!

- గబ్బిలాల నుంచి పుట్టుకొచ్చిన కొత్త వైరస్
- పెరుగుతున్న హెచ్‌కేయూ 5-కోవ్-2 కేసులు



బీజింగ్: ఐదేళ్ల క్రితం కోవిడ్-19 మహమ్మారి సృష్టించిన అల్లకల్లోలం గుర్తుంది కదా! చైనాలో పుట్టినట్లుగా భావిస్తున్న కరోనా వైరస్ ప్రపంచమంతటా వ్యాప్తి చెందింది. లక్షల మందిని పొట్టనపెట్టుకుంది. అలాంటి మహమ్మారి మరొకటి చైనాలో పుట్టినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. గబ్బిలాల నుంచి హెచ్‌కేయూ5-కోవ్-2 అనే కొత్త వైరస్ మనుషులకు వ్యాపిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఈ వైరస్ బారినపడి ఆసుపత్రుల్లో చేరి, మాస్కులు ధరించి చికిత్స పొందుతున్న బాధితుల ఫొటోలు సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. హెచ్‌కేయూ5-కోవ్-2 వైరస్ క్రమంగా మహమ్మారిగా మారే ప్రమాదం ఉందని కొందరు నిపుణులు అంచనా వేస్తుండగా, అలాంటిదేమీ లేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని మరికొందరు సూచిస్తున్నారు. చైనాలో హ్యూమన్ మెటాన్యూమో వైరస్(హెచ్‌ఎంపీవీ) కేసులు ఇటీవల విపరీతంగా పెరిగాయి. ఇవి హెచ్‌కేయూ5-కోవ్-2కు సంబంధించిన కేసులని భావిస్తున్నారు. ఈ కొత్త వైరస్ సరిగ్గా ఎక్కడ పుట్టిందన్నది స్పష్టంగా తెలియనప్పటికీ గబ్బిలాల నుంచి వచ్చినట్లు కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. గబ్బిలాల నుంచి తొలుత మరో జంతువుకు, అక్కడి నుంచి మనుషులకు సోకినట్లు అంచనా వేస్తున్నాయి. గాంగ్‌జౌ లేబొరేటరీ, గాంగ్‌జౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్, వూహాన్ యూనివర్సిటీ, వూహాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ పరిశోధకులు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. ఐదేళ్ల క్రితం సార్స్-కోవ్-2 వైరస్ మనుషుల్లోని హ్యూమన్ యాంజియోటెన్సిన్-కోవర్టింగ్ ఎంజైమ్(ఏసీఈ2) అనే రిసెప్టర్‌ను ఉపయోగించుకొని కణాలపై దాడి చేసింది. ఫలితంగా కోవిడ్-19 పంజా విసరింది. గబ్బిలాల నుంచి పుట్టిన హెచ్‌కేయూ5-కోవ్-2 వైరస్ సైతం ఇదే రిసెప్టర్ ద్వారా మనుషుల్లోకి ప్రవేశిస్తున్నట్లు గుర్తించారు. అంటే కోవిడ్-19 తరహాలోనే మరో మహమ్మారి వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కోవిడ్-19 నియంత్రణ కోసం అప్పట్లో పాటించిన జాగ్రత్తలే ఇప్పుడు కూడా పాటించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

అంగారకుడిపై నిర్మాణాలకు
నీటి రహిత కాంక్రీట్

అభివృద్ధి చేసిన ఐఐటీ-చెన్నై బృందం

చెన్నై: ఇతర గ్రహాలపై సమీప భవిష్యత్తులో మానవ ఆవాసాలు నిర్మించడం సాధ్యమేనని సైంటిస్టులు చెబుతున్నారు. భూమికి ఆవల గ్రహాలపై ఆవాసాలు నిర్మించుకొనే దిశగా ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. ఆయా గ్రహాలపై లభించే వనరులతోనే ఇళ్లు రూపొందించడానికి కృషి చేస్తున్నారు. ఈ విషయంలో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)-మద్రాసుకు చెందిన ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్(ఎక్స్‌టెమ్) గణనీయమైన పురోగతి సాధించింది. నీటితో సంబంధం లేని కాంక్రీట్‌ను అభివృద్ధి చేసింది. అంగారక(మార్స్) గ్రహంపై ఇళ్ల నిర్మాణానికి ఈ కాంక్రీట్ చక్కగా సరిపోతుందని చెబుతున్నారు. సల్ఫర్ మిశ్రమంతో కాంక్రీట్‌ను అభివృద్ధి చేసినట్లు ఎక్స్‌టెమ్ బృందం వెల్లడించింది. అంగారకుడిపై సల్ఫర్ సమృద్ధిగా ఉంది. అక్కడ ఇప్పటివరకైతే నీటి జాడ కనిపెట్టలేదు. ఇదిలా ఉండగా, ఎలాంటి వాతావరణం లేని శూన్య స్థితిలో నిర్మాణాలపై ఎక్స్‌టెమ్ బృందం పరిశోధనలు చేస్తోంది. మైక్రోగ్రావిటీ డ్రాప్‌టవర్‌ను రూపొందించింది. జీరో గ్రావిటీలో వస్తువుల లక్షణాలపై దీనిద్వారా అధ్యయనం చేయొచ్చు. భూమిపై నుంచి వస్తువులు తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇతర గ్రహాలపై ఉన్న వస్తువులు, వసతులతోనే వ్యోమగాములు అక్కడ మనుగడ సాగించేలా చేయాలన్నదే తమ ఆశయమని ఎక్స్‌టెమ్ ప్రతినిధి ప్రొఫెసర్ సత్యన్ సుబ్బయ్య చెప్పారు.

టారిఫ్ బెదిరింపులతో బ్రిక్స్ విచ్ఛిన్నం: ట్రంప్

వాషింగ్టన్: డాలర్‌తో ఆటలాడితే.. 150 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించడంతో బ్రిక్స్ విచ్ఛిన్నమైందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. టారిఫ్ గురించి హెచ్చరించిన తరువాత.. బ్రిక్స్ గురించి తాను వినలేదన్నారు. 'వాళ్లకు ఏమైందో తెలియదు. బ్రిక్స్ దేశాల నుంచి ఈ మధ్య మాకు ఎలాంటి సమాచారం అందలేదు. బ్రిక్స్ దేశాలు మన డాలర్‌ను నాశనం చేయడానికి ప్రయత్నించాయి. కొత్త కరెన్సీని తయారు చేయాలనుకున్నారు. కాబట్టి నేను రాగానే మొదట చెప్పింది ఏ బ్రిక్స్ దేశమైనా, డాలర్ విధ్వంసం గురించి ప్రస్తావించినా 150% సుంకం వసూలు చేస్తామని హెచ్చరించాను.. అలాగని బ్రిక్స్ దేశాలు విచ్ఛిన్నం కావడం మాకు ఇష్టం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. బ్రిక్స్ కూటమిలో భారత్‌తో పాటు రష్యా, చైనా, బ్రెజిల్, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండొనేసియా, ఇరాన్ సభ్య దేశాలు. బ్రిక్స్‌పై 100 శాతం టారిఫ్‌లు తప్పవని ట్రంప్ రెండోసారి అధికా రంలోకి రాకముందు నుంచీ హెచ్చరిస్తూ వస్తున్నారు. బ్రిక్స్ దేశాలు డాలర్‌కు బదులుగా తమ సొంత కరెన్సీల్లోనే లావాదేవీలు నెరపాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2023లో బ్రిక్స్ శిఖరాగ్రంలో ప్రతిపాదించారు. మరుసటేడాది బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రుల భేటీ కూడా ఇదే అభిప్రాయం వెలిబుచ్చింది.

అమెరికన్లకు హాని చేయాలనుకుంటే
అంతు చూస్తాం

- ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్ కాశ్ పటేల్ హెచ్చరిక
- పటేల్ నామినేషన్‌కు 51-49 ఓట్ల తేడాతో సెనేట్ ఆమోదం
- బాలీవుడ్ స్టైల్లో స్వాగతం పలికిన వైట్‌హౌస్


కాశ్ పటేల్

వాషింగ్టన్: అమెరికన్లకు హాని చేయాలనుకునేవారి అంతు చూస్తామని, వారు భూమ్మీద ఏ మూల దాక్కున్నా వదలబోమని ఎఫ్‌బీఐ నూతన డైరెక్టర్ కశ్యప్ పటేల్ (కాశ్ పటేల్) హెచ్చరించారు. అమెరికా ప్రజలు గర్వించదగ్గ సంస్థగా ఎఫ్‌బీఐని పునర్నిర్మిస్తామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిరకాల మిత్రుడైన కాశ్ పటేల్‌ను ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా సెనేట్ గురువారం ధ్రువీకరించింది. అనంతరం పటేల్... అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అటార్నీ జనరల్ పామ్ బోండీకి కృతజ్ఞతలు తెలిపారు. ఏజెన్సీని పారదర్శకంగా, జవాబుదారీగా, న్యాయానికి కట్టుబడినదిగా పునర్నిర్మిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ''ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ తొమ్మిదో డైరెక్టర్‌గా నన్ను ధ్రువీకరించడం గౌరవంగా భావిస్తున్నా. అచంచల విశ్వాసం, మద్దతు ఇచ్చిన అధ్యక్షుడు ట్రంప్, అటార్నీ జనరల్ బోండీకి ధన్యవాదాలు. 'జీ-మెన్' నుంచి 9/11 దాడుల నేపథ్యంలో దేశాన్ని కాపాడటం వరకు ఎఫ్‌బీఐకి ఘనమైన వారసత్వం ఉంది. పారదర్శకంగా, జవాబుదారీతనంతో, న్యాయానికి కట్టుబడి ఉండే ఎఫ్‌బీఐకి అమెరికా ప్రజలు అర్హులు. రాజకీయ జోక్యంతో న్యాయ వ్యవస్థ ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. ఈ రోజుతో అది ముగుస్తుంది'' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

బాలీవుడ్ స్టైల్‌లో స్వాగతం..

ఎఫ్‌బీఐ కొత్త డైరెక్టర్‌గా కశ్యప్ పటేల్‌ను శ్వేతసౌధం స్వాగతించింది. వైట్‌హౌస్ డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ డాన్ స్కావినో కాశ్‌కు బాలీవుడ్‌స్టైల్‌లో స్వాగతం పలికారు. నటుడు రణ్‌వీర్ సింగ్ నటించిన 'బాజీరావ్ మస్తానీ' చిత్రంలోని 'మల్హరి' పాటను ఎడిట్ చేసి.. రణవీర్ స్థానంలో పటేల్ ముఖాన్ని ఉంచిన వీడియోను షేర్ చేశారు. ''ఎఫ్‌బీఐ కొత్త డైరెక్టర్ కాశ్ పటేల్‌కు అభినందనలు'' అని స్కావినో ట్వీట్ చేశారు. 47 సెకన్ల నిడివి ఉన్న ఈ క్లిప్‌ను వెంటనే 30 లక్షల మందికి పైగా చూశారు.

డెమొక్రాట్ల నుంచి వ్యతిరేకత..

పటేల్ నామినేషన్ రాజకీయంగా చర్చనీయాంశం కావడంతో ఆమోదానికి వారం రోజులు ఆలస్యమైంది. ఈ పదవికి ఆయన అనర్హుడంటూ డెమొక్రాట్లు ఆందోళన వ్యక్తం చేశారు. కుట్ర సిద్ధాంతాలతో ఆయన అనుబంధం, రాజకీయ శత్రువులపై ప్రతీకారం తీర్చుకుంటామంటూ గతంలో ఆయన ప్రకటనలు చేశారని, ట్రంప్ ఎఫ్‌బీఐ ప్రతీకార ప్రణాళికల సమాచారాన్ని దాచిపెట్టారని, పటేల్‌ను ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమిస్తే పరిస్థితి మరింత దిగజారుతుందని డెమొక్రాట్ సెనేటర్లు ఆరోపించారు. పటేల్ అమెరికన్ల ప్రయోజనాల పరిరక్షణకు కాకుండా.. ట్రంప్ ప్రయోజనాల కోసం పని చేస్తా రని మండిపడ్డారు. అయితే సెనేట్‌లో రిప బ్లికన్లకు మెజారిటీ ఉండటం తెలిసిందే. అలాస్కాకు చెందిన రిపబ్లికన్ సెనేటర్లు లీసా ముర్కోవ్‌స్కీ, మైనేకు చెందిన సుసాన్ కొలిన్స్ నుంచి వ్యతిరేకత ఎదురైంది. అయితే.. గతంలో ఇతర ట్రంప్ నామినీలను వ్యతి రేకించిన సెనేట్ మైనారిటీ నాయకుడు మిచ్ మెక్కా నెల్‌తో సహా మిగిలిన రిపబ్లికన్ పార్టీ మొత్తం పటేల్‌కు మద్దతు లభించింది. దీంతో.. సెనేట్ డెమొక్రాట్లందరూ కాశ్‌కు వ్యతిరేకంగా ఓటు వేసి నా.. 51-49 ఓట్ల స్వల్ప తేడాతో ఆయన నామినేషన్ ఆమోదం పొందింది.

భారతీయ నేపథ్యం..

కాశ్ పటేల్ తల్లిదండ్రులు గుజరాతీలు. యూఎస్‌లో స్థిరపడ్డారు. 1980లో న్యూయార్క్‌లో జన్మించిన పటేల్.. తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. లాంగ్ ఐలాండ్‌లోని గార్డెన్ సిటీ హైస్కూల్ నుంచి పట్టభద్రుడయ్యారు. రిచ్మండ్ విశ్వ విద్యాలయంలో అండర్ గ్రాడ్యుయేట్ విద్యను పూర్తి చేశారు. యూకేలోని యూనివర్సిటీ కాలేజ్ లండన్ ఫ్యాకల్టీ ఆఫ్ లాస్ నుంచి న్యాయ శాస్త్రంలో డిగ్రీ అందుకున్నారు. అంతర్జాతీయ చట్టంలో సర్టిఫికెట్ కోసం న్యూ యార్క్‌కు తిరిగి వచ్చారు. ఆ తరువాత జాతీయ భద్రతా సలహాదారుగా, హౌస్ పర్మనెంట్ సెలెక్ట్ కమిటీ ఆన్ ఇంటెలిజెన్స్ (హెచ్‌పీఎస్సీఐ)కి సీనియర్ కౌన్సెల్‌గా పనిచేశారు.

హత్రాస్ బాబాకు క్లీన్ చిట్

హత్రాస్: హత్రాస్‌లో 121 మంది ప్రాణాలను బలి తీసుకున్న తొక్కిసలాట ఘటనపై ఆధ్యాత్మిక గురువు నారాయణ్ సాకార్ హరి అలియాస్ భోలె బాబాకు న్యాయ విచారణ కమిటీ క్లీన్ చిట్ ఇచ్చింది. గతేడాది జులై 2వ తేదీన ఈ దారుణం చోటుచేసుకుంది. దీనిపై యూపీ ప్రభుత్వం రిటైర్డు జస్టిస్ బ్రిజేశ్ కుమార్ శ్రీవాస్తవ్ సారథ్యంలో ముగ్గురు సభ్యుల జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. భోలె బాబా అసలు పేరు సూరజ్‌పాల్. అయితే, పోలీసులు నిందితుడి జాబితాలో సూరజ్‌పాల్ పేరును చేర్చలేదు. దర్యాప్తు సమయంలో గతేడాది అక్టోబర్‌లో కమిషన్ ఎదుట భోలె బాబా హాజరయ్యారు. ఈ కమిటీ భోలెబాబాకు క్లీన్ చిట్ ఇస్తూ నివేదిక అందజేసిందని ఆయన లాయర్ ఏపీ సింగ్ వెల్లడించారు. కొందరు కుట్రదారులు భోలె బాబాను, యూపీ ప్రభుత్వం ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించగా వారి ఎత్తుగడలను కమిషన్ బయటపెట్టిందన్నారు. ఇది సత్యానికి, విశ్వాసానికి లభించిన విజయంగా పేర్కొన్నారు. తొక్కిసలాట చోటుచేసుకున్న తర్వాత కార్యక్రమ ప్రధాన నిర్వాహకుడు ప్రకాశ్ మధుకర్ సహా 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జిని, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ కార్యక్రమానికి 80 వేల మందికి మాత్రమే అనుమతివ్వగా 2.50 లక్షల మందికి పైగా భక్తులు రావడంతోనే ఘోరం జరిగిందని యంత్రాంగం వాదించింది. కాగా, ఘటన వెనుక కుట్ర కోణం ఉందంటూ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఆరోపించారు.

పాస్‌పోర్టు కోర్టులో ఉన్నా అమెరికా ఎలా వెళ్లాడు?

సుప్రీంకోర్టు విస్మయం • సీబీఐ విచారణకు ఆదేశం



న్యూఢిల్లీ: పాస్‌పోర్టు కోర్టు అధీనంలోనే ఉన్నప్పటికీ ధిక్కారం ఆరోపణలను ఎదుర్కొంటున్న వ్యక్తి అమెరికాకు వెలా వెళ్లిపోయాడని సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది చాలా తీవ్రమైన అంశమని జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం పేర్కొంది. దీనిపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీబీఐని ఆదేశించింది. అమెరికాలో భర్త వద్ద ఉన్న తన బిడ్డను అప్పగించాలంటూ ఓ మహిళ పెట్టుకున్న పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. జనవరి 29వ తేదీన ఆ వ్యక్తిపై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. అతడిని అరెస్ట్ చేసేలా అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని, చట్టం ముందు అతడిని నిలబెట్టాలని హోం శాఖను సైతం ఆదేశించింది. అయినప్పటికీ, అతడు తప్పించుకుపోవడంపై విస్మయం చెందింది. ఆ వ్యక్తి ఫోర్జరీ పత్రాలతో అమెరికా వెళ్లిపోయి ఉంటాడని పిటిషనర్ తెలిపారు. అమెరికా హోం శాఖకు విషయం తెలిపి, తప్పించుకున్న వ్యక్తిని అక్కడి అధికారుల సాయంతో వెనక్కి తీసుకువచ్చేందుకు అవకాశముందని అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ ధర్మాసనానికి నివేదించారు. ఆ వ్యక్తి ఎయిర్ పోర్టులో వీల్ చైర్‌లో వెళ్తున్న దృశ్యాలతో కూడిన వీడియోను అందజేశారు. అయితే, చిన్నారిని తల్లి చెంతకు చేర్చడం ముఖ్యమైన అంశమని పేర్కొన్న ధర్మాసనం ..చిన్నారి వెంటనే అమెరికా నుంచి తీసుకువచ్చి తల్లికి అప్పగించాలని ప్రతివాది తరఫు లాయర్‌కు మౌఖిక ఆదేశాలు జారీ చేసింది.

వాజ్‌పేయి సర్కారును కూల్చిన ఆ ఒక్క ఓటు నేను వేయించిందే

శరద్ పవార్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: 1999లో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని పడగొట్టిన ప్రతిపక్షంలోని ఆ ఒక్క ఓటు తను ఒప్పించి వేయించిందేనని సీనియర్ నేత, ఎన్సీపీ(ఎస్పీ)చీఫ్ శరద్ పవార్ పేర్కొన్నారు. శుక్రవారం మహారాష్ట్ర సంసద్‌లో అఖిల భారతీయ మరాఠీ సాహిత్య సమ్మేళన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1999 లోక్‌సభలో ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి ప్రభుత్వం గద్దె దిగి పోవడానికి దారి తీసిన పరిణామాలను ఆయన గుర్తు చేశారు. ఓ ఎంపీతో సుమారు 10 నిమిషాలపాటు మాట్లాడాక అధికార పక్షం ఎన్డీఏలోని ఆ ఒక్క సభ్యుడి ఓటును ప్రతిపక్షానికి అనుకూలంగా వేసేలా ఒప్పించింది తనేనంటూ చెప్పుకొచ్చారు. దాని ఫలితంగానే ఆ ప్రభుత్వం కుప్పకూలిందన్నారు. ఈ సందర్భంగా నీలేశ్‌కుమార్ కులకర్ణి రచించిన 'సన్సద్ భవన్ టు సెంట్రల్ విస్టా' పుస్తకావిష్కరణ జరిగింది.

ఆ మృతదేహం షిరి బిబాస్‌ది కాదు..

- హమాస్ అప్పగించిన మహిళ మృతదేహంపై ఇజ్రాయెల్ ఆరోపణ
- షిరి బిబాస్ సహా బందీలందరినీ విడుదల చేయాలని డిమాండ్



షిరి బిబాస్ (ఫైల్)

టెల్‌అవీవ్: హమాస్ గురువారం అప్పగించిన నాలుగు మృతదేహాల్లో మహిళ మృతదేహం.. 2023 అక్టోబర్ 7 దాడి సమయంలో పట్టుబడిన బందీలకు చెందినది కాదని ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం తెలిపింది. మృతదేహాల్లో ఖఫీర్ బిబాస్, అతని నాలుగేళ్ల సోదరుడు ఏరియల్ అనే ఇద్దరు పిల్లలున్నారని, మూడో మృతదేహం వారి తల్లి షిరి బిబాస్‌ది కాదని వెల్లడించింది. మహిళ మృతదేహం అపహరణకు గురైన ఇతర వ్యక్తులతో సరిపోలడం లేదని సైనిక ప్రతినిధి తెలిపారు. అంతేకాదు.. కఫీర్ బిబాస్, ఏరియల్ బిబాస్‌లను హమాస్ చంపిందని ఆరోపించారు. బందీల విడుదల ఒప్పందంలో హమాస్‌ది తీవ్రమైన ఉల్లంఘనని ఇజ్రాయెల్ మండిపడింది. షిరితో పాటు మిగిలిన బందీలందరినీ వెంటనే వెనక్కి రప్పించాలని ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. అయితే, ఇజ్రాయెల్ ఆరోపణలపై హమాస్ ఇంకా స్పందించలేదు. కాగా, గురువారం మృతదేహాల అప్పగింత సమయంలో జరిగిన హడావుడిపై అంతర్జాతీయంగా విమర్శలు వచ్చాయి. విడుదల సందర్భంగా వేలాది మంది జనం మధ్య.. సాయుధ హమాస్ ఫైటర్లు నాలుగు శవపేటికలను ప్రదర్శించింది. ఈ ప్రదర్శనను ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ సహా అంతర్జాతీయ నేతలు తీవ్రంగా ఖండించారు.

ఆస్పత్రిలోనే పోప్ ఫ్రాన్సిస్

రోమ్: పోప్ ఫ్రాన్సిస్(88) ప్రమాదం నుంచి బయట పడలేదు కానీ, ఆయనకు ప్రాణాపాయం లేదని ఆయనకు చికిత్స చేస్తున్న రోమ్‌లోని గెమెల్లి ఆస్పత్రి వైద్య బృందం తెలిపింది. వచ్చే వారమంతా ఆయన ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తుందని కూడా వైద్యులు స్పష్టం చేశారు. బ్రాంకైటిస్, న్యుమోనియాతో తీవ్ర అనారోగ్యం బారిన పడిన పోప్ ఈ నెల 14వ తేదీన ఆస్పత్రిలో చేరిన విష యం తెల్సిందే. శుక్రవారం మొదటిసారిగా పోప్ ఆరోగ్యంపై వారు స్పష్టత ఇచ్చారు. 'అప్పుడప్పుడూ ఆయనకు విటమిన్లు, మినరల్స్‌తో కూడిన ఆక్సిజన్‌ను అందజేస్తున్నాం. న్యుమోనియా రెండు ఊపిరితిత్తుల్లోనూ ఉంది. దీని నివారణ వైద్య చికిత్సలకు ఆయన సరిగ్గానే స్పందిస్తున్నారు' అని గెమెల్లి ఆస్పత్రి వైద్య బృందం వివరించింది. శ్వాసకోశ సంబంధ ఇన్ఫెక్షన్‌తోనూ ఆయన ఇబ్బంది పడుతున్నట్లు పరీక్షల్లో వెల్లడైందని తెలిపింది. ఇలా ఉండగా, పోప్ ఫ్రాన్సిస్ దీర్ఘకాలం పాటు ఆస్పత్రిలోనే కొనసాగాల్సి అవసరం వస్తే పరిస్థితి ఏమిటి? ముఖ్యమైన రోజు వారీ విధులను నిర్వహించలేనప్పుడు ఆ బాధ్యతల నుంచి ఆయన తప్పుకుంటారా అన్న చర్చ కార్డినల్స్‌లో ఇప్పటికే మొదలైందని చెబుతున్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 22 । ఫిబ్రవరి । 2025



అందుబాటులో ఉన్నది ఒక్కరే!
నకిలీ విద్యార్హత పత్రాల గ్యాంగ్ నుంచి వివిధ సర్టిఫికెట్లు ఖరీదు చేసిన వ్యక్తుల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ప్రాథమికంగా 11 మందిని గుర్తించారు. -8లో



ఖేలో.. అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్
నగరం అంతర్జాతీయ క్రీడల్లోనూ రాణిస్తోంది. అమెరికన్ ఫుట్‌బాల్‌లో సైతం తన ప్రాతినిధ్యాన్ని పెంచుకుంటోంది. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
35.0/22.0
నగరం పరిధిలో శనివారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 35, కనిష్ఠంగా 22 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చని అంచనా.

ఏఐ పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేస్తాం

మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: ఫండమెంటల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ప్రాథమిక స్థాయి విద్యార్థులకు భాషా గణిత సామర్థ్యాల సాధన) కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పైలట్ ప్రాజెక్టును విజయవంతం చేస్తామని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకటాచారి

లక్డీకాపూల్: వచ్చే నెల 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ)వెంకటాచారి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ జిల్లాలో ఇంటర్ పరీక్షలను 244 కేంద్రాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నపత్రాల తరలింపులో పోలీసులు అత్యంత బాధ్యత, భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు సమయానుకూలంగా పరీక్ష కేంద్రాలకు చేరేలా ఆర్టీసీ బస్సులు నడపాలని సూచించారు విద్యార్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని.. క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్ష కేంద్రాల లొకేషన్‌లను పరిశీలించుకోవాలన్నారు. సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్ 040 29700934ను సంప్రదించవచ్చని సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి డి.ఒడ్డెన్న, ఏసీపీ భాస్కర్, ఆర్‌ఎం బాబూనాయక్, జిల్లా వైద్యాధికారి జె. వెంకటి, పోస్టల్ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను కట్టండహో!

జీహెచ్‌ఎంసీ వినూత్న ప్రచారం



ఇందిరానగర్‌లో ఆస్తి పన్ను కట్టాలంటూ మైక్‌తో బల్దియా సిబ్బంది చాటింపు

బంజారాహిల్స్: ఆస్తి పన్ను బకాయిలున్న బడా బాబులకు, స్టార్ హోటళ్లకు సీజ్‌లతో షాక్ ఇస్తున్న అధికారులు తమ పంథా మార్చారు. ప్రస్తుతం బస్తీలు, కాలనీల్లో వినూత్న తరహాలో ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాది మార్చి 31లోగా ఆస్తి పన్నుతో పాటు మొండి బకాయిలను వెంటనే చెల్లించాలంటూ క్షేత్ర స్థాయిలో అన్ని శాఖల సిబ్బంది చేతికి మైక్‌సెట్లు ఇచ్చి చాటింపు వేయిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ బస్తీలో శుక్రవారం జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది మైక్‌సెట్‌లో ఆస్తి పన్ను చెల్లించాలంటూ ప్రచారం చేశారు. ఆస్తి పన్ను చెల్లించని మొండి బకాయిదారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు స్పందించని వారి ఆస్తులను సైతం జప్తు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

పతంగిదే పై‘చేయి’

బల్దియా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమే

- కలిసి, నిలిచి, గెలిచిన కాంగ్రెస్, ఎంఐఎం
- పోటీ నుంచి వైదొలగిన బీఆర్‌ఎస్



వీరే స్టాండింగ్ కమిటీ సభ్యులు (పార్టీల వారీగా)

ఎంఐఎం నుంచి..	కాంగ్రెస్ నుంచి..
అబ్దుల్ వాహబ్ (చాంద్రాయణగుట్ట), డాక్టర్ ఆయేషా హుమేరా (టోలిచౌకి), గౌసుద్దీన్ మహ్మద్(ఛోలక్‌పూర్), పర్వీన్ సుల్తానా (ఘాన్సీబజార్), బాతాజబీన్ (విజయనగర్ కాలనీ), మహ్మద్ సలీం (దూద్‌బౌలి), సమీనా బేగం (తలాబ్ చంచలం), సయ్యద్ మిన్హాజుద్దీన్ (అక్బర్ బాగ్).	వి.జగదీశ్వర్‌గౌడ్ (మాదాపూర్), బానోత్ సుజాత (హస్తినాపురం), మహ్మద్ బాబా ఫసియుద్దీన్(బోరబండ), బూరుగడ్డ పుష్ప (ఆర్‌సీపురం), బొంతు శ్రీదేవి (చర్లపల్లి), మహాలక్ష్మి రామన్ గౌడ్ (హిమాయత్‌నగర్), సీఎన్ రెడ్డి (రహ్మత్‌నగర్).

సాక్షి, సిటీబ్యూరో:

నామినేషన్ల సందర్భంగా సస్పెన్స్‌లు.. డ్రామాలు.. రక్తికట్టిన అనంతరం జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు ఊహించినట్లుగానే ఏకగ్రీవమయ్యాయి. అధికారంలో ఉన్న పార్టీతో సఖ్యత ఫార్ములాతో ఎంఐఎం.. కాంగ్రెస్‌తో జత కట్టడంతో ఆ రెండు పార్టీల కార్పొరేటర్లే స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంతకాలం ఆ పార్టీతో జట్టుకట్టిన ఎంఐఎం.. ఈసారి కాంగ్రెస్‌తో జత కలిసింది. దాంతో.. ఈసారి బీఆర్‌ఎస్ స్థానే కాంగ్రెస్ సభ్యులు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లున్న జీహెచ్‌ఎంసీలో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యుల కోసం ఎన్నిక జరిగింది. రెండు పార్టీలు కలిస్తే.. మిగతా పార్టీలు గెలవవని తెలిసినప్పటికీ.. అధిష్ఠానం నిర్ణయానికి ముందస్తుగానే నామినేషన్లు వేసి బరిలో దిగిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో పోలింగ్ జరగకుండానే పోటీలో మిగిలిన 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైనట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ప్రకటించారు.

పోటీ చేయని బీజేపీ

రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు దూరమంటూ జీహెచ్‌ఎంసీలో ఆ పార్టీతో కలిస్తే అపప్రథ అనే తలంపుతో బీజేపీ అసలు పోటీ చేయలేదు. ఈ ఎన్నికకు పార్టీలతో సంబంధం లేనందున వ్యక్తిగత బలంతో గెలవవచ్చనుకున్నారో, లేక లోపాయికారీగా నామినేషన్లు ముగిసేలోగా ఏమైనా జరగవచ్చనుకున్నారో నామినేషన్లు వేసిన ఇద్దరు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు పోటీ నుంచి వైదొలిగారు. గెలవలేమని తెలిసి బరిలో ఉండొద్దంటూ అధిష్ఠానం ఆదేశించడంతో నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

ఎంఐఎందే హవా..

స్టాండింగ్ కమిటీలో స్థానంతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పరువు దక్కించుకున్నప్పటికీ, ఎంఐఎం హవా కొనసాగనుంది. 15 మంది సభ్యులకుగాను 8 మంది ఎంఐఎం వారే. అంటే, ఒక్కటే అయినప్పటికీ, కాంగ్రెస్ కంటే ఎంఐఎందే మెజార్టీ. ఇక జీహెచ్‌ఎంసీ పాలకమండలికి చివరి సంవత్సరంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరగనున్న తరుణంలో స్టాండింగ్‌క మిటీలో ఆమోదం పొందాలంటే ఎంఐఎం సభ్యులే కీలకం కానున్నారు. ఎంఐఎంకు అధికారంలోని పార్టీలతో అనుబంధం ఈనాటిది కాదు. బీఆర్‌ఎస్ రాకముందు నుంచీ అది అధికారంలో ఉన్న పార్టీతో పొత్తు కొనసాగిస్తోంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు పొత్తులో భాగంగా స్టాండింగ్ కమిటీలోనే కాదు..మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలు పొత్తులో భాగంగా పంచుకున్నారు.

పెరిగిన కాంగ్రెస్ బలం..

కాంగ్రెస్ పార్టీ బలం ప్రస్తుతం 25కు చేరినప్పటికీ, ఆ పార్టీ తొలుత గెలిచింది రెండు సీట్లే. ఇతర పార్టీల నుంచి చేరికలతో దాని బలం 25కు పెరిగింది. గతంలో కాంగ్రెస్-ఎంఐఎం పొత్తు కొనసాగినప్పుడు కాంగ్రెస్ 8, ఎంఐఎం 7 స్టాండింగ్‌కమిటీ స్థానాలు పొందేవి. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక బల్దియాలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు 99 మంది, ఎంఐఎం కార్పొరేటర్లు 44 మంది ఉన్నప్పుడు బలానికనుగుణంగా అంటూ బీఆర్‌ఎస్ నుంచి 9 మంది, ఎంఐఎంనుంచి ఆరుగురు మాత్రమే స్టాండింగ్ కమిటీలో ఉన్నారు. గత పాలకమండలి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలం 56కు తగ్గడంతో తిరిగి స్టాండింగ్ కమిటీకి 8 మందినే ఖరారు చేశారు. ఇప్పుడు ఎంఐఎం-కాంగ్రెస్ పొత్తులో భాగంగా ఎంఐఎంకు ఎక్కువమంది కార్పొరేటర్లు ఉన్నందున వారు ఎనిమిది స్టాండింగ్ కమిటీ స్థానాలు పొందారు. మొత్తానికి ఎన్నికలకున్న ఏడాది సమయంలో ముఖ్యపాత్ర పోషించనున్నారు. కాంగ్రెస్‌లోకి ఇతర పార్టీల నుంచి వచ్చినవారే స్టాండింగ్ కమిటీలో స్థానం పొందారు. తొలుత గెలిచిన వారిలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం.

వేధింపులకు గురి చేసి..
వేరు కాపురం పెట్టి..

జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్‌పై ఆయన భార్య ఫిర్యాదు

- ఇంట్లో మరో మహిళతో కలిసి ఉండగా పట్టుకుని దేహశుద్ధి
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



జానకీరామ్‌పై దాడి చేస్తున్న కల్యాణి కుటుంబ సభ్యులు

బౌద్ధనగర్: తనను వేధింపులకు గురి చేస్తూ.. మరో మహిళతో కలిసి ఉన్న జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని పోలీసులకు అప్పగించింది ఆయన భార్య. ఈ ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాచకొండ సైదులు, బాధితురాలు చెప్పిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌లోని వారాసిగూడకు చెందిన జానకీరామ్ జీహెచ్‌ఎంసీ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు గతంలో వివాహమైంది. కొంత కాలం తర్వాత దంపతులు విడాకులు తీసుకున్నారు. 2018లో బౌద్ధనగర్‌కు చెందిన కల్యాణితో జానకీరామ్‌కు రెండో పెళ్లి జరిగింది. కొన్నాళ్ల పాటు వీరి కాపురం సజావుగానే సాగింది. ఆ తర్వాత జానకీరామ్, కల్యాణి కలిసి ఆయన తల్లిదండ్రులతో నివసించసాగారు. ఈ క్రమంలోనే కల్యాణిని అత్తామామలతో పాటు తన భర్త అన్న, వదిన వేధింపులకు గురి చేసేవారు. జానకీరామ్‌కు మరో వివాహం చేసేందుకు కల్యాణిని ఇంట్లో నుంచి వెళ్లగొట్టే ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో జానకీరామ్ నాలుగు నెలల క్రితం భార్యను ఆమె పుట్టింట్లో వదిలేసి వెళ్లాడు. అప్పటి నుంచి కల్యాణి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా భర్త లిఫ్ట్ చేసేవాడు కాదు. దీంతో భర్తపై అనుమానం కలిగిన కల్యాణి శుక్రవారం తన కుటుంబ సభ్యులతో కలిసి వారాసిగూడలోని భర్త ఇంటికి వెళ్లి చూడగా.. అతను మరో అమ్మాయితో కలిసి ఉన్నాడు. వీరిద్దరినీ పట్టుకొని దేహశుద్ధి చేశారు. వారాసిగూడ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని జానకీరామ్‌తో పాటు సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. కాగా.. తన భర్త మరో మహిళను పెళ్లి చేసుకుని కాపురం పెట్టినట్లు సమాచారం రావడంతో వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు బాధితురాలు కల్యాణి తెలిపారు. తన భర్తతో పాటు ఆయన కుటుంబ సభ్యులు తనను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేశారని, తాను 3 నెలల గర్భిణిగా ఉన్న సమయంలో కడుపుపై భర్త తన్నడంతో గర్భస్రావం జరిగిందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ లీక్ చేసి చంపేందుకు ప్రయత్నించాడని ఫిర్యాదులో కల్యాణి పేర్కొన్నారు.

20 మంది దాడి చేశారు: జానకీరామ్

తనతో పాటు ఇంట్లో ఉన్న తన స్నేహితురాలిపై 20 మంది దాడికి పాల్పడ్డారని జాయింట్ కమిషనర్ జానకీరామ్ వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన భార్య కల్యాణి, బావమరిది బులిశెట్టి భాస్కర్ సుమారు 20 మందితో కలిసి ఇంట్లోకి వచ్చి దాడి చేశారన్నారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాచకొండ సైదులు తెలిపారు.

ఎలివేటెడ్ కారిడార్‌లకు మార్చిలో టెండర్లు

రెండు కారిడార్‌లలో 1,730 నిర్మాణాల గుర్తింపు
- త్వరితగతిన ఆస్తుల సేకరణ, పరిహారం చెల్లింపు
- అంచనా వ్యయం దాదాపు రూ.5 వేల కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: ఎలివేటెడ్ కారిడార్‌లపై హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. సికింద్రాబాద్ నుంచి ఉత్తరం వైపు రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రభుత్వం గతేడాది ఎలివేటెడ్ కారిడార్‌లకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే. ఇప్పటి వరకు క్షేత్రస్థాయిలో వివిధ రకాల సర్వేలు నిర్వహించారు. రెండు రూట్లలో తొలగించాల్సిన చెట్లు, ఆస్తుల గుర్తింపుపై హెచ్‌ఎండీఏ ఇంజినీరింగ్, ప్లానింగ్‌తో పాటు ఇతర ప్రభుత్వ విభాగాలకు చెందిన అధికారులు సంయుక్తంగా అధ్యయనం చేపట్టారు. ప్రస్తుతం కారిడార్ మార్గాలపై సాంకేతిక పనులు పూర్తి కావడంతో నిర్మాణం దిశగా హెచ్‌ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఆసక్తి గల జాతీయ, అంతర్జాతీయ నిర్మాణ సంస్థల నుంచి మార్చిలో టెండర్‌లను ఆహ్వానించనున్నట్లు హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. నిర్మాణ సంస్థల ఎంపిక అనంతరం దశలవారీగా పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

మూడేళ్లలో కారిడార్‌ల నిర్మాణం..

ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు, ప్యారడైజ్ నుంచి డైరీఫామ్ వరకు రెండు మార్గాల్లో ఆరు లేన్‌లతో నిర్మించ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్‌లను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలని హెచ్‌ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం నిధుల కొరత ఉన్నప్పటికీ వివిధ రకాలుగా వాటిని సేకరించి దశలవారీగా నిర్మించనున్నారు. ఎలివేటెడ్ కారిడార్‌లతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.20 వేల కోట్ల వరకు అవసరమని హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటికే గుర్తించారు. హెచ్‌ఎండీఏకు సొంతంగా వందల ఎకరాల భూములు ఉన్నప్పటికీ ప్రస్తుతం విక్రయానికి అనుకూలమైన పరిస్థితులు లేవు. ఈ క్రమంలోనే ఆ భూములనే తాకట్టు పెట్టి రుణాలు సేకరించాలని భావిస్తున్నారు.

- ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు 18.1 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్‌కు రూ.2,232 కోట్లతో అంచనాలను రూపొందించారు. వెస్ట్ మారేడుపల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్, తూంకుంట నుంచి శామీర్‌పేట్ ఓఆర్‌ఆర్ జంక్షన్ వరకు నిర్మిస్తారు. అలాగే.. ప్యారడైజ్ నుంచి డైరీఫామ్ వర కు నిర్మించనున్న 5.5 కిలోమీటర్ల మార్గంలో తాడ్‌బండ్, బోయిన్‌పల్లి జంక్షన్‌ల మీదుగా రహదారులను విస్తరిస్తారు. ఈ కారిడార్ కోసం రూ.1,580 కోట్లు ఖర్చు కానున్నట్లు అంచనా. ఇంచుమించు రూ.5 వేల కోట్ల వరకు వ్యయం కానుంది.

రెవెన్యూ అధికారుల నిర్ణయం ప్రకారం పరిహారం..

ఈ రెండు కారిడార్‌ల కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి సేకరించాల్సిన ఆస్తులను అధికారులు తాజాగా గుర్తించారు. ప్యారడైజ్‌- డైరీఫామ్ రూట్లో సుమారు 452 వరకు ఉన్నాయి. ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ వరకు మరో 1,278 ఆస్తులను గుర్తించారు. రెండు మార్గాల్లో 1,730 ఆస్తులను సేకరించి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులు నిర్ణయించిన ప్రకారం ఆస్తులకు పరిహారం చెల్లించనున్నారు. ఇందుకోసం సుమారు రూ.3 వేల కోట్ల వరకు ఖర్చు కావచ్చు.



నిధుల లేమి కారణంగానే జాప్యం..

నిధుల కొరత కారణంగా ఎలివేటెడ్ కారిడార్‌ల నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లలో ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా ప్లాట్‌లను విక్రయించి నిధులను సేకరించాలని తొలుత భావించారు. ఈ మేరకు సన్నాహాలు కూడా చేపట్టారు. కానీ.. రియల్ ఎస్టేట్‌లో నెలకొన్న స్తబ్దత కారణంగా వాయిదా పడింది. దీంతో కారిడార్‌ల నిర్మాణంలో జాప్యం చోటుచేసుకుంది. మరింత జాప్యం ఏర్పడకుండా వివిధ రూపాల్లో నిధులను సేకరించి దశలవారీగా ప్రాజెక్టును చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే మార్చిలో టెండర్లను ఆహ్వానించనున్నారు.

లిఫ్టులో ఇరుక్కుపోయిన ఆరేళ్ల బాలుడు

అపస్మారక స్థితిలోకి వెళ్లిన చిన్నారి
- పరిస్థితి విషమం.. నిలోఫర్‌లో చికిత్స

నాంపల్లి: ఆరేళ్ల బాలుడు లిఫ్టులో ఇరుక్కుపోయి.. ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిపోయిన ఘటన నాంపల్లి పరిధిలోని మాసబ్‌ట్యాంక్ శాంతినగర్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గోడేకీ ఖబర్ ప్రాంతానికి చెందిన అజయ్ కుమార్ ప్రైవేట్ హెల్త్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు కుమారుడు అరుణవ్ (6) ఉన్నాడు. శాంతినగర్ కాలనీ మఫర్ కంఫర్టెక్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన అత్తమ్మ ఆయేషా ఇంటికి తాతయ్యతో కలిసి అరుణవ్ శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో వచ్చాడు. అపార్ట్‌మెంట్ మూడో అంతస్తుకు వెళ్లేందుకు తాతా, మనవడు లగేజీతో లిఫ్టు ముందు నిలబడ్డారు. కిందికి వచ్చిన లిఫ్టు లోపలికి మొదట అరుణవ్ వెళ్లాడు. బాలుడి తాత కొంత లగేజీని లిఫ్టులో పెట్టాడు. మిగిలిన లగేజీని తెచ్చేందుకు అతడు మళ్లీ లిఫ్టు బయటికి వెళ్లాడు. అంతలోనే అరుణవ్ బటన్ నొక్కాడు. అంతే.. క్షణాల్లో లిఫ్టు కదిలి పైకి వెళ్లింది. లిఫ్టు గ్రిల్స్ తెరిచే ఉండటంతో బయపడ్డ అరుణవ్ లిఫ్టు నుంచి దూకాడు. ఈ క్రమంలో లిఫ్టుకు, స్లాబ్ గోడకు మధ్యలోని సందులో ఇరుక్కుపోయాడు. అప్పటికే లిఫ్టు.. మొదటి ఫ్లోర్ స్లాబ్ వద్దకు చేరుకుని నిలిచిపోయింది. అందులో ఇరుక్కున్న అరుణవ్ గట్టిగా అరిచాడు. అపార్ట్‌మెంట్‌లోని వారంతా అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. నాంపల్లి ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు ఫైర్ సిబ్బందికి, హైడ్రా డీఆర్‌ఎఫ్ బలగాలను రప్పించారు.

లిఫ్టు పని తీరుపై అనుమానాలు..

శాంతినగర్ కాలనీలోని మఫర్ కంఫర్టెక్ అపార్ట్‌మెంట్ మొత్తం నాలుగు అంతస్తులు ఉంది. ఈ అపార్ట్‌మెంట్‌ను మఫర్ అనే సంస్థ నిర్మించి గ్రిల్స్‌తో కూడిన లిఫ్టును ఏర్పాటు చేసింది. ఎక్కడైనా గ్రిల్స్ మూస్తేనే లిఫ్ట్ పైకి కదులుతుంది. కానీ ఇక్కడి లిఫ్టు గ్రిల్స్ వేయకుండానే, కేవలం బటన్ నొక్కగానే పైకి కదిలింది. ఇలా లిఫ్టు పని చేయడంతోనే బాలుడు ఇరుక్కుపోవడానికి కారణమైందని భావిస్తున్నారు.

గ్యాస్ కట్టర్లతో తొలగించి..

ఘటనా స్థలానికి చేరుకున్న బలగాలు గ్యాస్ కట్టర్లు, ఫైర్ విభాగానికి చెందిన పరికరాలతో లిఫ్టు ఫ్రేమ్‌ను కట్ చేశారు. రెండు గంటల పాటు శ్రమించి స్లాబ్ గోడను తొలగించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ యజ్ఞనారాయణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి.దత్తు తమ బృందాలతో ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. బాలుడిని ప్రాణాలతో బయటికి తీసి చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు.

అపస్మారక స్థితిలో బాలుడు..

నిలోఫర్ ఆస్పత్రి ఐసీయూలో అరుణవ్‌ను వెంటిలేటర్ మీద ఉంచి ఆక్సిజన్, ఫ్లూయిడ్, గ్లూకోజ్‌ను అందిస్తున్నారు. 24 గంటలు గడిస్తే తప్ప బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఏమీ చెప్పలేమని నిలోఫర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ తెలిపారు. బాధిత బాలుడిని స్థానిక ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ పరామర్శించారు.





లిఫ్టులో ఇరుక్కుపోయిన బాలుడు, బయటికి తీస్తున్న సిబ్బంది

ప్రాణాలతో చెలగాటం



తాజాగా మాసబ్‌ట్యాంక్‌లో మరో ఉదంతం

- ఘటన జరిగినప్పుడే అధికారుల హడావుడి
- ఆ తర్వాత అంతా షరామామూలే
- నిబంధనలు పాటించాలంటున్న నిపుణులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడే సంబంధిత అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి. ఆ తర్వాత అందరూ ఆ విషయాన్ని మరిచిపోతున్నారు. భవనాలు కూలినప్పుడే అక్రమ నిర్మాణాలు, అగ్నిప్రమాదాలు జరిగినప్పుడే సేఫ్టీ నిబంధనలు గుర్తుకొస్తాయి. అలాగే లిఫ్టుల్లో ప్రమాదాలు జరిగినప్పుడే వాటి నిర్వహణ గుర్తుకొస్తుంది. శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లో ఆరేళ్ల బాలుడు లిఫ్టులో ఇరుక్కుపోవడంతో లిఫ్టులు.. వాటి నిర్వహణ.. తీసుకోవాల్సిన భద్రతచర్యలు వంటివి చర్చనీయాంశంగా మారాయి.

ఎవరికీ పట్టదు..

లిఫ్టులు, వాటి నిర్వహణకు సంబంధించి ఏ ప్రభుత్వ విభాగం కూడా పట్టించుకోవడం లేదు. జీహెచ్‌ఎంసీలో భవనాల నిర్మాణాలకు నిబంధనలున్నప్పటికీ, లిఫ్టుల ఏర్పాటుకు సంబంధించి నిబంధనల్లేవని సంబంధిత అధికారులు తెలిపారు. లిఫ్టుల స్టెబిలిటీ, నిర్వహణలపై కూడా నిబంధనల్లేవు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ సర్టిఫికెట్ ఇచ్చినట్లుగానే లిఫ్టుల ఏర్పాటుకు సంబంధించి లిఫ్ట్ ఇన్‌స్పెక్టర్ సర్టిఫికెట్ ఉండాలనేది ప్రతిపాదనలకే పరిమితమైంది. భవనం ఎత్తును బట్టి లిఫ్టులు ఉండాలనే నిబంధన ఉన్నప్పటికీ, లిఫ్టుల స్టెబిలిటీ, నిర్వహణలకు సంబంధించి ఎలాంటి నిబంధనల్లేవు. ఏటా వేల సంఖ్యలో భవనాల నిర్మాణం జరుగుతున్న జీహెచ్‌ఎంసీలో లిఫ్ట్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం దారుణమనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

నిర్వహణలో నిర్లక్ష్యం..

- స్టెబిలిటీ లేకపోవడం.. నాసిరకం లిఫ్టులు వాడటం ప్రమాదాలకు ఒక కారణం కాగా, కనీస నిర్వహణ లేకపోవడం ప్రమాదాలకు తావిస్తోంది.
- సాధారణంగా లిఫ్టు ఏర్పాటు సమయంలోనే ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రైవేటు సంస్థలు సంబంధిత లిఫ్టు కంపెనీలతో ఏఎంసీ(యాన్యువల్ మెయింటనెన్స్ కాంట్రాక్ట్) కుదుర్చుకుంటాయి. నిర్ణీత వ్యవధుల్లో పరీక్షించడం, అవసరాన్నిబట్టి పరికరాలు సరఫరా చేయడం, తగిన మరమ్మతులు చేయడం వంటివి చేయాలి.

గతంలోనూ ప్రమాదాలు..

- గతంలో కుందన్‌బాగ్‌లోని ఐఏఎస్‌ల క్వార్టర్లలోని లిఫ్టు కేబుల్ తెగి ప్రమాదం జరిగిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హిమాయత్‌నగర్‌లో లిఫ్టులో ఇరుక్కొని ఒకరు మృతి చెందారు.
- వ్యాపార సంస్థలతోపాటు నివాస అపార్ట్‌మెంట్లలోనూ లిఫ్టులతో అప్రమత్తంగా ఉండాలి. నిర్ణీత వ్యవధుల్లో సర్వీసు చేయించడం, లిఫ్టు ఆపరేటర్ విధుల్లో ఉండేలా చూడటం అవసరం.

- విద్యాసంస్థలు, ఆస్పత్రుల్లో ఇవి మరింత పకడ్బందీగా ఉండాలి.
- లిఫ్టులో లిఫ్ట్ ఆపరేటర్ తప్పనిసరిగా ఉండాలి. ఆపరేటర్ లేకుండా లిఫ్ట్ వినియోగించరాదు.
- పనిచేసే ‘అలార్మ్’ బెల్ ఉండాలి.లేని పక్షంలో కనీసం ఫోన్ చేసేందుకు వీలుగా ల్యాండ్‌లైన్ ఉండాలి.
- అత్యవసర సమయాల్లో ఫోన్ చేసేందుకు వీలుగా సంబంధిత ఎమర్జెన్సీ నెంబర్లులిఫ్టులోకనబడేలా ఉండాలి.
- గ్రిల్‌తో కూడిన లిఫ్టుల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. గ్రిల్ వాటికంటే పూర్తిగా మూసుకునే డోర్‌వి, అందరికీ కనిపించేలా అద్దాలవి అయితే మేలు.

కీసరగుట్ట బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న తోటకూర వజ్రేష్‌యాదవ్, తటాకం నారాయణ తదితరులు



దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

కీసర: ప్రముఖ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 24 నుంచి వచ్చే నెల 1 వరకు కొనసాగనున్న బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ శుక్రవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, ఆలయ చైర్మన్ తటాకం నారాయణ ఆధ్వర్యంలో ఆలయ పాలక మండలి సభ్యులు ముఖ్యమంత్రిని ఆహ్వానించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కీసరగుట్ట దేవాలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, గుట్టను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చొరవ చూపాలని ముఖ్యమంత్రిని కోరినట్లు తెలిపారు. కీసరగుట్ట దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లకు వారు ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కందాడి అంజిరెడ్డి, ఈఓ సుధాకర్‌రెడ్డి, తటాకం రమేష్, తటాకం వెంకటేష్, తటాకం ఉమాపతి, ట్రస్టుబోర్డు సభ్యులు మొర్గు ముత్యాలు, కందాడి రాజిరెడ్డి, ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉన్నది ఒక్కరే!

- నకిలీ సర్టిఫికెట్లు కొన్న వారిలో 11 మంది గుర్తింపు
- నలుగురు బీటెక్, ముగ్గురు బీకాం డిగ్రీలు ఖరీదు
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నది మాత్రం ఒక్కరే
- 'స్థానిక పోలీసు'లకు ఈ కేసు దర్యాప్తు ఓ సవాలే



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అంతర్రాష్ట్ర నకిలీ విద్యార్హత పత్రాల గ్యాంగ్ నుంచి వివిధ సర్టిఫికెట్లు ఖరీదు చేసిన వ్యక్తుల కోసం పోలీసు విభాగం ఆరా తీస్తోంది. ప్రాథమికంగా 11 మందిని గుర్తించినప్పటికీ... వీరిలో ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. దైనందిన విధులు, పని ఒత్తిడి నేపథ్యంలో ఈ కేసు దర్యాప్తు స్థానిక పోలీసులకు సవాల్‌గా మారనుంది. ఇన్వెస్టిగేషన్ త్వరితగతిన పూర్తయి, నిందితులపై కోర్టులో నేరం నిరూపణ కావాలంటే ప్రత్యేక విభాగంతో దర్యాప్తు చేయించాలనే వాదన వినిపిస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నారని సమాచారం.

గతంలో వెలుగులోకి రాని వజాహత్ పేరు...

మలక్‌పేటలోని ఫ్లై ఎబ్రాడ్ కన్సల్టెన్సీ సర్వీసెస్ కేంద్రంగా బజార్‌ఘాట్‌కు చెందిన మహ్మద్ హబీబ్ నేతృత్వంలో నడుస్తున్న ఈ గ్యాంగ్ 2019 నుంచి నకిలీ సర్టిఫికెట్ల దందా చేస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతను ఐదుసార్లు పోలీసులకు చిక్కాడు. అయితే గతంలో నాలుగుసార్లు పట్టుబడినప్పుడు పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడించలేదు. తాజాగా ఈ ముఠా గుట్టురట్టు కావడానికి మల్లేపల్లికి చెందిన మహ్మద్ వజాహత్ అరెస్టే కారణం. సోమవారం అతడిని అదుపులోకి తీసుకున్న వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అతడిచ్చిన సమాచారంతో మంగళవారం హబీబ్ సహా మరో ఐదుగురిని అరెస్టు చేశారు. హబీబ్‌కు 2019 నుంచి వజాహత్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నా... గతంలో అరెస్టు అయిన సందర్భాల్లో అతడి పేరు బయటకు రాలేదు. కేసు తీవ్రత దృష్ట్యా ఇప్పటికే వెలుగులోకి వచ్చిన ఏజెంట్లు, సబ్–ఏజెంట్ల వద్దే నిందితుల జాబితా ఆగిపోతుందని దర్యాప్తు పూర్తయ్యే వరకు చెప్పలేని పరిస్థితి.



నిందితుడు మహ్మద్ హబీబ్ (ఫైల్)

దర్యాప్తు భారీ ప్రహసనమే...

ఇప్పటికే పోలీసులు ఈ గ్యాంగ్ నుంచి 11 మందికి చెందిన 114 సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు గుర్తించిన దాని ప్రకారం మరో ఏడుగురు నిందితులు చిక్కాల్సి ఉంది. ఇప్పటికే అరెస్టు అయిన, ఇకపై అరెస్టు కానున్న నిందితుల ఫోన్లను విశ్లేషించాలి. వాటిలో వివరాలు లభిస్తే జారీ అయిన నకిలీ సర్టిఫికెట్లు, వాటిని ఖరీదు చేసిన వారి సంఖ్య భారీగా పెరుగుతుంది. ఇలాంటి కేసుల్లో దోషులుగా నిరూపించాలంటే పక్కాగా చార్జ్‌షీట్ దాఖలు చేయాలి. దాని కోసం ప్రతి నకిలీ సర్టిఫికెట్‌ను అది ఏ వర్సిటీ పేరుతో ఉందో ఆ అధికారులకు పంపాలి. అది తాము జారీ చేసినది కాదని, సంతకాలు ఫోర్జరీ అయ్యాయని అధికారికంగా తీసుకోవాలి. వీలున్నంత వరకు ప్రతి వర్సిటీ అధికారితో ఆయా ఠాణాల్లో ఫిర్యాదు చేయించాలి. ఇంతటి జటిలమైన ప్రక్రియ అనునిత్యం బందోబస్తు, ఇతర విధులతో బిజీగా ఉండే స్థానిక పోలీసులతో పూర్తికాదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

గుర్తించిన సర్టిఫికెట్ల వివరాలిలా..

1. మహ్మద్ యాసీన్: ఆంధ్రా యూనివర్సిటీ పేరుతో బీటెక్ (మెకానికల్)
2. మహ్మద్ అబ్దుల్ అలీం: తెలంగాణ యూనివర్సిటీ పేరుతో బీకాం(కంప్యూటర్స్)
3. హూర్ సుల్తానా: తెలంగాణ యూనివర్సిటీ పేరుతో బీకాం (కంప్యూటర్స్)
4. మహ్మద్ ఉమెర్ అహ్మద్: అన్నా యూనివర్సిటీ పేరుతో బీఈ (సివిల్)
5. ఎం.వంశీకృష్ణ మూర్తి: అన్నా యూనివర్సిటీ పేరుతో బీఈ (సీఎస్ఈ)
6. సయ్యద్ బిలాల్ పాషా: యూనివర్సిటీ పేరుతో బీటెక్ (సివిల్)
7. మహ్మద్ వలీ అక్రం: యూనివర్సిటీ పేరుతో బీఏ
8. మహ్మద్ నూరుద్దీన్: తెలంగాణ యూనివర్సిటీ పేరుతో బీకాం (కంప్యూటర్స్)
9. మహ్మద్ తౌఫీఖ్: ఆంధ్రా యూనివర్సిటీ పేరుతో బీటెక్ (మెకానికల్)
10. మహ్మద్ ఫయాజుద్దీన్: అన్నా యూనివర్సిటీ పేరుతో బీఎస్సీ (కంప్యూటర్స్)
11. షేక్ ముబీన్ అబ్దుల్లా: ఆంధ్రా యూనివర్సిటీ పేరుతో బీటెక్ (మెకానికల్)

◆ హబీబ్ గ్యాంగ్ వీరిలో ఒక్కొక్కరికీ సునీల్ కపూర్ తయారు చేసిన ఒరిజినల్ డిగ్రీలతో పాటు ప్రొవిజనల్ సర్టిఫికెట్, కన్సాలిడేటెడ్ మార్క్స్ మెమో, సెమిస్టర్ వారీగా మార్క్స్ మెమో తదితరాలతో కలిపి తొమ్మిది నుంచి 11 సర్టిఫికెట్లు అందజేసింది. దీంతో వీళ్లు ఎక్కడ ఉన్నారు? ఏఏ ఉద్యోగాలు చేస్తున్నారు? అనేది పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికి ఒకరినే గుర్తించారని, మిగిలిన వారి వివరాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేరుతో ఏపీకే ఫైల్

నగర మహిళ నుంచి రూ.7.44 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నివసించే ఓ వ్యక్తికి పీఎం కిసాన్ యోజన పేరుతో ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్‌ను పంపి రూ.1.97 లక్షలు కాజేసిన కేసును మరువకముందే నగరంలో మరో నేరం వెలుగులోకి వచ్చింది. ఆరోగ్య రంగంలో పని చేసే మహిళకు (34) ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేరుతో ఏపీకే ఫైల్ పంపిన సైబర్ నేరగాళ్లు ఆమె ఖాతా నుంచి రూ.7.44 లక్షలు స్వాహా చేశారు. దీనిపై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. బాధిత మహిళకు ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో ఖాతా ఉంది. ఆమెకు నాలుగు రోజుల క్రితం ఆ బ్యాంక్ నుంచి వచ్చినట్లు ఆన్‌లైన్ ప్రాసెసింగ్ పేరుతో సందేశంతో కూడిన లింకు రూపంలో ఏపీకే ఫైల్ వచ్చింది. ఈ సందేశం బ్యాంక్ నుంచే వచ్చిందని భావించిన ఆమె సదరు లింక్ ఓపెన్ చేశారు. అందులో ఆమె వ్యక్తిగత వివరాలు పొందుపరచాలని ఉండటంతో అనుమానం వచ్చి ఆ పని చేయలేదు. అయితే సైబర్ నేరగాళ్లు ఆ ఏపీకే ఫైల్స్‌లో నిక్షిప్తం చేసిన మాల్‌వేర్ అప్పటికే ఆమె ఫోన్‌లో నిక్షిప్తమైంది. అది ఇన్‌స్టాల్ కావడంతోనే ఆమె ఫోన్ మొత్తం నేరగాళ్ల ఆధీనంలోకి వెళ్లింది. ఇలా ఫోన్ ద్వారా జరిగే లావాదేవీలతో పాటు వచ్చే ఎస్సెమ్మెస్‌లు సైతం యాక్సస్ చేయగలిగిన సైబర్ నేరగాళ్లు ఆమె నెట్ బ్యాంకింగ్ నుంచి ఆర్థిక లావాదేవీలు చేస్తూ, ఓటీపీలను వినియోగించి రూ.7.44 లక్షలు కాజేశారు. ఎట్టకేలకు జరిగిన మోసాన్ని గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీనిని అధికారులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. ఏపీకే ఫైల్స్‌ను సైబర్ నేరగాళ్లు లింకులు, సందేశాలు సహా వివిధ రూపాల్లో పంపిస్తారని, వీటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు కోరుతున్నారు. ఏదైనా మెసేజ్, లింకు వచ్చినప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలని అందులో .ఏపీకే అనే అక్షరాలు కనిపిస్తే ఇన్‌స్టాల్ కాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ వెంటనే డిలీట్ చేయాలని సూచిస్తున్నారు.

నగరంలో నేడు

- గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో డిజైర్ డిజైన్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాళికలాను చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నాలెడ్జి సిటీలోని టీ వర్క్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎలివేట్ ఎక్స్‌పో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

డిజిటల్ అరెస్టుతో రూ.1.38 కోట్లు లూటీ

- మరో కేసులో రూ.28.65 లక్షలు వసూలు
- తమిళనాడు, కేరళకు చెందిన నిందితుల అరెస్టు

సాక్షి, హైదరాబాద్: డిజిటల్ అరెస్టు పేరుతో అమాయకులను బెదిరించి డబ్బులు వసూలు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో ఏడుగురు నిందితులను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబరాబాద్‌కు చెందిన 82 ఏళ్ల రిటైర్డ్ ఇంజినీర్‌కు +91 9907433363 నంబర్ నుంచి గత ఏడాది సెప్టెంబర్‌లో ఫోన్‌కాల్ వచ్చింది. ఎస్‌బీఐ ప్రతినిధిగా పరిచయం చేసుకున్న అతను.. బాధితుడిపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని బెదిరించాడు. ముంబై సైబర్ క్రైమ్ నకిలీ అధికారి వాట్సాప్ నంబర్ (+91 9912150357)కు కాల్‌ను అనుసంధానించాడు. అరెస్టు చేయకుండా ఉండాలంటే డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు నిందితులు సూచించిన పలు బ్యాంకు ఖాతాలకు రూ.1.38 కోట్లు బదిలీ చేశాడు. ఈ మోసంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. సాంకేతిక ఆధారాలతో బ్యాంకు ఖాతా లావాదేవీలను పరిశీలించారు. బాధితుడి నుంచి కొట్టేసిన డబ్బు మొత్తం తమిళనాడుకు చెందిన శంకర్ గణేష్, ఎలంచెజియన్ సత్యవేల్‌ల ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. వీరు సైబర్ నేరస్తులకు 10 శాతం కమీషన్ ప్రాతిపదికన నకిలీ బ్యాంకు ఖాతాలను అందిస్తున్నట్లు తేలింది. జెస్మిన్ మండల్, సచిన్, ముత్తుకుమార్, సలీంలు సైబర్ క్రైమ్ పోలీసులు, న్యాయాధికారులుగా నటిస్తూ అమాయకులను డిజిటల్ అరెస్టు పేరుతో భయపెట్టి సొమ్ము కాజేస్తున్నట్లు గుర్తించారు. తాజాగా ఈ కేసులో శంకర్ గణేష్, సత్యవేల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు.

మరో కేసులో రూ.28.65 లక్షలు దోపిడీ

మరో మహిళను కూడా సైబర్ మోసగాళ్లు ఇలాగే దోపిడీ చేశారు. 66 ఏళ్ల రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగినికి +9986159427 నంబర్ నుంచి ఫోన్ చేసి.. ఆమె ఆధార్ కార్డును వినియోగించి, ముంబైలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా తెరిచారని, ఆ అకౌంట్ మనీ లాండరింగ్ కేసులో లింకై ఉందని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు నిందితులు సూచించిన బ్యాంకు ఖాతాలకు రూ.28.68 లక్షలు బదిలీ చేసింది. ఈ ఘటనపై నమోదైన కేసులో కేరళకు చెందిన ముస్తఫా, హెన్సిలీ జోసెఫ్, వీపీ మనికందన్, హంజా, ఆసిఫ్ అలీలను అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడు బాబు పరారీలో ఉన్నాడు.

వృద్ధుడి హత్యకేసులో నిందితుడికి పదేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మద్యం మత్తుతో ఓ వృద్ధుడి(95)పై దాడి చేసి అతడి మృతికి కారణమైన కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 15వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ రఘు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డప్పు బాలయ్య(95) అనే వ్యక్తి గండిపేట మండలం, ఖానాపూర్ గ్రామంలో కుటుంబంతో కలిసి నివాసం ఉండేవాడు. అదే గ్రామానికి చెందిన అశోక్ తాగుడుకు బానిసై అందరినీ బెదిరించి డబ్బులు వసూలు చేసేవాడు. ఈ నేపథ్యంలో 2021 అక్టోబర్ 12న ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన బాలయ్యను అశోక్ డబ్బులు డిమాండ్ చేశాడు. అందుకు అతను నిరాకరించడంతో అతడిపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన బాలయ్యను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మర్నాడు మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం శుక్రవారం పైవిధంగా తీర్పు వెలువరించింది.

నగరంలో చికెన్, ఎగ్స్ మేళా



సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం చికెన్ అండ్ ఎగ్స్ మేళా కార్యక్రమాలు నిర్వహించారు. బర్డ్ ఫ్లూ నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న భయాందోళనలను తొలగించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. సరైన విధంగా వండిన చికెన్, గుడ్లు తినవచ్చునని, భయపడాల్సిన అవసరం లేదని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉచితంగా చికెన్, గుడ్లు పంపిణీ చేశారు. రోజువారీ ఆహారంలో ప్రొటీన్లు అత్యధికంగా ఉన్న చికెన్, గుడ్ల ప్రాముఖ్యతను వివరించారు.

ఏపీ టు చైనా

- పెట్టుబడిపై రోజుకు 20 శాతం రాబడి అంటూ వల
- బైనాన్స్, కుకాయిన్, ట్రస్ట్ వ్యాలెట్లలో ఇన్వెస్ట్‌మెంట్స్
- రూ.52.31 లక్షలు కాజేసిన అంతర్జాతీయ సైబర్ నేరస్తులు
- కేటుగాళ్లకు మ్యూల్ అకౌంట్ల సరఫరా అయ్యేది ఏపీ నుంచే
- క్రిప్టో, మ్యూల్ అకౌంట్స్ ట్రేడర్ మణికంఠ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: టెలిగ్రామ్, వాట్సాప్‌లలో పరిచయం చేసుకుని, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని నమ్మించి మోసం చేస్తున్న అంతర్జాతీయ సైబర్ నేరస్తుల ఆట కట్టించారు సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. చైనా కేంద్రంగా సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు బ్యాంక్ ఖాతాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు కడప జిల్లాకు చెందిన పతి మణికంఠను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

◆ సైబరాబాద్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను గుర్తుతెలియని టెలిగ్రామ్, వాట్సాప్ ద్వారా (+44 యూకేకు చెందిన వాట్సాప్ నంబర్ల ద్వారా) సంప్రదించారు. క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే రోజుకు 20 శాతం రాబడిని అందుకోవచ్చని ఆశ పెట్టారు. బాధితుడు ఉన్నత విద్యావంతుడు, ఐటీ నిపుణుడు కావడంతో అతడిని నమ్మించేందుకు విలీనాలు, అక్విజిషన్స్, రీస్ట్రక్చరింగ్, ఐపీఓ, షేర్ రీసేల్స్, డెట్ ఆఫర్స్ వంటి లావాదేవీలపై సలహాలు ఇచ్చే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ మోర్గాన్ స్టాన్లీ విధానాన్ని అనుకరించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు నెల రోజుల పాటు క్రిప్టో పథకంలో పెట్టుబడులు పెట్టాడు. నిందితులు సూచించిన బైనాన్స్, కుకాయిన్, ట్రస్ట్ వ్యాలెట్ వంటి బహుళ క్రిప్టో ప్లాట్‌ఫామ్‌లలో 55,066 యూఎస్‌డీటీ (క్రిప్టో కరెన్సీ)లు పెట్టుబడులు పెట్టాడు. మన కరెన్సీలో దీని విలువ రూ.52,31,270లకు సమానం. పెట్టుబడులు పెట్టినా లాభాలు రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గతేడాది ఆగస్టులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో నిధుల మళ్లింపు..

బాధితుల నుంచి కొట్టేసిన మొత్తాన్ని మళ్లించేందుకు నేరస్తులు ఆధునాతన సాంకేతికతలను ఉపయోగించారు. దీంతో బ్లాక్ చెయిన్ నెట్‌వర్క్‌లో సంక్లిష్టమైన బహుళ నెట్‌వర్క్‌లతో కూడిన ఈ నేర విధానాన్ని అర్థం చేసుకునేందుకు, ఛేదించేందుకు సైబరాబాద్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సిబ్బంది, క్రిప్టో నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ), కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన క్రిప్టో కరెన్సీ దర్యాప్తు బృందం సహాయంతో నిందితులకు చైనా, హాంకాంగ్, యూకే దేశాలతో సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. కమీషన్ ప్రాతిపదికన నిందితుడు మణికంఠ మ్యూల్ బ్యాంక్ ఖాతాలను కొనుగోలు, సరఫరా చేయడంతో పాటు టెలిగ్రామ్ ద్వారా నిందితుడు చైనా నేరస్తులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నమోదు కోసం ఉద్దేశించబడిన యూడీవైఏఎం నకిలీ వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా సంస్థ ప్రతినిధుల ఆధార్, పాన్ ఇతర వ్యక్తిగత వివరాలను తీసుకుని బ్యాంక్ ఖాతాలను తెరుస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి ఫోన్ నుంచి యూడీవైఏఎం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను సైతం స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మణికంఠ స్నేహితులు హర్యానాకు చెందిన నిందితుల కోసం గాలిస్తున్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: యువతి అదృశ్యమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలుకు చెందిన ఎస్.ప్రభాకర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తూ రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. అతని సోదరుడి కుమార్తె 2 నెలలుగా ఇతని ఇంట్లోనే ఉంటూ కుందన్‌బాగ్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఈనెల 20న ఉదయం విధులకు వెళ్లింది. మధ్యాహ్నం ప్రభాకర్ భార్యకు ఫోన్ చేసి అమెజాన్ నుంచి పార్శిల్ వస్తుందని తీసుకోవాలని చెప్పింది. తర్వాత రాత్రివరకు కూడా ఇంటికి రాలేదు. ఆమె కోసం కాల్స్ చేసినా రిప్లై ఇవ్వలేదు. దీంతో ప్రభాకర్ శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో మతిస్థిమితం లేని యువకుడు

వెంగళరావునగర్ : మతిస్థిమితం సరిగా లేని దాదాపు 28 ఏళ్ల యువకుడిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు శుక్రవారం పెట్రోలింగ్ చేస్తుండగా రోడ్డుపై యువకుడు తిరుగుతూ కనిపించాడు. అతని వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీయగా మాట్లాడలేక పోయాడు. అంతేగాకుండా బిగ్గరగా అరుస్తూ కేకలు పెట్టాడు. దీంతో పోలీసులు అదుపులోకి తీసుకుని మధురానగర్ పీఎస్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వాహనాలు ఢీ

వెంగళరావునగర్: రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌లో నివసించే మహ్మద్‌గౌస్ ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. ఆలీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి శుక్రవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అంబేడ్కర్‌నగర్ మలుపులో వేగంగా వచ్చిన ఓ టీవీఎస్ ఎక్సెల్ ఢీకొట్టగా గౌస్ కిందపడి గాయపడ్డాడు.అంతేగాకుండా వాహనం కూడా స్వల్పంగా దెబ్బతిన్నది. దీంతో క్షతగాత్రుడు గౌస్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని పలువురికి గాయాలు

వెంగళరావునగర్ : కారు ఢీకొని పలువురు గాయపడిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కార్మికనగర్‌లో నివసించే పి.ఆనంద్‌రెడ్డి వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 15న జవహర్‌నగర్‌లోని తన స్నేహితుడితో కలిసి బైక్‌పై మధురానగర్ వెళ్తున్నారు. సిద్ధార్థనగర్‌కాలనీ వరకు వెళ్లగానే వేగంగా వచ్చిన ఓ కారు వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో ఇరువురికి గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స అనంతరం బాధితులు శుక్రవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణా నిర్మూలన

అందరి బాధ్యత



అవగాహన కార్యక్రమంలో ప్రజ్వల, సెర్ప్ సిబ్బంది

బంజారాహిల్స్: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే సమూలంగా నివారించవచ్చని ప్రజ్వల సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరామకృష్ణ అన్నారు. మావన అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం, బాధితురాలిపై పడే ప్రభావం, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, చట్టాలు, సఖీ, భరోసా, చైల్డ్‌లైన్, పోలీస్ టోల్‌ఫ్రీ నంబర్ తదితర అంశాలపై ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో 2 రోజుల పాటు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజ్వల సంస్థ ద్వారా ఇప్పటివరకు 30 వేల మంది అమ్మాయిలు, మహిళలను కాపాడామన్నారు. సైబర్ ట్రాఫికింగ్ ద్వారా అక్రమ రవాణా చాలా పెరిగిపోయిందన్నారు. సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాలో పేద, మధ్య తరగతి అమ్మాయిలు, మహిళలే ఎక్కువగా ఉంటున్నారని పేర్కొన్నారు. సెర్ప్, మహిళా సంఘం సభ్యులు వారి ఆర్థిక సామాజిక స్థితిగతులను గమనించి అవగాహన కల్పించాలన్నారు. సైబర్ ట్రాఫికింగ్ అనేది చాలా వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య అని, పిల్లలకు ఫోన్ ఉపయోగించడం వల్ల వచ్చే నష్టాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ సిబ్బంది అరుంధతి, ప్రజ్వల సిబ్బంది సురేశ్ కుమార్, అంబర్‌సింగ్, మితాలిరాజ్, స్రవంతితో పాటు భద్రాద్రి, హన్మకొండ, జనగాం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల నుంచి డీపీఎం, ఏపీఎం, వీఓఏలు పాల్గొన్నారు.

రేపు తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ మహాసభలు

కాచిగూడ: తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ 5వ మహాసభలను ఈ నెల 23న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నకిరకంటి శ్రీనివాస్ గౌడ్, అడ్వైజర్ చామకూర రాజు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 40,500 మంది గ్యాస్ డెలివరీ వర్కర్స్ ఉన్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో కేపీ గౌడ్, బుర్ర చంద్రయ్య, ఎండీ యూనస్, కుమార్, గోర శ్యామ్‌సుందర్ గౌడ్, రమేశ్, తిరుపతి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలి

పంజగుట్ట: బడ్జెట్‌లో విద్యారంగానికి 20 శాతం నిధులు కేటాయించాలని విద్యా పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు, భగత్‌సింగ్ మేనల్లుడు జగ్‌మోహన్ సింగ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెరుగైన విద్య అందరికీ అందాలంటే బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువ ఉండాలని కానీ కేంద్రం నామమాత్రంగా కేటాయింపులు చేసిందన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. గతేడాది రుణమాఫీ చేశామని చెప్పి విద్యారంగానికి కేవలం 7.3 మాత్రమే కేటాయించారని, ఈసారైనా బడ్జెట్‌లో 20 శాతం విద్యకు కేటాయించాలని కోరారు. ప్రొఫెసర్లు కె.చక్రధర్ రావు, కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. అందరికీ సమాన, మెరుగైన విద్యను అందించాలని కోరారు. సమావేశంలో రవిచంద్ర, గంగాధర్, ప్రదీప్, కిష్టప్ప, లింగారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్స్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కాచిగూడ: విద్యుత్ సంస్థల్లోని 20 వేల మంది ఆర్టిజన్స్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ కె.ఈశ్వర్ రావు, కన్వీనర్ ఎం.ఏ.వజీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్రాన్స్‌కో, జెన్‌కో యాజమాన్యాలు చలో విద్యుత్‌సౌధ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టిజన్స్‌ను విధుల నుంచి తొలగిస్తామని ఇచ్చిన ఆర్డర్స్‌ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. సీహెచ్ ఎల్లయ్య, జి.నాగరాజు, జి.అరవింద్ కుమార్, ఎస్.చంద్రారెడ్డి, ఎస్.సదానందం, పి.కోటి గౌడ్, శీలం పాషా, జె.ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను బకాయిదారులకు నోటీసులు

బంజారాహిల్స్: ఆస్తి పన్ను బకాయిదారులకు గత నెలలో డిమాండ్ నోటీసులు పంపించామని సర్కిల్-18 డీసీ ప్రశాంతి తెలిపారు. నోటీసులకు కొందరు స్పందించి ఆస్తి పన్ను చెల్లించారని పేర్కొన్నారు. అలాగే మూడేళ్లకు పైబడి బకాయిలు ఉన్న వారికి వారెంట్లు జారీ చేయగా చాలవరకు వసూలు అయ్యాయని తెలిపారు. బంజారాహిల్స్ రోడ్డునంబర్-13లోని బంజారా హోటల్‌కు కూడా వారెంట్ జారీ చేయగా యాజమాన్యం స్పందించి సగం చెల్లించిందని, మిగితా ఆస్తి పన్నును వారం రోజుల్లో చెల్లిస్తామని అంగీకరించిందని పేర్కొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



ఫిలింనగర్: భగత్‌సింగ్ కాలనీలో స్తంభాలు తక్కువగా ఉండి కనెక్షన్లు ఎక్కువగా ఉండడంతో తరచూ భారం పడి విద్యుత్ అంతరాయం కలుగుతోంది. అలాగే ఈదురుగాలులు, వర్షాలు పడినప్పుడు మంటలు చెలరేగుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు కాలిపోతున్నాయి. దీంతో స్థానికులు పలుమార్లు జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ఫిలింనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈతో మాట్లాడి శుక్రవారం స్తంభాల ఏర్పాటు పనులు ప్రారంభించారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాచిగూడ: ఓబీసీల డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ఏపీ బీసీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వచ్చే నెల 12,13 తేదీల్లో ఢిల్లీలో మేధావుల సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ ఎస్.మారేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాస్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మారేశ్, భూపేశ్ సాగర్, అనంతయ్య, నడిపేన శశి భార్గవి, సి.రాజేందర్, నడిపెన శ్రీనివాస్ రావు, పీతాను ప్రసాద్, రాజశేఖర్, చల్లా వరుణ్, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



ఎంఎస్ మక్తాలో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ, జలమండలి అధికారులు

బంజారాహిల్స్: రంజాన్ మాసంలో మసీదుల వద్ద తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని, ఇందుకోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మీర్జాబేగ్ సూచించారు. జలమండలి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణ తదితరులతో కలిసి సోమాజీగూడ ఎంఎస్‌మక్తాలో శుక్రవారం పర్యటించారు. అన్సారీ మసీదుతో పాటు అబూబాకర్ వద్ద ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతిరోజూ మసీదులకు ఎక్కువసేపు తాగునీటి సరఫరా చేయాలన్నారు. అలాగే మసీదులకు వెళ్లే మార్గాల్లో సీవరేజీ లైన్లు ఓవర్ ఫ్లో కాకుండా డీసిల్టింగ్ చేపట్టాలన్నారు. ఇక్కడ తాగునీటి సమస్య పరిష్కారానికి రైలు పట్టాల కింది నుంచి టన్నెల్ ద్వారా పైప్‌లైన్ వేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని, ఇందుకు ప్రభుత్వంతో తాను మాట్లాడతానని ఎమ్మెల్సీ హామీనిచ్చారు.

నాలాలోని పైప్‌లైన్ల మళ్లింపు

సాక్షి ఎఫెక్ట్..



మళ్లింపు పనులు చేస్తున్న సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎన్బీటీ నగర్ బస్తీలో రంగుమారిన నీళ్లు సరఫరా అవుతున్న వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు స్పందించారు. ఎన్బీటీనగర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఎదుట సమస్యను గుర్తించి శుక్రవారం తవ్వకాలు చేపట్టారు. నాలాను ఆనుకొని ఉన్న తాగునీటి పైపులు డ్యామేజీ కావడం వల్లే సమస్య ఉత్పన్నమైందని జలమండలి తట్టికాన సెక్షన్ మేనేజర్‌రాంబాబు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌ను పశ్చిమ మండల డీసీపీ విజయ్ కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. స్టేషన్ వెనకాల పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలు పెద్ద సంఖ్యలో ఉండడం చూసిన ఆయన వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉంటూ న్యాయం జరిగేలా చూడాలన్నారు. అంతేగాకుండా ఫోన్ ట్యాంపరింగ్ కేసు నిందితులకు బెయిల్ రావడం, తాతను చంపిన మనువడు కేసులో నిందితుడు కీర్తితేజ ఇటీవల పోలీస్ కస్టడీలో ఏం చెప్పాడు..? అనే విషయాలపై ఆరా తీసినట్లు సమాచారం.

విధులకు ఆటంకం: యువకుడిపై కేసు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్-36లోని నీరూస్ జంక్షన్‌లో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ వి.అశోక్ శుక్రవారం వాహన తనిఖీలు చేస్తుండగా టీజీ 29ఏ 3965 నంబర్ గల బైక్‌పై ఓ యువకుడు రాంగ్‌రూట్‌లో వస్తుండగా ఎస్ఐ ఆపాడు. దీంతో యువకుడు ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా విధులకు ఆటంకం కలిగించగా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. దీంతో ఎస్ఐ బైక్‌ను స్వాధీనం చేసుకుని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించి ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులకు 'టైంస్కేల్' వర్తింపజేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం

కాచిగూడ: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులకు 'టైంస్కేల్' ఇవ్వాలని పలువురు వక్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరాం మాట్లాడుతూ.. ఈవిషయమై సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులకు జాబ్ భద్రత కల్పించినప్పుడే విద్యావ్యవస్థ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకృష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేశ్, డాక్టర్ పరశురాం, నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మన్ సూర్య చందర్, అధ్యక్షుడు కట్టా వెంకటేశ్, కన్వీనర్ చిర్యాల శ్రీనివాస్, ఎం.మన్‌మోహన్, కట్కూరి శ్రీకాంత్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్.అరుణ్‌కుమార్, రమేశ్ దాస్, టి.చేతన్ తదితరులు పాల్గొన్నారు.

జలాభిషేకం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్-12లోని విశ్వసాయి మందిరంలో సాయిబాబా మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం బాబాకు కస్తూరి జలంతో అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

పంజగుట్ట: చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నిందితుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేసి 12 గ్రాముల చైన్, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పంజగుట్ట క్రైం ఇన్‌స్పెక్టర్ బి.శ్రవణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుందన్‌బాగ్‌లో విధులు నిర్వహించే జి.వీరలక్ష్మి ఈ నెల 19న విధులు ముగించుకుని సాయంత్రం 5:40 ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నది. గుర్తుతెలియని వ్యక్తి వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 12 గ్రాముల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. దీంతో వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అక్కడి సీసీ ఫుటేజీలు పరిశీలించి నిందితుడు రామ్‌కోట్ ఎక్స్ రోడ్డు, ఆబిడ్స్‌కు చెందిన మాథ్యూరాజ్ (22)గా గుర్తించి అరెస్టు చేశారు. అలాగే బంగారు గొలుసు కొనుగోలు చేసిన సరూర్‌నగర్‌కు చెందిన గోల్డ్ షాపు నిర్వాహకుడు కవడియా అన్రాజ్ ప్రజాపత్‌ను కూడా అదుపులోకి తీసుకుని గోల్డ్ చైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు నిందితుడిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

వరదనీటి పైపులైన్ పనుల పరిశీలన



ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్‌లో వరదనీటి పైప్‌లైన్ పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ విజయారెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ చైతన్యతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓల్డ్ సీఐడీ క్వార్టర్స్ నుంచి పాఠ్యపుస్తక ముద్రణాలయం వరకు పనులు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

షాపులో సామగ్రి అపహరణ

బంజారాహిల్స్: సేల్స్‌మెన్ కళ్లుగప్పి సామగ్రి ఎత్తుకెళ్లిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డునంబర్-45లో మినిమీ కిడ్స్ స్టోర్‌కు ఇద్దరు వచ్చారు. సేల్స్‌మెన్‌ను మాటల్లో పెట్టిన యువకుడు వారి దృష్టిమరల్చగా తోడుగా వచ్చిన యువతి విలువైన సామగ్రిని దొంగిలించి అక్కడి నుంచి జారుకుంది. సాయంత్రం షాపు సిబ్బంది వస్తువులను లెక్కబెడుతుండగా బ్రాస్‌లెట్‌తో పాటు కొంత సామగ్రి కనిపించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా యువతీ యువకుడు వస్తువులు దొంగిలించినట్లుగా గుర్తించారు. దీంతో స్టోర్ మేనేజర్ చక్రపాణి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, శనివారం, 22 ఫిబ్రవరి 2025



ఖేలో..

అమెరికన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్

నగరంలో అమెరికన్ ఫుట్‌బాల్‌కు పెరుగుతున్న ఆదరణ


ప్రత్యేకంగా తెలంగాణ అసోసియేషన్ ఏర్పాటు

రెండేళ్లలో నగర వేదికగా అంతర్జాతీయ టోర్నమెంట్‌కు ప్రణాళికలు

ఇప్పటికే 4 నేషనల్స్ గెలిచాం : ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ కెప్టెన్ మణికంఠ

ఎన్నో విశిష్టతలున్న భాగ్యనగరం అంతర్జాతీయ క్రీడల్లోనూ తన ప్రశస్తిని కొనసాగిస్తుంది. ముఖ్యంగా క్రికెట్, టెన్నిస్ వంటి ప్రజాధరణ ఉన్న క్రీడలతో పాటు బ్యాడ్మింటన్ వంటి క్రీడలతో దేశానికి ఒలింపిక్స్ మెడల్స్ అందించిన ఘనత నగరానికి ఉంది. ఇదే కోవలో మరిన్ని అంతర్జాతీయ క్రీడలు నగరంలో రాణిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికన్ ఫుట్‌బాల్ సైతం ఈ మధ్య తన ప్రశస్తిని పెంచుకుంటుంది. నగరవాసులు అమెరికన్ ఫుట్‌బాల్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు. ఈ ఆదరణ దృష్ట్యా తెలంగాణ అమెరికన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రారంభమై ఈ క్రీడ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుంది.

– సాక్షి, సిటీబ్యూరో



అమెరికన్ ఫుట్‌బాల్ క్రీడను నగరంతో పాటు రాష్ట్రంలో మరింత అభివృద్ధి చేసేందుకు అమెరికన్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అనుబంధ సంస్థ అయిన తెలంగాణ అమెరికన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (టాఫా) కృషి చేస్తుంది. ఇందులో భాగంగా 2025–28 మధ్య కాలానికి అధ్యక్షుడిగా చాగన్ల బల్వీందర్ నాథ్‌ను నియమించింది. తెలంగాణ రాష్ట్రంలో అమెరికన్ ఫుట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్ ప్రోత్సహించి, ఒలింపిక్స్ వేదికలపై మన క్రీడాకారుల నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అమెరికా వంటి దేశాల్లో అత్యంత ప్రజాదరణ పొందిన క్రీడగా ఈ అమెరికన్ ఫుట్‌బాల్ ప్రసిద్ధి చెందింది. సాకర్, రగ్బీ నుంచి వచ్చిన ఈ గేమ్ 2022లో లీగ్ వార్షిక ఆదాయం 18.6 బిలియన్ డాలర్లుగా నమోదు చేసి ప్రపంచంలోనే విలువైనస్పోర్ట్స్ లీగ్‌లో భాగంగా చేరింది.



రాష్ట్ర వ్యాప్త గుర్తింపు దిశగా..

ఈ క్రీడను హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వృద్ధిలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాం. దీని కోసం ప్రత్యేకంగా అన్ని పట్టణాల్లో, జిల్లాల్లో శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసి, వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను కల్పిస్తాం. ఈ ప్రయత్నంలో భాగంగా అసోసియేషన్స్, క్లబ్స్ ఏర్పాటు చేయనున్నాం. మరో రెండేళ్లలో నగరంలోని గచ్చిబౌలి స్టేడియం వేదికగా అంతర్జాతీయ స్థాయి లీగ్‌ను నిర్వహించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఇందులో దాదాపు 22 దేశాలను భాగం చేస్తున్నాం. యూనివర్సిటీలు, కాలేజీలు, స్కూల్స్‌లో ఔత్సాహిక క్రీడాకారులకు, యువతకు ప్రత్యేక శిక్షణ అందించనున్నాం. టాఫా ప్రధాన కార్యదర్శి సుధాకర్ రావు నడిపల్లి, ఏఎఫ్ఎఫ్ఐ సీఈఓ సందీప్ చౌదరి వంటి దార్శనికుల ప్రణాళికలతో ముందుకు సాగుతున్నాం. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందించాలని కోరనున్నాం. – చాగన్ల బల్వీందర్ నాథ్, టాఫా అధ్యక్షులు.



నాలుగు నేషనల్స్‌లో తెలంగాణ..

అమెరికన్ ఫుట్‌బాల్ గేమ్‌లో కాంటాక్ట్, నాన్‌కాంటాక్ట్ అనే ఈ విభాగాల్లో పోటీ ఉంటుంది. నాన్ కాంటాక్ట్ విభాగంలోని ఫ్లాగ్ గేమ్ ఇక్కడ అభివృద్ధిలో ఉంది. రగ్బీలా ఇందులో మ్యాన్ పుల్లింగ్ ఉండదు. నేను 13 ఏళ్ల నుంచి ఈ గేమ్ ఆడుతున్నాను. అంతేకాకుండా ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాను. ఇప్పటి వరకూ తెలంగాణ రాష్ట్రం నాలుగు నేషనల్స్ గెలిచింది. 2028 ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రస్తుతం సన్నద్ధమవుతున్నాం. ఇందులో స్థానిక క్రీడాకారులను భాగం చేసేందుకు టాఫా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి మాదిరిగా ఇక్కడ కూడా ఈ క్రీడకు పాపులారిటీ తీసుకురానున్నాం.

– జీవీ మణికంఠ రెడ్డి, ఇండియన్ ఫ్లాగ్ ఫుట్‌బాల్ కెప్టెన్



డిజైర్ డిజైన్ ఎగ్జిబిషన్

సందడి చేసిన మోడల్స్

మగువల మనసు దోచే శారీస్, ఫ్యాషన్ వేర్, వెడ్డింగ్ వేర్‌తో డిజైర్ డిజైన్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు ప్రదర్శించనున్న ఈ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. నగరంలోని ప్రముఖ మోడల్స్ వివిధ రకాల శారీస్, డ్రెస్సెస్, ఫ్యాషన్ జ్యూవెలరీతో సందడి చేశారు. ఐటీ కారిడార్‌లో ఫ్యాషన్ లవర్స్ కోసం వివిధ రకాల డిజైన్లను అందుబాటులో ఉంచామని చీఫ్ ఆర్గనైజర్ అనిత అగర్వాల్ పేర్కొన్నారు. –గచ్చిబౌలి

నేడు రాచప్రోలు లక్ష్య నృత్యప్రదర్శన

సాక్షి, సిటీబ్యూరో : కూచిపూడి నృత్యకారిణి, ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల శిష్యురాలు, ఆర్.రవికుమార్, ప్రొఫెసర్ దంపతుల కుమార్తె రాచప్రోలు లక్ష్య నేడు రవీంద్ర భారతిలో నృత్య ప్రదర్శన ఇవ్వనున్నారు. ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్ విభాగంలో ఇంజినీరింగ్ విద్యనభ్యసించిన ఆమె ప్రస్తుతం ఐఐటీలో స్పేస్ ఇంజినీరింగ్ చేస్తున్నారు. చిన్ననాటి నుంచి కూచిపూడి పట్ల ఉన్న అభిరుచి మేరకు పదో ఏట నుంచే నృత్యంలో శిక్షణ తీసుకున్నారు. అలేఖ్య స్ఫూర్తితో రుద్రమదేవి, మండోదరి వంటి నృత్యప్రదర్శనల్లో పాల్గొన్నారు. త్రిష్ణ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 6.45 గంటలకు ఇచ్చే ప్రదర్శనకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జే.గీతారెడ్డి, పద్మశ్రీ ప్రతిభ ప్రహ్లాద్, రోడ్లు, భవనాల శాఖ ప్రభుత్వ కార్యదర్శి హరిచందన పాల్గొనున్నారు. అమ్మా ఆనందదాయిని, భామాకలాపం, తక్కువేమి మనకు, బృందావని, థిల్లానా నృత్య రీతులను లక్ష్య ప్రదర్శించనున్నారు.



వైద్యుడి వైవిధ్యం..

పర్వతారోహణలో ప్రావీణ్యం

- సాహస యాత్రలపై ఆసక్తి
- మొట్టమొదటి ఆర్థోపెడిక్ వైద్య పర్వతారోహకుడిగా గుర్తింపు
- నగర వైద్యుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి ఘనత

వృత్తిరీత్యా అతను డాక్టర్.. అయితే పర్వతారోహణ అతని ప్రవృత్తి.. ఇటు వైద్యం అటు సాహస యాత్రలు రెంటినీ సమన్వయం చేసుకుంటూ.. వైవిధ్యమైన ప్రతిభను చూపిస్తున్నారు. ఓ వైపు వైద్యంలో గుర్తింపు తెచ్చుకుంటూనే.. మరోవైపు పర్వతారోహణలోనూ ప్రావీణ్యం కనబరుస్తున్నాడు. సాహస యాత్రల లక్ష్యంగా ప్రపంచంలోని ఏడు పర్వతాలను ఎక్కేందుకు సిద్ధమయ్యాడు. ఇప్పటి వరకూ ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఐదు పర్వతాలను అధిరోహించాడు.

– చందానగర్


వైద్యుడిగా వైద్య సేవలందిస్తూ మరోవైపు ప్రపంచంలోని ఏడు సమ్మిట్స్ (పర్వతాలు) అధిరోహించాలనే తపన డాక్టర్ రాజశేఖర్ రెడ్డిలో మొదలైంది. అప్పటి నుంచి పర్వతాలు అధిరోహించాలంటే ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో శిక్షణ మొదలుపెట్టాడు. అనుకున్నదే తడవుగా భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్లో ట్రైనర్ శేఖర్‌బాబు, రాకేష్‌లను సంప్రదించాడు. తన లక్ష్యాన్ని వారికి వివరించాడు. 2021లో రాక్ క్లైంబింగ్ శిక్షణ ప్రారంభించాడు.

ఏడు పర్వతాలే లక్ష్యంగా..

ప్రపంచంలో మొత్తం ఏడు పర్వతాలు (సమ్మిట్స్) ఉన్నాయి. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, యూరోప్, దక్షిణ అమెరికా, ఆసియా ఖండం నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్టు, అంటార్కిటికా, ఉత్తర అమెరికాలో ఉన్నాయి. 2022 జనవరిలో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని, 2022 ఆగస్టు 15న యూరోప్‌లోని ఎల్‌బ్రస్ పర్వతాన్ని అధిరోహించాడు. స్పోర్ట్స్ ఇన్‌జ్యూరీ కారణంగా ఒక సంవత్సరం గ్యాప్ తీసుకున్నాడు. 2023లో ఆస్ట్రేలియాలోని కొజియోకోవ్ పర్వతాన్ని, 2024 ఫిబ్రవరిలో దక్షిణ అమెరికాలోని అకాన్‌గ్వా పర్వతాన్ని, 2024 మే 23న ఆసియా ఖండం నేపాల్‌లోని మౌంట్ ఎవరెస్టు అధిరోహించాడు. మిగిలిన రెండు పర్వతాలు అంటార్కిటికా, 2025 వేసవి కాలంలో ఉత్తర అమెరికాలోని పర్వతాలను అధిరోహించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

వ్యాయామం.. శాకాహారం..

ప్రతి రోజు 3.30 గంటలకు లేచి ప్రాణాయామం, మూడు గంటల పాటు వాకింగ్, జాగింగ్, రన్నింగ్ రోజుకు 10 నుంచి 15 కిలో మీటర్లు వారానికి ఐదు రోజులు, ఒక గంట పాటు రిఫ్రెష్‌మెంట్ అనంతరం రెండు గంటల కార్డియో జిమ్ చేశాను. పూర్తిగా శాకాహారమైన రాగి జావ, పండ్లు, జ్యూస్‌లు, చపాతి, పప్పు, కూరగాయాలు, ప్రొటీన్ ఫుడ్స్ తీసుకున్నాను. ఇప్పటి వరకూ ఏడు పర్వతాలను అనేక మంది అధిరోహించారు. అయితే డాక్టర్ వృత్తిలో కొనసాగుతూ ఐదు పర్వతాలను ఎక్కిన ఘనత పొందాను.



కుటుంబ సభ్యుల సహకారం..

మియాపూర్ మదీనా గూడ మైత్రినగర్‌లో మా నివాసం. తల్లిదండ్రులు, ఇన్‌ఫెక్షన్ డిజీజ్ స్పెషలిస్ట్ అయిన భార్య హరిప్రియ సహకారం ఎంతో ఉంది. వీరందరి ప్రోత్సాహంతోనే పర్వతాలు అధిరోహించా. నగరంలోని సన్‌షైన్ ఆస్పత్రిలో డాక్టర్ గురువారెడ్డి వద్ద 2014 నుంచి 2018 వరకూ ఆర్థోపెడిక్ సేవలు అందించా. కొంత కాలం నీలిమ ఆస్పత్రిలో, 2021 నుంచి కూకట్‌పల్లిలోని శ్రీ మంజు ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ సేవలందిస్తున్నా.

– డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి

మనసుదోచే ఫ్లై చికెన్

గచ్చిబౌలి రాజీవ్‌గాంధీనగర్‌లో ప్రారంభం



రాయదుర్గం : నగర వాసులకు 'ఫ్లై చికెన్' అందుబాటులోకి వచ్చింది. ఆహార ప్రియుల మనసు దోచే ఫ్రైడ్ చికెన్ అందుబాటులోకి తెచ్చేందుకు 'ఫ్లై చికెన్'ను గచ్చిబౌలిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో శుక్రవారం ప్రారంభించారు. నార్డిక్ ఫ్రైడ్ చికెన్ బ్రాండ్ దీనికి వాడుతున్నామని, ఈ బ్రాండ్‌ను వచ్చే 5–7 ఏళ్లలో దేశవ్యాప్తంగా 250 అవుట్‌లెట్లను ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఫ్లై చికెన్ సంస్థ ఇండియా సీఈఓ కుల్‌ప్రీత్ సాహ్ని తెలిపారు. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో స్థానం ఏర్పరచుకోవడమే ఫ్లై చికెన్ లక్ష్యమన్నారు. ఫ్లై చికెన్ తొలుత స్కాండినేవియాలో ప్రారంభించామని, నాణ్యత, అత్యుత్తమ రుచికరమైన చికెన్ పదార్థాలు అందుబాటులో ఉంటాయన్నారు. తాము నార్వే చికెన్‌ను వాడతామని, అయినా 80 నుంచి 90 శాతం ఉడికిస్తే ఎలాంటి సమస్యలూ రావని, బర్డ్ ఫ్లూ సమస్య తమ వద్ద ఉండదని స్పష్టం చేశారు. ప్రత్యేకమైన మజ్జిగ మిశ్రమంలో మేరినేట్ చేసి, రుచి కోసం బోల్డ్ మసాలా మిక్స్ చేస్తారన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలికలాసు చిత్రప్రదర్శన

రెండు రోజులపాటు కొనసాగింపు

ఆకట్టుకుంటున్న తోలుబొమ్మల చిత్రాలు

విద్యార్థులు వేసిన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కాలికలాసు పేరిట చిత్ర ప్రదర్శనను శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈనెల 23 వరకూ ఈ ప్రదర్శన అందుబాటులో ఉంటుంది. కర్ణాటక విద్యార్థులు వేసిన 50 చిత్రాలను సందర్శించేందుకు ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7.00 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు లెక్చరర్స్‌కి వర్క్‌షాపులను నిర్వహించారు. –మాదాపూర్





ఆహా.. ఏమి రుచి..

బార్బెక్యూ నేషన్ సీడీఓ మన్సూర్‌మెమన్

భారతీయ వంటకాలకు అంతర్జాతీయ సంస్కృతిని మిళితం చేస్తూ వెజ్, నాన్ వెజ్, గ్రిల్ వంటకాలను ఆహార ప్రియులకు అందుబాటులో ఉంచామని బార్బెక్యూ నేషన్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (సీడీఓ) మన్సూర్‌మెమన్ పేర్కొన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఫీనిక్స్ సెంటారస్‌లో బార్బెక్యూ నేషన్ రెస్టారెంట్‌ను శుక్రవారం ప్రారంభించారు. నాన్‌వెజ్ ప్రియులకు హిరియాలి ఫిష్ టిక్కా, పెరి పెరి చికెన్ టిక్కా, చిల్లీ గార్లిక్ ప్రాన్స్, తందూరీ షీక్ కబాబ్, అంగార తంగడి, వెజిటేరియన్లకు తందూరి పన్నీర్ టిక్కా, చిల్లీ గార్లిక్ మష్రూమ్, స్పినాచ్ కార్న్ చీజ్ రోల్, పీనట్ కబాబ్ వంటకాలు నోరూరిస్తాయని తెలిపారు. మెయిన్‌కోర్స్‌లో మటన్ హలీం, మటన్‌బిర్యానీ, పన్నీర్ లబాబ్దార్, కడాయి చోలే, చిల్లీ గార్లిక్ నూడుల్స్ విందు చేయనున్నాయి. గ్రిల్ వంటకాలను డైనింగ్ టేబుల్ వద్దే అందిస్తారని తెలిపారు. 18 సంవత్సరాల్లో 85కు పైగా నగరాల్లో విస్తరించామని పేర్కొన్నారు.

–గచ్చిబౌలి





ప్రాణవాయువు పెట్టె..

నగరంలో మొదటి 'హైపర్‌బేరిక్ ఆక్సిజన్ థెరపీ'

రాస్ మెడికల్ ఫిట్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వినూత్న చికిత్స

స్వచ్ఛమైన ప్రాణవాయువుతో అధునాతన చికిత్స

భవిష్యత్తులో ప్రాణవాయువు (ఆక్సిజన్)కొనుక్కునే పరిస్థితి వస్తుందనేది ఎంత వాస్తవమో తెలియదు కానీ.. నగరంలో మొట్టమొదటి సారిగా స్వచ్ఛమైన ఆక్సిజన్‌తో అందించే హైపర్ బేరిక్ ఆక్సిజన్ థెరపీ (హెచ్‌బీఓటీ) అందుబాటులోకి వచ్చింది. నగరంలోని రాస్ మెడికల్ ఫిట్నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వినూత్నంగా తీసుకొచ్చిన ఈ థెరపీతో 20 మందికి చికిత్స అందించి నగరానికి మరో ప్రత్యేకమైన వైద్య చికిత్సను పరిచయం చేశారు. – సాక్షి, సిటీబ్యూరో

వయసును అధిగమించేందుకు తోడ్పాటు

నాన్ ఇన్వేజివ్ థెరపీలో భాగంగా ఆరోగ్యం కోసం ప్రత్యేకమైన ప్రెజరైజ్డ్ ఛాంబర్‌లో వందశాతం స్వచ్ఛమైన ఆక్సిజన్ అందిస్తుంది. దీనివల్ల శరీరం ఆక్సిజన్ మరింత మెరుగ్గా స్వీకరించి సెల్యులార్ పనివిధానాన్ని వేగవంతం చేస్తుందని రాస్ మెడికల్ ఫిట్నెస్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. యాంటీ ఏజింగ్ ప్రయోజనాలతో పాటు నాడీ, జీవక్రియ ఆరోగ్యానికి మేలు చేస్తూ రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం..

ఈ చికిత్సను ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులు, అథ్లెట్లు, వెల్‌నెస్ ఔత్సాహికులు విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం నగరంలోని జూబ్లీహిల్స్ వేదికగా అందుబాటులోకి తీసుకొచ్చారు. హైపర్‌బేరిక్ ఆక్సిజన్ థెరపీ 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తిగా, ఆరోగ్య పునరుద్ధరణ, యాంటీ–ఏజింగ్ పరిష్కారాలను విప్లవాత్మకంగా మార్చుతోంది. ఈ చికిత్సలో నాడీ సంబంధిత, మెటాబాలిక్ రేటు పెంచుతుంది. తద్వారా ఆరోగ్య జీవనశైలి పునరుద్ధరణ వంటి ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా వయసుతో వచ్చే సమస్యలకు ఇది సరైన పరిష్కారం. మనం పీల్చుకునే గాలిలో 20 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉంటుంది. ఇందులో 15 శాతం బయటకు వదిలేస్తాం. కానీ హెచ్‌బీఓటీ ఛాంబర్‌లో నూరు శాతం ఆక్సిజన్ మాత్రమే ఉంటుంది. ఈ ప్రక్రియతో కొల్లాజెన్ ఉత్పత్తి ప్రేరేపితం అవుతుంది. చర్మం స్థితిస్థాపన మెరుగుపడి శరీరం మీది ముడతలు తగ్గిపోతాయి. ఎముకలు, కండరాలకు వయసుతో పాటు వాటిల్లే నష్టాన్ని తగ్గిస్తుంది. గుండె కండరాలు, ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. డయాబెటిస్ రోగులకు రక్తంలో చక్కెరశాతాన్ని సమన్వయం చేస్తూ.. గాయాలను నయం చేస్తుంది. క్యాన్సర్ చికిత్సలో రేడియేషన్ తర్వాత కణజాల పునరుద్ధరణకు సహాయపడుతుంది.

– సయ్యద్ ఖలీల్, రాస్ మెడికల్ ఫిట్నెస్ సెంటర్ ఫిజికల్ థెరపిస్ట్.

సాక్షి రియల్టీ

శనివారం
22-02-2025





ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగిపోయింది.. మంచిదే..! శబ్ద, వాయు కాలుష్యంతో మానవాళికి ఉపద్రవంగా మారుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలు(ఈవీ) వినియోగించాలని వినియోగదారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం కూడా ఈవీ వాహనాల కొనుగోళ్లు, వినియోగంపై ప్రత్యేక రాయితీలు అందిస్తున్నారు. ఈక్రమంలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా ఈవీ పాలసీని సైతం తీసుకొచ్చింది. అయితే వాహనాల కొనుగోళ్లకు రాయితీలు ఇస్తేనే సరిపోదు.. ఆయా వాహనాల చార్జింగ్ పాయింట్లు, స్టేషన్ల ఏర్పాటుపై కూడా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. – సాక్షి, సిటీబ్యూరో

సెల్లార్ లేదా ఓపెన్ స్పేస్.. ఎక్కడ పెట్టాలన్న అంశంపై డైలమా

ఈవీ మార్గదర్శకాలు ఏవీ

భవన సముదాయాల్లో ఏర్పాటుపై అస్పష్టత

ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్ డెవలపర్లకు వ్యాపారంతో పాటు సామాజిక బాధ్యత కూడా కాస్త ఎక్కువే. ప్రభుత్వం ఈవీ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కోసం పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్న తరుణంలో.. బిల్డర్లు కూడా తమవంతు బాధ్యతగా భవన సముదాయాల్లోనే ఈవీ స్టేషన్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇక్కడే స్పష్టత లోపించింది. భవన సముదాయాల్లో ఎక్కడ ఈవీ స్టేషన్లు, పాయింట్లను ఏర్పాటు చేయాలనే దానిపై స్పష్టత కొరవడింది. బేస్‌మెంట్, సెల్లార్‌లోనా లేదా బయట ఓపెన్ స్పేస్‌లో ఈవీ స్టేషన్ ఏర్పాటు చేయాలా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయలేదు. దీంతో ఈవీ పాలసీ అమలులో ఉన్నా.. స్పష్టత లేకపోవడంతో స్టేషన్ల ఏర్పాటుకు బిల్డర్లు వెనుకంజ వేస్తున్నారు.

బిల్డర్‌ను బాధ్యుడిని చేస్తే ఎలా?

ప్రస్తుతం గృహ కొనుగోలుదారులు వారి అవసరాలు, అభిరుచులకు అనుగుణంగా నివాస సముదాయాల్లో వసతులను కోరుకుంటున్నారు. పర్యావరణ స్పృహ పెరిగిన నేపథ్యంలో కస్టమర్లు వారు ఉండే చోటే ఈవీ చార్జింగ్ స్టేషన్ ఉండాలని అడుగుతున్నారు. అయితే ప్రభుత్వం నుంచి స్పష్టమైన నిబంధనలు లేకపోవడంతో బిల్డర్లు పునరాలోచనలో పడుతున్నారు. ఒకవేళ సెల్లార్‌లో ఈవీ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే దానికి బిల్డర్‌ను బాధ్యులు చేస్తే ఎలా? అని



సంశయంలో పడిపోతున్నారు.

ఈవీపై స్పష్టత అవసరమే..

సాధారణంగా బిల్డర్ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసిన తర్వాత నివాస సముదాయాన్ని అసోసియేషన్‌కు అప్పచెబుతాడు. వారు ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను సరిగా నిర్వహణ చేయపోయినా, ఇతరత్రా కారణాల వల్ల ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎలా? అని పలువురు డెవలపర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో నివాస సముదాయాల్లో ఈవీ స్టేషన్ల ఏర్పాటుపై స్పష్టమైన నిబంధనలు జారీ చేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ఉదాహరణకు గతంలో ప్రాజెక్ట్‌కు అగ్ని ప్రమాద శాఖ నిరభ్యంతర ధృవీకరణ పత్రం(ఎన్‌ఓసీ) వచ్చిందంటే ఇక ఆ ప్రాజెక్ట్ వంక అధికారులు చూసేవారు కాదు. కానీ, ఇప్పుడు ప్రతీ మూడేళ్లకు ఒకసారి రెన్యూవల్ చేసుకోవాలని కొత్త నిబంధనలను జోడించారు. ఇదే ఆహ్వానించదగ్గ పరిణామం. ఎందుకంటే ప్రాజెక్ట్‌ను అసోసియేషన్‌కు అప్పజెప్పిన తర్వాత నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రమాదం జరిగినప్పుడు ఫైర్ సేఫ్టీ ఉపకరణలు పనిచేయవు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తాజా నిబంధనలతో నిర్వహణ సక్రమంగా ఉండటంతో పాటు క్రమంతప్పకుండా మాక్ డ్రిల్స్ చేస్తుంటారు. దీంతో ప్రమాదాలను నియంత్రించే అవకాశం ఉంటుంది.

4.5 శాతం పెరిగిన అద్దెలు


గచ్చిబౌలి, కొండాపూర్‌లో ఇళ్లకు డిమాండ్

ఔటర్, ఆఫీసులకు చేరువలో ఉండటమే కారణం

అద్దెలు పైపైకి!

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం అధిక సంఖ్యలో నగరానికి వలస వస్తుండటంతో నగరంలో ఇంటి అద్దెలు పెరుగుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అద్దెలు పెరిగాయి. దాదాపు అన్ని కార్యాలయాలు వర్క్ ఫ్రమ్ హోమ్ ఎత్తివేయడంతో అంతా నగరానికి చేరుకున్నారు. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉందని మ్యాజిక్‌బ్రిక్స్.కామ్ తెలిపింది. ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తున్నారు. దీంతో సప్లై తగ్గడంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు అద్దెలు కూడా పెరిగాయి.

- ఈ ఏడాది హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్, సప్లై వాటా 50, 39 శాతంగా ఉన్నాయి.
- గచ్చిబౌలి, కొండాపూర్‌లో అత్యధికంగా అద్దెలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్)తో మెరుగైన కనెక్టివిటీ కారణం. 55 శాతం మంది అద్దెదారులు రూ.10 వేలు నుంచి రూ.20 వేలు నెలవారీ అద్దెలకు కోసం వెతుకుతున్నారు. 1000 చదరపు అడుగుల నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది.



LUXURY

లగ్జరీ ఓకే

జనవరిలో 5,444 యూనిట్ల రిజిస్ట్రేషన్

ఇందులో 12 శాతం వాటా వీటిదే

నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో లగ్జరీ గృహాలకు ఆదరణ పెరిగింది. ఖరీదైన, విశాలమైన ఇళ్లకు డిమాండ్ కొనసాగుతూనే ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌లో జనవరిలో రూ.3,293 కోట్ల విలువైన 5,444 యూనిట్లు రిజిస్ట్రేషన్ కాగా.. ఇందులో రూ.కోటి కంటే ఖరీదైన లగ్జరీ ఇళ్ల వాటా 12 శాతంగా ఉంది. యూనిట్ల వారీగా చూస్తే.. గతేడాది జనవరిలో 5,464 యూనిట్లు అమ్ముడుపోగా.. ఈ విభాగంలో 738 ఇళ్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఇక, ఈ ఏడాది తొలి నెలలో ఈ యూనిట్ల సంఖ్య 823కు పెరిగాయి. ఆయా ఫ్లాట్ల విలువ రూ.522 కోట్లు. విలువల్లో లగ్జరీ విభాగం వాటా 17 శాతంగా ఉంది.


- ఇక, విశాలమైన ఇళ్లకూ ఆదరణ ఏమాత్రం తగ్గడం లేదు. జనవరిలో రిజిస్ట్రేషన్ అయిన యూనిట్లలో 14 శాతం వాటా 2,000 చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణమైన ఇళ్లవే.. వెయ్యి చ.అ.లోపు ఉన్న యూనిట్ల వాటా 17 శాతం, 1,000–2,000 చ.అ. మధ్య ఉన్న ఇళ్ల వాటా 69 శాతంగా ఉంది. నగరంలో ప్రాపర్టీ ధరలు ఏడాది కాలంలో 3 శాతం పెరిగాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా నివేదిక వెల్లడించింది.



బ్యూటీ సీలింగ్..

కూల్ ఫీలింగ్

వేసవి కాలం వచ్చేస్తోంది.. బయటే కాదు ఇంట్లో ఉన్నా ఎండ వేడి తగులుతుంది. అసలు ఇంటి పైకప్పు ఉందా లేదా అన్నట్టుగా ఉంటుంది ఇంట్లో వేడి. సాధారణ సీలింగ్ ఉన్న ఇంట్లో అయితే ఈ వేడిమి తీవ్రత మరింత ఎక్కువే. దీనికి పరిష్కారం చూపించి.. మండు వేసవిలో ఇంటిని చల్లగా మార్చేస్తుంది 'ఫాల్స్ సీలింగ్'! ఫాల్స్ సీలింగ్ ప్రధాన ఉద్దేశం.. గదిలో ఆహ్లాద వాతావరణం ఏర్పర్చడమే. అలసిన మనసు, శరీరానికి సాంత్వన చేకూర్చడమే. ఫాల్స్ సీలింగ్‌తో ఇంట్లోని వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదంగా మార్చుకోవటమే కాకుండా సాధారణ ఇంటి పైకప్పును డైమండ్, చతురస్రం, గోళాకారం వంటి విభిన్న ఆకృతుల్లో అందంగా కూడా తీర్చిదిద్దుకోవచ్చు. – సాక్షి, సిటీబ్యూరో



- ఫాల్స్ సీలింగ్ రంగుల ఎంపికలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వారేమంటారంటే..
- గోడ రంగుతో పోల్చుకుంటే సీలింగ్‌కు వేసే వర్ణం తేలికగా ఉండాలి. అప్పుడు పైకప్పు తక్కువ ఎత్తులో ఉందనిపిస్తూ, విశాలంగా ఉన్న భావనను కలిగిస్తుంది. ముదురు షేడ్లను ఎంచుకుంటే పైకప్పు ఎత్తులో ఉందన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది.



- మిగతా గదులతో పోల్చుకుంటే పడక గది సీలింగ్‌నే ఎక్కువసేపు చూస్తాం కాబట్టి వర్ణాల్లో సాదాసీదావి కాకుండా నేటి పోకడలకు అద్దంపట్టేవి ఎంచుకోవాలి. మధ్యస్తం, డార్క్, బ్రౌన్ వర్ణాలు పడకగదికి చక్కగా నప్పుతాయి. ఎందుకంటే ఈ వర్ణాలు ఉత్సాహపరిచే విధంగా, స్వభావానికి అనుకూలంగా ఉంటాయి మరి.
- తాజాదనం ఉట్టిపడుతున్న లుక్ రావాలంటే మోనోక్రోమాటిక్ థీమ్‌ను ఎంచుకోవాలి. రెండు, మూడు వర్ణాలు కలిసినవి ఎంచుకుంటే మాత్రం అది పడకగది గోడలకు వేసిన రంగు కంటే తేలికగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీ సీలింగ్ ప్రశాంత భావనను కలగజేస్తుంది.
- గోడల రంగుకు, సీలింగ్‌కు ఒకే రకమైనవి కాకుండా.. వేర్వేరు వర్ణాల్ని కూడా వేసుకోవచ్చు. దగ్గర దగ్గర రంగులు కాకుండా, చూడగానే తేడా ఇట్టే కన్పించే వర్ణాలను ఎంపిక చేసుకోవటం మేలు. దృశ్య వ్యక్తీకరణ ప్రదేశంగా సీలింగ్‌ను వినియోగించుకోండి. ఆహ్లాదభరితమైన ఆకాశం, లేదంటే గదితో కలిసిపోయేలా ఆకట్టుకునే ఆకారాలు, వర్ణాలతో నాటకీయత కన్పించేలా అలంకరించుకోవచ్చు.

జాగ్రత్తలివే..

- ఫాల్స్ సీలింగ్ ఎంపికలో ధర కంటే నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలి.
- ఫ్లోర్ నుంచి పైకప్పు మధ్య కనీసం 12 అడుగుల ఎత్తు అయినా ఉండాలి.
- ఏమరుపాటుగా ఉంటే ఫాల్స్ సీలింగ్‌తో పాటు ఎయిర్ కండిషన్ మెషిన్ కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది.
- ఉడెన్ ఫాల్స్ సీలింగ్‌లో అయితే ఎలుకలతో పాటు చెదలు, పురుగులు చేరే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.
- దుమ్ము, ధూళి చేరకుండా అప్పుడప్పుడు శుభ్రం చేయాలి.

హై.. హై..

హెచ్‌ఎన్‌ఐ!



- స్థిరాస్తిలో పెట్టుబడులకు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ ఆసక్తి
- అల్ట్రా లగ్జరీ ప్రాపర్టీల కొనుగోళ్లకు మొగ్గు

సాక్షి, సిటీబ్యూరో: దేశీయ స్థిరాస్తి రంగంలో పెట్టుబడులకు హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(హెచ్‌ఎన్ఐ), అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్(యూహెచ్‌ఎన్ఐ)లు ఆసక్తిగా ఉన్నారు. ఫలితంగా లగ్జరీ, అల్ట్రా ప్రీమియం ప్రాపర్టీలకు డిమాండ్ పెరిగింది. 65 శాతం మంది హెచ్‌ఎన్ఐ, యూహెచ్‌ఎన్ఐలు రూ.4–10 కోట్లు ధర ఉన్న లగ్జరీ ప్రాపర్టీ కొనుగోలుకు మొగ్గు చూపుతుండగా.. 13 శాతం మంది రూ.25 కోట్లకు పైన ధర ఉన్న స్థిరాస్తులపై ఆసక్తిగా ఉన్నారని ఇండియా సోత్‌బైస్ ఇంటర్నేషనల్ రియల్టీ(ఐఎస్ఐఆర్) వార్షిక సర్వే వెల్లడించింది.

- కరోనాతో స్థిరాస్తి రంగానికి జరిగిన ప్రధాన మేలు.. సొంతింటి అవసరం తెలిసి రావడమే.. మరీ ముఖ్యంగా గృహ విభాగంలో యువతరం భాగస్వామ్యం పెరగడం. 74 శాతం సంపన్న కొనుగోలుదారులు ద్రవ్యోల్బణాన్ని నిరోధించేందుకు రియల్ ఎస్టేట్ ఒక ప్రధాన ఆస్తిగా పరిగణిస్తారు.
- 61 శాతం మంది హెచ్‌ఎన్ఐ, యూహెచ్‌ఎన్ఐలు 2024–25లో లగ్జరీ ప్రాపర్టీలను కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. 34 శాతం మంది హైరైజ్ అపార్ట్‌మెంట్లు కొనుగోలుకు ఆసక్తిగా ఉండగా.. 30 శాతం మంది ఫామ్‌హౌస్‌లు, హాలిడే హోమ్స్‌లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అలాగే 23 శాతం మంది వాణిజ్య సముదాయాలలో పెట్టుబడులకు, 15 శాతం మంది స్థలాలపై ఆసక్తిగా ఉన్నారు.
- గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 34 శాతం మంది హెచ్‌ఎన్ఐ, యూహెచ్‌ఎన్ఐలు విలాసవంతమైన ప్రాపర్టీలను కొనుగోలు చేశారు. ఇప్పటికీ చాలామంది కొనుగోలుదారులు లగ్జరీ గృహాల కోసం శోధిస్తున్నారు. వచ్చే రెండు మూడేళ్ల దేశీయ రియల్టీ రంగం సరికొత్త రికార్డులను చేరుకుంటుందని విశ్వసిస్తున్నారు. 16 నెలలుగా లగ్జరీ గృహాల ధరలు పెరిగాయి. 2015 గరిష్ఠ ధరలతో పోలిస్తే స్వల్ప పెరుగుదలేనని తెలిపారు.
- విశాలవంతమైన గృహాలు, గ్రీనరీ ఎక్కువగా ఉండే ప్రాపర్టీలకే లగ్జరీ కొనుగోలుదారులు మొగ్గు చూపిస్తున్నారు. సంపన్న భారతీయుల ప్రాపర్టీ ఎంపికలో తొలి ప్రాధాన్యత మెరుగైన ఫిజికల్, సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సదుపాయాలకే..

ఈ నగరాలే హాట్‌స్పాట్స్..

సంపన్న కొనుగోలుదారులు ప్రాపర్టీ కొనుగోళ్లకు ప్రధాన కారణం మెరుగైన జీవన శైలి. మూలధన వృద్ధి, భవిష్యత్తు తరాలకు ఆస్తి వంటివి ఆ తర్వాతి అంశాలు. ఢిల్లీ–ఎన్‌సీఆర్, ముంబై, గోవా, బెంగళూరు నగరాలలో గృహాల కొనుగోళ్లకు హెచ్‌ఎన్ఐ, యూహెచ్‌ఎన్ఐలు ఆసక్తిగా ఉన్నారు. 11 శాతం మంది సంపన్నులు విదేశాలలో ప్రాపర్టీలకు మొగ్గు చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా భయాలు తగ్గుముఖం పట్టడంతో విలాసవంతమైన భారతీయులు న్యూయార్క్, మయామి, లండన్, దుబాయ్, లిస్బన్ దేశాలలో లగ్జరీ అపార్ట్‌మెంట్ల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.



క్లుప్తంగా...

పేదలకు కేటాయించిన స్థలాలను వెంటనే ఇవ్వండి

సీపీఎం నేతల డిమాండ్..
ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలను వెంటనే వారికి స్వాధీనం చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. సీపీఎం పోరాట ఫలితంగా 2007లో అప్పటి ప్రభుత్వం 60 గజాల చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయాంలో ఇందుకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందజేశారని తెలిపారు. ఆతర్వాత ఈ స్థలాన్ని రామోజీ ఫిలింసిటీ యాజమాన్యం ఆక్రమించిందని చెప్పారు. సీపీఎం పోరాటాలతో దిగివచ్చిన ఫిలింసిటీ నిర్వాహకులు అన్నివిధాలా అభివృద్ధి చేసిన వెంచర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని 2023, మార్చిలో కలెక్టర్‌కు లిఖిత పూర్వక హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంతవరకూ అది అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు సామెల్, జంగయ్య, జగన్, మండల కార్యదర్శి బుగ్గరాములు, వెంకటేశ్, నర్సింహ, కరుణాకర్‌రెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

మాదిగలకు రెండు మంత్రి పదవులివ్వాలి

కేబినెట్ విస్తరణలో న్యాయం చేయాలి: మంద కృష్ణ మాదిగ



కాచిగూడ: త్వరలో జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కడియం శ్రీహరి, ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో దామోదర రాజనర్సింహ మాదిగలకు ద్రోహం చేశారని ఆరోపించారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సాంస్కృతిక ఉద్యమం తాత్కాలికంగా వాయిదా పడిందే తప్ప రద్దు చేయలేదని తెలిపారు. ఈ నెల 24వ తేదీన హైదరాబాద్‌లో జరిగే ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల కార్యక్రమ తేదీని త్వరలోనే ప్రకటిస్తామని, ప్రతి ఇంటికో డప్పు కొనుగోలు చేసి పెట్టుకోవాలని మాదిగలకు సూచించారు. షమీ అక్తర్ కమిషన్ గడువు పొడిగించారని, దీనిని ఉపకులాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వెంకటేశ్ నేతకాని, విఠల్, సయ్యద్ ఇస్మాయిల్, నరేశ్ మాదిగ, ఉల్లా శ్రీనివాస్‌రావు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రామరాజ్యం పేరుతో వసూళ్లు

- వీర రాఘవరెడ్డిపై కోర్టులో పోలీసుల నివేదిక
- సైన్యం విస్తరణకు నిధులివ్వాలని రంగరాజన్‌పై ఒత్తిడి

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి కేసులో ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డి రామరాజ్యం పేరుతో వసూళ్లు చేపట్టినట్లు పోలీసులు కోర్టుకు నివేదించారు. రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను కస్టడీకి తీసుకున్న పోలీసులు.. మూడు రోజులపాటు విచారించారు. కస్టడీ ముగియడంతో శుక్రవారం ఉదయం రాజేంద్రనగర్ మున్సిఫ్ కోర్టులో హాజరుపర్చి, విచారణ నివేదికను సమర్పించారు. 2022లో రామరాజ్యం పేరుతో సంస్థను ఏర్పాటు చేసిన వీర రాఘవరెడ్డి.. అప్పటి నుంచి పలు ప్రాంతాల్లోని దేవాలయాలకు వెళ్లి అర్చకులతో మాట్లాడాడు. రామరాజ్యం విస్తరణకు సహకరించాలని కోరుతూ ఆరు ఆలయాల నుంచి డబ్బులు వసూలు చేశారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం రామరాజ్యం సైన్యంలో చేరితే నెలకు రూ.20 వేల వేతనం ఇస్తామని సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో గత నెలలో 25 మంది సైన్యంలో చేరారు. వీరికి నాలుగు రోజులపాటు శిక్షణ ఇచ్చి.. యూనిఫాంలు కుట్టించాడు. ఈ నెల 7న ఆ సైన్యంతో వీర రాఘవరెడ్డి చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లి అర్చకుడు రంగరాజన్‌ను నిధులు సమకూర్చాలని డిమాండ్ చేశాడు. అందుకు ఆయన నిరాకరించడంతో దాడి చేశాడు. కాగా, వీర రాఘవరెడ్డికి డబ్బులు ఇచ్చినవారు నగదు రూపంగా ఇచ్చారా? బ్యాంకు ఖాతాల్లో జమ చేశారా? అనే విషయాలపై పోలీసులు దృష్టి సారించారు. ఎవరెవరి ఖాతాల నుంచి డబ్బులు వచ్చాయి, అతనితో ఫోన్‌లో ఎవరెవరు మాట్లాడారనే వివరాలను సేకరించి నివేదికలో పొందు పర్చినట్లు తెలిసింది. వీర రాఘవరెడ్డిని కోర్టులో హాజరుపర్చిన అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు.

811 టీఎంసీల్లో 71% కేటాయించాలి



బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ వాదన

- ఒక బేసిన్ నీటిని ఇతర బేసిన్లకు మళ్లించ కూడదని కావేరి ట్రిబ్యునల్ చెప్పింది
- తాగునీటి అవసరాలకు మాత్రమే నీటిని మళ్లించవచ్చునని సుప్రీంకోర్టు పేర్కొంది
- అయినా ఏపీ 323 టీఎంసీల కృష్ణా జలాలను ఇతర బేసిన్‌లకు మళ్లిస్తోంది
- తదుపరి విచారణ మార్చి 24–26 తేదీలకు వాయిదా వేసిన ట్రిబ్యునల్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది పరీవాహక ప్రాంతం ప్రామాణికంగా కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి ఉన్న 811 టీఎంసీల వాటాలో 71 శాతం నీటిని తమ రాష్ట్రానికి కేటాయించాలని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. పరీవాహక ప్రాంతంలో లభ్యతగా ఉన్న నీటిని పరీవాహక ప్రాంత అవసరాలు తీర్చడానికి మాత్రమే వినియోగించుకోవాలని.. ఇతర నదుల పరీవాహక ప్రాంతాలకు మళ్లించకూడదని కావేరి ట్రిబ్యునల్ (సీడబ్ల్యూడీటీ) చెప్పిందని ఎత్తిచూపింది. తాగునీటి అవసరాలకు మాత్రమే ఒక నది పరీవాహక ప్రాంతం నుంచి మరో నది పరీవాహక ప్రాంతానికి నీటిని మళ్లించవచ్చునని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని వివరించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ అంశంపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలోని కృష్ణా ట్రిబ్యునల్–2 ఎదుట మూడోరోజు శుక్రవారం తెలంగాణ తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ వాదనలు కొనసాగించారు.

ఇతర బేసిన్లకు మళ్లించనివ్వొద్దు

'ఏపీ 323 టీఎంసీల కృష్ణా జలాలను పెన్నా, గుండ్లమ్మ పరీవాహక ప్రాంతాలకు మళ్లిస్తోంది. తాజాగా పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా, పెన్నా పరీవాహక ప్రాంతాలకు తరలించడానికి ప్రణాళిక రచించింది. ఇతర నదుల పరీవాహక ప్రాంతాలకు కృష్ణా జలాలను మళ్లించడానికి అదనపు కేటాయింపుల కోసం ఏపీ ప్రభుత్వం వాదిస్తోంది. కృష్ణా పరీవాహకంలో అధికంగా నీటిని వినియోగించే వరి, చెరకు పంటలకు కాదు.. ఆరుతడి పంటలకు నీటిని కేటాయించాలని వాదించింది. ఏపీ ప్రస్తుత అవసరాల కోసం నీటిని కోరుతోంది. చారిత్రకంగా అన్యాయానికి గురవుతున్న తెలంగాణ కొత్త ప్రాంతాలకు నీటిని కోరుతోంది. నీటి కేటాయింపుల్లో అసమతుల్యతలను తగ్గించాలి. బేసిన్‌ను ప్రామాణికంగా తీసుకుని 71 శాతం నీటిని కేటాయించాలి. పరీవాహక ప్రాంతం ఆవల దుర్భిక్ష ప్రాంతాలకు కావేరి నీటిని బదిలీ చేయాలని తమిళనాడు చేసిన వాదనను కావేరి ట్రిబ్యునల్ పరిగణనలోకి తీసుకోలేదు. అలాగే కృష్ణా జలాలను పరీవాహక ప్రాంతం ఆవలకు తరలించడానికి ఏపీకి అనుమతి ఇవ్వకూడదు..'అని వైద్యనాథన్ వాదించారు.

తెలంగాణలో ఆరుతడి పంటలకైనా నీళ్లివ్వాలి

'ఏపీలో పెన్నా పరీవాహకంలో 75 శాతం లభ్యత ఆధారంగా 98 టీఎంసీలు, సగటు లభ్యత ఆధారంగా 195 టీఎంసీలు అందుబాటులో ఉండగా, 228 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లను నిర్మించుకుంది. పెన్నా పరీవాహకంతో పాటు ఇతర నదుల పరీవాహకాల్లో 360 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్లను నిర్మించుకుంది. ఏపీ 512 టీఎంసీల కృష్ణా జలాల్లో 323 టీఎంసీలను పరీవాహక ప్రాంతం ఆవలకు తరలిస్తోంది. పెన్నా, గుండ్లకమ్మ పరీవాహకాల్లో లభ్యత కంటే అధికంగా నీటిని ఆ బేసిన్‌లకు కృష్ణా బేసిన్ నుంచి ఏపీ మళ్లిస్తోంది. పోలవరం నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు 200 టీఎంసీలను తరలించడానికి, బొల్లాపల్లి వద్ద 150 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించడానికి ప్రణాళిక రూపొందించింది. దీన్నిబట్టి చూస్తే ఏపీకి అదనపు వనరులు ఉన్నాయన్నది స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ బేసిన్‌లోని రైతులకు ఆరుతడి పంటలకైనా నీటిని కేటాయించాలి..'అని వైద్యనాథన్ వాదించారు. అనంతరం ట్రిబ్యునల్ విచారణను మార్చి 24–26 తేదీలకు వాయిదా వేసింది.

ఇక చుక్క నీటిని కూడా తరలించనివ్వొద్దు

- కృష్ణా బోర్డుకు తెలంగాణ విజ్ఞప్తి
- ఇప్పటికే ఏపీ వాటాకు మించి కృష్ణా జలాలను వాడుకుంది
- ఏపీని నిలువరించకపోతే మా పంటలు ఎండిపోతాయి
- జూలై 31 నాటికి మొత్తం 116 టీఎంసీలు విడుదల చేయండి

సాక్షి, హైదరాబాద్: ఏపీ ఇప్పటికే కోటాకు మించి కృష్ణా జలాలను తరలించిన నేపథ్యంలో తదుపరి ఒక చుక్క నీటిని కూడా తరలించుకోకుండా ఆ రాష్ట్రాన్ని నిలువరించాలని కృష్ణా బోర్డును తెలంగాణ డిమాండ్ చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లోని ఏ విభాగం నుంచి నీళ్లు తరలించకుండా శుక్రవారం నుంచే అడ్డుకోవాలని కోరింది. తెలంగాణ నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, నల్లగొండ సీఈ అజయ్‌కుమార్, గోదావరి బేసిన్ డిప్యూటీ డైరెక్టర్ సుబ్రమణ్యం ప్రసాద్ శుక్రవారం జలసౌధలో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) చైర్మన్ అతుల్ జైన్, సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పూరేతో సమావేశమై ఈ మేరకు విజ్ఞప్తి చేశారు.

మొత్తం 107 టీఎంసీలు కోరుతూ లేఖ

వచ్చే మే 31 నాటికి కల్వకుర్తి, నాగార్జునసాగర్ ఎడమకాల్వ, ఏఎమ్మార్పీ ప్రాజెక్టుల కింద ఉండనున్న ఆయకట్టు అవసరాలకు 90 టీఎంసీలు, తాగునీటి అవసరాలకు 17 టీఎంసీలు కలుపుకుని మొత్తం 107 టీఎంసీలను కేటాయించాలని ఈ సందర్భంగా తెలంగాణ విజ్ఞప్తి చేసింది. అలాగే జూన్ 1 నుంచి జూలై 31 వరకు ఉండనున్న తాగునీటి అవసరాలకు మరో 9 టీఎంసీలను కేటాయించాలని కూడా కోరింది. ఈ మేరకు రాహుల్ బొజ్జా బోర్డుకు లేఖను అందజేశారు. సోమవారం వరకు సమావేశం వాయిదా వేయాలని ఏపీ కోరిన నేపథ్యంలో అప్పటిలోగా సాగర్, శ్రీశైలం నుంచి నీళ్లు తరలించుకోకుండా ఆ రాష్ట్రాన్ని నిలువరించాలని కోరారు. ఇప్పటికే వాటాకు మించి నీళ్లను ఏపీ తరలించుకుందని, సోమవారం నాటికి మరో నాలుగైదు టీఎంసీలను తరలించుకునే అవకాశం ఉందని తెలిపారు. సాగర్ కుడికాల్వ ద్వారా రోజూ 9 వేల క్యూసెక్కులను తరలించుకుంటున్నారని వివరించారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో 1,010 టీఎంసీల కృష్ణా జలాల లభ్యత ఉండగా, ఇప్పటికే ఏపీ 640 టీఎంసీలను తరలించుకుందని ఫిర్యాదు చేశారు. రబీ సీజన్‌లో తెలంగాణలో సాగర్ ఎడమ కాల్వ కింద 6.38 లక్షల ఎకరాలు, కల్వకుర్తి లిఫ్టు కింద 2.8 లక్షల ఎకరాలు, ఏఎమ్మార్పీ కింద 2.39 లక్షల ఎకరాలు సాగు అవుతున్నాయని, ఏపీని నిలువరించకపోతే ఈ పంటలు ఎండిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జంటనగరాలు, మహబూబ్‌నగర్, వికారాబాద్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం, సాగర్‌లో నిల్వలను పరిరక్షించాలని కోరారు.

సమావేశం వాయిదా వేసినా భేటీ

శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లోని మిగులు నిల్వల వినియోగంపై చర్చించడానికి మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్‌లోని జలసౌధలో తలపెట్టిన అత్యవసర సమావేశాన్ని ఏపీ విజ్ఞప్తి మేరకు సోమవారానికి కృష్ణా బోర్డు వాయిదా వేసింది. అయితే సమావేశానికి తాము హాజరవుతామని చెప్పిన తెలంగాణ అధికారులు.. బోర్డు చైర్మన్, సభ్య కార్యదర్శితో భేటీ కావడం గమనార్హం.

అద్దెలు, డైట్‌చార్జీల పెండింగ్ వద్దు

- రూ.3 వేల కోట్ల బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయండి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించిన అద్దెలు, డైట్‌చార్జీలను పెండింగ్‌లో పెట్టొద్దని.. క్రమం తప్పకుండా వాటిని చెల్లించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. అందుకు సంబంధించి ఆర్థిక శాఖ నుంచి ఎప్పటికప్పుడు బిల్లులు మంజూరు చేయించుకోవాలని సూచించారు. సంక్షేమమే తమ ప్రజాప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి విక్రమార్క పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 3 వేల కోట్ల బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల్లోగా స్వయం ఉపాధి పథకాలు అందించేలా ప్రణాళికలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

కేంద్ర నిధులు పొందడంలో వేగం పెంచాలి

మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు హాస్టళ్లు, గురుకులాల్లో నిరంతరం పర్యటించేలా షెడ్యూల్‌ను వారికి సంక్షేమ శాఖ అధికారులు గుర్తుచేయాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. సబ్‌ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావాల్సిన నిధులపై ఎప్పటికప్పుడు కసరత్తు చేయాలన్నారు. కేంద్ర పథకాలకు సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు పొందడంలో వేగం పెంచాలన్నారు.

గిరిజన భూముల అభివృద్ధికి చర్యలు

ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూపంపిణీ జరిగిందని డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ, ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. అలాగే అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రచించి రాబోయే రెండేళ్లలో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆయా వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో ఏ సూచన చేసినా అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత, ఇరిగేషన్ సెక్రటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు జీవిత బీమా

హెచ్‌యూజే డైరీ ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి



హెచ్‌యూజే డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో హెచ్‌యూజే నేతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఆరోగ్య బీమాతో పాటు జీవిత బీమా సదుపాయాన్ని కల్పిస్తామని, ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం సచివాలయంలో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే–టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో రూపొందిన డైరీ–2025ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అరుణ్ కుమార్, జగదీశ్ రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను భట్టి దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన భట్టి మాట్లాడుతూ ఆరోగ్య, జీవిత బీమాలతో పాటు హెల్త్‌కార్డులపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీఇచ్చారు. అనారోగ్యానికి గురై ఇంటికి పరిమితమయ్యే జర్నలిస్టు కుటుంబాల కోసం ఆర్థిక సహకారం అందించే విషయాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, కోశాధికారి బట్టిపాటి రాజశేఖర్, నాయకులు రామకృష్ణ, చిట్యాల మధుకర్, క్రాంతి, ప్రశాంత్, కొడవటి నవీన్, యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు చేసి బోర్లు వేయొద్దు

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటిపోతున్న తరుణంలో.. కమిషన్ తరఫున చేతులెత్తి కోరుతున్నా.. రైతులెవరూ అప్పులు చేసి బోర్లు వేయొద్దని వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. నీళ్లు ఉంటేనే పంట సాగుచేయాలని, అప్పులతో బోర్లు వేయొద్దని కోరారు. రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు రైతులను మానసిక ఒత్తిడికి గురిచేసేలా ప్రకటనలు చేయొద్దని హితవు పలికారు. రైతు బిడ్డగా రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి చేయాల్సినవన్నీ చేస్తున్నారని చెప్పారు. ఎండాకాలం సాహసం చేసి పంటలు వేసి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు.

యాదగిరి క్షేత్రంలో విశేష హోమం



నిత్య పూర్ణాహుతి నిర్వహిస్తున్న రుత్వికులు. పాల్గొన్న రామానుజ జీయర్ స్వామి, ప్రధానార్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం యాగశాలలో విమాన దిగ్దేవతా విశేష హోమం జరిపించారు. అనంతరం పంచ వింశతి కలశ స్నపనము నిర్వహించారు. పంచ వింశతి (25) కలశాల్లో సుగంధ ద్రవ్యాలు, శుద్ధ జలం, పాలు, పెరుగు, సర్వ ఔషధి జలములతో కలశాలు నింపి అభిషేకం చేసేందుకు పూజలు జరిపించారు. అనంతరం శ్రీవానమామలై మఠం 31వ మధురకవి రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో రుత్వికులు నిత్య పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రికి శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం జరిపించి, ధాన్యాధివాసం పూజను శాస్త్రోక్తంగా చేపట్టారు. మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయాలి

- ఎరువుల లభ్యతపై సమీక్షలో వ్యవసాయ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతమున్న 1.38 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను అన్ని జిల్లాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చేయాలని వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎరువుల లభ్యతపై శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రంలో యూరియా వినియోగం అధికంగా ఉందని, 2022–23లో అత్యధిక వినియోగం జరిగిన అంశాన్ని దృష్టిలో పెట్టుకుని అంతకంటే ఎక్కువ యూరియా నిల్వల కోసం ప్రయత్నిస్తున్నట్లు వ్యవసాయాధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 8.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉన్నట్లు కేంద్రానికి ప్రణాళిక ఇవ్వగా.. కేంద్రం సరఫరా చేసింది మాత్రం 6.73 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమేనని వ్యవసాయశాఖ సంచాలకుడు గోపి మంత్రికి వివరించారు. రాష్ట్రంలో అత్యధికంగా యూరియా వినియోగం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు జరిగిందన్నారు. ఈ నెలలో వాస్తవంగా రావాల్సిన యూరియా కంటే దాదాపు 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా రాష్ట్రానికి సరఫరా చేశారని తెలిపారు. ఈ అంశంపై కేంద్ర ఎరువులు, రసాయన మంత్రిత్వ శాఖకు లేఖ రాయగా.. రాష్ట్రంలో ఎలాంటి కొరత తలెత్తకుండా అవసరానికి తగ్గట్టు సరఫరా చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎరువుల సరఫరా కోసం కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని మంత్రి తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి అవసరం మేరకే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు.

నీటి ఎద్దడిపై సర్కారుకు సోయిలేదు

- సాగర్ ఎడమకాలువపై మంత్రి ఉత్తమ్ సమీక్షలేవీ?
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ జలాలను ఏపీ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్ర వీడటం లేదని బీఆర్‌ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. రేవంత్ సర్కారుకు ముందుచూపు లేకపోవడంతో కేసీఆర్ పదేండ్లు చేసిన కృషి వృథా అవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలసి శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ ప్రభుత్వానికి తెలంగాణలో కొట్లాటలు, విమర్శలు, కుల పంచాయతీలు తప్ప ముందుచూపు లేదు. వేసవి కాలంలో సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తుతుందనే సోయి కూడా కనిపించడం లేదు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ మినహా పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తయినా కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతో మోటార్లు ప్రారంభించడం లేదు'అని అన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని, అయితే 14 నెలల కాంగ్రెస్ పాలనలో ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీరు ఇవ్వలేదని విమర్శించారు. సాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి ఏపీకి ఎంత నీరు తరలిస్తున్నారనే అంశంపై రేవంత్ ప్రభుత్వానికి స్పృహలేదని మండిపడ్డారు. 'నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద పంటలు ఎండుతున్నా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కనీసం సమీక్ష నిర్వహించడం లేదు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులు ముందుకు కదలడం లేదు'అని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పాలమూరు– రంగారెడ్డి పథకం డీపీఆర్‌ను ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని అన్నారు.


సారూ.. నా రుణమాఫీ చేయరూ..

గాంధీభవన్ మెట్ల మీద కూర్చొని రైతు యాదగిరి నిరసన

సాక్షి, హైదరాబాద్: ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీలో తాను తీసుకున్న క్రాప్‌లోన్ మాఫీ కాలేదంటూ అంబర్‌పేట గ్రామం, శాలిగౌరారం మండలం, తుంగతుర్తి నియోజకవర్గానికి చెందిన రైతు తోట యాదగిరి గాంధీభవన్ మెట్ల మీద కూర్చొని నిరసన వ్యక్తంచేశారు. క్రాప్ లోన్ ద్వారా తీసుకున్న లోన్ అప్పులతో రూ.3 లక్షల వరకు అయిందన్నారు. మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే మందల సామేలుకు విన్నవిస్తూ చేతిలో లేఖను పట్టుకొని కలెక్టర్ ద్వారా రుణమాఫీ చేయించాలని కోరారు. తనకు ఎలాంటి పింఛన్ లేదని, ప్రభుత్వ సాయమూ లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన వడ్ల బోనస్ కూడా రాలేదని, తన విన్నపాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే పరిష్కరించాలని యాదగిరి కోరారు.

కృష్ణా నీటి తరలింపు అడ్డుకోలేకే రంకెలు

- సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు ఫైర్
- చంద్రబాబుకు పాదసేవ చేస్తూ పాలమూరు ప్రయోజనాలు కాలరాస్తున్నారు
- వాస్తవాలను వక్రీకరిస్తున్నారు.. 'పాలమూరు'కు అడ్డుపడుతూ కేసులు వేయించిందే మీరు
- మీ 14 నెలల పాలనపై చర్చకు సిద్ధం.. ఎప్పుడు, ఎక్కడికి రావాలో చెప్పు



మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాస్తున్న హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: కృష్ణా జలాల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నారాయణపేట జిల్లా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కృష్ణా జలాల తరలింపును అడ్డుకోవడం చేతకాక తమపై రంకెలు వేస్తున్నారని ధ్వజమెత్తారు. వాస్తవాలను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏపీ సీఎం చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి పాదసేవ చేస్తూ పాలమూరు ప్రయోజనాలను కాలరాస్తున్నారని విమర్శించారు. రేవంత్ పాలనే జిల్లాకు శాపమైందని అన్నారు. చంద్రబాబుకు ఊడిగం చేసినా.. మోదీకి భయపడి భాయ్ అన్నా రేవంత్‌రెడ్డి లాంటి ఊసరవెల్లికే సాధ్యమని పేర్కొన్నారు. హరీశ్‌రావు శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రజల బతుకుల్లో నిప్పులు పోస్తున్నారు..

'టీడీపీ, కాంగ్రెస్‌తో అంటకాగి జిల్లాకు ద్రోహం చేసిన చరిత్ర మీది. మీరు వేసిన కేసులు ఎదుర్కొంటూ కూడా ప్రాజెక్టుల పనుల్లో 90 శాతం పూర్తి చేశాం. మిగతా 10 శాతం పూర్తి చేయకుండా మీరు ప్రజల బతుకుల్లో నిప్పులు పోస్తున్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు అడ్డుపడుతూ కేసులు వేయించిందే నువ్వు. ఈ ఎత్తిపోతలు పూర్తయితే నారాయణపేట, కొడంగల్ రైతుల పాదాలు కడిగేవాళ్లం. అలా జరిగితే ప్రజలు ఎప్పటికీ కేసీఆర్‌ను తలుచుకుంటారనే కుళ్లు బుద్ధితోనే ప్రాజెక్టును పండబెట్టారు. 2014కి ముందు కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల కింద 27 ఎకరాలు సాగైతే..వాటిని పూర్తి చేసి సాగును 6.5 లక్షల ఎకరాలకు పెంచింది కేసీఆర్. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పాలమూరు జిల్లాలో మొత్తం 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం. కానీ ఏడాదిన్నరగా ఒక్క ఎకరాకు నీరివ్వని అర్భకుడు మీరు. పనికిమాలిన 14 నెలల పాలనపై చర్చకు నేను సిద్ధం. నీ సవాల్‌ను స్వీకరిస్తున్నా. ఏ రోజు చర్చ చేద్దాం, ఎక్కడ చేద్దామో నువ్వే చెప్పు. నువ్వు చెప్పిన చోటికి, చెప్పిన సమయానికి వస్తా. నీ కొడంగల్ నియోజకవర్గమైనా సరే, చివరకు నీ ఇంట్లో అయినా సరే తప్పకుండా వస్తా..'అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. 'రేవంత్‌రెడ్డి కుసంస్కారి. అందుకే కేసీఆర్‌పై కక్ష పూరిత ఆరోపణలు చేస్తున్నారు. ఆయనకు నోటి విలువ తెలియదు. కేవలం నోట్ల విలువ మాత్రమే తెలుసు. కృష్ణా జలాలను తరలించుకుపోతున్నారనే మేము పదవులను త్యజించాం. దగా చేసిన నీ దవడలే పగలగొట్టాల్సి ఉంటుంది..'అని వ్యాఖ్యానించారు.

యాసంగి అయ్యేవరకు సాగునీరు అందించండి

సిద్దిపేట జోన్: యాసంగి పంటకాలం పూర్తి అయ్యేంతవరకు సాగుకు గోదారి నీటిని అందించాలని హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి లేఖ రాశారు. నాలుగేళ్లుగా పొలాలకు రంగనాయక సాగర్ కాల్వల ద్వారా సాగునీరు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దీనివల్ల పంట దిగుబడి పెరిగిందని, ఏటా రంగనాయక సాగర్ పరిధిలో 50 వేల ఎకరాల పంట సాగవుతోందని వివరించారు. అయితే ఇటీవల మీ ఆదేశాల మేరకు 2.4 టీఎంసీల నీటిని పంపింగ్ చేశారని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.85 టీఎంసీల నీరే అందుబాటులో ఉందని తెలిపారు. యాసంగి పంటకాలం మొత్తం పూర్తి స్థాయిలో నీరు అందాలంటే అదనంగా 2.5 టీఎంసీలు అవసరం కాబట్టి మిడ్‌మానేరు నుంచి రెండు విడతల్లో రంగనాయక సాగర్‌లోకి నీళ్లు పంపింగ్ చేసేలా అధికారులను ఆదేశించాలని హరీశ్ కోరారు.

కేసీఆర్, హరీశ్‌ల వల్లే ప్రాజెక్టులు కుంటినడక

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజం
- నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల విషయంలోనూ రాష్ట్రానికి అన్యాయం
- జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిల ఆరోపణలకు కౌంటర్



సాక్షి, హైదరాబాద్: కృష్ణా పరీవాహకంలోని సాగునీటి ప్రాజెక్టులు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ముందుకు సాగకపోవడానికి నాటి సీఎం కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు కారణం కాదా? అని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల అప్పటి మంత్రులుగా ఇందులో మీ బాధ్యత లేదా? అని జి.జగదీశ్‌రెడ్డి, ఎస్.నిరంజన్ రెడ్డిలను నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో ప్రభుత్వంపై వారు చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని ఉత్తమ్ విమర్శించారు. తెలంగాణ ప్రజలను తాకట్టు పెట్టి రూ.1.81లక్షల కోట్ల అప్పులు తీసుకొచ్చినా, కృష్ణా జలాల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారికి కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు.

103 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయాం..

'బీఆర్‌ఎస్ హయాంలో కృష్ణా పరీవాహకంలో ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేకపోయారు. నిధుల కేటాయింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఏటా 103 టీఎంసీల కృష్ణా జలాలను నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని దక్షిణ తెలంగాణ కోల్పోయింది. ఎస్సెల్బీసీ, డిండి, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే వాటిపై ఆధారపడిన రిజర్వాయర్లలో వరుసగా 9.84, టీఎంసీలు, 25.64 టీఎంసీలు, 67.52 టీఎంసీలు కలిపి మొత్తం 103 టీఎంసీల కృష్ణా జలాలను నిల్వ చేసుకునే అవకాశం ఉండేది.

మూడేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం

కృష్ణా బేసిన్‌లోని ఇతర ప్రాజెక్టులకు సైతం నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసి దక్షిణ తెలంగాణలో కరువు పరిస్థితులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కారణమైంది. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలు అసంపూర్తిగా ఉన్న విషయం తెలియదా?..'అని మంత్రి ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మూడేళ్లలో కృష్ణా పరీవాహకంలోని ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

'సెకీ' ఒప్పందం సక్రమమే

7000 MW Solar Power Procurement from SECI: Several objections regarding 7000 power procurement exist on various grounds and voiced cancellation of approval by APERC, given the media reports regarding the bribes in the SECI power procurement. The Commission consented to the PSA with detailed reasoning subject to the Outcome in the Hon'ble High Court of Andhra Pradesh in the pending PILs. In the Commission's opinion, there shall be an ISTS charges and losses waiver, as per the MoP's Orders, CERC's GNA Regulations and PPA. As the matter is subjudice and DISCOMS proposes to procure it as per the approval given by APERC, the Commission found no reason not to include 4000 MW out of 7000 MW from SECI in the power procurement plan for FY2025-26. Regarding the negotiations on reducing trading margin, the appropriate Commission, the CERC, in this case, has already approved the Tariff with a trading margin of 7 paise in its Orders. Hence, this Commission is not inclined to comment on this. Regulated contracts like subject PSAs can not be cancelled suomoto as requested by the stakeholders.

సెకీ నుంచి విద్యుత్ తీసుకునేందుకు డిస్కమ్‌లకు అనుమతిస్తూ ఏపీఈఆర్సీ ఇచ్చిన ఆదేశాలు

అందులో ఎలాంటి లోపాలు లేవు.. అంతా నిబంధనల మేరకే జరిగింది

కాబట్టి రద్దు చేయడం కుదరదు ▪ అంతర్రాష్ట్ర ప్రసార చార్జీలు వర్తించవు

తేల్చి చెప్పిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి

డిస్కమ్‌ల విద్యుత్ సేకరణ ప్రణాళికకు ఆమోదం

సెకీ నుంచి ఈ ఏడాదే 4 వేల మెగావాట్ల కొనుగోలుకు అనుమతి

ఇన్నాళ్లూ ఒప్పందంపై విషం చిమ్మిన చంద్రబాబు, టీడీపీ కరపత్రం

సాక్షి, అమరావతి: రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దూరదృష్టితో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకీ'తో కారుచౌకగా యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా రూ.1.10 లక్షల కోట్లను ఆదా చేసి సంపద సృష్టించే దిశగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడుగులు వేసిందని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) సాక్షిగా రుజువైంది. గత ప్రభుత్వ హయాంలో సెకీతో జరిగిన ఒప్పందంలో ఎలాంటి లోపాలు లేవని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) క్లీన్ చిట్ ఇచ్చింది. 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలు ఒప్పందం పూర్తిగా నిబంధనల మేరకే జరిగిందంటూ ఆదాయ అవసరాల నివేదిక (అగ్రిగేట్ రెవిన్యూ రిక్వైర్‌మెంట్–ఏఆర్ఆర్)లో ఏపీఈఆర్సీ స్పష్టం చేసింది. విద్యుత్ సేకరణపై తాజాగా విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్స్) చేసిన ప్రతిపాదనల్లో సెకీ విద్యుత్ కూడా ఉంది. 2025–26లో సెకీ నుంచి 4 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను తీసుకోవడానికి అనుమతించాల్సిందిగా ఏపీఈఆర్సీని డిస్కంలు కోరాయి. దీనిపై స్పందించిన కమిషన్ 'సెకీ' విద్యుత్ ఒప్పందంపై తాజాగా పూర్తి స్పష్టత ఇచ్చింది. "సెకీ నుంచి తీసుకునే 7 వేల మెగావాట్లలో ఈ ఏడాది (2025–26)లో 4 వేల మెగావాట్లను విద్యుత్ సేకరణ ప్రణాళిక (పవర్ ప్రొక్యూర్‌మెంట్ ప్లాన్)లో చేర్చకపోవడానికి కమిషన్‌కు ఎటువంటి కారణం కనిపించడం లేదు" అని ఏపీఈఆర్సీ పేర్కొంది. ఇక సెకీ నుంచి విద్యుత్ సేకరణ ప్రణాళికలో ట్రేడింగ్ మార్జిన్ తగ్గించడంపై జరిగిన చర్చలను కూడా మండలి ప్రస్తావించింది. సీఈఆర్సీ రూ.0.7 పైసల ట్రేడింగ్ మార్జిన్‌తో టారిఫ్‌ను ఇప్పటికే ఆమోదించిందని, అందువల్ల దానిపై కమిషన్ దీనిపై ఇప్పుడు వ్యాఖ్యానించదని తెలిపింది. అంటే గత ప్రభుత్వం కుదుర్చుకున్న ధర యూనిట్ రూ.2.49కే సెకీ నుంచి విద్యుత్ తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో సెకీలాంటి పీఎస్ఏ ఒప్పందాలను కొందరు డిమాండ్ చేస్తున్నట్లుగా సూమోటోగా కమిషన్ రద్దు చేయలేదని తేల్చి చెప్పింది. కాబట్టి ఈ ఏడాది ఏప్రిల్, అక్టోబరులో విద్యుత్ సేకరణకు డిస్కంలు కోరిన ప్రణాళికలో సెకీ విద్యుత్‌ను చేర్చడానికి కమిషన్ మొగ్గు చూపుతున్నట్లు ప్రకటించింది. సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న సోలార్ విద్యుత్తు ఒప్పందంలో భారీ అవినీతి జరిగిందని.. అదానీ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారని.. అంతర్జాతీయ స్థాయికి అవినీతిని చేర్చారని.. పేరుకే సెకీ.. ఒప్పందం అదానీతోనే.. ఐఎస్టీఎస్ చార్జీలు కట్టాల్సిందే.. జుగల్ బందీలు.. రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్ల ఆర్థిక భారం.. ఇలా చిలువలు పలువలుగా.. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్నట్లుగా ఎల్లో మీడియా, టీడీపీ కూటమి నేతలు సాగించిన దుష్ప్రచారం పూర్తిగా అవాస్తవమని దీన్నిబట్టి తేలిపోయింది. కేవలం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లడమే ఏకైక లక్ష్యంగా బరితెగించినట్లు వెల్లడైంది.

అంటే తప్పులేదని ఒప్పుకున్నట్లేగా

అంతరాష్ట్ర విద్యుత్ సరఫరా చార్జీలను (ఐఎస్టీఎస్) మినహాయించి యూనిట్ రూ.2.49 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తామంటూ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీ తనకు తానుగా 2021 సెప్టెంబర్ 15 రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శికి లేఖ ద్వారా ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో యూనిట్ రూ.2.49 చొప్పున ఏడు వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను 25 ఏళ్లపాటు సరఫరా చేసేలా సెకీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాన్ని 2021 నవంబర్ 11న ఏపీఈఆర్సీ కూడా ఆమోదించింది. 2003 విద్యుత్ చట్టం ప్రకారం సెకీ ఒప్పందాలకు ఏపీఈఆర్సీ అనుమతినిచ్చింది. నిజానికి సెకీ నుంచి గతేడాది సెప్టెంబర్ నుంచి విద్యుత్ కొనుగోలు మొదలవ్వాల్సి ఉంది. తొలి ఏడాది 2024లో 3వేల మెగావాట్లు, 2025లో మరో 3 వేల మెగావాట్లు, 2026లో 1,000 మెగావాట్లు చొప్పున మొత్తం 7వేల మెగావాట్లను రాష్ట్రం తీసుకుంటుందని ఒప్పందంలో ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం 4వేల మెగావాట్లను ఈ ఏడాదే తీసుకుంటామంటూ ప్రతిపాదించింది. అంటే ఇన్నాళ్లూ తాము చెప్పినవన్నీ శుద్ధ అబద్ధాలని, కల్పిత కథనాలేనని కూటమి ప్రభుత్వం ఒప్పుకున్నట్టైంది!

ఎల్లో కరపత్రం.. ఎంత విషం చిమ్మిందో..



కళ్ల ముందు వాస్తవాలు కనిపిస్తున్నా అడ్డగోలుగా ఈనాడు ప్రచురించిన అసత్య కథనాల్లో కొన్ని ఇవీ...

ఆరోపణ: సెకీతో ఒప్పందాన్ని 7 గంటల్లోనే ఆమోదించారంటూ ఈనాడు వక్రీకరణ

నిజం: సెకీ లేఖ - ఒప్పందానికి మధ్య దాదాపు రెండున్నర నెలల సుదీర్ఘ సమయం. కమిటీ లోతైన అధ్యయనం తరువాతే కేబినెట్ ఆమోదం

ఆరోపణ: ట్రాన్స్‌మిషన్ చార్జీలు పడతాయంటూ ఈనాడు నిస్సిగ్గుగా అబద్ధాలు

నిజం: పాతికేళ్ల పాటు అంతరాష్ట్ర ప్రసార చార్జీలు వర్తించవని లేఖలోనే చెప్పిన 'సెకీ'

ఆరోపణ: సోలార్ విద్యుత్తు ఒప్పందంలో భారీ అవినీతి జరిగింది.. అదానీ రూ.1,750 కోట్లు లంచం ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయికి అవినీతిని చేర్చారు. రాష్ట్ర ప్రజలపై రూ.లక్ష కోట్ల ఆర్థిక భారం పడుతుంది.

నిజం: ఈ ఒప్పందంలో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. ఒప్పందం జరిగింది.. కేంద్ర ప్రభుత్వ సంస్థ.. రాష్ట్ర ప్రభుత్వం.. డిస్కమ్‌ల మధ్య! ఇక లంచాలకు తావెక్కడ?

సంపద సృష్టించిందెవరు?.. గుదిబండ మోపిందెవరు?

సెకీ నుంచి కారుచౌకగా విద్యుత్తు కొనుగోలు ఒప్పందం ద్వారా గత ప్రభుత్వం ఏడాదికి రూ.4,400 కోట్లు ఆదా చేసింది. ఈ లెక్కన 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్లను ఆదా చేయడం ద్వారా సంపద సృష్టించింది. అదే చంద్రబాబు హయాంలో 2014–19 మధ్య సౌర విద్యుత్ యూనిట్ సగటున రూ.5.90 చొప్పున కొనుగోలు ఒప్పందాలు(పీపీఏలు) చేసుకున్నారు. సెకీ నుంచి కొనుగోలు చేసిన దానికంటే యూనిట్ రూ.3.41 అధికంగా కొన్నారు. దీనివల్ల ఏడాదికి రూ.3,500 కోట్లు చొప్పున 25 ఏళ్లలో రూ.87,500 కోట్ల భారం ప్రభుత్వ ఖజానాపై భారం పడింది. మరి 25 ఏళ్లకు రూ.1.10 లక్షల కోట్లను ఖజానాకు ఆదా చేసి సంపద సృష్టించిన వైఎస్ జగన్ గొప్పా..? లేక రూ.87,500 కోట్లు ఖజానాపై భారం వేసి సంపదను ఆవిరి చేసిన చంద్రబాబు గొప్పా?

చేసిన మంచిని దాచలేరు..

గాడి తప్పిన విద్యుత్ రంగాన్ని చక్కదిద్దేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టింది. వ్యవసాయానికి ఉచితంగా, వివిధ వర్గాలకు రాయితీతో విద్యుత్ సరఫరా అందించింది. అందుకుగానూ డిస్కంలకు 2019–24 మధ్య రూ.47,800.92 కోట్లను అందించింది. 2014–19 వరకు టీడీపీ సర్కారు రూ.13,255.76 కోట్లు మాత్రమే సబ్సిడీ చెల్లించింది. రైతులకు ఉచిత విద్యుత్ బకాయిలు రూ.8,845 కోట్లు ఇవ్వకుండా ఎగవేసింది. దానిని కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే చెల్లించింది. 2019–2023 మధ్య వైఎస్ జగన్ ప్రభుత్వం రెండు లక్షలపైగా వ్యవసాయ డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసింది. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో 3.5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయగా వైఎస్ జగన్ ప్రభుత్వం సుమారు 5 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చి సాగుకు చేదోడు వాదోడుగా నిలిచింది. రాష్ట్రంలో 9 గంటలు వ్యవసాయానికి పగటిపూట విద్యుత్ సరఫరా చేసేలా 6,663 ఫీడర్ల సామర్థ్యాన్ని పెంచేందుకు రూ.1,700 కోట్లు వెచ్చించారు. విద్యుత్ రంగానికి, రైతన్నలకు ఇంత మంచి చేసిన వైఎస్ జగన్‌పై బురద చల్లుతూ సెకీ విద్యుత్ ధర ఎక్కువని, ఐఎస్టీఎస్ చార్జీలు కట్టాల్సి వస్తుందని కూటమి నేతలు, కరపత్రికలు దుష్ప్రచారం చేశాయి. చివరికి అవన్నీ తప్పుడు ఆరోపణలని విద్యుత్ నియంత్రణ మండలి తేల్చింది.

ఇప్పుడేమంటారు బాబూ..?

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతో గత ప్రభుత్వం, విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య త్రైపాక్షిక విద్యుత్ కొనుగోలు ఒప్పందం జరిగింది. ఇందులో ఎలాంటి రహస్యం లేదు. మంత్రి మండలితో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆమోదంతో అత్యంత పారదర్శకంగా బహిరంగంగానే జరిగింది. సెకీతో ఒప్పందం వల్ల రాష్ట్రానికి 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ యూనిట్ రూ.2.49కే పాతికేళ్ల పాటు సరఫరా అవుతుంది. దాన్ని రైతుల వ్యవసాయ అవసరాల కోసం అందించాలని వైఎస్ జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఆ ధర అప్పటికి ఎన్టీపీసీ సరఫరా చేస్తున్న సౌర ధర రూ.2.79 కన్నా 30 పైసలు తక్కువ. ఈ ఒప్పందంపై చంద్రబాబు కూటమి ప్రభుత్వం, టీడీపీ అనుబంధ కరపత్రిక ఈనాడు పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేశాయి. అదానీపై అమెరికాలో ఏదో కేసు నమోదైందని, అందులో జగన్ పేరు ఉందని, లంచం తీసుకున్నారని నిరాధార కథనాలను వండి వార్చాయి. ఈనాడు, టీడీపీ అనుబంధ మీడియా రాసిన అసత్య కథనాలను పట్టుకుని చంద్రబాబు ప్రోద్బలంతో కూటమి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఊగిపోయారు. ఏకంగా జగన్‌పైనే కేసు పెట్టినట్లు నిందలేస్తూ ఆరోపణలు గుప్పించారు.

సెకీ ఒప్పందానికి అంతర్ రాష్ట్ర ప్రసార చార్జీల నుంచి మినహాయింపు రాదని, యూనిట్ రూ.2.49 కూడా ఎక్కువేనని, ప్రజలపై పాతికేళ్లలో రూ.లక్ష కోట్ల భారం పడుతుందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించి ఏమార్చేందుకు టీడీపీ కరపత్రికలు యత్నించాయి. అవన్నీ ఇప్పుడు పటాపంచలయ్యాయి. ఇదే చంద్రబాబు గతంలో అత్యధిక ధరలకు ప్రైవేటు వ్యక్తులు, సంస్థల నుంచి విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ) కుదుర్చుకున్నారు. అప్పుడు మార్కెట్‌లో సౌర విద్యుత్ యూనిట్ రూ.2.44కే లభిస్తున్నా ఏకంగా యూనిట్ రూ.6.99 చొప్పున కొన్నారు. మిగులు విద్యుత్ ఉన్నప్పటికీ చంద్రబాబు దానిని వృథా చేసి మరీ ఇంత ఎక్కువ ధరకు పీపీఏలు చేసుకున్నారు. తాజాగా ఏపీఈఆర్సీ ఇచ్చిన స్పష్టత వాటికి చెంపపెట్టులా పరిణమించింది.

First page of power supply arrangement with SECI (GOI undertaking)


BUY[illegible]G ENTITY PSA (Rev. 00) INDIA NON JUDICIAL

Government of National Capital Territory of Delhi

This Power Sale Agreement is made on the 1st day of December of 2021 at Velagapudi, Andhra Pradesh

Between

Solar Energy Corporation of India Limited, a company incorporated under the Companies Act 1956, having its registered office at 6th Floor, Plate-B, NBCC Office Block Tower-2, East Kidwai Nagar, New Delhi-110023(hereinafter referred to as "Buyer" or "SECI" as the case maybe, which expression shall, unless repugnant to the context or meaning thereof, be deemed to include its successors and permitted assigns) as a Party of the first part,

Page 1 of 56

Deputy Secretary to Government
Energy Department, A.P. Secretariat,
Velagapudi, Amaravati

2021 డిసెంబర్ 1న సెకీతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ సరఫరా ఒప్పందం

3.2.1 Buying entity shall not be liable for any payments to be made for any ISTS charges, open access, CTU scheduling charges (if any) and any other charges from injection/delivery point to the receiving substation(s) of Buying Entity.

3.2.3 This agreement is based on the waiver of the inter-state transmission charges for the conveyance of power namely Open Access Charges, CTU charges, scheduling charges

ఐఎస్టీఎస్ చార్జీలు వర్తించవంటూ సెకీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య ఒప్పందంలోనే స్పష్టం చేసిన భాగం

fixed tariff of Rs. 2.42/kWh plus trading margin of Rs. 0.07/ kWh for the entire term of this agreement.

స్థిర చార్జీ రూ.2.42లతోపాటు ట్రేడింగ్ మార్జిన్ రూ.0.07తో కలిపి యూనిట్ రూ.2.49 పడుతుందని సెకీ-ఏపీ ప్రభుత్వం మధ్య ఒప్పందంలో స్పష్టంగా పొందుపరిచిన భాగం

రాష్ట్ర చరిత్రలోనే కారుచౌక

రాష్ట్ర చరిత్రలోనే ఇంత కారుచౌకగా సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం.. అది కూడా అత్యధికంగా 7 వేల మెగావాట్ల కొనుగోలు కోసం ఒప్పందం గతంలో ఎప్పుడూ, ఏ ప్రభుత్వంలోనూ జరగలేదు. ఏ ముఖ్యమంత్రి హయాంలోనూ జరిగిన దాఖలాలు లేవు. డిస్కమ్‌లు కూడా ఇలాంటి ఒప్పందాన్ని ఎన్నడూ కుదుర్చుకోలేదు. అందులోనూ కేంద్రమే స్వయంగా లేఖ రాసి మరీ యూనిట్ రూ.2.49 చొప్పున 25 ఏళ్లపాటు నిరాటంకంగా విద్యుత్తు సరఫరా చేస్తామని ముందుకొస్తే ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా కాదంటుందా? రైతులకు ఉచిత విద్యుత్తుపై వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దూరదృష్టి. సోలార్‌పై మన విధానాలను అభినందిస్తూ స్వయంగా సెకీ నాడు లేఖ రాసింది. సరఫరా చార్జీల భారం లేకుండా అత్యంత చౌకగా కరెంట్ అందిస్తామని సంసిద్ధత తెలిపింది. ఎవరు మాత్రం దీన్ని కాదంటారు? అసలు ఈ ఒప్పందం ఓ రాష్ట్ర ప్రభుత్వం – కేంద్ర ప్రభుత్వానికి మధ్య జరిగింది. అలాంటప్పుడు ఇక లంచాలెలా వస్తాయి? కేంద్రం ఎక్కడైనా రాష్ట్రానికి లంచం ఇస్తుందా? ఒకవేళ తీసుకోవాలనుకుంటే కేంద్రం రాసిన లేఖకు ఎందుకు స్పందిస్తారు? అలాంటి ఉద్దేశం ఉంటే నేరుగా అదానీతోనే ఒప్పందం చేసుకోవాలి కదా? నేరుగా కేంద్రంతో ఒప్పందం చేసుకున్నప్పుడు ఇందులో మూడో వ్యక్తి అనే ప్రస్తావన ఎందుకు ఉంటుంది?

'సెకీ' ఒప్పందంతో లాభాలివీ..

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) యూనిట్ రూ.2.49కే సోలార్ విద్యుత్తు అందచేస్తామంటూ తనకు తానుగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. ఈ ప్రతిపాదనకు ఏపీ అంగీకరించడం వల్ల 25 ఏళ్ల పాటు ఐఎస్టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు లభిస్తుందని 2021 సెప్టెంబర్ 15న రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో సెకీ స్పష్టం చేసింది.
- ఈ చారిత్రక ఒప్పందం వల్ల రాష్ట్ర ఖజానాకు దాదాపు రూ.లక్ష కోట్ల మేర విద్యుత్తు భారం నుంచి ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది.
- ఐఎస్టీఎస్ చార్జీల నుంచి మినహాయింపు అనేది మరే ఇతర ప్రాజెక్ట్‌కి దక్కని చాలా కీలకమైన ప్రయోజనం. ఇతర రాష్ట్రంలో ఉన్న సోలార్ పవర్ ఉత్పాదక కేంద్రం నుంచి విద్యుత్ సరఫరా కోసం మరే ఇతర సంస్థతో ఒప్పందం చేసుకుంటే మన రాష్ట్రం ఐఎస్టీఎస్ ఛార్జీలను చెల్లించాల్సి వచ్చేది. అప్పుడు అది చాలా భారంగా మారుతుంది. ప్రతి నెలా మెగావాట్‌కు సుమారు రూ.4 లక్షలు దానికే ఖర్చవుతుంది.
- రాష్ట్ర డిస్కంలు మునుపెన్నడూ ఇంత తక్కువ ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు.
- ఇది కేంద్ర సంస్థ సెకీతో గత ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందం. ఇందులో మూడో వ్యక్తి ప్రమేయానికి తావే లేదు. అలాంటప్పుడు ఇక లంచాలకు ఆస్కారం ఎక్కడుంటుంది?
- టీడీపీ హయాంలో కుదుర్చుకున్న అధిక ధరల పీపీఏలతో పోలిస్తే సెకీతో సగం కంటే తక్కువ ధరకే ఒప్పందం కుదిరింది.

అభినందించాల్సింది పోయి నిందలేస్తారా?



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఒక చరిత్రాత్మక ఒప్పందం జరిగితే.. యూనిట్ రూ.2.49కే రాష్ట్రానికి విద్యుత్ దొరుకుతుంటే.. పైగా స్పెషల్ ఇన్సెంటివ్‌గా అంతరాష్ట్ర ట్రాన్స్‌మిషన్ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించడం ద్వారా యూనిట్‌కు మరో రూ.1.98 ఆదా అవుతుంటే.. ఇంత మంచి ప్రతిపాదన రాష్ట్రానికి వస్తే ఎవరైనా క్షణం ఆలోచించకుండా ముందుకెళ్తారు. మేం కూడా అదే చేశాం. ఈ ఒప్పందం ద్వారా 25 ఏళ్లలో రూ.1.10 లక్షల కోట్లు ఆదా చేయడం వలన సంపద సృష్టించాం. నిజంగా ఇదొక రోల్ మోడల్ కేసు. ఇంత మంచి చేస్తే నాపై రాళ్లేస్తారా? ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే. ఆత్మనిర్భర్ ప్యాకేజ్ కింద తమిళనాడు, ఒడిశా, చత్తీస్‌ఘడ్‌లకు సెకీ ఎంతకు అమ్మిందో తెలుసా? ఆ మూడు రాష్ట్రాలకు యూనిట్ రూ.2.61 చొప్పన సరఫరా చేశారు. అంటే వాళ్లకంటే రూ.0.12 తక్కువకే విద్యుత్ తీసుకొచ్చిన నన్ను అభినందించి శాలువా కప్పి ప్రశంసించాల్సింది పోయి బురద జల్లుతారా? మంచి చేసిన వాడిపై రాళ్లు వేయడమే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5తో పాటు చంద్రబాబుకు చెందిన ఎల్లో గ్యాంగ్ పనిగా పెట్టుకుంది. వీళ్లు తానా అంటే తందానా అనే ఇతర పార్టీల్లో ఉండే టీడీపీ సభ్యులు మిడిమిడి జ్ఞానంతో చంద్రబాబును మోయాలన్న తాపత్రయంతో... జగన్‌పై బురద చల్లాలి అనే యావతో నోటికొచ్చినట్టు ఆరోపణలు గుప్పించడం ఎంతవరకు సమంజసం?.

– ఎల్లో మీడియా దుష్ప్రచార కథనాలపై గతంలో వైఎస్ జగన్ వ్యాఖ్య

క్లుప్తంగా...

రాష్ట్రపతి నిలయంలో 27, 28 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు

- జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా నిర్వహణ

రసూల్‌పురా: జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27, 28 తేదీల్లో బొల్లా రం రాష్ట్రపతి నిలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజనీ ప్రియా శుక్రవారం మాట్లాడుతూ సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ (సీడీ ఎఫ్‌డీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ), సెంటర్ ఫర్ సెల్యులార్ అం డ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ), సర్వే ఆఫ్ ఇండియా, జన విజ్ఞాన వేదిక, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), ఎన్‌జీఆర్ఐ సంస్థలు తమ పరిశోధన, అభివృ ద్ధి ఆవిష్కరణలు ప్రదర్శించడానికి స్టాల్స్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జనవిజ్ఞాన వేదిక, నేషనల్ బుక్ ట్రస్ట్, డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజ్ఞాన సాంకేతిక వారసత్వంపై పుస్తక ప్రదర్శన నిర్వహించను న్నట్లు వెల్లడించారు. దేశంలోని శాస్త్రజ్ఞుల ఫొటో ప్రదర్శన, ప్రముఖ శాస్త్రవేత్తలు, అక డమిక్స్, ఇన్నోవేటర్స్ ఆధ్వర్యంలో విజ్ఞానం లో పురోగతి, సైన్స్‌లో కెరీర్లు, అంతరిక్ష అన్వే షణ, ఆసక్తికర అంశాలను ఉద్దేశించి వర్క్‌షా పులు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 040–29560518 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

28న గచ్చిబౌలి స్టేడియంలో నేషనల్ సైన్స్‌డే వేడుకలు


- హాజరుకానున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 28న గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించనున్న నేషనల్ సైన్స్ డే–2025 వేడుకలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఆర్‌డీఓ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లోని రక్షణ రంగ కర్మాగారాల్లో ఉత్పత్తి చేస్తున్న పరికరాలు, ట్యాంకులను ఆ రోజు ప్రదర్శనకు ఉంచనున్నారు. దాదాపు 30 వేల మంది విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకి స్తారు. దేశానికి రక్షణ రంగం ఎంత కీలకమన్న విషయాన్ని వారికి వివరించడంతోపాటు, విజ్ఞాన పరంగా రక్షణ రంగ పరిశ్రమలు ఎలా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మార్పులు చేస్తున్నాయన్న వివరాలను విద్యా ర్థులకు వివరించనున్నారు. ఏరో ఇండియా మాదిరిగా హైదరాబాద్ బ్రాండ్‌ను విస్తృతం చేయడానికి ఏటా ఈ కార్యక్రమం చేపట్టాలని రక్షణ శాఖ అధికారులు యోచిస్తున్నారు.

జగన్ భద్రతలోనూ బాబు కుట్ర

జడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న జగన్ భద్రతపై ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం

- నిబంధనల ప్రకారం 139 మందితో భద్రత కల్పించాలి
- ఎన్నికలవగానే ఏకపక్షంగా భద్రత కుదింపు
- సీఎం కాకుండానే చంద్రబాబు మౌఖిక ఆదేశాలు
- 58 మందితో భద్రత కల్పిస్తున్నట్టు ప్రకటన..
- వాస్తవంగా ఇస్తున్నది ఇద్దరు కానిస్టేబుళ్లనే
- జగన్ నివాసం వద్ద అసలు భద్రతా సిబ్బందిని కేటాయించని ప్రభుత్వం



సాక్షి, అమరావతి: జడ్ ప్లస్ భద్రత ఉన్న ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ప్రభుత్వం కల్పిస్తున్న భద్రత కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లే. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా ఇది వాస్తవం. అత్యంత పటిష్టమైన భద్రత కల్పిం చాల్సిన వైఎస్ జగన్‌కు చంద్రబాబు ప్రభుత్వం ఆయనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఉద్దేశ పూర్వకంగా, కుట్రపూరితంగా భద్రత సిబ్బందిని కుదించేసింది. వైఎస్ జగన్‌పై గతంతో రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గుర్తు తెలియని బెది రింపు కాల్స్ వస్తున్నాయి. వీటిని కూడా చంద్రబా బు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్ నివాసం, పార్టీ ఆఫీసు వద్ద కూడా భద్రతను తొలగించడం ప్రభుత్వ కుతంత్రా నికి నిదర్శనం. వైఎస్ జగన్ జిల్లా పర్యటనల్లోనూ కనీస భద్రత కూడా కల్పించడంలేదు. 2024 ఎన్ని కల ఫలితాలు వెలువడిన వెంటనే చంద్రబాబు కుట్రకు తెరతీశారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేయకముందే వైఎస్ జగన్ భద్రత కుదించాలం టూ పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దాంతో పోలీసు ఉన్నతాధికారులు వైఎస్ జగన్‌కు 139 మందితో ఉన్న జడ్ ప్లస్ భద్రతను ఏకపక్షంగా ఉపసంహరించారు. పైకి 58 మందితో భద్రత కలి ్పస్తున్నట్లు చెబుతూ ప్రజలను పక్కదారి పట్టిస్తోం ది. వాస్తవానికి ఏ సమయంలో చూసినా ఆయన భద్రతకు కేవలం ఇద్దరు కానిస్టేబుళ్లనే కేటాయిస్తుం డటం ఆందోళన కలిగిస్తోంది. వైఎస్ జగన్ ఆఫీసు, నివాసం వద్ద భద్రతా సిబ్బందిని పూర్తిగా తొలగిం చింది. ఆయనపై ఎవరైనా దాడికి యత్నిస్తే వెంటనే ఆగంతకులపై ప్రతి దాడి చేసేందుకు ఉద్దేశించిన ఆక్టోపస్ కౌంటర్ అసాల్ట్ టీమ్‌లను కూడా పూర్తిగా ఉపసంహరించింది. అధికార టీడీపీ కూటమి ఎమ్మెల్యేల భద్రతకు నియోగించిన సిబ్బందికంటే వైఎస్ జగన్‌కు తక్కువ మంది సిబ్బందిని కేటా యించడం చంద్రబాబు కుట్రపూరిత విధానాలకు నిదర్శనం.

వైఎస్ జగన్‌పై ఇప్పటికే రెండుసార్లు హత్యాయత్నాలు

వైఎస్ జగన్ భద్రతకు ముప్పు ఉందన్న విషయం ప్రభుత్వానికి, పోలీసు శాఖకు తెలుసు. ఆయనపై గతంలో రెండుసార్లు హత్యాయత్నాలకు తెగబ డ్డారు. ప్రతిపక్ష నేతగా ఉండగా 2018లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే విశాఖపట్నం విమానా శ్రయంలోనే ఆయన మెడపై కత్తితో దాడి చేసి హత్య చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. ఆ దాడి నుంచి ఆయన తృటిలో తప్పించుకున్నారు. భుజంపై తగిలిన తీవ్రమైన గాయానికి శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. ఆయన్ని హత్య చేసే పన్నాగంతోనే ఈ దాడి చేశారని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కూడా స్పష్టంగా చెప్పింది. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉండగానే 2024లో విజయ వాడలో ఎన్నికల ర్యాలీలో ఓ ఆగంతకుడు ఆయన తలపైకి పదునైన గ్రానైట్ రాయి విసిరి హత్య చేసేం దుకు యత్నించాడు. ఈ దాడి నుంచి కూడా ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఈ రెండు హత్యాయత్నాల కేసులు విచారణలో ఉన్నాయి. అయినప్పటికీ టీడీపీ ప్రభుత్వం వైఎస్ జగన్ భద్ర తను పూర్తిగా కుదించడం వెనుక దురుద్దేశాలు ఉన్నాయని పరిశీలకులు అంటున్నారు.

కొనసాగుతున్న బెదిరింపులు

వైఎస్ జగన్ లక్ష్యంగా రాష్ట్రంలో కొన్ని శక్తులు కుట్రలు పన్నుతున్నాయి. తమ ప్రభుత్వం అధి కారంలోకి వస్తే ఆయన అంతు తేలుస్తామని 2024 ఎన్నికల ముందే టీడీపీ కూటమి నేతలు బహిరంగంగా ప్రకటించారు. ఎన్నికల అనం తరం టీడీపీ నేత, ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ చిం తకాయల అయ్యన్నపాత్రుడు వైఎస్ జగన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు విభ్రాంతి కలిగిం చాయి. 'వైఎస్ జగన్ ఎన్నికల్లో ఓడిపోయాడు గానీ చనిపోలేదు. చచ్చేంత వరకూ కొట్టాలి' అని ఆయన వ్యాఖ్యానించడం గమనా ర్హం. ఎన్నికలకు ముందు, ఆ తరువాత కూడా గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వైఎస్ జగన్ నివాసానికి బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తూనే ఉన్నాయి. అంటే ఆయన భద్రతకు తీవ్రమైన ముప్పు పొంచి ఉందన్నది సుస్పష్టం.

జిల్లా పర్యటనల్లో అడుగడుగునా భద్రతా వైఫల్యం

చంద్రబాబు ప్రభుత్వ కుట్రపూరిత వైఖరి వైఎస్ జగన్ జిల్లా పర్యటనల్లో ప్రస్ఫుటంగా బయటపడుతూనే ఉం ది. జగన్ జిల్లా పర్యటనల్లో అడుగడుగునా భద్రతా వై ఫల్యం సర్వసాధారణంగా మారింది. వైఎస్సార్, తిరు పతి, కాకినాడ, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆయన పర్యటనల్లో కనీస భద్రత కూడా కల్పించ లేదు.

అనుమతుల్లేకుండానే ఔషధాల తయారీ

డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ తనిఖీల్లో గుట్టురట్టు

సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి లైసెన్స్‌లు పొందకుండా నే.. అక్రమంగా మందులు తయారు చేస్తున్న ఒక సంస్థ గుట్టురట్టు చేశారు డీసీఏ అధికారులు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామంలోని ప్రొసేఫ్ బయలాజికల్స్ ఎల్ఎల్‌పీలో అక్రమంగా మందులు తయారు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు.. సదరు సంస్థలో ఈనెల 20న సోదాలు చేపట్టినట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.54.75 లక్షల విలువైన మందులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. స్వాధీనం చేసుకున్న మందులను ఫుడ్ సప్లిమెంట్స్‌గా చూపుతూ.. ఫుడ్ లైసెన్స్‌లను వినియోగించి తయారు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారని తెలిపారు.

సీపీడబ్ల్యూడీ ఈఈ ఆస్తులు జప్తు

సాక్షి, హైదరాబాద్: బిల్లులు క్లియర్ చేసేందుకు లంచం తీసుకుంటూ సీబీఐ ఏసీబీకి చిక్కిన సీపీడబ్ల్యూడీ (సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్) ఎగ్జి క్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పి.సాయి కొమరేశ్వర్, అతని భార్య పి.ప ద్మావతి పేరిట ఉన్న సుమారు రూ.1.27 కోట్ల విలువైన మూడు స్థిరాస్తు లను ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం తాత్కాలికంగా జప్తు చేసింది. ఈఈగా పనిచేస్తున్నప్పుడు పి.సాయి కొమరేశ్వర్ బిల్లులు క్లియర్ చేయడా నికి ఒక కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అధికారులకు చిక్కాడు. సీబీఐ ఏసీబీ నిందితుని నివాసంలో అనేక పత్రాలు, రూ.30.50 లక్షల నగదు, లాకర్ కీని స్వాధీనం చేసుకుంది. పి.సాయి కొమరేశ్వర్‌పై ఆదాయా నికి మించిన ఆస్తుల కేసును ఈడీ నమోదు చేసింది.

జీఎస్టీ కుంభకోణంలో మలుపులు

- నిందితులు డిలీట్ చేసిన వాట్సాప్ డేటాను సేకరించిన సీఐడీ
- కొన్ని కంపెనీల ఆడిట్ చేయొద్దని నాటి సీఎస్ సోమేశ్ నేతృత్వంలోని వాట్సాప్ గ్రూప్‌లో ఆదేశాలు
- ఇన్వాయిస్‌లు, టిన్ నంబర్లు కూడా పోస్టు చేసి వాటిని పట్టించుకోవద్దని అధికారులకు సందేశాలు
- ఆ సందేశాల్లోని కంపెనీలు, గతంలో ప్రభుత్వం నోటీసులిచ్చిన కంపెనీలు ఒక్కటేనన్న చర్చ

సాక్షి, హైదరాబాద్: జీఎస్టీ శాఖలో సంచలనం సృ ష్టించిన కుంభకోణం మలుపులు తిరుగుతోంది. ఈ శాఖ బాధ్యతలు నిర్వహించిన నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌తోపాటు మరి కొందరు అనేక అక్రమాలకు పాల్పడ్డారంటూ నమోదైన కేసులో భాగంగా సీఐడీ జరుపుతున్న దర్యాప్తులో అనేక విషయాలు వెలుగులోకి వస్తు న్నాయి. 'స్పెషల్ ఇనీషియేటివ్స్' పేరుతో సోమేశ్ తోపాటు కాశీ విశ్వేశ్వరరావు, శ్రీరాంప్రసాద్, శోభ న్‌బాబు, ప్లియాంటో టెక్నాలజీస్ ప్రతినిధులు సభ్యులుగా నిర్వహించిన వాట్సాప్ గ్రూప్ సమా చారాన్ని రిట్రీవ్ చేయగా ఈ కేసుకు సంబంధిం చిన అనేక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. ఆ వాట్సాప్ గ్రూప్‌ను, అందులోని మెసేజ్‌లను 6 నెలల క్రితమే డిలీట్ చేయడంతో ప్రత్యేక సాఫ్ట్‌వే ర్‌ను ఉపయోగించి సీఐడీ రిట్రీవ్ చేయించినట్లు సమాచారం. గత ప్రభుత్వ పెద్దలతో సంబం ధమున్న కంపెనీలను ఆడిట్ చే యొద్దని.. కొన్ని ఇన్వాయిస్‌లు, టిన్ నంబర్లు పెట్టి ఆ నంబర్లు ఉన్న వాటిని పట్టించుకోవద్దంటూ ఈ గ్రూపులో సందేశాలు పంపారనే విష యాలు వెల్లడైనట్లు విచారణలో తెలియవచ్చింది. ఇప్పుడు ఈ కంపె నీల పేర్లే విచారణలో కీలకం కానున్నాయనే చర్చ వాణిజ్య పన్నుల శాఖ వర్గా ల్లో జరుగుతోంది.

ప్రత్యేక బృందాలతో ఆడిటింగ్‌తోనే సాధ్యం..

వాట్సాప్ గ్రూప్‌లో వెల్లడైన కంపెనీలు... వాణి జ్య పన్నుల శాఖ డైరెక్టర్‌గా టి.కె.శ్రీదేవి ఉన్నప్పుడు ఆడిట్ నోటీసులు పంపిన కంపెనీలు ఒక్కటేనా అనే చర్చ జరుగుతోంది. ఈ రెండు చోట్ల కంపెనీలు ఒక్కటే అయితే మాత్రం భారీ కుంభకోణం జరిగి ఉంటుందని కూడా ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో డిమాండ్ నోటీసులు పంపిన 70–80 సంస్థలను ఆడిట్ చేసిన సీటీవో, డీసీటీవో, జేసీలు తమకు ఎలాంటి పన్ను ఎగవేత కనిపించలేదని ప్రభుత్వా నికి నివేదికలు సమర్పించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తే ఈ కంపెనీల్లో ఆడిటింగ్ వ్యవహారం నిగ్గు తేలు తుందని వారు చెబుతున్నట్లు సమాచారం. ఈ కుంభకోణంలో ఎక్కువగా ఐరన్, స్టీల్, ఎలక్ట్రా నిక్స్, ఎలక్ట్రికల్, బ్యాటరీ తయారీ, విక్రయ కంపె నీల ద్వారానే అక్రమాలు జరిగాయనే నిర్ధారణకు సీఐడీతోపాటు వాణిజ్య పన్నుల శాఖ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఆ కంపెనీల పేర్లు సరిపోల డాన్ని బట్టి ఏ కంపెనీల్లో ఎంత మేర అక్రమాలు జరిగాయి.. వాటికి సోమేశ్, ఇతరులు ఎలా సహకరించారు.. అవినీతి ఏ మేరకు జరిగింది? అనే అంశాలు తేలుతాయని వాణిజ్య పన్నుల శాఖ అధికారులు చెబుతున్నారు.

నా స్టేట్‌మెంట్‌పై అనుమానం ఉంది

- కాపీ అడిగితే డీఎస్పీ ఇవ్వడంలేదు
- నా కేసు ఫాల్స్ కాదని వివరిస్తా..
- వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డి



పులివెందుల: 'రెండు నెలల క్రితం పులివెందుల డీఎస్పీ నా ఇంటికొచ్చి నా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. ఈ స్టేట్‌మెంట్ కాపీ ఇవ్వాలని ఇప్పటికే పదిసార్లకు పైగా ఆయన్ను కలిశాను. అయినా డీఎస్పీ ఆ కాపీ ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నా రు.. ఆ స్టేట్‌మెంట్‌పై నాకు అనుమానంగా ఉం ది'.. అని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డి ఆరోపించారు. అంతేకాక.. తాను పెట్టిన ప్రైవేట్ కంప్లయింట్ ఫాల్స్ కేసు అని గురువారం పులివెందుల కోర్టులో పిటిషన్ దాఖ లు చేశారన్నారు. ఇది ఏ విధంగా ఫాల్స్ కేసో డీఎ స్పీని వివరణ కోరేందుకు తానీ రోజు డీఎస్పీ కా ర్యాలయానికి వచ్చానని.. అయితే ఆయన అందు బాటులో లేరని ఆఫీస్ సిబ్బంది తెలిపారన్నారు. అయినా మళ్లీ వచ్చి డీఎస్పీని కలిసి వివరణ అడ గాలనుకుంటున్నానని కృష్ణారెడ్డి స్పష్టంచేశారు.

టీడీపీ కూటమి సర్కారు రాగానే మళ్లీ విచారణ..

గతంలో వివేకా హత్య కేసు విచారణ చేస్తున్న సీబీఐ అధికారి రాంసిం గ్, నర్రెడ్డి సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిలు వారికి అనుకూలంగా స్టేట్‌మెం ట్ ఇవ్వాలని కృష్ణారెడ్డిని వేధించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి అప్పట్లో రాం సింగ్, సునీత, రాజశేఖర్‌లపై వైఎస్సార్ జిల్లా పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి చార్జిషీటు కూడా వేశారు. అయితే, గత ఏడాది రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ కేసును మళ్లీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా కృష్ణారెడ్డితోపాటు దాదాపు మరో 10 మందిని ఆయన విచారించి కృష్ణారెడ్డి కేసు ఫాల్స్ కేసుగా పులివెందుల కోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పులివెందుల కోర్టు తిరస్క రించింది. అయితే, శుక్రవారం వివేకా పీఏ కృ ష్ణారెడ్డి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలవడానికి వెళ్లారు. డీఎస్పీ అందుబాటులో లేకపోవడంతో ఆయన మీడియాతో మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

సాక్షి సినిమా



మా అమ్మ క్షేమంగా... ఆరోగ్యంగా ఉన్నారు

- చిరంజీవి

''మా అమ్మ అంజనా దేవిగారు ప్రస్తుతం క్షేమంగా, సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారు'' అని హీరో చిరంజీవి తెలిపారు. అంజనా దేవి అస్వస్థతకు గురయ్యారంటూ ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న వార్తలపై ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ''మా అమ్మ అంజనా దేవిగారి ఆరోగ్యం సరిగా లేదనీ, అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారనీ ప్రచారం అవుతున్న వార్తలు నా దృష్టికి వచ్చాయి. ఈ విషయంపై నేను స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఇటీవల అమ్మ కొద్దిపాటి అస్వస్థతకు గురైన మాట వాస్తవమే. కానీ, ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేదు. సంపూర్ణ ఆరోగ్యంతో క్షేమంగా ఉన్నారు. అమ్మ ఆరోగ్యానికి సంబంధించి దయచేసి ఊహాజనిత వార్తలను ప్రచురించవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. అవాస్తవాలు ప్రచారం చేయొద్దు. మీరంతా అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను'' అని చిరంజీవి పేర్కొన్నారు.

కోర్ట్‌లో హీరో ఎవరో చెప్పడం కష్టం



- శ్రీదేవి, రోషన్, నాని, ప్రియదర్శి, రామ్ జగదీష్

''కోర్ట్ - నాని

చాలా అందమైన సినిమా. ప్రియదర్శి, రోషన్, శ్రీదేవి అద్భుతంగా నటిం చారు. డైరెక్టర్ జగదీష్ బాగా తీశారు. ఈ సినిమా చూశాను... ఇందులో హీరో ఎవరో చెప్పడం కష్టం . ఈ సినిమా తీసినందుకు గర్వపడుతున్నాను '' అని హీరో నాని చెప్పారు. ప్రియదర్శి ప్రధాన పాత్రలో రోషన్, శ్రీదేవి ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'కోర్ట్ –స్టేట్ వర్సెస్ ఏ నోబడీ'. రామ్ జగదీష్ దర్శకత్వం వహించారు. నాని వాల్ పోస్టర్ సినిమా సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మించిన ఈ చిత్రం మార్చి 14న హోలీ పండగ సందర్భంగా విడు దల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో నాని మాట్లాడుతూ– ''ఈ కథ సున్నితమైనది. చాలా జాగ్రత్తలు తీసుకొని చేశాం. జగదీష్ చాలా పరిశోధన చేశారు. ఇది అద్భుతమైన కోర్టు రూమ్ డ్రామా. గొప్ప సందేశం ఉంటుం ది. ఈ సినిమా పూర్తయ్యాక ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొడతారు... ఇందుకు నాదీ గ్యారెంటీ. ఇలాంటి సినిమా బ్లాక్ బస్టర్ అయితే ఇండస్ట్రీ, ఆడియన్స్ ఒక అడుగు ముందుకేసినట్లే'' అన్నారు. ''నాని అన్న బ్యానర్‌లో సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అని ప్రియదర్శి చెప్పారు. ''నన్ను నమ్మి అవకాశం ఇచ్చిన నానీగారికి థ్యాంక్స్. ఒక్క డౌట్ లేకుండా స్క్రిప్ట్‌ని నమ్మి ఆయన సినిమా నిర్మించారు'' అని రామ్ జగదీష్ తెలిపారు. ''నాని, ప్రశాంతి ప్రొడక్షన్ హౌస్‌లో కథ నచ్చితే ఎంత అయినా ఖర్చు పెడతారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుం ది'' అన్నారు సహ నిర్మాత దీప్తి గంటా. ''ఇలాంటి మంచి సినిమాలో చాన్స్ ఇచ్చిన దర్శక- నిర్మాతలకు కృతజ్ఞతలు'' అని రోషన్, శ్రీదేవి పేర్కొన్నారు.

మహా శివరాత్రి కానుకగా...



- బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా, అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో పెన్ స్టూడియోస్‌పై డా. జయంతిలాల్ గడా సమర్పణలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్‌పై కేకే రాధా మోహన్ నిర్మించారు. శ్రీ చరణ్ పాకాల సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'భైరవం' థీమ్ సాంగ్ రిలీజ్ చేశారు. చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించిన ఈ పాటని శంకర్ మహదేవన్ పాడారు. ''ఈ నెల 26న రానున్న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ ఆధ్యాత్మిక పాటని విడుదల చేశాం. చైతన్య ప్రసాద్ రాసిన సాహిత్యం శివుని దైవిక సారాన్ని అద్భుతంగా ఆవిష్కరించి, లోతుగా ప్రతిధ్వనించే భావో ద్వేగాన్ని అందించింది. ఈ పాటలో బెల్లంకొండ శ్రీనివాస్ అద్భుత మైన హావభావాలు, డ్యాన్స్ అలరిస్తాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: హరి కె. వేదాంతం.

గంగూలీ బయోపిక్‌లో...



- రాజ్‌కుమార్ రావ్

ఇండియాలో క్రికెటర్లకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అందుకే ప్రముఖ క్రికెటర్ల జీవితాలను వెండితెర పైకి తీసుకు వచ్చేం దుకు దర్శక–నిర్మాతలు ఆసక్తి చూపు తుంటారు. ఇప్పటికే కపిల్ దేవ్, ధోనీ బయోపిక్‌లు వెండితెర్పై సందడి చేశాయి. కొన్నాళ్లుగా ఇండియా మాజీ కెప్టెన్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ బయోపిక్‌పై వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. గంగూలీ పాత్రలో నటించనున్నారంటూ ఆయుష్మాన్ ఖురానా, రాజ్ కుమార్ రావు, రణబీర్ కపూర్... వంటి హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే తన పాత్రలో రాజ్‌కుమార్ రావ్ నటించనున్నారని సౌరవ్ గంగూలీ స్వయంగా తెలిపారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న గంగూలీ తన బయోపిక్ గురించి స్పందించారు. ''ప్రస్తుతం నా బయోపిక్ పనులు జరుగుతున్నాయి. నేను విన్నంతవరకు, నాకు తెలిసినంత వరకు రాజ్‌కుమార్ రావ్ నా పాత్ర చేయనున్నారు. తన డేట్లు సర్దుబాటుకి కొంచెం సమయం అడిగినట్లు తెలిసింది. ఈ కారణంగా షూటింగ్ ప్రారంభం కావడానికి మరికొంత సమయం పట్టొచ్చు'' అని గంగూలీ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కరణ్ శర్మ దర్శకత్వం వహించనున్నారని టాక్.

హాలీవుడ్ ఎంట్రీ



- సల్మాన్



- సంజయ్

బాలీవుడ్‌లో స్టార్ హీరోలుగా క్రేజ్ సొంతం చేసుకున్న సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ హాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్నారు. లూయిస్ మచిన్, ఎవా బియాంకో, పౌలా లుస్సీ ప్రధాన పాత్రల్లో రోడ్రిగో గెర్రెరో దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సెవెన్ డాగ్స్'. 2021లో అర్జెంటీనాలో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ మూవీని హాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నారు. ఈ రీమేక్‌లో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం దుబాయ్‌లో జరుగుతోంది. సల్మాన్, సంజయ్‌లపై సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ షూటింగ్ వీడియో క్లిప్పింగ్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. సల్మాన్ ఖాకీ చొక్కా వేసుకుని ఆటో డ్రైవర్ వేషంలో ఉండగా... సంజయ్ సూటు ధరించి ఉన్నారు. మిడిల్ ఈస్ట్‌లో జరిగే అమెరికన్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోందట. మిడిల్ ఈస్ట్‌లో సల్మాన్ ఖాన్, సంజయ్ దత్ సినిమాలకు ఉన్న క్రేజ్, ఫాలోయింగ్‌ని దృష్టిలో పెట్టుకుని ఈ రీమేక్‌లో నటింపజేస్తున్నారట హాలీవుడ్ మేకర్స్. అయితే భద్రతా కారణాల రీత్యా ఈ సినిమాకు సంబంధించిన విశేషాలను అధికారికంగా వెల్లడించలేదు.

అతిథి పాత్రలో...

'గబ్బర్ సింగ్, రామయ్యా వస్తావయ్యా, దువ్వాడ జగన్నాథమ్' వంటి పలు చిత్రాలకు దర్శకత్వం వహించిన హరీష్ శంకర్ 'ఓ భామ అయ్యో రామ' చిత్రంలో గెస్ట్ రోల్‌లో కనిపించ నున్నారు. సుహాస్ హీరోగా రూపొందుతోన్న ఈ సినిమా ద్వారా మలయాళ నటి మాళవికా మనోజ్ తెలుగుకి హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. నూతన దర్శకుడు రామ్ గోధల దర్శకత్వంలో హరీష్ నల్ల నిర్మిస్తున్న ఈ సినిమాని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా విడుదల చేయనుంది. ఈ చిత్రం లో హరీష్ శంకర్ అతిథి పాత్ర చేసినట్లు మేకర్స్ ప్రకటిం చారు. ''ఈ సినిమాలో సున్నిత మైన ప్రేమ, భావోద్వేగా లతో పాటు మంచి వినోదం ఉంటుంది. ఈ మూవీలోని ఓ పాత్ర కోసం హరీష్ శంకర్‌గారిని ఒప్పించి, ఆయన పాత్ర షూటింగ్ పూర్తి చేశాం. ఆయన గెస్ట్ రోల్ సర్‌ప్రైజ్ చేస్తుంది. మా చిత్రాన్ని ఈ వేసవిలో విడుదల చేస్తాం'' అన్నారు హరీష్ నల్ల.



- హరీష్ శంకర్, సుహాస్

ఓటీటీ ఇది చూడొచ్చు

ప్రేమించడానికి సమయం లేదు

ఓటీటీలో ఇది చూడొచ్చు అనే ప్రాజెక్ట్స్ చాలా ఉం టాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో తమిళ చిత్రం కాదలిక్క నేరమిల్లై ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ప్రేమ.. ఓ చక్కటి ఫీలింగ్. ప్రేమ తరువాత పెళ్లి... ఓ థ్రిల్లింగ్ ఈవెంట్... పెళ్లి తరువాత పిల్లలు... జస్ట్ స్ట్రగులింగ్... ఇక్కడ మొదలవుతుంది అసలు కథ. నేటి యువతరం పడు తున్న పాట్లు ఇవి. ఇన్ఫెర్టిలిటీ అనేది నేటి జనరేషన్‌తో పాటు వేగంగా విస్తరిస్తున్న సమస్య. చాప కింద నీరులా ఈ సమస్య మనకు తెలియకుండానే మన కుటుంబాలను, బంధాలను మానసికంగా వేధిస్తోంది. ఆ సమస్య మీదే కాస్త చిలిపిగా రాసుకున్న కథ 'కాదలిక్క నేరమిల్లై' (ప్రేమించడానికి సమయం లేదు). ఇది తమిళ సినిమా కానీ నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగులోనూ లభ్యమవుతోంది. సినిమా అంతా చాలా సరదాగా సాగిపోతుంది. దర్శకురాలు కృతికా ఉదయనిధి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'జయం' రవి, నిత్యా మీనన్ హీరో హీరోయిన్లుగా నటించారు. ఇక ఈ సినిమా కథ విషయానికొస్తే... 2017లో ఈ సినిమా కథ ప్రారంభమవుతుంది. ఆర్కిటెక్ అయిన శ్రియ తను ప్రేమిం చిన కరణ్‌ను తల్లిదండ్రులను ఎదిరించి రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంటుంది. పెళ్లైన కొద్ది సమయంలోనే కరణ్ మోస గాడు అని తెలిసి, విడిపోతుంది. కానీ శ్రియకు పిల్లలంటే మహా ఇష్టం. విడిపోయిన కరణ్‌తో అది సాధ్యపడదు కాబట్టి ఐవీఎఫ్ పద్ధతిలో పిల్లలను కనాలని నిర్ణయించుకుంటుంది. మరో పక్క పెళ్లి, పిల్లలు అనే సిద్ధాంతానికి దూరంగా ఉన్న ఆర్కిటెక్ సిద్ తన గర్ల్‌ఫ్రెండ్ నిరుపమతో విడిపోవాల్సి వస్తుంది. కొన్ని అనుకోని పరిస్థితుల్లో తాను ఓ స్వచ్ఛంద సంస్థకు వీర్యదానం చేస్తాడు. అనూహ్యంగా సిద్ వీర్యంతోనే శ్రియ ఓ పిల్లాడికి జన్మనిస్తుంది. ఆ పిల్లాడి పేరు పార్థివ్. పార్థివ్‌కు ఊహ తెలిశాక తన తండ్రి కోసం వెతుకుతూ ఉంటాడు. ఇదే టైంలో ఓ ప్రాజెక్టుకు సంబంధించి సిద్, శ్రియ చెన్నై నగరంలో కలుస్తారు. మరి... తన తండ్రి సిద్ అని పార్థివ్ తెలుసుకుంటాడా? సిద్‌ని పార్థివ్ తండ్రిగా శ్రియ ఒప్పుకుంటుందా? అనేది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమ్ అవుతున్న 'కాదలిక్క నేరమిల్లై' సినిమాలోనే చూడాలి. ఓ సున్నితమైన పాయింట్‌ని చక్కటి స్క్రీన్‌ప్లేతో సరదాగా తీసుకెళ్లారు దర్శకురాలు. మీకు సమయం ఉంటే ప్రేమ కోసం ప్రేమతో ఈ సినిమాని చూడండి. వర్త్‌ఫుల్ వాచ్.

– ఇంటూరు హరికృష్ణ

సాక్షి బిజినెస్
శనివారం
22-2-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 425	నిఫ్టీ ▽ 117
75,311	22,796

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11:30 ముగింపు)			
నాస్‌డాక్	19,718	▽	245
డోజోన్స్	43,686	▽	490
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,659	▽	4
డాక్స్	22,288	▽	27
షాంఘై	3,379	△	20
నికాయ్	38,777	▽	99

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (24 క్యారెట్)	85,100	▽	420
బంగారం (22 క్యారెట్)	81,050	▽	400
వెండి (కేజీ)	1,09,000		0

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	86.10	87.12
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	108.30	111.17
€	యూరో	ఒకటి	89.65	92.28
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.00	58.45
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.35	56.57
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.56	67.24
SAR	సౌదీ రియాల్	పదింటికి	22.21	23.77
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	22.70	24.49
¥	చైనా యువాన్	పదింటికి	11.07	12.89

నాలుగో రోజూ నష్టాలే

ఆటో షేర్లు రివర్స్ గేర్ ● సెన్సెక్స్ 425 పాయింట్లు డౌన్



ముంబై: ఫైనాన్స్, ఆటో, ఫార్మా షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో స్టాక్ సూచీలు శుక్రవారం అరశాతం నష్టపోయాయి. సెన్సెక్స్ 425 పాయింట్లు కోల్పోయి 75,311 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117 పాయింట్లు నష్టపోయి 22,796 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు జాతీయ, అంతర్జాతీయంగా నెలకొన్న ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో రోజంతా నష్టాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 624 పాయింట్లు పతనమై 75,112 వద్ద, నిఫ్టీ 193 పాయింట్లు క్షీణించి 22,720 వద్ద ఇంట్రాడే కనిష్టాలు తాకాయి. చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లు మళ్లీ అమ్మకాల బాటపట్టాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.18%, 0.43 శాతం నష్టపోయాయి. వరుస నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 686 పాయింట్లు నిఫ్టీ 164 పాయింట్లు నష్టపోయాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 4 పైసలు బలహీనపడి 86.68 స్థాయి వద్ద స్థిరపడింది.

- ఇండెక్సుల వారీగా ఆటో సూచీ 2.60%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.50%, ఆయిల్అండ్‌గ్యాస్ 1.42%, రియల్టీ 1.33% టెలికం 1.19%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1% నష్టపోయాయి. మెటల్ ఇండెక్సు మాత్రమే 1% లాభపడింది.
- భారత్‌లోకి టెస్లా ఎంట్రీ నేపథ్యంలో కేంద్రం ఎలక్ట్రిక్ వాహన దిగుమతి సుంకాలను 110 శాతం నుంచి 15% తగ్గించవచ్చనే వార్తలతో దేశీయ ఆటో కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. ఎంఅండ్ఎం షేరు అత్యధికంగా 6% పతనమైంది. టీవీఎస్ మోటార్ 4%, ఎక్సైడ్ ఇండస్ట్రీస్ 3%, అపోలో టైర్స్, టాటా మోటార్స్ 2.50%, అశోక్ లేలాండ్ 2%, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో 1.50% నష్టపోయాయి. మారుతీ సుజుకీ, ఎంఆర్ఎఫ్ ఒకశాతం తగ్గాయి.
- నష్టాల మార్కెట్లో మెటల్ షేర్లు మెరిశాయి. నాల్కో 3.35%, సెయిల్ 2.50%, టాటా స్టీల్, హిందాల్కో 2% పెరిగాయి. జేఎస్ఎల్, వెల్‌స్పన్ కార్ప్, హిందుస్థాన్ జింక్, వేదాంత ఒక శాతం లాభపడ్డాయి. ఏపీఎల్అపోలో, ఎన్ఎండీసీ షేర్లు అర శాతం మేర పెరిగాయి.

ఇక వెండి.. కొండ!

- బంగారానికి పోటీగా దూకుడు
- ఏడాదిలో రూ.1.25 లక్షలకు!
- పరిశ్రమ వర్గాల అంచనాలు
- ఈ ఏడాది ఇప్పటికే 13% అప్

ఆకాశమే హద్దుగా దూసుకెళ్తున్న పసిడి రేట్లకు దీటుగా పరుగులు తీసేందుకు వెండి కూడా సన్నద్ధమవుతోందా? అంటే అవుననే సంకేతాలే కనిపిస్తున్నాయి. ఖరీదైన బంగారానికి ప్రత్యామ్నాయంగా ఇన్వెస్టర్లు వెండి వైపు చూస్తుండటంతో పాటు పారిశ్రామిక అవసరాలకు సంబంధించిన డిమాండ్ పెరుగుతుండటం కూడా ఇందుకు దోహదపడుతున్నాయి. బంగారం, వెండి మధ్య కీలక నిష్పత్తుల్లో చోటు చేసుకుంటున్న మార్పులు దీన్ని సూచిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఏడాది వ్యవధిలో వెండి రేటు కేజీకి రూ. 1.1 లక్షల నుంచి రూ. 1.25 లక్షల వరకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారానికి మించి వెండి అధిక రాబడులు ఇచ్చే అవకాశం ఉందనే అంచనాలతో ఎక్స్చేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్) వైపు చూసే ఇన్వెస్టర్ల సంఖ్య కూడా పెరుగుతోంది.



నిష్పత్తి చెబుతోందిదే..

బంగారంతో పోలిస్తే వెండి ధర ఎంత చౌకగా ఉంది, లేదా ఎంత ఎక్కువగా ఉంది అనేది తెలుసుకోవడానికి రెండింటి రేట్ల మధ్య నిర్దిష్టంగా ఉండే నిష్పత్తి ఉపయోగపడుతుంది. ప్రస్తుతం ఇది ఆల్‌టైమ్ కనిష్టం అయిన 0.01 స్థాయిలో ఉంది. ఈ నిష్పత్తి ఆల్‌టైం గరిష్టం 0.06 స్థాయి. సాధారణంగా సగటున ఒక్క ఔన్సు (31.1) గ్రాముల బంగారం విలువ, 60 నుంచి 70 ఔన్సుల వెండి విలువకు సమానంగా ఉంటుంది. ప్రస్తుతం ఒక్క ఔన్సు బంగారం కొనాలంటే 90 ఔన్సుల వెండి అవసరమవుతోంది. ఈ వ్యత్యాసం సగటు స్థాయికి తగ్గాలంటే వెండి మరింతగా పెరగాల్సి ఉంటుంది. ఈ మధ్య కాలంలో పసిడి భారీగా ఎగిసిన నేపథ్యంలో స్వల్పకాలానికి వెండిని కొనుగోలు చేస్తే సురక్షితంగా ఉంటుందనే భావన ఇన్వెస్టర్లలో నెలకొంది. గత మూడేళ్లగా రాబడుల విషయంలో పసిడితో పోలిస్తే వెండి వెనకబడింది. డాలరు మారకంలో పసిడిపై రాబడులు సుమారు 54 శాతంగా ఉండగా, వెండిపై రాబడులు 37 శాతమే. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు పసిడి రేటు 11.77 శాతం పెరగ్గా, వెండి రేట్లు 13.3 శాతం పెరిగాయి.

3,200 డాలర్ల దిశగా పసిడి!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల దెబ్బతో ద్రవ్యోల్బణం భారీగా ఎగియొచ్చన్న అంచనాలు పసిడి ర్యాలీకి దోహదపడుతున్నాయి. సురక్షిత పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్లు బంగారం వైపు మొగ్గు చూపుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర ప్రస్తుతం దాదాపు రూ. 2,948 డాలర్లకు పెరిగింది. ఇది ఈ ఏడాది ఏకంగా 3,200 డాలర్లకు ఎగియొచ్చనే పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అయితే, ప్రస్తుత స్థాయి నుంచి మరీ దూకుడుగా ధరల పెరుగుదల ఉండకపోవచ్చని పేర్కొన్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత విషయంలో జాప్యం చేసే అవకాశాలు, రష్యా–ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు, ట్రేడ్ టారిఫ్‌ల అమలు నెమ్మదించడం వంటి అంశాలు ప్రతికూలంగా మారొచ్చని వివరించాయి.



ఇన్వెస్టర్లు, పరిశ్రమల దన్ను..

ఇటు ఇన్వెస్టర్లు, అటు పరిశ్రమల నుంచి డిమాండ్ నెలకొనడంతో సమీప భవిష్యత్తులో పసిడికి మించి వెండి ర్యాలీ చేసే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఏడాది వ్యవధిలో వెండి ధర రూ. 1.10 లక్షల నుంచి రూ. 1.25 లక్షల వరకు చేరొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనా వేస్తోంది.అంటే సగటున 20 శాతం రాబడి ఉండొచ్చు. దీంతో ప్రస్తుతం రేటు తగ్గితే కొనుక్కుని దగ్గర పెట్టుకోవడం మంచిదని సూచించాయి. అయితే, వెండి మీద అధిక రాబడులు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ రేట్లు తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపాయి. పసిడితో పోలిస్తే వెండి ధరలో హెచ్చుతగ్గులు 2.5 రెట్లు అధికంగా ఉంటాయని వివరించాయి.

-సాక్షి, బిజినెస్‌డెస్క్

ఏడాది వ్యవధిలో వెండి ఈటీఎఫ్‌ల్లో రాబడులు (%)

ఏబీఎస్ఎల్ సిల్వర్	36.36
కోటక్ సిల్వర్	36.34
డీఎస్‌పీ సిల్వర్	36.21
హెచ్‌డీఎఫ్‌సీ సిల్వర్	36.13
యూటీఐ సిల్వర్ ఈటీఎఫ్	36.01

ఫిబ్రవరి 20 గణాంకాల ప్రకారం

ఆరేళ్లలో 5 కోట్ల మంది ప్రయాణికులు

- శంషాబాద్ విమానాశ్రయంపై జీఎంఆర్ అంచనా
- ప్రస్తుతం ఏటా 2.9 కోట్ల మంది రాకపోకలు



హైదరాబాద్: ఆరేళ్లలో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య ఏటా 5 కోట్ల స్థాయికి చేరుతుందని జీఎంఆర్ గ్రూప్ అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2.9 కోట్లుగా ఉంటుందని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణిక్కర్ వెల్లడించారు. '2023–24లో 2.5 కోట్ల మంది శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రయాణాలు చేశారు. కంపెనీ ప్రస్తుత కార్గో టెర్మినల్ విస్తరణ కోసం రూ.370 కోట్లు పెట్టుబడి పెట్టే ప్రక్రియలో ఉంది. ఏటా 4 లక్షల టన్నుల సామర్థ్యాన్ని చేరుకోవడానికి కొత్త టెర్మినల్ ఏర్పాటు చేస్తోంది. విమానాశ్రయం ఇప్పటికే ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసింది. 2008లో ఏటా 1.2 కోట్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా ఎయిర్‌పోర్టును నిర్మించారు' అని వివరించారు.

బీవోఐలో రూ. 227 కోట్ల ఫ్రాడ్



న్యూఢిల్లీ: గుప్తా పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే సంస్థ రూ. 227 కోట్ల మేర రుణం తీసుకుని, మోసం చేసినట్లు ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) వెల్లడించింది. ఈ ఖాతాను మొండిపద్దుగా (ఎన్‌పీఏ) వర్గీకరించి, రిజర్వ్ బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించింది. రూ. 227 కోట్లకు గాను రూ. 213 కోట్లు ప్రొవిజనింగ్ చేసినట్లు బ్యాంకు తెలిపింది. ఒరిస్సాకు చెందిన గుప్తా పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అటు పంజాబ్ నేషనల్ బ్యాంకులో (పీఎన్‌బీ) కూడా రూ. 271 కోట్ల ఫ్రాడ్‌కి పాల్పడింది. పీఎన్‌బీ కూడా దీన్ని ఎన్‌పీఏగా వర్గీకరించి, ప్రొవిజనింగ్ చేసి, రిజర్వ్ బ్యాంక్ దృష్టికి తీసుకెళ్లింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో బీవోఐ నికర లాభం 35% పెరిగి రూ. 1,870 కోట్ల నుంచి రూ. 2,517 కోట్లకు చేరగా, ఆదాయం రూ.16,411 కోట్ల నుంచి రూ.19,957 కోట్లకు ఎగసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టారిఫ్‌లు తగ్గిస్తే భారత్‌కే మంచిది: నీతి ఆయోగ్
ఫ్రెషర్లకు ఈ ఏడాది అధిక అవకాశాలు

నివా బూపా హెల్త్‌పై సైబర్ దాడి!

విచారణ చేస్తున్నట్లు ప్రకటించిన కంపెనీ



న్యూఢిల్లీ: నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ సైబర్ ముప్పును ఎదుర్కొన్నట్లు ప్రకటించింది. కంపెనీ కస్టమర్ల డేటాబేస్‌ను హ్యాక్ చేసినట్లు ఓ గుర్తు తెలియని సంస్థ నుంచి బెదిరింపు ఈ–మెయిల్ వచ్చినట్లు స్టాక్ ఎక్స్చేంజీలకు సమాచారం అందించింది. డేటా లీక్ అయిన విషయంలో తాము దర్యాప్తు చేస్తున్నట్లు, రిస్క్‌ను అధిగమించే చర్యలు అమలు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. 2024 డిసెంబర్ 31 నాటికి నివాబూపాకు 1.98 కోట్ల మంది పాలసీదారులు ఉన్నారు. గతేడాది మరో సంస్థ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సైతం డేటా చోరీ ఘటనను ఎదుర్కోవడం తెలిసిందే.

సాక్షి స్పోర్ట్స్

చాంపియన్స్ ట్రోఫీలో నేడు
ఆస్ట్రేలియా X ఇంగ్లండ్
వేదిక: లాహోర్
మధ్యాహ్నం గం. 2:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ 18, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఐర్లాండ్‌పై భారత్ విజయం

భువనేశ్వర్: అంతర్జాతీయ హాకీ సమాఖ్య ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టుకు మరో విజయం లభించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని టీమిండియా 3–1 గోల్స్ తేడాతో ఐర్లాండ్ జట్టును ఓడించింది. భారత్ తరఫున మన్‌దీప్ సింగ్ (22వ నిమిషంలో), జర్మన్‌ప్రీత్ సింగ్ (45వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (58వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. ఐర్లాండ్ జట్టుకు జెరెమీ డంకన్ (8వ నిమిషంలో) ఒక గోల్ అందించాడు. మరోవైపు జర్మనీతో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0–4 గోల్స్ తేడాతో పరాజయం పాలైంది.

అదరగొట్టిన దక్షిణాఫ్రికా



రికెల్టన్

- తొలి మ్యాచ్‌లో భారీ విజయం
- 107 పరుగులతో అఫ్గానిస్తాన్ చిత్తు
- రికెల్టన్ సెంచరీ
- బవుమా, మార్క్‌రమ్, డసెన్ అర్ధ శతకాలు
- రాణించిన సఫారీ పేసర్లు

కరాచీ: సుదీర్ఘ కాలంగా ఐసీసీ ట్రోఫీ టైటిల్ కోసం తీవ్ర ప్రయత్నం చేస్తున్న దక్షిణాఫ్రికా చాంపియన్స్ ట్రోఫీని భారీ విజయంతో మొదలు పెట్టింది. తొలిసారి టోర్నీ ఆడుతున్న అఫ్గానిస్తాన్‌కు ఎలాంటి సంచలనానికి అవకాశం ఇవ్వకుండా తమ స్థాయికి తగ్గ ఆటతో పైచేయి సాధించింది. ముందుగా బ్యాటింగ్‌లో భారీ స్కోరుతో చెలరేగిన మాజీ చాంపియన్ ఆ తర్వాత పదునైన పేస్ బౌలింగ్‌తో ప్రత్యర్థిని పడగొట్టింది. శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 107 పరుగుల తేడాతో అఫ్గానిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ర్యాన్ రికెల్టన్ (106 బంతుల్లో 103; 7 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగగా... కెప్టెన్ బవుమా (76 బంతుల్లో 58; 5 ఫోర్లు), మార్క్‌రమ్ (36 బంతుల్లో 52 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), డసెన్ (46 బంతుల్లో 52; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం అఫ్గానిస్తాన్ 43.3 ఓవర్లలో 208 పరుగులకే ఆలౌటైంది. రహ్మత్ షా (92 బంతుల్లో 90; 9 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతావారంతా విఫలమయ్యారు.

మూడు అర్ధ సెంచరీలు...

ఇన్నింగ్స్ ఆరంభంలోనే టోనీ జోర్జి (11) వెనుదిరగ్గా... రికెల్టన్, బవుమా కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. తొలి 10 ఓవర్లలో దక్షిణాఫ్రికా స్కోరు 46 పరుగులకు చేరింది. చక్కటి షాట్లతో ఆకట్టుకున్న రికెల్టన్ 48 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ జోడీని విడదీసేందుకు అఫ్గాన్ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. 63 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్న అనంతరం నబీ బౌలింగ్‌లో బవుమా వెనుదిరిగాడు. రికెల్టన్, బవుమా రెండో వికెట్‌కు 23.4 ఓవర్లలో 129 పరుగులు జోడించారు. ఆ తర్వాత కొద్దిసేపటికి 101 బంతుల్లో రికెల్టన్ కెరీర్‌లో తొలి శతకాన్ని సాధించాడు. అయితే తర్వాతి ఓవర్లోనే అతను అనూహ్యంగా రనౌటయ్యాడు. కీలక వికెట్ తీసిన ఆనందం అఫ్గాన్‌కు దక్కలేదు. ఆపై డసెన్, మార్క్‌రమ్ తమ జోరును ప్రదర్శించడంతో దక్షిణాఫ్రికా స్కోరు 300 దాటింది.

రహ్మత్ షా మినహా...

భారీ ఛేదనలో అఫ్గాన్ టీమ్ తడబడింది. రహ్మత్ షా పట్టుదలగా నిలబడినా... ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ భాగస్వామ్యం లేకపోయింది. నలుగురు సఫారీ పేసర్ల ధాటికి బ్యాటర్లు నిలవలేకపోయారు. పవర్‌ప్లే ముగిసేసరికే తొలి 2 వికెట్లు కోల్పోయిన జట్టు తర్వాతి 5 ఓవర్లలో మరో 2 వికెట్లు చేజార్చుకుంది. 89/5 స్కోరు వద్ద జట్టు గెలుపుపై ఆశలు వదిలేసుకుంది. రహ్మత్ మాత్రం కాస్త పోరాడుతూ సెంచరీకి చేరువయ్యాడు. అయితే మరోవైపు నుంచి అతనికి సహకారం లభించలేదు.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: రికెల్టన్ (రనౌట్) 103; టోనీ జోర్జి (సి) అజ్మతుల్లా (బి) నబీ 11; బవుమా (సి) సాదిఖుల్లా (బి) నబీ 58; డసెన్ (సి) హష్మతుల్లా (బి) నూర్ 52; మార్క్‌రమ్ (నాటౌట్) 52; మిల్లర్ (సి) రహ్మత్ (బి) ఫారుఖీ 14; యాన్సెన్ (బి) అజ్మతుల్లా 0; ముల్డర్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (50 ఓవర్లలో 6 వికెట్లకు) 315. వికెట్ల పతనం:** 1–28, 2–157, 3–201, 4–248, 5–298, 6–299. **బౌలింగ్:** ఫారుఖీ 8–0–59–1, అజ్మతుల్లా 6–0–39–1, నబీ 10–0– 51–2, రషీద్ ఖాన్ 10–0–59–0, గుల్బదిన్ 7–0–42–0, నూర్ అహ్మద్ 9–0–65–1.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) మహరాజ్ (బి) ఎన్‌గిడి 10; ఇబ్రహీమ్ (బి) రబడ 17; సాదిఖుల్లా (రనౌట్) 16; రహ్మత్ షా (సి) రికెల్టన్ (బి) రబడ 90; హష్మతుల్లా (సి) బవుమా (బి) ముల్డర్ 0; అజ్మతుల్లా (సి) రికెల్టన్ (బి) రబడ 18; నబీ (సి) రబడ (బి) యాన్సెన్ 8; గుల్బదిన్ (సి) బవుమా (బి) ఎన్‌గిడి 13; రషీద్ (సి) మార్క్‌రమ్ (బి) మహరాజ్ 18; నూర్ (బి) ముల్డర్ 9; ఫారుఖీ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (43.3 ఓవర్లలో ఆలౌట్) 208. వికెట్ల పతనం:** 1–16, 2–38, 3–50, 4–50, 5–89, 6–120, 7–142, 8–169, 9–208, 10–208. **బౌలింగ్:** యాన్సెన్ 8–1– 32–1, ఎన్‌గిడి 8–0–56–2, రబడ 8.3–1–36–3, ముల్డర్ 9–0–36–2, మహరాజ్ 10–0–46–1.

కేరళ కల నిజమాయె...

- తొలిసారి రంజీ ట్రోఫీలో ఫైనల్లోకి
- గుజరాత్‌పై 2 పరుగులతో ఆధిక్యంతో ముందంజ
- డిఫెండింగ్ చాంపియన్ ముంబైను ఓడించిన విదర్భ



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అజహరుద్దీన్ (తెలుపు జెర్సీ)

నాగ్‌పూర్: విధి లిఖితం అంటే ఇదేనేమో! క్వార్టర్ ఫైనల్లో ఒక్కటంటే ఒక్క పరుగుతో గట్టెక్కిన కేరళ జట్టు... సెమీఫైనల్లో రెండు పరుగుల ఆధిక్యంతో ముందంజ వేసింది. వెరసి 91 ఏళ్ల రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ చరిత్రలో కేరళ తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లి తమ 'టైటిల్ పోరు' కలను నిజం చేసుకుంది. మాజీ చాంపియన్ గుజరాత్ జట్టుతో అహ్మదాబాద్ వేదికగా మలుపులు తిరుగుతూ సాగిన సెమీఫైనల్లో కేరళ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఫైనల్‌కు చేరుకుంది. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులకు ఆలౌట్‌కాగా... గుజరాత్ తొలి ఇన్నింగ్స్ 455 పరుగులకు ముగిసింది. రంజీ ట్రోఫీ నిబంధనల ప్రకారం ఫలితం తేలని మ్యాచ్‌ల్లో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కిన జట్టు ముందుకు వెళుతుంది. ఫలితంగా 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన కేరళకు ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఓవర్‌నైట్ స్కోరు 429/7తో శుక్రవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన గుజరాత్ చివరకు 174.4 ఓవర్లలో 455 పరుగులకు ఆలౌటైంది. జైమీత్ పటేల్ (177 బంతుల్లో 79) జట్టును గట్టెక్కించలేకపోయాడు. ఒకదశలో గుజరాత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించి ముందంజ వేయడం ఖాయమనిపించింది. కేరళ లెఫ్టార్మ్ స్పిన్నర్ ఆదిత్య సర్వతే 4 వికెట్లతో రాణించాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కేరళ ఆట ముగిసే సమయానికి 46 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 114 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన కేరళ బ్యాటర్ అజహరుద్దీన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. బుధవారం నుంచి నాగ్‌పూర్‌లో జరిగే ఫైనల్లో విదర్భతో కేరళ ఆడుతుంది.

ముంబైకు చుక్కెదురు

నాగ్‌పూర్‌లో జరిగిన మరో సెమీఫైనల్లో 42 సార్లు చాంపియన్ ముంబై జట్టును ఓడించిన విదర్భ జట్టు నాలుగోసారి ఫైనల్లోకి ప్రవేశించింది. డిఫెండింగ్ చాంపియన్ ముంబైతో జరిగిన సెమీఫైనల్లో విదర్భ 80 పరుగుల తేడాతో విజయం సాధించింది. 406 పరుగుల విజయ లక్ష్యంతో ఓవర్‌నైట్ స్కోరు 83/3తో శుక్రవారం ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన డిఫెండింగ్ చాంపియన్ ముంబై చివరకు 97.5 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. భారత ఆటగాడు శార్దుల్ ఠాకూర్ (66; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో పోరాడాడు. స్టార్ ఆటగాళ్లు సూర్యకుమార్ (23), శివమ్ దూబే (12) విఫలమవడం ముంబైను దెబ్బ కొట్టింది. విదర్భ బౌలర్ హర్ష్ దూబే 5 వికెట్లు తీశాడు.

కేరళ జట్టు ప్రస్థానంపై కథనం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

అమన్‌జ్యోత్ మెరుపులు

బెంగళూరుపై ముంబై ఇండియన్స్ విజయం



అమన్‌జ్యోత్

బెంగళూరు: డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టుకు సొంత గడ్డపై చుక్కెదురైంది. అమన్‌జ్యోత్ కౌర్ ఆల్‌రౌండ్ మెరుపులు మెరిపించడంతో మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ జట్టు రెండో విజయం నమోదు చేసుకుంది. శుక్రవారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ నాలుగు వికెట్ల తేడాతో ఆర్‌సీబీపై గెలుపొందింది. మొదట ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ (43 బంతుల్లో 81; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) విజృంభించింది. ముంబై బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం ముంబై జట్టు 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (38 బంతుల్లో 50, 8 ఫోర్లు, 1 సిక్స్), సివర్ బ్రంట్ (21 బంతుల్లో 42; 9 ఫోర్లు) ధాటిగా ఆడారు. చివర్లో ఉత్కంఠ నెలకొన్న సమయంలో అమన్‌జ్యోత్ కౌర్ (27 బంతుల్లో 34 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కమలిని (11 నాటౌట్; 1 ఫోర్) కీలక పరుగులు చేసి జట్టును విజయ తీరాలకు చేర్చారు. నేడు జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో యూపీ వారియర్స్ తలపడుతుంది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి) యస్తిక (బి) షబ్నిమ్ 26; డానీ వ్యాట్ (సి) హేలీ (బి) సివర్ బ్రంట్ 9; పెర్రీ (సి) షబ్నిమ్ (బి) అమన్‌జ్యోత్ 81; కనిక (బి) సంస్కృతి 3; రిచా (బి) అమన్‌జ్యోత్ 28; జార్జియా (సి) సంస్కృతి (బి) అమన్‌జ్యోత్ 6; కిమ్ గార్త్ (నాటౌట్) 8; ఎక్తా బిష్త్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 167. వికెట్ల పతనం:** 1–29, 2–48, 3–51, 4–57, 5–107, 6–119, 7–165, **బౌలింగ్:** షబ్నిమ్ 4–0–36–1; సివర్ బ్రంట్ 4–0–40–1; హేలీ మాథ్యూస్ 4–0–37–1; అమేలియా కెర్ 4–0–28–0; సంస్కృతి 1–0–3–1; అమన్‌జ్యోత్ 3–0–22–3. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** హేలీ (ఎల్బీడబ్ల్యూ) (బి) ఏక్తా 15; యస్తిక (ఎల్బీడబ్ల్యూ) (బి) కిమ్ గార్త్ 8; సివర్ బ్రంట్ (బి) కిమ్ గార్త్ 42; హర్మన్‌ప్రీత్ (సి) రిచా (బి) జార్జియా 50; అమేలియా (సి) ఏక్తా (బి) జార్జియా 2; అమన్‌జ్యోత్ (నాటౌట్) 34; సంజనా (ఎల్బీడబ్ల్యూ) జార్జియా 0; కమలిని (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (19.5 ఓవర్లలో 6 వికెట్లకు) 170. వికెట్ల పతనం:** 1–9, 2–66, 3–74, 4–82, 5–144, 6–144, **బౌలింగ్:** రేణుక 4–0–35–0; కిమ్ గార్త్ 4–0–30–2; జార్జియా 4–1–21–3; ఏక్తా 3.5–0–37–1; జోషిత 2–0–19–0; కనిక 2–0–28–0.



మహా 'కాసుల' మేళా!

రూ.3 లక్షల కోట్ల వ్యాపారం • అంచనా వేస్తున్న సీఏఐటీ

సాక్షి, బిజినెస్ బ్యూరో: మహా కుంభ మేళా కాసులు కురిపిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు కోట్లాది మంది భక్తులను ఆకర్షిస్తున్న ఈ వేడుక.. వస్తువులు, సేవల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం నమోదు చేయనుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఇది భారత్‌లో అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాలలో ఒకటిగా నిలిచిందని సీఏఐటీ సెక్రటరీ జనరల్, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. 144 ఏళ్లకోసారి జరిగే మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా ఈ నెల 26 వరకు కొనసాగనుంది. ప్రపంచంలోనే అతి పెద్ద మతపర, ఆధ్యాత్మిక సమావేశంగా గుర్తింపు పొందిన ఈ కుంభ మేళాలో ఇప్పటివరకు 56 కోట్లకు పైగా భక్తులు పాల్గొన్నారు.

విశ్వాసం, ఆర్థిక వ్యవస్థ మధ్య సంబంధాన్ని ఈ కార్యక్రమం దృఢంగా నిర్వచించిందని ఖండేల్వాల్ అన్నారు. 'డైరీలు, క్యాలెండర్లు, జనపనార సంచులు, స్టేషనరీ తదితర మహాకుంభ నేపథ్య ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం స్థానిక వాణిజ్యాన్ని పెంచుతోంది. కచ్చితమైన బ్రాండింగ్ కారణంగా అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మహా కుంభ మేళా ప్రారంభానికి ముందు 40 కోట్ల మంది ప్రజలు వస్తారని అంచనా వేశారు. అలాగే దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు జరుగుతాయని భావించారు. అయితే దేశవ్యాప్తంగా నెలకొన్న అపూర్వ ఉత్సాహం కారణంగా.. ఫిబ్రవరి 26 నాటికి దాదాపు 60 కోట్ల మంది మహా కుంభమేళాలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. తద్వారా భారీ స్థాయిలో రూ.3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం నమోదు అయ్యే అవకాశం ఉందని ఖండేల్వాల్ చెప్పారు.


అంచనాలను మించి..

ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు ఈ కార్యక్రమం గణనీయ ప్రోత్సాహాన్ని అందించిందని, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించిందని సీఏఐటీ వెల్లడించింది. ఆతిథ్యం, వసతి, ఆహారం, పానీయాలు, రవాణా, మతపర దుస్తులు, పూజా సామగ్రి, హస్తకళలు, వస్త్రాలు, దుస్తులు, వినియోగ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్ సేవలు, మీడియా, ప్రకటనలు, వినోదం, పౌర సేవలు, టెలికం, మొబైల్, ఏఐ ఆధారిత సాంకేతికత, సీసీటీవీ కెమెరాలు, ఇతర పరికరాలు వంటి అనేక వ్యాపార విభాగాల్లో పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు నమోదయ్యాయని వివరించింది.

భారీగా ఆర్థిక కార్యకలాపాలు

మహాకుంభ మేళా ఆర్థిక ప్రయోజనాలు ప్రయాగ్‌రాజ్‌కు మాత్రమే కాకుండా 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నగరాలు, పట్టణాలకు కూడా విస్తరించాయి. అయోధ్య, వారణాసి, ఇతర మతపర ప్రదేశాలకు యాత్రికులు వెల్లువెత్తారు. మహాకుంభ మేళా భారత్‌లో వ్యాపారం, వాణిజ్యం, సాంస్కృతిక వ్యవస్థ రూపురేఖలను సానుకూలంగా మారుస్తుందని, ఏళ్ల తరబడి కొత్త రికార్డును సృష్టిస్తుందని భావిస్తున్నారు.

150 కిలోమీటర్ల పరిధిలో లబ్ధి



అయోధ్య ఆలయం వద్ద భక్తుల రద్దీ

రూ.1,500 కోట్ల పెట్టుబడిని ఎలా ప్రశ్నిస్తారు: యూపీ సీఎం యోగి

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ప్రయాగ్‌రాజ్‌లో ఫ్లైఓవర్లు, రోడ్లు, అండర్‌పాస్‌ల వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.7,500 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో మహా కుంభమేళా ఏర్పాట్ల కోసం రూ.1,500 కోట్లు వెచ్చించారు. మేళాకు రూ.4,000 కోట్లు ఖర్చు చేశారంటూ ప్రతిపక్షాలు చేసిన విమర్శలపై ఆ రాష్ట్ర సీఎం యోగి ఆదిత్యనాథ్ స్పందించారు. 'మహా కుంభమేళా కేవలం ఒక మతపర కార్యక్రమం మాత్రమే కాదు. యూపీ ఆర్థికాభివృద్ధికి కూడా ఒక ప్రధాన చోదక శక్తి. పర్యాటకం, వాణిజ్యాన్ని పెంపొందించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.3 లక్షల కోట్ల మేర దోహదపడుతుంటే, రూ.1,500 కోట్ల పెట్టుబడిని ఎలా ప్రశ్నించగలరు' అని ఆయన అన్నారు.

క్లుప్తంగా...

మహా కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

చర్లపల్లి–దానాపూర్–చర్లపల్లి మధ్య సర్వీసులు



సాక్షి, హైదరాబాద్: మహా కుంభమేళాకు వెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని.. మరి కొన్ని ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు చర్లపల్లి–దానాపూర్ (07749/07750) ప్రత్యేక రైలు ఈ నెల 22వ తేదీ ఉదయం 9.30 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి.. రెండోరోజు తెల్లవారుజామున 2 గంటలకు దానాపూర్‌కు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 22వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు దానాపూర్‌లో బయల్దేరి.. రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది. చర్లపల్లి–దానాపూర్ (07751/07752) మరో ప్రత్యేక రైలు 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు బయల్దేరి.. రెండో రోజు తెల్లవారుజామున 2 గంటలకు దానాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 23వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి.. రెండో రోజు ఉదయం 8.15 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

మొత్తం 76 ప్రత్యేక రైళ్లు

మహాకుంభమేళా సందర్భంగా హైదరాబాద్ నుంచి వెళ్లే భక్తుల కోసం జనవరి, ఫిబ్రవరి నెలల్లో మొత్తం 76 ప్రత్యేక, రెగ్యులర్ రైళ్లను నడిపినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఈ రైళ్లలో 1.4 లక్షల మంది ప్రయాణించారు. ఈ రైళ్లు 144 శాతం ఆక్యుపెన్సీతో నడిచాయి. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, చర్లపల్లి స్టేషన్ల నుంచి వీటిని నడిపారు. గయ, పట్నా, అజాంఘర్, దానాపూర్, రెక్సల్, ప్రయాగ్‌రాజ్‌లకు ఈ రైళ్లు రాకపోకలు సాగించాయి.

హైదరాబాద్–మదీనాకు నేరుగా విమాన సర్వీసు

శంషాబాద్: హైదరాబాద్ నుంచి మదీనాకు నేరుగా విమాన సర్వీసు శుక్రవారం ప్రారంభించారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌తో కలిసి జీఎంఆర్ సంస్థ ప్రతినిధులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కొత్త సర్వీసును ప్రారంభించారు. సోమ, గురు, శనివారాల్లో ఈ సర్వీసు ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. హైదరాబాద్–మదీనా ప్రయాణ సమయం 5.47 గంటలు ఉంటుంది. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ.. ఇండిగో ప్రారంభించిన ఈ కొత్త సర్వీసుతో అంతర్జాతీయంగా నెట్‌వర్క్ మరింత విస్తరిస్తుందన్నారు. ఆధ్యాత్మిక నగరాల్లో ఒకటైన మదీనాకు సర్వీసు ప్రారంభించడంతో హైదరాబాద్–మదీనాల మధ్యన రాకపోకలకు మార్గం మరింత సులువుగా మారుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీఎంఆర్, ఇండిగో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

పశువైద్య విశ్వవిద్యాలయం వీసీగా జ్ఞానప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జ్ఞాన ప్రకాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు మూడేళ్లపాటు ఆయన్ను ఈ పదవిలో నియమిస్తూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 1989లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించిన జ్ఞానప్రకాశ్.. అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్‌తో పాటు యూనివర్సిటీ కంప్ట్రోలర్, పరిశోధనల డైరెక్టర్, రిజిస్ట్రార్‌గా పలు హోదాల్లో పనిచేశారు. గత ఏడాది అక్టోబర్‌లో ఉద్యోగ విరమణ చేశారు. వరంగల్ జిల్లా హసన్‌పర్తికి చెందిన జ్ఞానప్రకాశ్.. పశువైద్యానికి సంబంధించి 114 పరిశోధన పత్రాలను సమర్పించారు.

24న సమతామూర్తి విగ్రహ సందర్శనకు సెలవు

శంషాబాద్ (హైదరాబాద్): ముచ్చింతల్‌లో సమతామూర్తి విగ్రహ సందర్శన ఈ నెల 24న ఉండదని నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆ రోజు సందర్శకులకు అనుమతి లేదని తెలిపారు. భక్తులు దీనిని గమనించాలని కోరారు.

క్యాబ్ సేవలకు సర్కారు యాప్!



- ఎన్నికల హామీ అమలు దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- ఐటీ శాఖ ఆధ్వర్యంలో యాప్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు
- ఇక ప్రైవేటు క్యాబ్ సర్వీసు సంస్థల చార్జీల మాయాజాలానికి చెక్

సాక్షి, హైదరాబాద్: నగరంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఏ క్యాబ్ చార్జీ కూడా స్థిరంగా ఉండదు. యాప్‌లో బుకింగ్ సమయంలో ఒకసారి ఒక ధర చూపితే మరో సమయంలో ఇంకో ధర చూపుతుంది. అదేంటంటే పీక్ అవర్ డిమాండ్ అనే సమాధానం వస్తుంది. క్యాబ్ సర్వీసులను జనం విపరీతంగా వినియోగించుకోవడాన్ని ఆసరాగా చేసుకొని క్యాబ్ సేవల సంస్థలు చార్జీల మాయాజాలాన్ని ప్రదర్శిస్తున్నాయి. మరోవైపు కమీషన్ల రూపంలో ఎక్కువ మొత్తం తీసుకుంటూ తమకు తక్కువ చెల్లిస్తున్నాయని క్యాబ్ డ్రైవర్లు చాలాకాలంగా ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వమే ఓ యాప్‌ను రూపొందించి ఓలా, ఉబర్ తరహా సేవలందించేందుకు సిద్ధమైంది.

ఇంతకాలం ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో..

ఓలా, ఉబర్ లాంటి సంస్థలు క్యాబ్ సర్వీసులు ప్రారంభించిన తర్వాత ప్రజలు వాటివైపు మళ్లారు. అల్పాదాయ వర్గాలు కూడా వీటి సేవలు వినియోగించుకుంటున్నాయి. ప్రస్తుతం నగరంలో 1.25 లక్షల ట్యాక్సీ కార్లు, 1.60 లక్షల ఆటోలు వీటితో సేవలు అందిస్తున్నాయి. ప్రయాణికులు క్యాబ్‌ను బుక్ చేసుకున్నప్పుడు అది ఏ ధర చూపుతుందనేది ఆ సంస్థకు మాత్రమే తెలుస్తుంది. వాటిపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడంతో చార్జీల విషయంలో జోక్యం చేసుకోవటం లేదు. కంపెనీలు వర్షం, ట్రాఫిక్ జామ్, క్యాబ్‌ల కొరత వంటి కారణాలను చూపి అధిక చార్జీ వసూలు చేస్తున్నాయి. బుక్ చేసినప్పుడు చూపే మొత్తం కంటే క్యాబ్ దిగేటప్పుడు చూపే మొత్తం అధికంగా ఉంటోందన్న ఫిర్యాదులకు లెక్కేలేదు. దీనిపై నియంత్రణ లేని కారణంగా రవాణాశాఖ ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. తమకు రావాల్సిన మొత్తం కంటే తక్కువ చెల్లిస్తున్నారని డ్రైవర్లు కూడా వాపోతున్నారు. దీంతో తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ పలుమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది.

ప్రభుత్వమే చార్జీలు నిర్ధారించాలి

ప్రభుత్వం సొంతంగా యాప్‌ను అందుబాటులోకి తెస్తే క్యాబ్, ఆటో చార్జీలను కూడా ప్రభుత్వమే నిర్ధారించాలి. ప్రైవేటు సంస్థలకు అప్పగించొద్దు. 10 శాతం వరకు కమీషన్‌ను ప్రభుత్వం మినహాయించుకుని ఆ మొత్తాన్ని దీని నిర్వహణకు, గిగ్ వర్కర్స్ సంక్షేమానికి ఖర్చు చేయాలి. వంద శాతం మొత్తాన్ని డ్రైవర్లకే చెల్లించాలని మేం కోరట్లేదు. ఇది డ్రైవర్లకు, ప్రయాణికులకు ఉపయుక్తంగా ఉండేలా ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) ప్లాట్‌ఫాంతో అనుసంధానించాలి.

– షేక్ సలావుద్దీన్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం రేవంత్ రాష్ట్రంలో ఎగ్జిబిషన్ మైదానంలో గిగ్ వర్కర్స్ యూనియన్‌తో సమావేశమై వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వారికి హామీ ఇచ్చినందున, దాన్ని అమలు చేసే బాధ్యత తీసుకుంటామని ప్రకటించారు. ప్రభుత్వపక్షాన సొంతంగా యాప్ ఏర్పాటు చేసి డ్రైవర్లకు ఎక్కువ మొత్తం అందేలా చేస్తామని కూడా హామీ ఇచ్చారు.

సమ్మె హెచ్చరికతో..

అప్పట్లో ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదు. పలుమార్లు గిగ్ వర్కర్స్ యూనియన్ గుర్తుచేసినా చర్యలు లేకపోవడంతో సమ్మెకు సిద్ధమని ఇటీవల ప్రకటించింది. దీంతో గురువారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ యూనియన్ సభ్యులతో సమావేశమై చర్చించారు. ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్‌కు ఫోన్ చేసి దీనిపై మాట్లాడారు. టీ–హబ్ ఆధ్వర్యంలో యాప్‌ను రూపొందిస్తామని గతంలో చెప్పారు. ఇప్పుడు ఆ కసరత్తు ప్రారంభిస్తున్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఈ తరహా ప్రయోగాలు చేయగా ప్రభుత్వమే నిర్వహిస్తున్న చోట్ల మెరుగ్గా, ప్రైవేటు చేతికి అప్పగించిన చోట నిరుపయోగంగా ఉన్నాయి.

సూపర్ మెమొరీ

జ్ఞాపకశక్తిలో భారతీయ విద్యార్థి ఘనత

- 13.50 సెకన్లలో 80 సంఖ్యల మననం
- మెమొరీ లీగ్ వరల్డ్ చాంపియన్‌షిప్–2025ను సొంతం చేసుకున్న పుదుచ్చేరి విద్యార్థి రాజ్‌కుమార్



న్యూయార్క్: మెమొరీ లీగ్ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఇటీవల నిర్వహించిన ఆన్‌లైన్ మెమొరీ పరీక్షలో భారత్‌లోని పుదుచ్చేరికి చెందిన మనకుల వినాయగర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థి విశ్వ రాజ్‌కుమార్ 'మెమొరీ లీగ్ వరల్డ్ చాంపియన్‌షిప్–2025' టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. 13.50 సెకన్లలో 80 క్రమరహిత (రాండమ్ నంబర్స్) సంఖ్యలు, 8.40 సెకన్లలో 30 చిత్రాలను గుర్తుపెట్టుకుని ఈ ఘనత సాధించాడు. దీంతో రాజ్‌కుమార్ 5,000 స్కోర్ సాధించినట్టు మెమొరీ లీగ్ వెబ్‌సైట్ తెలిపింది. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పుష్కలంగా నీటిని తాగడం వల్ల మెదడుకు గుర్తుపెట్టుకునే సామర్థ్యం పెరుగుతుందని తెలిపాడు. విషయాలను గుర్తుపెట్టుకునే క్రమంలో వాటిని నిశ్శబ్దంగా మననం చేసుకుంటామని, కొన్ని సందర్భాల్లో బిగ్గరగా చదువుతామని, ఆ సమయంలో సరిపడ నీళ్లను తాగకుంటే చదివే వేగం తగ్గిపోతుందని పేర్కొన్నాడు. ఎంత ఎక్కువ నీటిని తాగితే... అంత ఎక్కువగా చదివే వేగం పెరుగుతుందన్నాడు. తన చదువు పూర్తయిన తరువాత జ్ఞాపకశక్తిపై శిక్షణ ఇచ్చేందుకు మెమొరీ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించాలని యోచిస్తున్నట్లు వివరించాడు. ఇక పోటీ గురించి మాట్లాడుతూ 80 క్రమరహిత అంకెలు స్క్రీన్‌పై ప్రదర్శిస్తారని, సాధ్యమైనంత వేగంగా ఈ నంబర్లను మననం చేసుకోవాలని తెలిపాడు. ఆ తర్వాత బటన్ నొక్కితే రీకాల్ షీట్ వస్తుందని, దానిపై తాను మొత్తం అన్ని నంబర్లను 13.50 సెకన్లలో.. అంటే సెకనుకు ఆరు అంకెలు గుర్తుపెట్టుకుని రాశానని వివరించాడు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి



ఎస్‌బీఐ కొత్త శాఖలను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

- ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి
- కొత్తగా 10 ఎస్‌బీఐ శాఖలను ప్రారంభించిన చైర్మన్

సాక్షి, హైదరాబాద్: ఖాతాదారులు కేంద్రంగా అధికారులు, సిబ్బంది సేవలందించాలని ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సర్కిల్ పరిధిలో శుక్రవారం వర్చువల్ విధానంలో 10 కొత్త ఎస్‌బీఐ శాఖలను ఆయన ప్రారంభించారు. దీంతో ఈ సర్కిల్ పరిధిలో మొత్తం బ్రాంచీల సంఖ్య 1,206కు చేరుకుందన్నారు. ఈ కొత్త బ్యాంకుల్లో ఖాతాదారులకు మెరుగైన అన్ని రకాల సేవలందిస్తూ వారి మనసులు చూరగొనాలని, ఇది ఉద్యోగులకు ఒక పరీక్ష వంటిదని పేర్కొన్నారు. భారత్ అంతర్జాతీయంగా వేగంగా ఎదుగుతోందని, ఇందులో ఎస్‌బీఐ భాగస్వామ్యం కూడా ఉందని శ్రీనివాసులు శెట్టి వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా నాల్గవ స్థానంలో 'ది బెస్ట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా–2024' అని ఎస్‌బీఐని గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ఎంపిక చేసిందని తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసిన బ్రాంచీల్లో ఆలంపూర్ క్రాస్‌రోడ్స్, చిన్నంబావి, రాఘవేంద్రకాలనీ కొండాపూర్, నియోపొలిస్, కిష్టారెడ్డిపేట (పటాన్‌చెరు), ఖాజాగూడ, ఉస్మాన్‌నగర్, కంగ్టి (నారాయణఖేడ్), సుచిత్రా సర్కిల్ (కుత్బుల్లాపూర్), నందిపేట ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోత లేకుండానే పెద్దపేగు కేన్సర్ కణితి తొలగింపు!

- తెలుగు రాష్ట్రాలలోనే తొలిసారిగా 'నోసెస్' రోబోటిక్ సర్జరీ ద్వారా నిర్వహణ
- 74 ఏళ్ల వృద్ధురాలికి కాంటినెంటల్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

రాయదుర్గం: పెద్దపేగులో కేన్సర్ కణితితో బాధపడుతున్న ఓ 74 ఏళ్ల వృద్ధురాలికి హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. తెలుగు రాష్ట్రాలలోనే తొలిసారిగా రోగి పొత్తి కడుపును కోయకుండానే నేచురల్ ఆరిఫిస్ స్పెసిమెన్ ఎక్స్‌ట్రాక్షన్ (నోసెస్) పద్ధతి ద్వారా వైద్యులు విజయవంతంగా రోబోటిక్ సర్జరీ నిర్వహించారు. రోగికి గతంలో గర్భసంచి తొలగింపు ఆపరేషన్ జరగడం, ప్రస్తుతం అధిక రక్తపోటు సమస్య ఉండటంతో ఆమె వయసు దృష్ట్యా డాక్టర్ కౌశిక్‌రావు, డాక్టర్ మధుసూదన్‌రెడ్డిలతో కూడిన వైద్య బృందం రోబోటిక్ 'నోసెస్' విధానంలో శస్త్రచికిత్స చేపట్టింది. కాగా, తమ ఆస్పత్రిలో 'నోసెస్' విధానంలో జరిగిన రోబోటిక్ కేన్సర్ కణితి శస్త్రచికిత్స ఒక సంచలన శస్త్రచికిత్స అని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ గురు ఎన్. రెడ్డి పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సను అత్యంత నైపుణ్యంతో, కచ్చితత్వంతో నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించారు.

'ఫాల్కన్'పై ఈడీ ఈసీఐఆర్ నమోదు

- సంస్థ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అనంత అరెస్టు
- డైరెక్టర్, సీఓఓ, సీఈవోపై లుక్ ఔట్ సర్క్యులర్



సాక్షి, హైదరాబాద్: అధిక లాభాల ఆశ చూపించి అమాయకుల నుంచి రూ.850 కోట్లు దోచుకున్న ఫాల్కన్ ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ (ఎఫ్ఐడీ) కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ప్రారంభించింది. సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ (ఈవోడబ్ల్యూ) ఎఫ్ఐఆర్ ఆధారంగా శుక్రవారం ఈడీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) నమోదు చేశారు. ఇప్పటికే ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద దర్యాప్తు ప్రారంభించారు. హైటెక్ సిటీ హుడా ఎన్‌క్లేవ్ కేంద్రంగా ఫాల్కన్ క్యాపిటల్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 9,979 మంది డిపాజిటర్ల నుంచి రూ.1,700 కోట్లు వసూలు చేసిన సంగతి తెలిసిందే. దుబాయ్, మలేషియా తదితర ప్రాంతాల్లోని 14 షెల్ కంపెనీలకు రూ.850 కోట్లు మళ్లించింది. పలువురు బాధితుల ఫిర్యాదుల మేరకు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు ఈ నెల 11న ఆ సంస్థపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఫాల్కన్ క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ వైస్ చైర్మన్ ఓదెల పవన్‌కుమార్, డైరెక్టర్ కావ్య నల్లూరిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అనంతను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన ఫాల్కన్ డైరెక్టర్ అమర్‌దీప్ కుమార్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఆర్యన్ సింగ్, సీఈవో యోగేందర్ సింగ్ దుబాయ్‌కి పారిపోయారు. వీరిపై సైబరాబాద్ పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. వీరు సొంతంగా చార్టర్డ్ ఫ్లైట్ కొనుగోలు చేసి ప్రయాణిస్తున్నట్లు గుర్తించి దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టులను అప్రమత్తం చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
శనివారం । 22-2-2025

● ప్రకృతి కాంతకు ఎన్నెన్ని హొయలో..






అడవుల జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లా ప్రకృతి సోయగానికి చిరునామాగా నిలుస్తోంది. అలాంటి జిల్లాలోని అటవీ ప్రాంతంలో కాలానుగుణంగా వచ్చే మార్పులతో వృక్ష సంపద పంచుతున్న అందాలు కనువిందు చేస్తున్నాయి. వివిధ వర్ణాలతో కూడిన పలు జాతుల వృక్షాలు ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రారమ్మని ఆహ్వానిస్తున్నాయి. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆదిలాబాద్

అమీతుమీ.. అడవిలోనే

లొంగుబాటుకు మావోయిస్టు నేత హిడ్మా ససేమిరా

ఏదైనా అడవిలోనే తేల్చుకుంటానని అన్నట్లు సమాచారం ● హిడ్మా ఇలాకాలో భద్రతా దళాల పాగా


సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు నేత మడావి హిడ్మా పోలీసులకు లొంగిపోయేందుకు ససేమిరా అంటున్నట్టు తెలుస్తోంది. చావోరేవో అడవిలోనే తేల్చుకుంటానని స్పష్టం చేసినట్లు సమాచారం. మావోయిస్టు పార్టీలో కీలకమైన నిర్ణయాలు తీసుకునేది కేంద్ర కమిటీ. ఆ నిర్ణయాలను వివిధ ఏరియా కమిటీలు క్షేత్రస్థాయిలో అమలు పరుస్తుంటాయి. ఈ రెండు విభాగాలు జనతన సర్కార్ పాలనలో నిమగ్నమైతే, వీటికి రక్షణ కల్పించేది పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ). మావోయిస్టుల వరకు పీఎల్‌జీఏ అంటే ఆర్మీ అన్నట్టుగానే పరిగణిస్తారు. దాదాపు ఆరుకు పైగా పీఎల్‌జీఏ బెటాలియన్లు బస్తర్ అడవుల్లో ఉన్నాయి. ఇందులో బెటాలియన్ – 1కు కమాండర్‌గా మడావి హిడ్మా కొనసాగుతున్నాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుక్మా జిల్లాలు ఈ బెటాలియన్ కార్యక్షేత్రంగా ఉన్నాయి. ఈ బెటాలియన్ రక్షణలోనే సెంట్రల్ రీజినల్ కమిటీ, తెలంగాణ రాష్ట్ర కమిటీలు ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నాయి.

కీలక నేతల లొంగుబాటు

ఇటీవల దక్షిణ బస్తర్ ప్రాంతానికి చెందిన పలువురు కీలక మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరు ఇచ్చిన సమాచారం ప్రకారం నలువైపులా నిర్బంధం పెరిగిపోయినందున వ్యూహాత్మకంగా లొంగుబాటు ప్రతిపాదనపై పీఎల్‌జీఏ బెటాలియన్ -1లో చర్చ జరిగినట్టు తెలిసింది. దీనికి కమాండర్ హిడ్మా ఘాటుగా స్పందిస్తూ ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం ఎదుట లొంగుబాటు ఆలోచన లేదని తేల్చిచెప్పినట్లు సమాచారం. తాను దక్షిణ బస్తర్‌లోనే ఉంటానని, తాడోపేడో తేల్చుకుంటానని స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. దీంతో లొంగుబాటు చర్చ అక్కడితో ఆగిపోయినట్టు ప్రచారం జరుగుతోంది.

చొచ్చుకుపోయిన భద్రతా దళాలు

గతేడాది జనవరిలో ఆపరేషన్ కగార్ ఆరంభమైన తర్వాత భద్రతా దళాలు దక్షిణ బస్తర్ అడవుల్లోకి చొచ్చుకుపోయాయి. 2024 ఫిబ్రవరిలో హిడ్మా స్వగ్రామమైన పువర్తిలోనూ క్యాంపు ఏర్పాటు చేశాయి. ఈ ఏడాదికి దక్షిణ బస్తర్‌లో మావోయిస్టుల కంచుకోటగా ఉన్న కర్రిగుట్టల సమీపానికి చేరుకున్నాయి. జనవరి 16న అక్కడ ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఆ తర్వాత ఈ ఏరియాలో కీలకమైన పూజారి కాంకేర్‌లో బేస్ క్యాంప్ ఏర్పాటైంది. దీంతో కర్రిగుట్టలు సైతం మావోయిస్టులకు సురక్షితం కాదని తేలిపోయింది.



మావోయిస్టు పీఎల్‌జీఏ బెటాలియన్-1 కమాండర్ మడావి హిడ్మా (ఫైల్)

చి'వరి'కిలా..!



ధర్పల్లి మండలం మదన్‌తండా వద్ద ఎండిపోయిన వరి మడిలో మేస్తున్న పశువులు

నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం శివారులో తిరుపతి సాయన్న తన వ్యవసాయ భూమిలో నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు రాక.. ఏడెకరాల వరిని జీవాల మేతకు వదిలేశాడు. మరోపక్క లక్ష్మణ్ అనే రైతు తన పొలం మొత్తం ఎండిపోవడంతో పశువులను మేపుతూ కనిపించాడు.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ధర్పల్లి మండలం ఓన్నాజీపేట శివారులో జీవాలకు వదిలేసిన వరి మడులు

పోలీసులు ఎవరినీ చిత్రహింసలు పెట్టలేదు

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులు చెబుతున్నది అవాస్తమన్న పీపీ

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో నిందితులెవరినీ పోలీసులు చిత్రహింసలు పెట్టలేదని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు హైకోర్టుకు నివేదించారు. ఈ కేసులో దర్యాప్తును నిలిపివేస్తూ మూడు రోజుల కిందట జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవరించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం మరోసారి విచారణ చేపట్టారు. పీపీ వాదనలు వినిపిస్తూ.. న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు నిందితులు ప్రయత్నిస్తున్నారన్నారు. ట్రయల్ కోర్టు ముగ్గురు నిందితులకు బెయిల్ ఇచ్చిందని.. ఇదే కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు (ఏ-1), రాధాకిషన్‌రావు (ఏ-2) కూడా బయటే ఉన్నారన్నారు. అందువల్ల పోలీసులు కేసు దర్యాప్తు చేపడితే వచ్చే నష్టం ఏమీ లేదని చెప్పారు. అయితే సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూద్రా అందుబాటులో లేనందున ఈ నెల 27కు విచారణ వాయిదా వేయాలని కోరారు. దీంతో గతంలో మార్చి 3కు వాయిదా వేసిన విచారణను న్యాయమూర్తి.. ఈ నెల 27కు ముందుకు జరిపారు.

జైలు నుంచి ముగ్గురు నిందితులు విడుదల

సిటీ కోర్టులు: చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫోన్ ట్యాపింగ్ ఫిర్యాదులో పోలీసులు అరెస్ట్ చేసిన ఏ-3 వంశీకృష్ణ, ఏ-4 సంతోశ్‌కుమార్, ఏ-5 పర్శరాములు శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరై ఒక్కొక్కరూ రూ. 20 వేల చొప్పున రెండేసి పూచీకత్తులను సమర్పించారు. ఈ కేసులో ఏ-1, ఏ-2గా ఉన్న హరీశ్‌రావు, రాధాకిషన్‌రావు హైకోర్టును ఆశ్రయించగా వారిని అరెస్టు చేయవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించడం తెలిసిందే. మిగిలిన ముగ్గురు నిందితులను ఈ నెల 15న పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతో వారి తరఫున న్యాయవాది జక్కుల లక్ష్మణ్ నాంపల్లి కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసి వాదనలు వినిపించారు. న్యాయవాది వాదనలతో ఏకీభవించిన కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ పలు షరతులు విధించింది. దీంతో వారు కోర్టుకు హాజరై పూచీకత్తులు అందజేయడంతో పాటు పాస్‌పోర్టులను కూడా కోర్టుకు అందజేశారు. దీనిపై విచారించిన కోర్టు వారిని విడుదల చేస్తూ తదుపరి విచారణ ఈనెల 28 వాయిదా వేసింది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్ జరిగిందంటూ నమోదైన కేసులో భాగంగా శుక్రవారం నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ విచారణకు ఇప్పటికే బెయిల్‌పై విడుదలైన నిందితులు ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు కోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణను కోర్టు మార్చి 21 వాయిదా వేసింది.

మాతృభాషల పరిరక్షకుడు గణేశ్

జర్మనీ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుంటూరు వాసి

● తెలుగు సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న మాతృభాషలకు డిజిటలైజేషన్‌తో జీవం పోసిన విద్యావేత్త





గణేశ్ తొట్టెంపూడి, జర్మనీ యూనివర్సిటీ ప్రొఫెసర్, మాతృభాషలకు సంబంధించిన సమావేశాల్లో తన సహచర ఉద్యోగులతో గణేశ్ తొట్టెంపూడి

మోర్తాడ్ (బాల్కొండ): మాతృభాషతోనే మనిషి మనుగడ సాధ్యం. భూమిపై ఉన్న ఎన్నో రకాలైన ప్రాణులు జీవిస్తున్నా ఒక్క మనిషి మాత్రమే తనలోని భావాలను వ్యక్తం చేయ డానికి మాతృభాషను ఏర్పాటు చేసుకున్నాడు. గ్లోబలైజేషన్ కారణంగా అనేక మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. మాతృభాష లేకుంటే మనిషి పురోగతి సాధించడం అసాధ్యమవుతుంది. అందుకే మాతృభాషల పరిరక్షణే ధ్యేయంగా తనవంతు కృషి చేస్తున్నారు జర్మనీ యూనివర్సిటీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ లాంగ్వేజెస్ ప్రొఫెసర్ గణేశ్ తొట్టెంపూడి. ఏపీలోని గుంటూరుకు చెందిన ఈ విద్యావేత్త 22 ఏళ్లుగా ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూ మాతృభాషల పరిరక్షణ కోసం విశేషమైన కృషి చేస్తున్నారు. తెలుగుతో సహా జర్మన్, ఫ్రెంచ్, డచ్, అరబిక్ భాషలతో పాటు యూరప్, సౌత్‌ఆఫ్రికా, చైనా, జపాన్, సోవియట్ యూనియన్ దేశాల్లోని ఎన్నో మాతృభాషలకు డిజిటలైజేషన్‌తో జీవం పోశారు. భాషకు సాంకేతికత తోడైతే ఆ భాషను బతికించడానికి అవకాశం ఉందని నమ్మిన గణేశ్ తన వృత్తిని ప్రవృత్తిగా మార్చుకుని ఎన్నో మాతృభాషలకు జీవం పోశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ సహకారంతో ఆయా దేశాల్లోని మాతృభాషలను డిజిటలైజేషన్ చేయడంతో పాటు లిపి లేని భాషలకు లిపీంద్రీకరణ చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో డిగ్రీ వరకు విద్యా బోధన అక్కడి మాతృభాషలోనే సాగుతుందని పీజీ నుంచి ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారని గణేశ్ 'సాక్షి'తో చెప్పారు. సమాజానికి భాష ఎంతో అవసరం అని ఆయన పేర్కొన్నారు. సౌత్‌ఆఫ్రికాలో జరిపిన పరిశోధనలో పదుల సంఖ్యలో జనం ఉండే గిరిజన ప్రాంతాల్లో వారి కోసం ప్రత్యేకమైన మాతృభాష ఉందని తెలిపారు. అక్కడి జనం అంతరించిపోతే ఆ భాష కూడా కనుమరుగవుతుందని గుర్తించి వారి భాషను ఆధునీకరించామని వివరించారు.

కేటీఆర్‌పై కేసుల్లో మీ వైఖరేంటి?

కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావుపై ముషీరాబాద్, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల్లో వైఖరిని తెలియజేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. సాక్ష్యాలు, ఆధారాల్లేకుండా తనపై ముషీరాబాద్, బంజారాహిల్స్ పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలంటూ కేటీఆర్ హైకోర్టులో రెండు పిటిషన్లు వేశారు. 2023 నవంబర్ 27న ఎన్నికల ప్రచార ర్యాలీలో బాణాసంచా కాల్చి ప్రజలకు ఇబ్బంది కలిగించానని ఆరోపిస్తూ నాటి ముషీరాబాద్ ఏఎస్ఐ ఆర్. ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ర్యాలీకి అనుమతి తీసుకున్నామని.. బాణాసంచా కాల్చడం వల్ల ఇబ్బంది పడ్డట్లు ఎవరూ ఫిర్యాదు చేయలేదని గుర్తు చేశారు. అలాగే కాంట్రాక్టర్లు, బిల్డర్ల సీఎం రేవంత్ రూ. 2,500 కోట్లు వసూలు చేసి ఢిల్లీకి పంపారంటూ 2024 మార్చి 27న తాను వ్యాఖ్యానించినట్లు ఆరోపిస్తూ బంజారాహిల్స్ స్టేషన్‌లో కాంగ్రెస్‌కు చెందిన బి. శ్రీనివాస్‌రావు ఫిర్యాదు చేశారని కేటీఆర్ మరో పిటిషన్‌లో పేర్కొన్నారు. దీని ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. ఇది రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారణ చేపట్టారు.

'బార్'ల ఎన్నికలపై వాదనలు వింటాం

బార్ అసోసియేషన్లు, బార్ కౌన్సిల్ వివాదంపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లు, బార్ కౌన్సిల్ మధ్య నెలకొన్న ఎన్నికల వివాదంపై విచారణ చేపడతామని హైకోర్టు తెలిపింది. బార్ అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకోకుండా బార్ కౌన్సిల్‌ను నిరోధించాలని, అసోసియేషన్ల కాలపరిమితిని రెండేళ్లకు పెంచలేమని కౌన్సిల్ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్‌తో పాటు 24 వివిధ కోర్టుల అసోసియేషన్లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రస్తుతానికి స్టేటస్‌కో ఆదేశాలు అవసరం లేదంటూ.. ఒకవేళ ఈలోపు కౌన్సిల్ నోటీసులు జారీచేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించొచ్చని అసోసియేషన్లకు సూచించారు. తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేశారు. అసోసియేషన్ల తరఫున సీనియర్ న్యాయవాది అయ్యాడపు రవీందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకునే అధికారం కౌన్సిల్‌కు లేదని తెలిపారు. కౌన్సిల్ కలుగజేసుకోకుండా స్టేటస్‌కో ఆదేశాలివ్వాలని కోరారు. రాష్ట్రంలోని బార్ అసోసియేషన్లపై బార్ కౌన్సిల్ నిబంధనలు విధించడం న్యాయవాదుల చట్టం 1961లోని నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. చట్టప్రకారం బార్ అసోసియేషన్ల రోజువారీ కార్యకలాపాల్లో, ఎన్నికల్లో జోక్యం చేసుకునే అధికారం కౌన్సిల్‌కు లేదని తెలిపారు. బార్ అసోసియేషన్లు కమిటీ పదవీకాలాన్ని రెండేళ్లకు పెంచాలని రాష్ట్రంలోని అన్ని అసోసియేషన్లు (110) తీర్మానించి, వినతిపత్రం ఇచ్చినా బార్ కౌన్సిల్ తిరస్కరించి మార్చి 31న ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపిందని చెప్పారు. దీంతో ఈ అంశంపై విచారణ చేపట్టి వాదనలు వింటామని చెప్పిన ధర్మాసనం.. విచారణను 25వ తేదీకి వాయిదా వేసింది.

మీ విభేదాలపై దృష్టి పెట్టండి

బీజేపీకి ఫిషరీస్ చైర్మన్ సాయికుమార్ హితవు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను.. తెలంగాణ ఫిషరీస్ కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఖండించారు. ముందు బీజేపీలో అంతర్గత విభేదాలపై ఆ పార్టీ నేతలు దృష్టి పెడితే మంచిదని హితవు పలికారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర బీజేపీ నాయకత్వాన్ని ఆ పార్టీ నేతలు, పార్టీకి చెందిన 8 మంది ఎమ్మెల్యేలే పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యేల్లో నలుగురో, ఐదుగురో కాంగ్రెస్ పార్టీలోకి రాకుండా చూసుకోవాలని ఎద్దేవా చేశారు. బీజేపీలో అజ్ఞానులు కోకొల్లలని, బండి సంజయ్‌తో సహా ఆ పార్టీ నేతలు ఎవరికైనా రాజకీయ శిక్షణ కావాలంటే.. గాంధీభవన్‌కు రావాలని సాయికుమార్ ఆహ్వానించారు.

కృష్ణా జలాలపై మంత్రి సొల్లు పురాణం

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి
● కాంగ్రెస్, బీజేపీ వల్లే తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం
● పంటలను కాపాడటంపై మంత్రి ఉత్తమ్ దృష్టి పెట్టాలి

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను పొరుగు రాష్ట్రం ఏపీ దోచుకెళ్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఇదే విషయాన్ని ప్రస్తావించిన మాజీ మంత్రి హరీశ్‌రావుపై నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెత్త మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి పొంచి ఉన్న నీటి గండంపై ప్రశ్నిస్తే, సోయి లేకుండా మంత్రి సొల్లు పురాణం చెప్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణకు నీటి వాటాల విషయంలో కాంగ్రెస్, బీజేపీలు అన్యాయం చేశాయన్నారు. ఇతరులు రాసిన స్క్రిప్ట్‌ను చదువుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఏపీ సీఎం చంద్రబాబును మాత్రం ప్రశ్నించడం లేదన్నారు. కృష్ణా జలాల్లో 50 శాతం నీటి వాటా కోసం ప్రయత్నిస్తున్నాం అని చెపుతున్న మంత్రి ఉత్తమ్, రాష్ట్రంలో ఎండుతున్న పంటలను కాపాడటంపై దృష్టి పెట్టాలని సూచించారు. మోదీ, చంద్రబాబుకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందన్నారు. నదీ జలాల్లో తెలంగాణకు తగిన వాటా దక్కేలా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని జగదీశ్‌రెడ్డి ప్రకటించారు. కేసీఆర్‌ను దూషించడం మానుకుని కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించడంపై మంత్రులు దృష్టి పెట్టాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టడం వల్లే సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై స్పందించాలని ఆయన అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బీఆర్ఎస్‌పై చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, ఆయనకు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించాలని జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

తడి చెత్తతో వుడ్ బ్రిక్స్ తయారీ

హోటళ్లు, పాఠశాలల్లో వంటచెరుకుగా ఉపయోగం



యంత్రం ద్వారా బయటకు వస్తున్న బ్రిక్స్

భద్రాచలం అర్బన్: భద్రాచలం గ్రామపంచాయతీ పరిధి లో సేకరించిన తడిచెత్తతో ప్రత్యేక యంత్రాల ద్వారా వుడ్ బ్రిక్స్ తయారీకి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని హోటళ్లలో ధాన్యం ఊకకు బదులుగా మాత్రమే కాక.. ప్రభుత్వ పాఠశాలల్లో వంట పొయ్యిల్లో వినియోగానికి వీటిని అందజేయనున్నారు. తద్వారా చెత్తను పునర్వినియోగించినట్లవుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిక్స్ తయారీకి భద్రాచలంలో ఇటీవల ఏర్పాటు చేసిన యంత్రాల ట్రయల్‌రన్‌ను బుధవారం నిర్వహించగా విజయవంతమైందని గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. గురువారం నుంచి పూర్తి స్థాయిలో ఈ యంత్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని వెల్లడించారు. ఇలాంటి ప్లాంట్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని పీర్జాదిగూడ మున్సిపాలిటీలో మాత్రమే ఉండగా, గ్రామ పంచాయతీల్లో మాత్రం భద్రాచలమే మొదటిదని స్పష్టం చేశారు.

రెక్కల గుర్రాలొచ్చాయి..



కథల్లో చెప్పిన రెక్కల గుర్రాలు నిజజీవితంలో కనిపించవుకానీ.. రంగురంగుల గుర్రపు బొమ్మలు మాత్రం ఇలా విశాఖ వీధుల్లో కనువిందుచేస్తున్నాయి. ఎండుగడ్డితో తయారుచేసిన బొమ్మలకు ఇలా ముఖమల్ క్లాత్‌తో కుట్టి అందమైన దారాలతో అలంకరించి రోడ్డు పక్కన అమ్ముతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

వేసవిలో చల్లచల్లగా..



తిరుపతి-కరకంబాడీ మార్గంలో ఓ ఉద్యోగి వేసవి కాలం నేపథ్యంలో ముందుగానే ప్రణాళికాబద్ధంగా ఇంటి ముందు చల్లదనం కోసం కాగితపు పూల మొక్కలను ఇలా ప్రత్యేక శ్రద్ధతో పెంచారు. దీంతో చల్లగాలి ఇంట్లోకి వచ్చి వేసవిలోనూ ఇల్లు చల్లగా ఉంటుందని తెలిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

బిడ్డా.. బడికిపో



రెక్కాడితే కాని డొక్కాడని మాలాంటి పరిస్థితి నీకు వద్దమ్మా.. బడికి పోకపోతే భవిష్యత్తు అంధకారమవుతుంది. బడికిపోయి చక్కగా చదువుకోబిడ్డా.. అంటూ ఓ వృద్ధురాలు తన మనవరాలిని బుజ్జగించి బడికి పంపిస్తోంది. అనంతపురం నగరంలో శుక్రవారం ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

వైఎస్ జగన్ ఫొటోలు మార్ఫింగ్ చేసే వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతిలో పోలీసులకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఫిర్యాదు



తిరుపతి క్రైమ్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు శుక్రవారం తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ×టీడీపీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు నిరంతరం వైఎస్ జగన్ ఫొటోలను మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారు. వారు సోషల్ మీడియాలో పెట్టే ఫొటోలు, వీడియోలు మాజీ ముఖ్యమంత్రి పరువు, ప్రతిష్టలను, వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఉంటున్నాయి. టీడీపీకి అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు హద్దులు మీరి పోస్టులు పెడుతూ ప్రజలను రెచ్చగొడుతున్నారు. ప్రజాశాంతికి భంగం కలిగిస్తున్నారు. ఇలాంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.₹ అని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పోలీసులకు ఫిర్యాదు చేసినవారిలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు ఉదయ వంశీ, పసుపులేటి సురేష్ రాయల్, అనిల్‌రెడ్డి, మల్లం రవికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, బి.ప్రకాష్ తదితరులు ఉన్నారు.

అత్త చెయ్యి నరికిన అల్లుడు

గంగవరం: తన భార్యపై కత్తితో దాడికి ప్రయత్నించిన ఓ వ్యక్తి... అడ్డువచ్చిన అత్త చెయ్యి నరికేశాడు. ఈ ఘటన చిత్తూరు జిల్లా గంగవరం మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ పెద్ద ఉగిణి గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద ఉగిణి గ్రామానికి చెందిన యూనిస్, సాల్మాకు రెండేళ్ల కిందట వివాహమైంది. యూనిస్ మద్యానికి బానిసగా మారి తనను వేధిస్తున్నాడని సల్మా వారం కిందట పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి రోజూ యూనిస్ మద్యం తాగి అత్తవారింటికి వెళ్లి గొడవ చేస్తున్నాడు. గురువారం రాత్రి కూడా మద్యం తాగిన యూనిస్ అందరూ నిద్రిస్తున్న వేళ కత్తి తీసుకుని అత్తవారింటికి వెళ్లి భార్య సల్మాపై దాడికి ప్రయత్నించాడు. ఆమె భయంతో ఇంట్లోకి వెళ్లి తలుపు వేసుకుంది. అడ్డువచ్చిన అత్త షమీలపై యూనిస్ కత్తితో దాడి చేయగా, ఆమె చెయ్యి తెగి పడింది. సల్మా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గంగవరం పోలీసులు శుక్రవారం యూనిస్‌ను అదుపులోకి తీసుకున్నారు. గాయపడిన షమీలను పలమనేరు ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా, తిరుపతికి రెఫర్ చేశారు.

తిరుపతి ఐఐటీలో తిరుత్సవ-2025 ప్రారంభం



రేణిగుంట: తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో సాంకేతిక, సాంస్కృతిక సంబరం- తిరుత్సవ-2025 వేడుకలు డైరెక్టర్ ప్రొఫెసర్ కలిదిండి ఎస్ సత్యనారాయణ పర్యవేక్షణలో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు వైభవంగా జరిగే ఈ ప్రారంభ వేడుకల్లో తెలుగు సినీ సంగీత దర్శకులు ఎస్ఎస్ థమన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశం సాంకేతికంగా పురోభివృద్ధి దిశగా పయనించడంలో ఐఐటీల పాత్ర కీలకమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రొఫెసర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రంలో తిరుపతి ఐఐటీ ప్రస్థానం చరిత్రాత్మకమన్నారు. తిరుత్సవ-2025 వేడుకలను ఐఐటీ విద్యార్థులతోపాటు దేశంలోని పలు కళాశాలల నుంచి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులతో కలసి వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు.

చింత.. నిశ్చింత..

- చింతను నమ్ముకుని జీవనం సాగిస్తున్న మడకశిర ప్రజలు
- నియోజకవర్గ వ్యాప్తంగా 2 లక్షల వరకు చింతచెట్లు
- సుమారు 20 వేల కుటుంబాలకు జీవనాధారం



చింతపండు మార్కెట్ -	హిందూపురం
లావాదేవీలు -	ప్రతి సోమ, గురువారం
సీజన్ -	ఫిబ్రవరి నుంచి ఏప్రిల్
యార్డ్‌లో ట్రేడ్ ఏజెన్సీలు -	70
ఒక్కో ఏజెన్సీ నుంచి -	100 టన్నులవరకు ఎగుమతి

సాక్షి, పుట్టపర్తి: అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గంలో అనేక గ్రామాల ప్రజలు చింత చెట్టును నమ్ముకుని నిశ్చింతగా జీవనం సాగిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో దశాబ్దాల తరబడి దాదాపు 20 వేల కుటుంబాలు చింత చెట్లనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 334 గ్రామాలు ఉండగా.. సుమారు 2 లక్షల చింతచెట్లు ఉన్నాయి. ప్రధాన మార్కెట్ అయిన హిందూపురం మార్కెట్‌కు వచ్చే సరుకులో అత్యధికంగా మడకశిర నుంచే వస్తుంది. గత మూడేళ్ల నుంచి చింత రైతులకు కూలీ వ్యయం బాగా పెరిగింది. చింతపండు ధర మాత్రం యథావిధిగా ఉండటంతో ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. చింతకాయలు కోసేందుకు కూలీలకు రోజుకు రూ.800 చొప్పున ఇవ్వాలి. మిగతా నూరిడి పనులకు అయితే రోజుకు రూ.300 ఇస్తారు. చింతపండును శుద్ధి చేసి మార్కెట్‌కు తరలించేందుకు క్వింటాల్‌కు రూ.2 వేల చొప్పున అదనంగా భరించాల్సి ఉంటుంది. పండు బాగా ఉంటే నాణ్యత ఆధారంగా క్వింటాల్ రూ.30 వేల వరకు ధర పలుకుతుంది. సరుకు బాగా లేకపోతే ధరలో వ్యత్యాసం ఉంటుంది. కొందరు సరిగా శుద్ధిచేయలేక తక్కువ ధరకు విక్రయిస్తుంటారు.

హిందూపురం యార్డ్‌లో విక్రయాలు..

ఏటా ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు వారానికి రెండు రోజులు (సోమ, గురు) చొప్పున హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో చింతపండు విక్రయాలు జరుగుతాయి. సీజన్‌లో గరిష్టంగా 28 సార్లు అమ్మకాలు ఉంటాయి. మార్కెట్ యార్డులో సుమారు 70 ట్రేడ్ ఏజెన్సీలు ఉన్నాయి. ఒక్కో ఏజెన్సీ నుంచి సగటున 100 టన్నుల చింతపండుఎగుమతి అవుతుంది. అందులో సగంపైగా మడకశిర నియోజకవర్గం నుంచి వస్తుండటం విశేషం. మిగతా సరుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి చేరుతుంది.

సీజన్ ముగిశాక శీతల గిడ్డంగుల్లోకి..

రైతుల నుంచి సేకరించిన సరుకును హిందూపురం మార్కెట్‌లో బాక్సుల్లో నింపి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. సీజన్ పూర్తయ్యేలోగా మిగిలిన సరుకును స్థానికంగా ఉన్న శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. లారీ చింతపండుకు ఏడాదికి రూ.25 వేలు చొప్పున అద్దె చెల్లించి శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుతారు. మడకశిరకు సమీపంలోనే హిందూపురం ఉండటంతో రైతులకు రవాణా ఖర్చులు కూడా కలిసివస్తాయి.



ఈ సారి ఖర్చు పెరిగింది



గతంతో పోలిస్తే ఈసారి ధరలు స్థిరంగా ఉన్నాయి. నేను 16 ఏళ్ల నుంచి చింత చెట్ల నుంచి ఫలసాయం పొందుతున్నా. ప్రతి ఏటా లాభాలు వచ్చేవి. అయితే ఈసారి మాత్రం ఖర్చు పెరిగింది. ఆశించిన స్థాయిలో ఆదాయం రాలేదు. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పిస్తే రవాణా ఖర్చులు మిగులుతాయి.

– రైతు జయరామప్ప, మెట్టబండపాళ్యం, మడకశిర మండలం

దిగుబడి తగ్గింది



మా తోట చుట్టూ 25 చింత చెట్లు ఉన్నాయి. ఈ ఏడాది వింత రోగం వచ్చి దిగుబడి తగ్గింది. అందుకే ఒక్కో చెట్టును రూ.2 వేల చొప్పున వ్యాపారికి అమ్మేశాను. దిగుబడి బాగా ఉండి ఉంటే చెట్టు రూ.3 వేలు పైగా ధర పలికేది.

– వీరాముద్దప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

మండలి ఎన్నికల్లో 'కూటమి'కి పాట్లు

- రెండు పట్టభద్రులు, ఒక టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 27న ఎన్నికలు
- పీడీఎఫ్, కూటమి మధ్య పోటాపోటీ
- టీడీపీ అభ్యర్థులకు సామాజిక 'పోటు'

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్ర శాసనమండలిలో మూడు స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు తిప్పలు తప్పడం లేదు. తొమ్మిది నెలల పాలనలో కూటమి సర్కారు అన్ని రంగాలలో వైఫల్యం చెందడం ఆ పార్టీ అభ్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తోంది. టీడీపీ అరాచకాలు అన్నింటా శృతిమించి పరాకాష్టకు చేరడం అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్థానాలకు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

పోటీలో 70 మంది ...

మండలిలో మూడు స్థానాలకు కూటమి, పీడీఎఫ్ అభ్యర్థులతోపాటు స్వతంత్రులు 70 మంది పోటీ పడుతున్నారు. గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల స్థానానికి టీడీపీ నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ నుంచి కె.ఎస్.లక్ష్మణరావుతో పాటు 25 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ నుంచి పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ నుంచి దిడ్ల వీరరాఘవులుతోపాటు 35 మంది పోటీచేస్తున్నారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పదవికి పది మంది బరిలో ఉన్నారు. కూటమి అభ్యర్థిగా పాకలపాటి రఘువర్మ, పీడీఎఫ్ తరఫున కోరెడ్ల విజయగౌరి, స్వతంత్ర అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు తలపడుతున్నారు.

మొత్తం 6,84,830 మంది ఓటర్లు

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో 6,62,337 మంది తమ హక్కును వినియోగించుకోనున్నారు. కృష్ణా-గుంటూరు జిల్లాల నుంచి పట్టభద్రులైన 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది మహిళలు, ఇతరులు 45 మంది ఓటర్లుగా ఉన్నారు. గోదావరి జిల్లాల నుంచి పట్టభద్రులుగా పురుషులు 1,83,734, స్త్రీలు 1,31,507, ఇతరులు 20 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఉత్తరాంధ్ర నుంచి టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 13,508 మంది పురుష ఉపాధ్యాయులు, 8,985 మంది మహిళా టీచర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

ప్రధాన పోటీ టీడీపీ, పీడీఎఫ్‌ల మధ్యే...

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ప్రధాన పోటీ టీడీపీ, పీడీఎఫ్ అభ్యర్థుల మధ్య నెలకొందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి తరఫున అంటున్నప్పటికీ మూడు స్థానాల నుంచి పోటీలోని అభ్యర్థులు టీడీపీకి చెందిన అగ్రవర్ణాల వారే. పీడీఎఫ్ నుంచి ఓసీ, బీసీ, ఎస్సీ వర్గాల వారు పోటీచేస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తలపడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన నాయకుడు. ఈ స్థానం నుంచి పీడీఎఫ్ తరఫున అనుభవజ్ఞులైన మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు వివిధ సంఘాల మద్దతుతో బలమైన పోటీదారుగా ఉన్నారు. ఆలపాటికి స్వపక్షంలోని రెండు జిల్లాల్లోని సీనియర్ నేతల నుంచే ఆశించిన కనీస మద్దతు లభించడం లేదు. జనసేన, బీజేపీ నుంచి సహకారం అంతంత మాత్రమే అనే ఆందోళన టీడీపీ అధిష్ఠానం నుంచే వ్యక్తమవుతోంది. ఆలపాటి అభ్యర్థిత్వమే ప్రధాన లోపమనే వ్యాఖ్యలు లేకపోలేదు.

- కాకినాడ జిల్లాకు చెందిన కాపు సామాజికవర్గ నాయకుడైన పేరాబత్తుల రాజశేఖరం టీడీపీ నుంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీలో ఉన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో టీడీపీ, జనసేనల మధ్య రాజకీయ వ్యవహారాలు పైకి పటారం, లోన లొటారం అన్న రీతిలో కొనసాగుతున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు రాజమహేంద్రవరం నుంచి ఎంపీగా ఉన్నప్పటికీ ఆ పార్టీ ఉనికే తెలియడం లేదు. పీడీఎఫ్ అభ్యర్థిగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రిటైర్డు టీచర్ దిడ్ల వీరరాఘవులుది తూర్పుగోదావరి జిల్లా. ఆయనకు ఉపాధ్యాయ, పట్టభద్రుల్లో గుర్తింపు ఉండటంతోపాటు గతంలో ఇక్కడి నుంచి పీడీఎఫ్ అభ్యర్థులు విజయం సాధించడం, ఉపాధ్యాయ సంఘాలతోపాటు ఇతర 50 సంఘాలు మద్దతు ఇప్పటికే ప్రకటించాయి. ఈ స్థానం నుంచి మాజీ ఎంపీ హర్షకుమార్ కుమారుడు సుందర్ ఇండిపెండెంట్‌గా ఉన్నందున ప్రభావం ఎంతమేర ఉంటుందనేది పరిశీలకులు అంచనాలు వేస్తున్నారు.
- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పదిమంది రంగంలో ఉన్నప్పటికీ టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకాలపాటి రఘువర్మ, పీడీఎఫ్ నుంచి కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ బలపరచిన మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు ప్రధాన పోటీదారులుగా ఉన్నారు. పాకాలపాటి, గాదెల పనితీరు గురించి ఉపాధ్యాయవర్గాలకు ఓ అవగాహన ఉండగా విజయగౌరికి యూటీఎఫ్‌తోపాటు సంఘాల మద్దతు దక్కుతోంది. ప్రత్యేకించి మహిళా టీచర్ల నుంచి ఆమెకు పెద్దఎత్తున సానుకూలత కనపడుతుందనేది పరిశీలకుల అంచనా.

మాతృభాష ఆవశ్యకతను భావితరాలకు తెలియజేయాలి



తిరుపతి సిటీ: మాతృభాష మనుగడను కాపాడాలంటే భావితరాలకు తెలుగు భాష ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉందని డీన్ ప్రొఫెసర్ సి వాణి పేర్కొన్నారు. పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సావేరి అతిథి గృహం వేదికగా శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆంగ్లమాధ్యమం కేవలం కమ్యూనికేషన్‌కు మాత్రమే ఉపయోగపడుతుందని, కానీ దీంతో మాతృభాష మనుగడకు ప్రమాదం అన్నారు. ప్రపంచదేశాలు సైతం తెలుగు భాషను గుర్తించి గౌరవిస్తున్నాయని తెలిపారు.

మిరప క్వింటాల్ రూ.25వేలకు కొనుగోలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



సాక్షి,అమరావతి: కేంద్రంపై ఆధారపడకుండా తక్షణమే మిరప రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి క్వింటా రూ.25వేలకు కొనుగోలు చేసి మిరప రైతులకు అండగా నిలవాలని కోరారు. విదేశీ మారకద్రవ్యాన్ని తెచ్చిపెడుతున్న మిర్చి రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.క్రిష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. ఒక్క మిరపే కాదు రాష్ట్రంలో వరి, పత్తి, మిరప, కంది, ఉలువలు, శనగ, జొన్న, మొక్కజొన్న వంటి ఏ ఒక్క పంటకు ఈ ఏడాది మద్దతు ధర లభించలేదని తెలిపారు. క్వింటాకు ధాన్యం రూ.400–500, పత్తికి రూ.5వేల నుంచి రూ.6వేలు, కందికి రూ.3వేలు, శనగ, ఉలువలకు రూ.4వేలకు పైగా రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి రైతులు పండించిన ప్రతీ పంటకు మద్దతు ధరలు నిర్ణయించి ప్రభుత్వ ఏజెన్సీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక సమాచారం



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,776 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,386 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.24 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నయన మనోహరం శ్రీవారి బ్రహ్మోత్సవం



చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. నాలుగవరోజు అయిన శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా స్వామి వారు సర్వభూపాల వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. శుక్రవారం స్వామి వారు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు చంద్రకోలు, దండం ధరించి కల్పవృక్షవాహనంపై శ్రీరాజమన్నార్ అలంకరణలో స్వామివారు భక్తులకు అభయమిచ్చారు. కల్పవృక్షం ఇవ్వలేని ధర్మమోక్షాన్ని నేను అనుగ్రహిస్తానని నిరూపిస్తూ స్వామి వారు భక్తులను కటాక్షించారు.

సుందరగిరిపై నృసింహ మహాయజ్ఞానికి ఏర్పాట్లు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభువుగా కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో, అతిరుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృసింహ 31వ మహాయజ్ఞ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు వేద పండితులు, రుత్వికులు వేద మంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో, సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షణలో ప్రధాన యజ్ఞం ప్రారంభానికి సూచికగా మహా గణపతి లక్షమోదక హోమాన్ని ఆలయ యాగశాలలో వైభవంగా నిర్వహించారు.

విద్యా సమాచారం



జాతీయ సమైక్యత శిబిరంకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

తిరుపతి సిటీ: జాతీయ యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం నాగర్ కోయిల్ నందు ఫిబ్రవరి 22 నుంచి 28 వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంకు ఎస్వీయూ ఎన్ఎస్ఎస్ బ్యూరో ఆధ్వర్యంలో ఐదు మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శిబిరంలో పాల్గొననున్న విద్యార్థులను అభినందించారు.

స్పోర్ట్స్ స్టయిఫండ్‌కు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) సౌత్ జోన్ స్పోర్ట్స్ స్టయిఫండ్ కోసం అర్హత కలిగిన ప్రతిభావంతులైన క్రీడాకారులు 2025–26 సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సయ్యద్ సాహెబ్ తెలిపారు. ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్‌కు సంబంధించి బాలురు, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాలకు సంబంధించి బాలబాలికలు అర్హులని తెలిపారు. 15 నుంచి 18, 18 నుంచి 24 ఏళ్లలోపు వారు మార్చి 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎఫ్‌సీఐ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

స్కిల్‌డెవలప్‌మెంట్‌తోనే ఉద్యోగాలు



తిరుపతి సిటీ: ఇంజినీరింగ్ విద్యార్థినులు అకడమిక్ విద్యతో పాటు ప్రధానంగా ఆధునిక సాంకేతికతపై నైపుణ్యాన్ని పెంచుకోవాలని గాదంకి ఎన్ఏఆర్ఎల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్పేస్ హెచ్‌ఓడీ డాక్టర్ కేకేఎస్‌వీవీ ప్రకాష్‌రావు సూచించారు. పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో విద్యుత్స్-2025 పేరుతో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవ ప్రారంభోత్సవానికి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. నూతన ఆవిష్కరణలు, ఇంధన పరిరక్షణ, సౌరశక్తి ప్రాముఖ్యత, విద్యుత్ పంపిణీ వ్యవస్థ, సాధారణ రాకెట్ ప్రయోగ కేంద్రం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పనితీరు వంటి విషయాలపై అవగాహన కల్పించారు.

● పాడుదాం గేయం



పరీక్షలంటే భయమెందుకు?

1
ఎందుకెందుకు.. భయం ఎందుకు
పరీక్షలంటే మనకు భయమెందుకు
దిగులెందుకు.. వణుకెందుకు
ధైర్యంతో సాగుదాం...
మునుముందుకు

2
శ్రద్ధగా విందాం బడిలో పాఠం
బుద్ధిగా చేద్దాం చెప్పిన కార్యం
ప్రశ్నకు జవాబు గట్టిగా చదివి
రాద్దాం చక్కగా...
ఎదుగుదాం ఎత్తుగా

3
గురువుల మాట ఎన్నడూ తప్పక
చదవాల్సినది వాయిదా వేయక
బద్ధకం.. నిర్లక్ష్యం వద్దేవద్దంటూ
రాద్దాం చక్కగా...
ఎదుగుదాం ఎత్తుగా

4
అడ్డదారుల్లో అసలే సాగక
మేలు దారుల్లో బాటలు వేయగా
ఊరువాడా మెచ్చుకొని దీవించగా
పరీక్ష రాద్దాం చక్కగా...
ఎదుగుదాం ఎత్తుగా

5
మార్కులెన్ని వచ్చినా
ఉప్పొంగక.. గొప్పలు పోక
తక్కువ వస్తే కుంగిపోక బెంగటిల్లక
తదుపరి తరగతికి సిద్ధమవుతూ
చదువుదాం చక్కగా...
ఎదుగుదాం ఎత్తుగా

గుడ్‌లక్



స్కూల్‌కు సరిగా వెళ్లలేదు. మధ్యలో టైఫాయిడ్ వచ్చింది. లెసెన్స్ అర్థం కాలేదు. మేథ్స్ చాలా టఫ్... ఇలా సంజాయిషీలు చెప్తుంటాం పరీక్షలకు ముందు. అలా ప్రకృతి చెప్పదు. రుతువుల గతి మార్చుకోదు. కరువు ఉన్నా, వానలు పడకపోయినా, ఎండలు ప్రచండంగా ఉన్నా తను ఎక్కడో ఒక చోట ఒక చిగురు వేస్తూనే ఉంటుంది. పువ్వు పూస్తూనే ఉంటుంది. ఇక్కడ చూడండి... అందమైన ఫొటో. బెర్లిన్‌లో మార్చిలో వసంత రుతువు వస్తుంది. దాని రాకను ప్రకటిస్తూ దట్టమైన మంచులో కూడా పూసిందీ పసుపుపచ్చని పువ్వు. మనం ఇలా ఉండాలి. మనం చేయదగ్గది చేయాలి. రిజల్ట్స్ సంగతి తర్వాత. నెపాలు వెతక్కుండా మీ మీద మీరు విశ్వాసం ఉంచుకొని బాగా చదవండి. పరీక్షలు బాగా రాయండి. ఆల్ ద బెస్ట్.

● వండర్ కిడ్

నేను బాషా ఒక్కసారి రాస్తే 400 భాషల్లో రాసినట్టు!

మీకు ఎన్ని భాషలొచ్చు? తెలుగు, హిందీ, ఇంగ్లీషు.. ఇంకా? ఈ మూడేనా? నాలుగైదు భాషలు మాట్లాడేవారు మీ చుట్టుపక్కల ఎవరైనా ఉన్నారా? మాట్లాడటం సరే, వాళ్లు ఆ భాషలు రాయగలరా? అసాధ్యం అనుకుంటున్నారా? ఆ అసాధ్యాన్ని సాధ్యం చేసి చూపించాడు చెన్నైకి చెందిన మహమూద్ అక్రమ్. అతను ఎన్ని భాషల్లో రాయగలడో తెలుసా? అక్షరాలా 400 భాషలు. అంతేకాకుండా, సుమారు 46 భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడు. ఈ ఘనతలతో అతను ఇప్పటికి మూడు ప్రపంచ రికార్డులు సాధించాడు.



● తండ్రి షిల్పీ మొళిప్పిరిన్‌తో మహమూద్ అక్రమ్

అక్రమ్ తండ్రి షిల్పీ మొళిప్పిరిన్. ఉద్యోగరీత్యా రకరకాల దేశాలు ప్రయాణించేవారు. ఆ సమయంలో అక్కడి స్థానిక భాష అర్థంకాక, వారితో మాట్లాడలేక ఇబ్బంది పడేవారు. దీంతో మెల్లగా ఆ భాషలు నేర్చుకోవడం మొదలుపెట్టి 16 భాషల్లో మాట్లాడే స్థాయికి వచ్చారు. తండ్రిని చూస్తూ పెరిగిన అక్రమ్ కూడా అలా రకరకాల భాషల మీద ఆసక్తి పెంచుకున్నాడు.. దాంతో తండ్రి అక్రమ్‌కు నాలుగేళ్ల వయసు నుంచే రకరకాల భాషల్లోకి పదాలు, వాటికి అర్థాలు నేర్పించేవారు. ఆరు రోజుల్లో మొత్తం ఇంగ్లీషు అక్షరాలు నేర్చుకున్న అక్రమ్, మూడు వారాల్లో తమిళంలోని 299 అక్షరాలను నేర్చేసుకుని ఆ చిన్నవయసులోనే అందర్నీ ఆశ్చర్యపరిచాడు.

ఆరేళ్ల వయసొచ్చేసరికి తండ్రితో రకరకాల భాషల్లో మాట్లాడటమే కాకుండా తమిళ వాక్యాలను స్పష్టంగా చదవడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత రెండేళ్లలో మరో 50 భాషలు సాధన చేసి, వాటి మీద అవగాహన తెచ్చుకున్నాడు. కొడుకు ఆసక్తిని గమనించి, వివిధ భాషల పుస్తకాలు తెప్పించి, అతనికి ఇచ్చేవారు మొళిప్పిరిన్. కేవలం చదవడమే కాకుండా, ఆ భాషల్లో టైప్ చేయడం కూడా మొదలుపెట్టిన అక్రమ్, అతి చిన్నవయసులో వివిధ భాషలు టైప్ చేసి మొదటి ప్రపంచ రికార్డు సాధించాడు.

10 ఏళ్ల వయసులో మన జాతీయ గీతం 'జనగణమన'ను ఒక్క గంటలో 20 భాషల్లో రాసి రెండో ప్రపంచ రికార్డు సాధించాడు. 12 ఏళ్ల వయసు వచ్చేసరికి 400 భాషలు చదివి, రాసి, టైప్ చేస్తూ ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తాడు. దీంతో మూడో సారి అతనికి ప్రపంచ రికార్డు సొంతమైంది. ఒక వాక్యాన్ని వీలైనన్ని ఎక్కువ భాషల్లో అనువాదం చేసే ప్రక్రియలో ఆరితేరిన అక్రమ్, అందుకుగానూ జర్మనీ దేశంలో ప్రతిష్ఠాత్మకమైన 'జర్మనీ యంగ్ టాలెంట్ అవార్డు' అందుకున్నాడు. అనువాదంలో అతని వేగం చూసి సీనియర్ అనువాదకులు సైతం ఆశ్చర్యపోయారు.



అయితే భాషల మీద ఇంత పట్టున్న అతనికి స్కూళ్ల నుంచి ప్రోత్సాహం రాలేదు. భాషల మీద కాకుండా కేవలం సబ్జెక్టుల మీదే దృష్టి పెట్టాలని అతణ్ని ఒత్తిడి చేశారు. దీంతో స్కూల్ మానేసి, ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి పాసయ్యాడు. ఆ తర్వాత అతని ప్రతిభ గుర్తించి, ఆస్ట్రియాలోని డనుబే ఇంటర్నేషనల్ స్కూల్ అతనికి స్కాలర్‌షిప్ ఇచ్చి మరీ తమ స్కూల్లో చేర్చుకుంది. ప్రస్తుతం అక్రమ్ యూకేలోని ఓపెన్ యూనివర్సిటీ నుంచి భాషావిభాగంలో ఒకేసారి రకరకాల డిగ్రీలు చేస్తున్నాడు. తన భాషా పరిజ్ఞానాన్ని మరింత విస్తరించుకోవాలన్న ఉత్సాహంతో ఉన్నాడు.

● ఆదర్శం

వీరిలాగే మీరూ చదివిస్తారా?





● సెంథిల్, సర్జున్



పిల్లలూ! మీరందరూ రోజుకు స్కూల్‌కి వెళ్లి ఎన్నో విషయాలు నేర్చుకుంటారు. ప్రతినెలా మీ అమ్మానాన్న స్కూల్ ఫీజు కట్టి, మీకు కావాల్సినవన్నీ ఇస్తారు. కానీ అందరికీ అమ్మానాన్నలు ఉండరు. ఒకవేళ ఉన్నా, అందరి దగ్గరా వాళ్ల పిల్లల్ని స్కూల్‌కి పంపించేంత డబ్బులు ఉండవు. అలాంటి వాళ్లు చదువుకు దూరమైతే ఎలా? మీరెప్పుడైనా ఆలోచించారా? ఇలాంటి ఆలోచనే బెంగళూరుకు చెందిన ఇద్దరు ఇంజినీర్లకు వచ్చింది. దానికి వారే పరిష్కారాన్ని కనుక్కొని, సొంతంగా ఓ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించారు. దాని గురించి తెలుసుకుందామా?

సెంథిల్, సర్జున్ అనే ఇద్దరు మిత్రులు బెంగళూరులో ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వారి దృష్టి బెంగళూరు నగరానికి వలస వచ్చే పల్లెటూరు ప్రజల మీద పడింది. పనులు వెతుక్కుంటూ వచ్చేవారు తమ వెంట పిల్లల్ని తీసుకొస్తారు. వారికి గుడిసెల్లోనో, షెడ్లలోనే ఉంచి వీళ్లు పనికి వెళ్తారు. లేదా పిల్లల్ని కూడా తమ వెంట తీసుకుని వెళ్తారు. దీంతో ఆ పిల్లలకు చదువు అందదు. వారి అమ్మానాన్నల కొచ్చే సంపాదనతో వారికి తిండి, బట్టలు కూడా సరిగా అందవు.

ఈ పరిస్థితిని మార్చాలని సెంథిల్, సర్జున్ అనుకున్నారు. దీంతో 2019లో 'Proud Indian' అనే స్వచ్ఛంద సంస్థ ప్రారంభించారు. నగరంలోని మురికివాడలు, రోడ్డు పక్కన నివాసముండే వారి వద్దకు వెళ్లి, వారి పిల్లలకు ఆహారం, బట్టలు ఇవ్వడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మరికొన్ని స్వచ్ఛంద సంస్థల సాయంతో వారున్న చోటికే వెళ్లి, అక్కడ కమ్యూనిటీ స్కూళ్లు ఏర్పాటు చేశారు. అక్కడే వారికి చదువు చెప్పడం ప్రారంభించారు.

అక్కడున్న పిల్లల్ని మూడు విభాలుగా చేసి, వారి వయసుకు తగ్గట్టు చదువు చెప్తారు. ఆపై వారి చేత పదో తరగతి పరీక్షలు రాయిస్తారు. అలా సుమారు 1,900 మంది చిన్నారులకు వాళ్లు చదువు చెప్పారు. వారిలో కొందరు ఇప్పుడు కాలేజీల్లో చదువుతున్నారు. దీంతోపాటు పెయింటింగ్, బట్టలు కుట్టడం, బొమ్మలు తయారు చేయడం వంటి అంశాలపై ఆసక్తి ఉన్న పిల్లలకు అవీ నేర్పించి, వారు సొంతంగా ఉపాధి పొందేలా చూస్తారు.

చూశారుగా! నిరుపేద పిల్లల కోసం వారెంత కృషి చేస్తున్నారో! మీరు కూడా మీ చుట్టూ అలాంటి పిల్లలుంటే వారికి సాయం చేయండి. రోజూ కొంతసేపు వారికి చదువు చెప్పండి. వారితో స్నేహంగా ఉండండి.

● మహనీయులు

పిల్లల నోటికి బువ్వ అందించారు



పిల్లలూ! ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం పూట విద్యార్థులకు భోజనం పెడతారన్న విషయం మీకు తెలుసా? పిల్లలు టిఫిన్ బాక్సులు తీసుకెళ్లకుండా, అక్కడ వండి, వడ్డించే అన్నాన్నే తింటారు. ఈ పద్ధతి చాలా బాగుంది కదా? మరి ఈ విధానాన్ని ఆలోచించింది, ఆచరణలోకి తెచ్చింది ఎవరో తెలుసా? తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కె.కామరాజ్. ఆయన గురించి తెలుసుకుందామా?

కె.కామరాజ్ 1903 జులై 15న అప్పటి మద్రాసు రాష్ట్రంలోని విరుదుపట్టి అనే ప్రాంతంలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు కుమారస్వామి, శివగామి అమ్మాల్. వారికి కంచి కామాక్షి అమ్మవారు ఇష్టదేవత. అందుకే పుట్టిన మగబిడ్డను 'కామాక్షి' అని, 'రాజా' అని పిలిచేవారు. చివరకు ఆ పేరు 'కామరాజ్'గా స్థిరపడింది. ఆయనకు ఆరేళ్ల వయసు ఉండగానే ఆయన తాత, ఆ తర్వాత ఆయన తండ్రి మరణించారు. దీంతో కుటుంబం ఇబ్బందులు పడింది. అతికష్టమ్మీద చదువుకున్న కామరాజ్ 12వ ఏట చదువు మానేసి, తన మేనమామ నడిపే బట్టల దుకాణంలో పనికి వెళ్లడం మొదలుపెట్టాడు.

అక్కడ ఉన్న సమయంలో స్థానికంగా ఉండే సమస్యలు, చుట్టుపక్కల జరిగే విషయాలను గమనిస్తూ తనకు తోచిన విధంగా ఇతరులకు సాయపడుతూ ఉండేవాడు. అప్పట్లో స్వాతంత్ర్యోద్యమం మొదలవడంతో పలువురు ప్రముఖులు వచ్చి ఉపన్యాసాలు ఇచ్చేవారు. ఆ కార్యక్రమాలు వెళ్లే కామరాజ్ వారి ప్రసంగాలతో ఉత్తేజితుడయ్యేవాడు. బంకించంద్ర ఛటర్జీ, సుబ్రహ్మణ్య భారతి రాసిన పుస్తకాలను ఇష్టంగా చదివేవాడు. అనీ బీసెంట్ 'స్వపరిపాలన' ఉద్యమానికి ఆకర్షితుడయ్యాడు.

ఆ తర్వాత 1921లో తొలిసారి కామరాజ్ మహాత్మాగాంధీని మదురైలో కలిశారు. ఆయన భావాలు, ఆలోచనలకు ఆకర్షితుడైన కామరాజ్ తను కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని నిశ్చయించుకున్నాడు. ఆ తర్వాత అనేక ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. కొన్ని సందర్భాల్లో పోలీసులు ఆయన్ని అరెస్టు చేసి, జైల్లో ఉంచారు. అలా సుమారు 3 వేల రోజులు కామరాజ్ జైల్లోనే గడిపారు. అయినా ఆయన ఏమాత్రం చలించలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మద్రాసు రాష్ట్రానికి మూడో ముఖ్యమంత్రిగా సేవలందించారు.

ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే తమిళనాడు రాష్ట్రంలోని విద్యావిధానంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చారు. పిల్లలు ఆకలితో పాఠాలు వినకుండా దేశంలోనే మొదటిసారిగా వారికి మధ్యాహ్న భోజనం అందించే ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్కూళ్లల్లో యూనిఫారం వేసుకునే విధానం సైతం ఆయనే అమల్లోకి తెచ్చారు. ఆయన అమలు చేసిన విధానాలను ఆ తర్వాత దేశమంతా అమలు చేశారు.

ఇలా ఎన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకున్నా కామరాజ్ మాత్రం చాలా నిరాడంబరంగా జీవించేవారు. ఆయన మరణించేనాటికి ఆయనకున్న ఆస్తి 130 రూపాయలు, రెండు జతల చెప్పులు, నాలుగు చొక్కాలు, ధోతీలు, కొన్ని పుస్తకాలు. ఆయన మరణానంతరం కేంద్ర ప్రభుత్వం ఆయనకు దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించింది.

చూశారుగా! మామూలు స్థాయి నుంచి ఎదిగిన కామరాజ్, దేశానికి ఎన్ని సేవలందించారో! మీరు కూడా అలా అందరికీ ఉపయోగపడే పనులు చేసి పేరు తెచ్చుకోవాలి.

● మన సినిమా

పెంగ్విన్ తో దోస్తీ కడదామా..!



పిల్లలూ... మీకు ఫ్రెండ్స్ ఎవరున్నారు అని అడిగితే ఠక్కున మీ ఫ్రెండ్స్ పేర్లన్నీ చెప్పేస్తారు. కాని బ్రెజిల్ దేశంలో చేపలు పట్టే జోవో డిసౌజాని అడిగితే మాత్రం తన ఫ్రెండ్ పెంగ్విన్ అని ఎక్సైట్‌మెంట్‌తో చెప్తాడు. అసలీ బెస్తవాడు ఎవరు, పెంగ్విన్ ఏంటి అనేది తెలియాలంటే 'మై పెంగ్విన్ ఫ్రెండ్' అనే సినిమా చూడాల్సిందే. కథమేమిటంటే బ్రెజిల్‌లో చేపలు పడుతూ బతికే డిసౌజా ఓరోజు సముద్రంలో గాయపడి బాధపడుతున్న ఉన్న ఓ పెంగ్విన్‌ని చూస్తాడు. ఆ పెంగ్విన్ సముద్రంలోని నూనె కలుషితాల వల్ల రాతి బండలకు సివియర్‌గా గాయపడి ఉంటుంది. డిసౌజా ఆ పెంగ్విన్‌ని కాపాడి ఇంటికి తీసుకువస్తాడు. దానికి డిన్‌డిమ్ అని పేరు కూడా పెడతాడు. డిన్‌డిమ్ త్వరగా కోలుకోని డిసౌజాతో ఫ్రెండ్షిప్ చేస్తుంది. ఇద్దరూ మంచి ఫ్రెండ్స్ అవుతారు. డిసౌజా డిన్‌డిమ్ గురించి అక్కడి సీ కోస్టు అంతా గొప్పగా చెప్పుకుంటాడు. కాని ఓ రోజు డిన్‌డిమ్ తన పెంగ్విన్ కుటుంబాన్ని వెతుక్కుంటూ హటాత్తుగా వెళ్లిపోతుంది. దీంతో డిసౌజా చాలా బాధ పడతాడు. మరి డిన్‌డిమ్ మళ్ళీ తన ఫ్రెండ్ డిసౌజాని కలుస్తుందా లేదా అన్నది మాత్రం హాట్‌స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న 'మై పెంగ్విన్ ఫ్రెండ్' సినిమా చూసి తెలుసుకోండి. ఈ సినిమాలో పెంగ్విన్ చేసే అల్లరి చాలా సరదాగా ఉంటుంది. ఇంకో సర్‌ప్రైజింగ్ విషయమేంటో తెలుసా. ఇదో రియల్ స్టోరీ. 2016లో నిజంగానే జరిగింది. దానిని మూవీగా తీశారు ఎంజాయ్ ది పెంగ్విన్ ఫ్రెండ్షిప్ బై ట్యూనింగ్ హాట్‌స్టార్.

- ఇంటూరి హరికృష్ణ

● ఈ నీతి వాక్యాలు

- అతి వినయం ధూర్త లక్షణం
- ఆలస్యం అమృతం విషం
- ఆడి తప్పవద్దు
- అప్పు చేయ వద్దు
- కలసిఉంటే కలదు సుఖం
- నిదానమే ప్రదానం
- నోరు మంచిదైదే ఊరు మంచిదవుతుంది
- పెద్దల మాట చద్దికూటి మూట
- పాలుత్రాగి పరుగెత్తేకంటే నీళ్ళు త్రాగి నిలబడటం మేలు

బిజినెస్ రీల్

డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్



చెన్నై: కంటి వైద్య సేవల్లో ఉన్న డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ తాజాగా క్రికెట్ లెజెండ్ సచిన్ టెండూల్కర్‌ను ప్రచారకర్తగా నియమించుకుంది. టెండూల్కర్‌కు గౌరవ సూచకంగా రెండు దశాబ్దాలకుపైగా '100 సెంచరీలు, 100 రోగులు' నినాదంతో ఏటా 100 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ తెలిపింది. 'సచిన్ టెండూల్కర్ మా బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం మాకు గౌరవంగా ఉంది. కంటి సంరక్షణలో మా అత్యుత్తమ ప్రయాణంలో ఆయనతో అనుబంధం ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుంది' అని వివరించింది.

హెడ్ డిజిటల్ చేతికి అడ్డా52

డీల్ విలువ రూ. 491 కోట్లు

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ పోకర్ ప్లాట్‌ఫామ్ అడ్డా52ను హెడ్ డిజిటల్ వర్క్స్(హెచ్‌డీడబ్ల్యూ) రెండు దశలలో కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ. 491 కోట్లు వెచ్చించనున్నట్లు ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ సంస్థ హెచ్‌డీడబ్ల్యూ వెల్లడించింది. అడ్డా52 మాతృ సంస్థ డెల్టాటెక్ గేమింగ్(డీజీఎల్)లో తొలుత హెచ్‌డీడబ్ల్యూ 51 శాతం వాటా సొంతం చేసుకోనుంది. తదుపరి హెచ్‌డీడబ్ల్యూలో డీజీఎల్ విలీనంకానుంది. విలీనం పూర్తయ్యాక హెచ్‌డీడబ్ల్యూలో డెల్టాకార్ప్(డీసీఎల్) 5.7 శాతం వాటా పొందనుంది. ఏ23 రమ్మీ, ఏ23 పోకర్ తదితర రియల్‌మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్ అభివృద్ధి, నిర్వహణను హెచ్‌డీడబ్ల్యూ చేపట్టే విషయం విదితమే.

గ్రాన్యూల్స్ చేతికి స్విస్ కంపెనీ

డీల్ విలువ రూ. 192 కోట్లు



న్యూఢిల్లీ: ఔషధ రంగ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా సీడీఎంవో సేవల స్విట్జర్లాండ్ కంపెనీ సెన్ కెమికల్స్ ఏజీను కొనుగోలు చేసింది. ఇందుకు సుమారు రూ. 192 కోట్లు వెచ్చించింది. గ్లోబల్ కస్టమర్ల కోసం సెన్ పెప్టైడ్స్, పెప్టైడ్స్ ఆధారిత అప్లికేషన్ల అభివృద్ధి, తయారీలను చేపడుతోంది. తద్వారా కాంట్రాక్ట్, రీసెర్చ్, డెవలప్‌మెంట్, తయారీ(సీడీఎంవో) సర్వీసులు అందిస్తోంది. 2025 తొలి అర్ధభాగానికల్లా కొనుగోలు ప్రక్రియ పూర్తికానున్నట్లు అంచనా వేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-2-2025

విశాఖ	445-00
చిత్తూరు	493-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	440-00
విజయవాడ	450-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	425-00
వరంగల్	427-00
రిటైల్ ధర	4.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	652.15	2.09
TATASTEEL	140.6	1.85
EICHERMOT	4,968.00	1.63
LT	3,315.50	1.21
SBILIFE	1,480.55	0.73

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	2,663.50	-6.2
ADANIPORTS	1,082.00	-2.67
BPCL	251.7	-2.67
TATAMOTORS	672.4	-2.52
ADANIENT	2,125.00	-2.48

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,125
ఎన్ఎస్ఈ	85,628
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,21,203
ఎఫ్ఐఐ	- 3,449
డీఐఐ	+ 2,885

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	71.01	$	72.48
బ్రెంట్	75.01	$	76.48

ఫ్రెషర్లకు ఈ ఏడాది అధిక అవకాశాలు



- 74 శాతానికి చేరిన నియామక ఉద్దేశ్యం
- టీప్‌టెక్ నైపుణ్యాలున్న వారికి ప్రాధాన్యం
- టీమ్‌లీజ్ ఎడ్యుటెక్ కెరీర్ అవుట్‌లుక్ వెల్లడి

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఫ్రెషర్లకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఫ్రెషర్ల నియామక ఉద్దేశ్యం కంపెనీల్లో 74 శాతానికి చేరినట్టు టీమ్‌లీజ్ ఎడ్యుటెక్‌కు చెందిన కెరీర్ అవుట్‌లుక్ సర్వే నివేదిక వెల్లడించింది. రాబోయే నెలలకు సంబంధించి వ్యాపార విశ్వాసాన్ని ఇది తెలియజేస్తున్నట్టు పేర్కొంది. ముఖ్యంగా ఐటీ రంగం కోలుకోవడం ఫ్రెషర్లకు మరిన్ని అవకాశాలను తెచ్చిపెట్టనున్నట్టు తెలిపింది. ప్రస్తుత ఏడాది తొలి ఆరు నెలల కాలానికి నివేదికను విడుదల చేసింది. డీప్‌టెక్ ఉద్యోగాలైన రోబోటిక్ ప్రాసెస్ ఆటోమేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సర్టిఫైడ్ రోబోటిక్ ఇంజనీర్ కోర్స్, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, ఏఐ అప్లికేషన్లలో ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లకు డిమాండ్ ఉన్నట్టు వెల్లడించింది. ఈ సర్వేలో 649 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కొన్ని రంగాలు ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో నియామకాలకు సంబంధించి బలమైన ధోరణిని వ్యక్తం చేశాయి. ఈ-కామర్స్ అండ్ టెక్నాలజీ స్టార్టప్‌ల్లో ఫ్రెషర్ల నియామక ధోరణి 61 శాతం నుంచి 70 శాతానికి పెరిగింది. తయారీలో 52 శాతం నుంచి 66 శాతానికి, ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాలో 59 శాతం నుంచి 69 శాతానికి పెరిగింది.

ఐటీ రంగంలో జోష్

''ఐటీ రంగం చెప్పుకోతగ్గ మేర కోలుకుంది. ఆరంభ స్థాయి ఉద్యోగుల నియామకాల ఉద్దేశ్యం 2024 ద్వితీయ 6 నెలల కాలంలో ఉన్న 45% నుంచి, 2025 మొదటి 6 నెలల కాలానికి 59 శాతానికి పెరిగింది. హెల్త్‌కేర్, ఫార్మాస్యూటికల్స్ రంగంలోనూ ఇది 47% నుంచి 52 శాతానికి పెరిగింది'' అని ఈ నివేదిక వెల్లడించింది. విద్యుత్, ఇంధన రంగం, మార్కెటింగ్ అండ్ అడ్వర్టైజింగ్ సైతం బలమైన వృద్ధిని చూపించినట్టు తెలిపింది. భౌగోళికంగా చూస్తే బెంగళూరు 78%, ముంబై 65%, ఢిల్లీ ఎన్‌సీఆర్ 61%, చెన్నై 57% చొప్పున తాజా గ్రాడ్యుయేట్లకు అవకాశాలు కల్పించనున్నట్టు పేర్కొంది. క్లినికల్ బయోఇన్ఫర్మాటిక్స్ అసోసియేట్, రోబోటిక్స్ సిస్టమ్ ఇంజనీర్, సస్టెయినబులిటీ అలనిస్ట్, ప్రాంప్ట్ ఇంజనీర్, ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ ఇంజనీర్, క్లౌడ్ ఇంజనీర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ వర్ధమాన కెరీర్ మార్గాలుగా అవతరిస్తున్నట్టు తెలిపింది. సమకాలీన వ్యాపార అవకాశాల దృష్ట్యా కంపెనీలు ముఖ్యంగా రోబో టిక్ ప్రాసెస్ ఆటోమేషన్, పెర్ఫార్మెన్స్ మార్కెటింగ్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, ఫైనాన్షియల్ రిస్క్ అనలైసిస్ నైపుణ్యాలున్న వారి కోసం చూస్తున్నాయని ఈ నివేదిక వెల్లడించింది.

రుణాల ముందస్తు ముగింపుపై చార్జీలొద్దు

ప్రతిపాదించిన ఆర్‌బీఐ



ముంబై: బ్యాంక్‌లు రుణాల ముందస్తు చెల్లింపులపై రుణగ్రహీతల నుంచి ప్రీ పేమెంట్ పెనాల్టీ/ఫోర్‌క్లోజర్ పేరుతో వసూలు చేసే చార్జీల విధానాన్ని తొలగించే దిశగా ఆర్‌బీఐ ముఖ్యమైన ప్రతిపాదన చేసింది. వ్యక్తులు, ఎంఎస్ఈలు తీసుకునే అన్ని ఫ్లోటింగ్ రేటు రుణాలు, వ్యాపార అవసరాలకు తీర్చుకునే వాటిపైనా ముందస్తు చెల్లింపుల చార్జీలు ఉండకూడదన్నది ఈ ప్రతిపాదన ఉద్దేశ్యం. ''టైర్ 1, టైర్ 2 ప్రాథమిక అర్బన్ కోపరేటివ్ బ్యాంక్‌లు, బేస్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు మినహా అన్ని రెగ్యులేటెడ్ ఎంటిటీలు (ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోని అన్ని రకాల బ్యాంక్‌లు, ఇతర ఎన్‌బీఎఫ్‌సీలు) ఫ్లోటింగ్ రేటు రుణాలను ముందుగా తీర్చివేస్తే ఎలాంటి చార్జీలు/పెనాల్టీలు విధించరాదు''అని ఆర్‌బీఐ ముసాయిదా సర్క్యులర్ పేర్కొంది. ఎంఎస్ఈ రుణ గ్రహీతలు అయితే రూ.7.50 కోట్ల వరకు పూర్తి రుణ మొత్తాలకు ఇది వర్తిస్తుంది. ఎలాంటి లాకిన్ పీరియడ్ లేకుండా దీన్ని అమలు చేయాలని పేర్కొంది. ఈ ముసాయిదాపై మార్చి 21 వరకు సూచనలు, సలహాలను ఆహ్వానిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది.

ఈవీ బ్యాటరీ తయారీలోకి కైనెటిక్

రూ.50 కోట్లతో మహారాష్ట్రలో ప్లాంట్



ముంబై: ఆటోమోటివ్ విడిభాగాల రంగంలో ఉన్న కైనెటిక్ గ్రూప్ ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీ తయారీ రంగంలోకి ప్రవేశించింది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో రూ.50 కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఫెసిలిటీలో ద్విచక్ర, త్రిచక్ర ఎలక్ట్రిక్ వాహనాల కోసం 60,000 రేంజ్-ఎక్స్ బ్రాండ్ బ్యాటరీలను తయారు చేస్తారు. లిథియం-అయాన్ ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్‌పీ), నికెల్ మాంగనీస్, కోబాల్ట్ (ఎన్ఎంసీ) రకం బ్యాటరీలు కూడా ఉత్పత్తి అవుతాయని కంపెనీ తెలిపింది. వాహన తయారీ సంస్థలకు సైతం వీటిని సరఫరా చేయనున్నట్టు వెల్లడించింది. త్రీవీలర్స్ కోసం ప్రిస్మాటిక్ సెల్స్ అభివృద్ధి చేస్తున్నట్టు కైనెటిక్ గ్రూప్ వివరించింది. కైనెటిక్ గ్రూప్‌నకు చెందిన ప్రధాన సంస్థ అయిన కైనెటిక్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఐదు దశాబ్దాలకు పైగా ఆటోమోటివ్ రంగంలో నిమగ్నమైంది. అహ్మద్‌నగర్ తయారీ కేంద్రంలో కంపెనీ 32 తయారీ షెడ్స్‌లో సుమారు 1,000 మందిని నియమించింది. 400లపైచిలుకు యంత్రాలను ఏర్పాటు చేశారు. రెనో, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అశోక్ లేలాండ్ వంటి ప్రధాన ఆటోమోటివ్ తయారీ సంస్థలు కైనెటిక్ గ్రూప్ క్లయింట్లుగా ఉన్నాయి.

చిన్న షేర్ల విషయంలో అప్పుడే హెచ్చరించాం: సెబీ చీఫ్



ముంబై: మధ్య, చిన్నతరహా షేర్ల పతనంపై స్పందించవలసిన అవసరంలేదని క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ చైర్‌పర్సన్ మాధవీ పురీ బచ్ తాజాగా పేర్కొన్నారు. ఇటీవల మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు భారీగా పతనమవుతున్న నేపథ్యంలో బచ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అయితే గతేడాది మార్చిలోనే మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ అధిక విలువల్లో ట్రేడవుతున్నట్లు సెబీ హెచ్చరించిందని బచ్ గుర్తు చేశారు. నిజానికి చిన్న షేర్లపై అవసరమైన సందర్భంలో సెబీ ఆందోళన వ్యక్తం చేసినట్లు దేశీ మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్(యాంఫీ) నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రస్తావించారు. ప్రస్తుతం ఈ అంశంపై సెబీ మరోసారి స్పందించవలసిన అవసరం కనిపించడంలేదని స్పష్టం చేశారు. ఇటీవల మధ్య, చిన్నతరహా షేర్ల కౌంటర్లలో నిరవధిక అమ్మకాల కారణంగా కొన్ని షేర్లు 20 శాతానికి మించి పతనమయ్యాయి. ఫలితంగా మిడ్, స్మాల్ క్యాప్ షేర్లలో బేర్ ట్రెండ్ కనిపిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ రెండు విభాగాల్లోనూ షేర్లు అధిక విలువలకు చేరినట్లు 2024 మార్చిలోనే బచ్ ఇన్వెస్టర్లను హెచ్చరించడం గమనార్హం! కాగా.. ఇటీవల ప్రవేశపెట్టిన రూ. 250 సిప్ పథకాలను ఫండ్ హౌస్‌లకు తప్పనిసరి చేయాలన్న ఆలోచనేదీ సెబీకి లేదని బచ్ తెలియజేశారు.

వారసత్వ పెట్టుబడుల బదిలీకి ఎంతో కృషి

తొలి తరం క్యాపిటల్ మార్కెట్ ఇన్వెస్టర్ల పెట్టుబడులను వారి వారసులు పొందడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ తెలిపారు. వారసులకు పెట్టుబడుల బదిలీని సులభతరం చేసే విషయంలో సెబీ ఎంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇన్వెస్టర్లు మరణించిన సందర్భాల్లో కొత్త సమస్యలు ఎదురవుతున్నట్లు పేర్కొన్నారు. ''ఆ తరం ఇప్పుడు అంతరిస్తోంది. వారి వారసులు సెక్యూరిటీలను వారసత్వంగా పొందుతున్నారు. ఈ క్రమంలో 20 ఏళ్ల క్రితం లేనివి కూడా నేడు సమస్యగా మారుతున్నాయి. ఎందుకంటే ఆ పెట్టుబడులు ఎక్కడ ఉన్నాయన్నది వారసులు గుర్తించలేకపోతున్నారు'' అని బుచ్ వివరించారు. క్యాపిటల్ మార్కెట్ల పట్ల విశ్వాసంతో పెట్టుబడులు పెట్టిన తొలి తరం వారిని మార్గదర్శకులుగా ఆమె అభివర్ణించారు. ఎన్ఎస్‌డీఎల్, సీడీఎస్ఎల్ రూపొందించిన యూనిఫైడ్ ఇన్వెస్టర్ యాప్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ రెండు డిపాజిటరీల పరిధిలో ఒక ఇన్వెస్టర్ పేరిట వివిధ డీమ్యాట్ ఖాతాల్లో ఉన్న అన్ని రకాల హోల్డింగ్స్‌ను ఇందులో పొందుపరిచారు. ఆ నాటి ఇన్వెస్టర్ల వారసులకు పెట్టుబడుల గుర్తింపు విషయంలో ఇది ఉపయోగకరంగా ఉంటుందని బుచ్ చెప్పారు.

సులభతర వీసా విధానం అవసరం

- వైద్య పర్యాటకానికి ప్రోత్సాహాన్నిస్తుంది
- అపోలో హాస్పిటల్స్ జేఎండీ సంగీతారెడ్డి



న్యూఢిల్లీ: వైద్య చికిత్సల కోసం భారత్‌కు వచ్చే విదేశీ రోగులకు సులభతర వీసా విధానాన్ని ప్రవేశపెట్టాలని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ జాయింట్ ఎండీ సంగీతా రెడ్డి కోరారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ 'హీల్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో కలసి పనిచేసేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ''హీల్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు భారత ప్రభుత్వంతో కలసి పనిచేయాలన్నది మా ఆలోచన! ఈ-వీసాలను మరింత పెంచాలి''అని మీడియాతో చెప్పారు. పొరుగు దేశాలైన థాయిలాండ్, టర్కీ, ఫిలిప్పీన్స్, సింగపూర్ దేశాలు ఎక్కువ మంది రోగులను ఆకర్షిస్తున్నాయని, దేశంలోకి వచ్చిన వెంటనే వీసా జారీ విధానాన్ని అమలు చేస్తున్నట్టు గుర్తు చేశారు. భారత్‌లో అధిక నాణ్యమైన హెల్త్‌కేర్ వసతులు ఉన్నాయంటూ.. ప్రపంచ సగటు ధరల్లో పదో వంతుకే అందిస్తున్నట్టు చెప్పారు. కనుక విదేశీ రోగుల రాకను సులభతరం చేయాలని, మెడికల్ వీసాలను వేగంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. వైద్య పర్యాటకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎంతో కీలకంగా చూస్తున్నట్టు అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతారెడ్డి అన్నారు. ''వీసా ప్రక్రియలను మెరుగ్గా మార్చాలి. భారత్‌లోకి ప్రవేశ అనుభవం మెరుగ్గా ఉండాలి. మనకు చాలా పట్టణాల్లో అద్భుతమైన విమానాశ్రయ వసతులు ఉన్నాయి''అని ఆమె గుర్తు చేశారు. ఐఐటీ, ఇతర సంస్థలతో కలసి ఆవిష్కరణల కోసం అపోలో హాస్పిటల్స్ కృషి చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే ఐదేళ్లలో రూ.3,000 పడకలు పెంచుకోనున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.

రెలిగేర్ షేరుకి డాబర్ జోష్

బర్మన్ కుటుంబం చేతికి నియంత్రణ

న్యూఢిల్లీ: సాధారణ వాటాదారులకు ఓపెన్ ఆఫర్ తదుపరి బర్మన్ కుటుంబం ప్రమోటర్లుగా అవతరించడంతో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ కౌంటర్‌కు భారీ డిమాండ్ ఏర్పడింది. ఓపెన్ ఆఫర్ తదుపరి రెలిగేర్‌లో దేశీ ఎఫ్ఎంసీజీ దిగ్గజం డాబర్ ఇండియా ప్రమోటర్ల వాటా 25.16 శాతానికి బలపడింది. అంతకుముందు 21.10 శాతం వాటా కలిగి ఉంది. వెరసి రెలిగేర్‌లో అతిపెద్ద వాటాదారుకావడంతోపాటు ప్రమోటర్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో రెలిగేర్ షేరు తాజాగా 19 శాతం జంప్‌చేసింది. బీఎస్ఈలో రూ. 42 జమ చేసుకుని రూ. 265 వద్ద ముగిసింది. రెలిగేర్ యాజమాన్యం, బోర్డుతో కలసి పనిచేస్తామని, వ్యూహాత్మక మార్గదర్శకత్వం వహిస్తామని బర్మన్ గ్రూప్ ప్రతినిధి ఒకరు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

రిస్క్ ఇన్వెస్టింగ్‌పై అవగాహన కల్పించాలి

- అనాలోచిత ఆర్థికీకరణతో సమస్యలు
- ఆర్థిక సంస్థలకు ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ రాజేశ్వర్ రావు సూచన



ముంబై: అన్‌సెక్యూర్డ్ రుణాలు, వేలం వెర్రిగా డెరివేటివ్స్ ట్రేడింగ్ పెరిగిపోతుండటంపై రిజర్వ్ బ్యాంక్ డిప్యూటీ గవర్నర్ ఎం రాజేశ్వర్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. తాత్కాలిక లాభాల్లో ఉండే ఆకర్షణ వల్ల దీర్ఘకాలిక ఆర్థిక భద్రత గురించి పట్టించుకోని పరిస్థితి ఉంటోందని పేర్కొన్నారు. అనాలోచితమైన విధంగా ఆర్థిక సేవలను విస్తరిస్తే (ఆర్థికీకరణ) రిస్కులు తప్పవని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక సంస్థలను హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజల్లో అన్‌సెక్యూర్డ్ రుణాలు, స్పెక్యులేటివ్ ఇన్వెస్టింగ్ వల్ల తలెత్తే రిస్కుల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విషయంపై ఆర్థిక రంగానికి చెందిన ఇతర నియంత్రణ సంస్థలతో కూడా ఆర్‌బీఐ కలిసి పని చేస్తోందని రావు చెప్పారు. ఆర్థిక అక్షరాస్యత లేకపోవడం వల్లే అమాయకులు మోసగాళ్ల బారిన పడుతున్న ఉదంతాలు పెరుగుతున్నాయని వివరించారు. ఏదైనా ఎదురుదెబ్బ తగిలినప్పుడు మొత్తం ఆర్థిక వ్యవస్థపైనే నమ్మకం పోయే ప్రమాదం ఉంది కాబట్టి, ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వ్యవస్థే పూనుకోవాలని సూచించారు. శరవేగంగా మారిపోతున్న ప్రపంచంలో నియంత్రణనేది చాలా సున్నితమైన అంశంగా మారిందని రావు చెప్పారు. నియంత్రణను మరీ తగ్గిస్తే వ్యవస్థాగతంగా రిస్కులు పెరుగుతాయని, అలాగని మరీ ఎక్కువగా నియంత్రిస్తే కొత్త ఆవిష్కరణలకు, రుణ లభ్యతకు అవరోధాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు.

టారిఫ్‌లు తగ్గిస్తే భారత్‌కే మంచిది

- అభివృద్ధి చెందిన దేశం కావాలంటే తప్పదు
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రమణ్యం



న్యూఢిల్లీ: టారిఫ్‌లు (దిగుమతి సుంకాలు) ఏ దేశాన్ని కాపాడలేవని, ఎవరో చెప్పారని కాకుండా భారత్ తన ప్రయోజనాల కోసం సుంకాలు తగ్గించాలని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఏఐఎంఏ)69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రపంచంతో స్వేచ్ఛాయుత వాణిజ్యం నెరపడం ఐదు కీలక ప్రాధాన్యతల్లో ఒకటిగా ఉండాలన్నారు. టారిఫ్‌లు తగ్గించేందుకు వీలుగా భారత్ యూరోపియన్ యూనియన్, బ్రిటన్, ఇతర ప్రముఖ ఆర్థిక వ్యవస్థలతో ముందుగా వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. కేంద్రం, రాష్ట్రాల స్థాయిలో నియంత్రణలను తొలగించడం ప్రపంచ సరఫరా వ్యవస్థతో భారత్ అనుసంధానానికి కీలకమన్నారు. భారత్‌లో పెట్టుబడులకు ఆసక్తి ఉన్నప్పటికీ, ఇన్వెస్టర్లు ఇక్కడి వచ్చి చూసి వేరే దేశాలకు వెళ్లిపోతున్నట్టు చెప్పారు. అంతర్జాతీయ కంపెనీలు అనుసరిస్తున్న 'చైనా ప్లస్ వన్' విధానంతో ఇండోనేషియా, వియత్నాం, టర్కీ ఎక్కువగా లాభపడుతున్నట్టు తెలిపారు. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాలకు మించి నియంత్రణల తొలగింపు, నైపుణ్యాభివృద్ధి అన్నవి అంతర్జాతీయ సరఫరా వ్యవస్థకు అవసరమన్నారు. వివిధ రంగాల్లో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్‌ను భాగం చేసేందుకు నీతి ఆయోగ్ కృషి చేస్తున్నట్టు సుబ్రమణ్యం తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విడిభాగాలకు సంబంధించి తాము చేసిన సిఫారసులు కేబినెట్ ఆమోదానికి వేచి ఉన్నట్టు చెప్పారు. ఆటో విడిభాగాలు, కెమికల్స్, టెక్స్‌టైల్స్, పాదరక్షలను సైతం అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో అనుసంధానించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించినట్టు ప్రకటించారు. తాము రూపొందించిన జాతీయ తయారీ మిషన్‌ను మూడు నెలల్లో ప్రారంభించనున్నట్టు తెలిపారు. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించేందుకు విద్య, వ్యవసాయానికి సైతం ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఉక్కు రంగానికి దిగుమతుల సెగ

- చౌక స్టీల్ దిగుమతులను ప్రభుత్వం కట్టడి చేయాలి
- టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్

న్యూఢిల్లీ: చౌక ఉక్కు దిగుమతులు వెల్లువెత్తుతుండటం దేశీయంగా పరిశ్రమను దెబ్బతీస్తోందని టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా మార్కెట్లలో అవకాశాల్లేక పలు దేశాల నుంచి స్టీల్ భారత్‌కు మళ్లుతోందని ఆయన చెప్పారు. దీనితో దేశీయంగా ధరలు పడిపోయి, ఉక్కు కంపెనీలు సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. భవిష్యత్తులో ఉక్కు పరిశ్రమ పెట్టుబడులపై కూడా ఇది ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నరేంద్రన్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే చౌక దిగుమతులను కట్టడి చేయాలంటూ ప్రభుత్వానికి పరిశ్రమ విజ్ఞప్తి చేసినట్లు ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని పరిశ్రమ ఎదురు చూస్తోందని ఆయన పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా అత్యధికంగా ఇన్వెస్ట్ చేస్తున్న ప్రైవేట్ రంగాల్లో ఉక్కు పరిశ్రమ కూడా ఉందని నరేంద్రన్ చెప్పారు. ప్రస్తుతం ఒక విడత విస్తరణ ప్రణాళికలు పూర్తయినట్లు వివరించారు. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో భారత ఉక్కు ఎగుమతులు సుమారు 29 శాతం క్షీణించి 3.99 మిలియన్ టన్నులకు పరిమితయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో ఎగుమతులు 5.61 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. మరోవైపు, ఏప్రిల్-జనవరి మధ్య వ్యవధిలో దిగుమతులు 20 శాతం పెరిగి 8.29 మిలియన్ టన్నులకు చేరాయి.





బజాజ్ ఆటో నెదర్లాండ్స్‌కు నిధులు

రూ. 1,364 కోట్ల పెట్టుబడులకు ఓకే

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన రంగ దిగ్గజం బజాజ్ ఆటో సొంత అనుబంధ నెదర్లాండ్స్ సంస్థలో 15 కోట్ల యూరోలు(రూ. 1,364 కోట్లు) ఇన్వెస్ట్ చేయనుంది. ఇందుకు బోర్డు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కంపెనీ తాజాగా వెల్లడించింది. బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్(బీఏఐహెచ్) బీవీ నెదర్లాండ్స్ పెట్టుబడి అవకాశాలకు వీలుగా నిధులను అందించనున్నట్లు తెలియజేసింది. 2026 మార్చి1లోగా ఈక్విటీ, ప్రిఫరెన్స్ మూలధనం, రుణాలు తదితర ఏదేని మార్గంలో ఒకేసారి లేదా దశలవారీగా పెట్టుబడులను చేపట్టనున్నట్లు బజాజ్ ఆటో పేర్కొంది. అయితే పెట్టుబడి అవకాశాలపై వివరణ ఇవ్వనప్పటికీ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న ఆస్ట్రియన్ బైకుల తయారీ కంపెనీ కేటీఎం ఏజీలో వాటాను పెంచుకునే వీలున్నట్లు తెలుస్తోంది. కేటీఎం ఏజీ చట్టబద్ధ పునర్వ్యవస్థీకరణలో ఉంది. బీఏఐహెచ్ బీవీ ద్వారా బజాజ్ ఆటో సహచర ఆస్ట్రియన్ కంపెనీ పీరెర్ బజాజ్ ఏజీ(పీబీఏజీ)లో 49.9 శాతం వాటాను కలిగి ఉంది. మిగిలిన వాటా పీరెర్ ఇండస్ట్రీస్ ఏజీ చేతిలో ఉంది. కాగా.. కేటీఎం ఏజీ హోల్డింగ్ కంపెనీ పీరెర్ మొబిలిటీ ఏజీ(పీఎంఏజీ)లో పీబీఏజీకు దాదాపు 75 శాతం వాటా ఉంది. ఈక్విటీ యాజమాన్యంతోపాటు 400 సీసీవరకూ బైకుల తయారీ, ఎగుమతుల్లో కేటీఎంకు వ్యూహాత్మక భాగస్వామిగా సైతం బజాజ్ ఆటో వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే.

‘టాప్స్’ జాబితా నుంచి వినేశ్, బజరంగ్ అవుట్



న్యూఢిల్లీ: మెగా ఈవెంట్స్‌లో పతక విజేతల్ని తయారు చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్న టార్గెట్ ఒలింపిక్ పోడియం పథకం (టాప్స్) జాబితాను కేంద్ర క్రీడా శాఖ కుదించింది. గతంలో 179 మందికి ‘టాప్స్’ కింద ఆర్థిక అండ దండలు అందించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా 94 మందికే చేయూత ఇవ్వనుంది. ఈ పథకం కింద లబ్ధి పొందిన క్రీడాకారుల ప్రదర్శనను సమీక్షించిన క్రీడాశాఖ దాదాపు సగం మందికి కోత పెట్టింది. ఈ 94 మంది జాబితాలో 42 మంది రెగ్యులర్ అథ్లెట్లు కాగా... 52 మంది పారా అథ్లెట్లున్నారు. పారిస్ పారాలింపిక్స్‌లో విశేష ప్రతిభ కనబరిచిన పారా అథ్లెట్లు 7 స్వర్ణాలు సహా 29 పతకాలు సాధించారు. దీంతో క్రీడాశాఖ దివ్యాంగ అథ్లెట్లకు ‘టాప్స్’లో పెద్దపీట వేసింది. గతంలో 78 మందితో ఉన్న రెగ్యులర్ అథ్లెట్లలో చాలా మందిని తప్పించింది. గోల్ఫ్, స్విమ్మింగ్, టెన్నిస్‌లలో ఏ ఒక్కరికి ‘టాప్స్’లో చోటు దక్కలేదు. మేటి రెజ్లర్లు వినేశ్ ఫొగాట్, బజరంగ్ పూనియాలను ‘టాప్స్’ నుంచి తప్పించారు. రెజ్లింగ్ నుంచి వీడ్కోలు తీసుకున్న వినేశ్ రాజకీయాల్లోకి వచ్చి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసి గెలిచింది. డోప్ టెస్టులకు గైర్హాజరు అయ్యాడనే కారణంగా జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) బజరంగ్‌పై నాలుగేళ్ల నిషేధం విధించింది.

క్రీడాకారుల ప్రదర్శన ఆధారంగా పారదర్శకంగా ఈ జాబితాను రూపొందించామని, కేవలం ప్రతిభే ప్రామాణికంగా తీసుకున్నామని దీనిపై టాప్స్ సీఈఓ ఎన్.ఎస్. జోహల్ వివరణ ఇచ్చారు. అథ్లెటిక్స్‌లో నిరాశజనక ప్రదర్శన వల్ల 30 మంది కాగా ఇప్పుడు ముగ్గురితో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. చాంపియన్ జావెలిన్ త్రోయర్, స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా, స్టీపుల్‌చేజర్ అవినాశ్ సాబ్లే, లాంగ్ జంపర్ శ్రీశంకర్‌లకు మాత్రమే ‘టాప్స్’లో చోటు దక్కింది. తెలంగాణ రైజింగ్ స్టార్, ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య విజేత లవ్లీనా బొర్గొహైన్‌లు ఇద్దరూ మహిళా బాక్సర్లకే ‘టాప్స్’ లబ్ధి చేకూరనుంది. గతంలో 8 మంది బాక్సర్లుండగా కేవలం ఇద్దరే ఇద్దరికి చోటు దక్కింది. షట్లర్లలో కిడాంబి శ్రీకాంత్‌కు, డబుల్స్ స్పెషలిస్ట్ అశ్విని పొన్నప్పలను పక్కన బెట్టిన క్రీడాశాఖ... సింధు, ప్రణయ్, లక్ష్యసేన్, డబుల్స్ అగ్రశ్రేణి జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ షెట్టిలను జాబితాలో కొనసాగించింది.

కమిన్స్ పునరాగమనం ఐపీఎల్ టోర్నీతో



సిడ్నీ: ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఐపీఎల్‌తో పునరాగమనం చేయాలని భావిస్తున్నాడు. గాయంతో ప్రస్తుతం జరుగుతున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి దూరమైన అతను ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు ముందు ఐపీఎల్‌లో బరిలోకి దిగాలనుకుంటున్నాడు. తమ సొంతగడ్డపై భారత్‌తో జరిగిన బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సందర్భంగా 31 ఏళ్ల కమిన్స్ చీలమండకు గాయమైంది. ఈ గాయాన్ని భరిస్తూనే టెస్టు సిరీస్ ఆడిన కమిన్స్ తదనంతరం శ్రీలంక పర్యటకు గైర్హాజరయ్యాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత బరిలోకి దిగాలనే ఉద్దేశంతో కమిన్స్ ఐసీసీ మెగా ఈవెంట్‌కు సైతం దూరంగానే ఉన్నాడు. ఇదే సమయంలో అతని భార్య రెండో బిడ్డకు జన్మనివ్వడంతో కుటుంబానికే పరిమితమయ్యాడు. అయితే వచ్చే నెల భారత్‌లో జరిగే ఫ్రాంచైజీ లీగ్ టోర్నీ ద్వారా మైదానంలోకి దిగేందుకు కమిన్స్ ఉత్సాహం కనబరుస్తున్నాడు. స్థానిక వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అతను మాట్లాడుతూ ‘నెల రోజులు అహ్లాదకరంగా గడిచాయి. ఇంటికే పరిమితమైన నేను ఎలాంటి కసరత్తు, సన్నాహాల్లోనూ పాల్గొనకుండా... పూర్తిగా భార్య బిడ్డలతో గడపడం చాలా ఆనందాన్నిచ్చింది. వచ్చే వారం పది రోజుల తర్వాత ప్రాక్టీసు ప్రారంభిస్తాను. తద్వారా ఐపీఎల్ టోర్నీ బరిలో దిగేందుకు వీలవుతుంది’ అని అన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)ను నడిపిస్తున్న కమిన్స్ సారథ్యంలోనే గత సీజన్‌లో ఈ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

భారత్‌లో మరోసారి కామన్వెల్త్ క్రీడలు!

‘2030’పై కేంద్ర ప్రభుత్వం దృష్టి



న్యూఢిల్లీ: భారత్‌లో రెండోసారి కామన్వెల్త్ క్రీడల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపిస్తోంది. 2030లో జరిగే పోటీల కోసం బిడ్ వేయాలని యోచిస్తోందని క్రీడా శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. 2010లో న్యూఢిల్లీలో కామన్వెల్త్ క్రీడలు జరిగాయి. క్రీడలను నిర్వహించడంతో పాటు 2026 కామన్వెల్త్ క్రీడల నుంచి తొలగించిన క్రీడాంశాలను కూడా మళ్లీ చేర్చే ఆలోచనలో భారత్ ఉంది. 2030 క్రీడల నిర్వహణకు ‘ఆసక్తిని ప్రదర్శించే’ ప్రక్రియకు మార్చి 31 చివరి తేదీ కాగా... ఈ దిశగానే ప్రయత్నం మొదలైనట్లు అధికారి చెప్పారు. ‘కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ అధికారులతో చర్చలు జరిగాయి. 2030లో మేం నిర్వహించాలనుకుంటున్నట్లు కూడా చెప్పాం. 2026లో తొలగించిన అన్ని క్రీడాంశాలను 2030లో చేర్చే విధంగా చూడాలని కూడా చెప్పాం’ అని ఆయన పేర్కొన్నారు. 2026లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే బడ్జెట్ పరిమితులను దృష్టిలో ఉంచుకొని నిర్వాహక కమిటీ కేవలం 10 క్రీడాంశాలకే పోటీలను పరిమితం చేసింది. ఈ క్రమంలో హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, షూటింగ్, టేబుల్ టెన్నిస్, స్క్వాష్, ట్రయాథ్లాన్, క్రికెట్‌లను పోటీల నుంచి తొలగించారు. ఇవే క్రీడాంశాల్లో భారత్‌కు ఎక్కువ పతకాలు వచ్చే అవకాశం ఉండేది. కమిటీ నిర్ణయం కారణంగా భారత్‌కు పెద్ద సంఖ్యలో పతకాలు వచ్చే అవకాశం ఉన్న ఆటలన్నీ క్రీడల్లో లేకుండాపోయాయి. గతంలో ఇదే తరహాలో 2022 బర్మింగ్‌హామ్ క్రీడల నుంచి కూడా ఆర్చరీ, షూటింగ్‌లను తొలగించిన తర్వాత వాటిని మళ్లీ చేర్చాలంటూ భారత్ విజ్ఞప్తి చేసింది. దీనికి సానుకూల స్పందన వచ్చినా కోవిడ్ కారణంగా మారిన పరిస్థితుల నేపథ్యంలో అది సాధ్యం కాలేదు. అయితే వన్నె తగ్గిన కామన్వెల్త్ క్రీడలను నిర్వహించే విషయంలో ఆర్థికభారం కారణంగా పలు పెద్ద దేశాలు కూడా వెనక్కి తగ్గుతున్న నేపథ్యంలో భారత్ ముందుకు వెళ్లడం ఆశ్చర్యకర పరిణామం! 2026కు ముందుగా ఆస్ట్రేలియాలోని విక్టోరియా వేదిక కాగా... 2023 జూలైలో ఆ దేశం అనూహ్యంగా తప్పుకుంది. నిర్వాహక కమిటీ మలేసియా దేశానికి ఆఫర్ ఇచ్చినా అదీ అంగీకరించలేదు. చివరకు తక్కువ బడ్జెట్‌తో, అదీ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆర్థిక సహకారంతో గ్లాస్గో ముందుకు వచ్చింది. వచ్చే ఏడాది జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు 23వ కామన్వెల్త్ క్రీడలు జరుగుతాయి. మరోవైపు 2036 ఒలింపిక్స్ నిర్వహణకు ఆసక్తి చూపిస్తూ భారత ప్రభుత్వం ఇప్పటికే అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ)కి లేఖ పంపించింది. వచ్చే మార్చి తర్వాత దీని పురోగతిపై స్పష్టత రావచ్చు.



కేరళ కల సాకారం

తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్లోకి ప్రవేశం • సీజన్ మొత్తం నిలకడగా రాణింపు

స్టార్ ఆటగాళ్లు లేకున్నా అద్భుతాలు • కష్టానికి తోడైన అదృష్టం

‘ధైర్యవంతులనే అదృష్టం వరిస్తుంది’ అనే నానుడి కేరళ జట్టుకు సరిగ్గా సరిపోతుంది. 68 సంవత్సరాల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ... 352 మ్యాచ్‌ల పోరాటం అనంతరం కేరళ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీలో ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో అద్వితీయ ప్రదర్శన కనబరుస్తున్న కేరళ జట్టు... తీవ్ర ఉత్కంఠ మధ్య మాజీ చాంపియన్ గుజరాత్‌తో జరిగిన సెమీఫైనల్లో పైచేయి సాధించి తొలిసారి తుదిపోరుకు చేరింది. క్వార్టర్ ఫైనల్లో ఒక్క పరుగు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జమ్మూకశ్మీర్‌ను వెనక్కి నెట్టిన కేరళ... ఇప్పుడు సెమీఫైనల్లో గుజరాత్‌పై రెండు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ముందంజ వేసింది. ఒక్క పరుగే కదా అని తేలికగా తీసుకుంటే ... ఎలాంటి ఫలితాలు వస్తాయో ప్రత్యర్థికి రుచి చూపింది. ఆరు దశాబ్దాల పోరాటం అనంతరం దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ టోర్నీ ఫైనల్‌కు చేరిన కేరళ జట్టు ప్రస్థానంపై ప్రత్యేక కథనం..



జలజ్

సాక్షి క్రీడావిభాగం

సుదీర్ఘ కాలంగా రంజీ ట్రోఫీ ఆడుతున్న కేరళ జట్టు ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయింది. ముంబై, కర్ణాటక, ఢిల్లీ, తమిళనాడు, బెంగాల్ మాదిరిగా తమ జట్టులో స్టార్ ప్లేయర్లు లేకపోయినా... నిలకడ కనబరుస్తున్నప్పటికీ ఆ జట్టు తుదిపోరుకు మాత్రం అర్హత సాధించలేదు. తాజా సీజన్‌లో అసాధారణ పోరాటాలు, అనూహ్య ఫలితాలతో ఎట్టకేలకు కేరళ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్ చేరి చరిత్ర సృష్టించింది. జమ్మూ కశ్మీర్‌తో హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్లో 1 పరుగు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో సెమీఫైనల్లో అడుగుపెట్టిన కేరళ జట్టు... సెమీస్‌లో మాజీ చాంపియన్ గుజరాత్‌పై 2 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో తమ చిరకాల కల నెరవేర్చుకుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన సెమీఫైనల్ చివరి రోజు కేరళ జట్టు అద్భుతమే చేసింది. చేతిలో 3 వికెట్లు ఉన్న గుజరాత్ జట్టు తుదిపోరుకు అర్హత సాధించాలంటే మరో 29 పరుగులు చేయాల్సిన దశలో తొలి ఇన్నింగ్స్ కొనసాగించగా... కేరళ జట్టు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని కట్టిపడేసింది. అప్పటికే క్రీజులో పాతుకుపోయి మొండిగా పోరాడుతున్న గుజరాత్ బ్యాటర్లు జైమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్‌లను కేరళ బౌలర్ ఆదిత్య వెనక్కి పంపాడు. ఇంకేముంది మరో వికెట్ తీస్తే చాలు కేరళ తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్ చేరడం ఖాయమే అనుకుంటే... ఆఖరి వికెట్‌కు అర్జాన్ నాగ్‌వస్వల్లా, ప్రియజీత్ సింగ్ జడేజా మొండిగా పోరాడారు. పది ఓవర్లకు పైగా క్రీజులో నిలిచిన ఈ జంటను చూస్తే ఇక మ్యాచ్ కేరళ చేజారినట్లే అనుకుంటున్న తరుణంలో అర్జాన్ కొట్టిన షాట్ కేరళకు కలిసొచ్చింది. ఆదిత్య వేసిన బంతిని అర్జాన్ బలంగా బాదే ప్రయత్నం చేశాడు. బంతి షార్ట్‌లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తున్న సల్మాన్ నిజార్ హెల్మెట్‌కు తాకి గాల్లోకి లేచి ఫస్ట్ స్లిప్‌లో ఉన్న కెప్టెన్ సచిన్ బేబీ చేతిలో పడింది. అంతే కేరళ జట్టు సంబరాల్లో మునిగిపోయింది.

స్టార్లు లేకుండానే...

స్టార్ ఆటగాడు సంజూ సామ్సన్ భారత జట్టులో ఉండగా... అనుభవజ్ఞులైన విష్ణు వినోద్, బాబా అపరాజిత్ వంటి వాళ్లు గాయాలతో జట్టుకు దూరమయ్యారు. అయినా ఈ సీజన్‌లో కేరళ జట్టు స్ఫూర్తివంతమైన ప్రదర్శన కనబర్చింది. ముఖ్యంగా మిడిలార్డర్‌లో కెప్టెన్ సచిన్ బేబీతో పాటు సీనియర్ ప్లేయర్ జలజ్ సక్సేనా... యువ ఆటగాళ్లు మొహమ్మద్ అజహరుద్దీన్, సల్మాన్ నిజార్ అసమాన పోరాటం కనబర్చారు. జమ్మూ కశ్మీర్‌తో క్వార్టర్స్ పోరులో మ్యాచ్‌ను ‘డ్రా’ చేసేందుకు సల్మాన్, అజహరుద్దీన్ కనబర్చిన తెగువను ఎంత పొగిడినా తక్కువే. 40 ఓవర్లకు పైగా జమ్మూ బౌలర్లను కాచుకున్న ఈ జంట వికెట్ ఇవ్వకుండా మ్యాచ్‌ను ముగించి తొలి ఇన్నింగ్స్‌లో దక్కిన ఒక్క పరుగు ఆధిక్యంతో సెమీఫైనల్‌కు చేరింది. తాజాగా గుజరాత్‌తో సెమీస్‌లోనూ తొలి ఇన్నింగ్స్‌లో కేరళ బ్యాటర్లు అసాధరణ ప్రదర్శన కనబర్చారు. సచిన్ బేబీ 195 బంతుల్లో 69 పరుగులు, జలజ్ సక్సేనా 83 బంతుల్లో 30 పరుగులు, అజహరుద్దీన్ 341 బంతుల్లో 177 పరుగులు, సల్మాన్ నిజార్ 202 బంతుల్లో 52 పరుగులు చేసి గుజరాత్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ముందు నుంచే చక్కటి గేమ్ ప్లాన్‌తో మైదానంలో అడుగుపెట్టిన కేరళకు చివర్లో అదృష్టం కూడా తోడవడంతో చక్కటి విజయంతో తొలిసారి రంజీ ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ టోర్నీ చరిత్రలో కేరళ జట్టు ఇప్పటి వరకు అత్యుత్తమంగా 2018–19 సీజన్‌లో సెమీఫైనల్‌కు చేరింది.

నిరీక్షణకు తెరదించుతూ..

తొమ్మిది దశాబ్దాల సుదీర్ఘ చరిత్ర ఉన్న రంజీ ట్రోఫీలో కేరళ జట్టు 1957లో అరంగేట్రం చేసింది. అప్పటి నుంచి ఒక్కటంటే ఒక్కసారి కూడా ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఫుట్‌బాల్‌కు అధిక ప్రాధాన్యత ఇచ్చే కేరళ వాసులు... క్రికెట్‌ను పెద్దగా పట్టించుకునేవాళ్లు కాదు. కానీ గత రెండు దశాబ్దాల్లో కేరళ క్రికెట్‌లో అనూహ్య మార్పు వచ్చింది. 2007 టి20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన శ్రీశాంత్ స్ఫూర్తితో మరెందరో ఆటగాళ్లు క్రికెట్‌పై మక్కువ పెంచుకున్నారు. అందుకు తగ్గట్లే గత కొన్నేళ్లుగా కేరళలో క్రీడా మౌలిక వసతులు మరింత మెరుగు పడటంతో ప్రతిభావంతులు వెలుగులోకి రావడం మొదలైంది. అయితే ఇది ఒక్క రోజులో సాధ్యమైంది కాదు. దీని వెనక ఎన్నో ఏళ్ల శ్రమ దాగి ఉంది. అందుకే శుక్రవారం సెమీస్‌లో కేరళ జట్టు విజయానికి చేరువవుతున్న సమయంలో ప్రసార మాధ్యమాల్లో వీక్షకుల సంఖ్య ఒక్కసారిగా లక్షల్లో పెరిగింది. ప్రతిష్టాత్మక టోర్నీలో కేరళ టీమ్ ఫైనల్‌కు చేరగానే సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. రాజకీయ, సినీ, క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు... తామే గెలిచినంతగా లీనమైపోయి జట్టును అభినందనల్లో ముంచెత్తారు.

మౌలిక వసతుల్లో భేష్..

సాధారణంగా అధిక వర్షపాతం నమోదయ్యే కేరళలో ఒకప్పుడు నిరంతరం అవుట్‌డోర్ ప్రాక్టీస్ చేయడం కూడా కష్టతరంగా ఉండేది. అలాంటిది ఇప్పుడు ఆ రాష్ట్ర వ్యాప్తంగా 17 ఫస్ట్‌క్లాస్ మైదానాలు అందుబాటులోకి వచ్చాయంటే కేరళ క్రికెట్‌లో ఎంత పురోగతి సాధించిందో అర్థం చేసుకోవచ్చు. ఈ కృషి వల్లే కేవలం పెద్ద నగరాల నుంచే కాకుండా... ద్వితీయ శ్రేణి పట్టణాలకు చెందిన ప్రతిభావంతులైన ఆటగాళ్లు కూడా రంజీ జట్టులో చోటు దక్కించుకోగలుగుతున్నారు. ‘ముంబై, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ వంటి ఇతర జట్లతో పోల్చుకుంటే... కేరళ జట్టు ఎంపిక విభిన్నంగా ఉండేది. పరిమితమైన వనరులు మాత్రమే ఉండటంతో అందుబాటులో ఉన్నవాళ్లనే ఎంపిక చేసేవాళ్లం. ముందు ఆ పరిస్థితి మారాలనే ఉద్దేశంతో అన్ని జిల్లాల్లో అకాడమీలను స్థాపించాం. కేవలం ప్లేయర్లకే కాకుండా కోచ్‌లకు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. మౌలిక వసతులపై ప్రధానంగా దృష్టి పెట్టాం. ఒకప్పుడు వర్షం వస్తే ప్రాక్టీస్ ఆగిపోయేది. ఇప్పుడు ఇండోర్‌లోనూ నెట్స్ ఏర్పాటు చేశాం. 2005లో రాష్ట్రంలో ఒక్క మైదానంలో కూడా లేదు. ఇప్పుడు మొత్తం 17 ఫస్ట్‌క్లాస్ గ్రౌండ్‌లు ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో మరే రాష్ట్రంలో లేనంతమంది బీసీసీఐ లెవల్1 కోచ్‌లు కేరళలో ఉన్నారు’ అని బీసీసీఐ మాజీ ఉపాధ్యక్షుడు మాధ్యూ తెలిపారు. కేరళ క్రికెట్ సంఘం కృషి వల్లే స్వేచ్ఛగా ఆడగలుగుతున్నామని... సెమీఫైనల్లో ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కించుకున్న అజహరుద్దీన్ వెల్లడించాడు. పరస్పర సహకారం, సమష్టితత్వంతో ముందుకు సాగడం వల్లే మెరుగైన ఫలితాలు వస్తున్నాయని అన్నాడు. ఈనెల 26 నుంచి నాగ్‌పూర్‌లో జరిగే తుది పోరులోనూ కేరళ విజయం సాధిస్తే 10 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీ చాంపియన్‌గా నిలిచిన దక్షిణాది జట్టుగా నిలుస్తుంది... ఆల్ ద బెస్ట్ కేరళ..!

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కబడ్డీ జట్లకు నిరాశ

కటక్: డిఫెండింగ్ చాంపియన్ హరియాణా శుక్రవారం మొదలైన సీనియర్ జాతీయ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో శుభారంభం చేసింది. తెలుగు రాష్ట్రాల జట్లకు ఓటమి ఎదురవగా... హరియాణాతో పాటు రైల్వేస్, మధ్యప్రదేశ్ జట్లు కూడా భారీ విజయాలతో టోర్నీని ఆరంభించాయి. పూల్ ‘ఎ’లో హరియాణా 50–20 స్కోరుతో తెలంగాణ జట్టును ఓడించింది. పూల్ ‘డి’లో మధ్యప్రదేశ్ 59–35తో ఆంధ్రప్రదేశ్‌పై ఘనవిజయం సాధించింది. ఇదే పూల్‌లో జరిగిన మరో మ్యాచ్‌లో చండీగఢ్ 40–24తో గుజరాత్‌పై గెలిచింది. పూల్ ‘బి’లో రైల్వేస్ 59–17తో మణిపూర్‌పై ఏకపక్ష విజయం సాధించగా... పూల్ ‘ఎఫ్’లో ఒడిశా 57–28తో విదర్భపై జయభేరి మోగించింది. పూల్ ‘సి’లో మహారాష్ట్ర 39–35తో కేరళపై పోరాడి గెలిచింది. బరిలో ఉన్న 30 జట్లను ఎనిమిది పూల్స్‌గా విభజించి ముందుగా ప్రిలిమినరీ మ్యాచ్‌ల్ని నిర్వహిస్తున్నారు. ఒక్కో పూల్ నుంచి రెండేసి జట్లు చొప్పున నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి.

టైటిల్ పోరుకు జీవన్–విజయ్ జోడీ



పుణే: మహా ఓపెన్ ఏటీపీ చాలెంజర్–100 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ జీవన్ నెడుంజెళియన్–విజయ్ సుందర్ ప్రశాంత్ (భారత్) జంట ఫైనల్లోకి దూసుకెళ్లింది. 1 గంట 43 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్లో జీవన్–విజయ్ ద్వయం 7–6 (7/5), 6–4తో నికీ కలియంద పునాచా (భారత్)–కోట్నీ జాన్ లాక్ (జింబాబ్వే) జోడీపై గెలిచింది. మరో సెమీఫైనల్లో బ్లేక్ బేల్‌డన్–మాథ్యూ క్రిస్టోఫర్ (ఆస్ట్రేలియా) ద్వయం 6–3, 3–6, 10–5తో ‘సూపర్ టైబ్రేక్’లో జే క్లార్క్ (బ్రిటన్)–జురిజ్ రొడియోనోవ్ (ఆస్ట్రియా) జోడీపై గెలిచింది.

యూకీ జంట ఓటమి



దోహా: ఖతర్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో యూకీ బాంబ్రీ (భారత్)–ఇవాన్ డోడిగ్ (క్రొయేషియా) జోడీకి పరాజయం ఎదురైంది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో యూకీ–డోడిగ్ ద్వయం 6–7 (3/7), 3–6తో జూలియన్ క్యాష్–లాయిడ్ గ్లాస్‌పూల్ (బ్రిటన్) జంట చేతిలో ఓడిపోయింది. క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ జంట మార్సెలో అరెవాలో (ఎల్ సాల్వడార్)–మాట్ పావిక్ (క్రొయేషియా)లను బోల్తా కొట్టించిన యూకీ–డోడిగ్ సెమీఫైనల్లో మాత్రం కీలకదశలో తడబడ్డారు. సెమీస్‌లో ఓడిన యూకీ–డోడిగ్‌లకు 45,750 డాలర్ల (రూ. 40 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 180 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

డోపింగ్‌లో దొరికిన పుణే మారథాన్ విజేత ప్రధాన్



న్యూఢిల్లీ: రెండు నెలల క్రితం పుణేలో నిర్వహించిన హాఫ్ మారథాన్ పరుగులో విజేతగా నిలిచిన ప్రధాన్ విలాస్ కిరులేకర్ డోపింగ్‌లో దొరికిపోయాడు. దీంతో అతనిపై తాత్కాలిక నిషేధం విధించారు. డిసెంబర్‌లో నిర్వహించిన 21.09 కిలోమీటర్ల రేసును ప్రధాన్ విలాస్ అందరికంటే ముందుగా ఒక గంటా 4 నిమిషాల 22 సెకన్లలో పూర్తిచేసి విజేతగా నిలిచాడు. అయితే అతని నుంచి సేకరించిన రక్త, మూత్ర నమూనాల్ని ల్యాబ్‌లో పరీక్షించగా, నిషిద్ధ ఉత్ప్రేరకం మెల్డోనియమ్ తీసుకున్నట్లు తేలింది. దీంతో ప్రపంచ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ)కు చెందిన స్వతంత్ర ఏజెన్సీ అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) ప్రధాన్ విలాస్‌పై చర్యలు చేపట్టింది. గతనెల భారత్‌కు చెందిన లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ మాధురి కాల్ డోపింగ్ పరీక్షల్లో పట్టుబడటంతో ఏఐయూ సస్పెన్షన్ వేటు వేసింది. 2016లో రష్యా టెన్నిస్ స్టార్ మరియా షరపోవా కూడా ఈ మెల్డోనియమ్ ఉత్ప్రేరకం తీసుకున్నట్లు తేలడంతో ఆమెపై కూడా సస్పెన్షన్ వేటు వేశారు. సాధారణంగా మెల్డోనియమ్‌ను డాక్టర్లు హృద్రోగులకు, నరాల జబ్బులున్న రోగులకు శక్తి కోసం సిఫారసు చేస్తారు.

సెలక్షన్స్‌పై ‘వీడియో’ కన్ను

పారదర్శక ఎంపికే లక్ష్యమన్న కేంద్ర క్రీడా శాఖ



న్యూఢిల్లీ: క్రీడాకారులు, జట్ల సెలక్షన్ ట్రయల్స్‌పై పదేపదే వస్తున్న విమర్శలకు చెక్ పెట్టేందుకు కేంద్ర క్రీడా శాఖ సిద్ధమైంది. దీనికి శాశ్వత పరిష్కారంగా ఇక మీదట జరిగే ఎంపిక ప్రక్రియనంతా వీడియో రూపంలో తీయనుంది. తద్వారా అర్హులైన ప్రతిభావంతులకే బెర్త్‌లు లభించేలా చూడనుంది. ప్రతి ఒక్కరి సెలక్షన్ ప్రదర్శన వీడియోలో నిక్షిప్తమై ఉంటుంది. కాబట్టి విమర్శలకు తావుండదు. ‘ఇకపై అన్ని సెలక్షన్ ట్రయల్స్‌పై వీడియో నిఘా పెడతాం. పారదర్శకత, న్యాయబద్ధమైన ఎంపికలకు ఇది ఎంతగానో దోహదం చేస్తుంది. దీనివల్ల క్రీడాకారులకు మేలు జరుగుతుంది. ప్రదర్శనే ఎంపికకు గీటురాయి అవుతుంది. మెరిట్ కనబరిచిన వారే భారత జట్లకు ఎంపికవుతారు. ఇందులో క్రీడా సమాఖ్యలు ఇష్టారీతిన వ్యవహరించేందుకు వీలుండదు. క్రీడా శాఖ అధికారులు, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) అధికారులు పర్యవేక్షకులుగా హాజరవుతారు. ఇకపై ప్రతీ క్రీడాంశంలో దీన్ని అమలు చేస్తాం’ అని క్రీడా శాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. షూటింగ్, రెజ్లింగ్‌లలో జరిగే సెలక్షన్ ట్రయల్స్ ప్రతీసారి విమర్శలపాలవుతోంది. రెజ్లింగ్ సమాఖ్య అయితే పతకాల కంటే కూడా ఈ తరహా వివాదాలు, విమర్శలతోనే వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే! భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) వ్యవహారాల వల్ల అర్హత ఉండి, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనలేకపోతున్నారు. ఈ సీజన్‌లో తొలి రెండు ర్యాంకింగ్ సిరీస్ టోర్నమెంట్‌లకు భారత రెజ్లర్లు దూరమయ్యారు. దీనిపై క్రీడాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అలాగే ఈ శాఖ గుర్తింపు ఉన్న జాతీయ సమాఖ్యలకు ఢిల్లీలోని స్టేడియాల్లో ఆఫీస్ వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టారు. దీనివల్ల ఢిల్లీకి వచ్చిన లేదంటే ఢిల్లీ నుంచి అంతర్జాతీయ టోర్నీలకు బయలుదేరే ఆటగాళ్లకు ఆయా సమాఖ్యలు సమన్వయంతో సేవలందించేందుకు వీలవుతుంది. గతంలో ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా సమాఖ్యల కార్యాలయాలు ఉండేవి. కానీ 2010 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం కోసం ఆ స్టేడియాన్ని నవీకరించడంతో సమాఖ్యల ఆఫీసుల్ని అక్కడి నుంచి తరలించారు.



మధ్యప్రదేశ్‌లోని ప్రఖ్యాత ఖజురహో ఆలయ ప్రాంగణంలో జరిగిన సుదీర్ఘ శాస్త్రీయ సంగీత నృత్య ప్రదర్శన ప్రపంచ రికార్డు సాధించింది. ఖజురహో డ్యాన్స్ ఫెస్టివల్‌లో భాగంగా 139 మంది కళాకారులు బుధవారం మధ్యాహ్నం 2.34 గంటల నుంచి గురువారం 2.43 గంటల వరకు నిర్విరామంగా నృత్యం చేశారు. కళాకారులతో కలిసి సీఎం మోహన్ యాదవ్ గిన్నిస్ బుక్ రికార్డ్ సర్టిఫికెట్‌ను అందుకున్నప్పటి ఫొటో ఇది.



అస్సాం రాజధాని గౌహతిలో ప్రధాని మోదీ సమక్షంలో ఈ నెల 24వ తేదీన జరిగే 'ఝుమోయిర్ బినందిని'కి శుక్రవారం రిహార్సల్స్ చేస్తున్న కళాకారులు. అతిపెద్ద ఝుమోయిర్ నృత్య ప్రదర్శనతో ప్రపంచ రికార్డు నెలకొల్పడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

ఎన్నికల 'మాయ'పై కాంగ్రెస్ చింత!

సాధారణ ఎన్నికలు సహా అనేక రాష్ట్రాల్లో ఇండియా కూటమి ఓట్లకు బీఎస్పీ గండి

- హరియాణా, రాజస్తాన్, మధ్యప్రదేశ్ సహా చాలా రాష్ట్రాల్లో ఇండియా కూటమికి బీఎస్పీతో ఇక్కట్లు
- యూపీ ఎన్నికల్లో 9 శాతం ఓట్లతో 16 స్థానాల్లో ఇండియా అభ్యర్థుల విజయాన్ని అడ్డుకున్న బీఎస్పీ
- ఈ నేపథ్యంలో బీఎస్పీ అధినేత్రి మాయావతిపై రాహుల్ వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: గడిచిన సాధారణ ఎన్నికలు సహా అనేక రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పాటు దాని నేతృత్వంలోని ఇండియా కూటమి విజయాలను అడ్డుకోవడంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కంట్లో నలుసులా మారుతుండటంపై కాంగ్రెస్ ఆందోళన చెందుతోంది. పార్టీ జయాపజయాలను నిర్ణయించే ఓట్లను చీల్చడంలో బీఎస్పీ తన పాత్రను సమర్థంగా పోషిస్తోందని, ఇది పరోక్షంగా అధికార బీజేపీ కూటమికి లబ్ధి చేకూరుస్తోందన్న వాదనను బలంగా తెరపైకి తెస్తోంది. బీఎస్పీతో జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకొనే ఉత్తర్‌ప్రదేశ్ పర్యటనలో ఉన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ బీఎస్పీ అధినేత్రి మాయావతి లక్ష్యంగా విమర్శలు గుప్పించినట్లుగా కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

యూపీ సహా అనేక చోట్ల పనిచేస్తున్న 'మాయ'

గత సార్వత్రిక ఎన్నికల్లో యూపీలో బీజేపీ ఓట్లకు భారీ గండి కొట్టాలనే బలమైన లక్ష్యంగా సమాజ్‌వాదీతో ముందస్తు పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్, బీఎస్పీని సైతం కూటమిలోకి ఆహ్వానించింది. దీనికి మాయవతి అంగీకరించకుండా ఒంటరిగా పోటీ చేసింది. ఈ ఎన్నికల్లో 80 లోక్‌సభ స్థానాలకు గానూ 33.8 శాతం ఓట్లతో ఎస్పీ 37, 9.5 శాతం ఓట్లతో కాంగ్రెస్ 6 స్థానాలు గెలుచుకుంది. రెండె పార్టీల ఓట్ల వాటా 43.3 ఓట్ల శాతం. ఇదే సమయంలో బీఎస్పీ ఒక్క సీటు గెలవలేకున్నా పార్టీకి మాత్రం 9.39 శాతం ఓట్లు వచ్చాయి. కూటమిలో భాగస్వామిగా ఉండుంటే ఓట్ల శాతం 52 శాతానికి పైగా పెరిగి మరిన్ని సీట్లు గెలిచే వారమని కాంగ్రెస్ వాదిస్తోంది. బీఎస్పీ ఒంటరిగా పోటీ చేయడంతో 16 సీట్లలో కూటమి అభ్యర్థుల విజయాన్ని బీఎస్పీ అడ్డుకుంది. 16 స్థానాల్లో కూటమి అభ్యర్థుల ఓడిన మార్జిన్ కన్నా బీఎస్పీకి ఎక్కువ ఓట్లు వచ్చాయి. అమ్రోహా స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి డానిష్ అలీ 28 వేల ఓట్ల తేడాతో ఓడితే బీఎస్పీకి అక్కడ 1.20 లక్షల ఓట్లు వచ్చాయి. బాన్స్‌గావ్ స్థానంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి 3 వేల ఓట్లతో ఓడితే బీఎస్పీకి 64వేల ఓట్లు వచ్చాయి. ఇదే మాదిరి చాలా స్థానాల్లో బీఎస్పీ కూటమి అభ్యర్థుల విజయాలకు గండికొట్టింది. యూపీలో 21 శాతం ఎస్సీలు ఉంటే అందులో అత్యధికంగా 55 శాతం ఉన్న జాతవ్ కులం నుంచి వచ్చిన మాయావతికి ఆ వర్గంలో గట్టి పట్టు ఉంది. దీనికి తోడు కాన్షీరాం వారసత్వ పార్టీగా హిందీ రాష్ట్రాల్లోనూ బీఎస్పీ ప్రాబల్యం బలంగా ఉంది. దళితులు–ముస్లిం ఫార్ములాను ముందు పెట్టి గడిచిన రెండేళ్లలో జరిగిన మధ్యప్రదేశ్, రాజస్తాన్, హరియాణా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో పోటీ చేసి 2–4 శాతం ఓట్లను రాబట్టుకుంది. ఈ ఓట్లన్నీ పరోక్షంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షాల ఓటమికి కారణమయ్యాయి. మొన్నటి హరియాణా ఎన్నికల్లో బీఎస్పీ, ఐఎన్ఎల్‌డీ పార్టీలు కలిసి పోటీచేసి ఏకంగా 5.96 శాతం ఓట్లను రాబట్టుకున్నాయి. ఇందులో బీఎస్పీకి 2 శాతం ఓట్లున్నాయి. ఈ ఓట్లే కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా చేశాయి. మధ్యప్రదేశ్‌లోనూ కచ్చితంగా తాము అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ భావించినా 3.40 శాతం ఓట్లను రాబట్టుకున్న బీఎస్పీ కాంగ్రెస్‌ను భారీ దెబ్బకొట్టింది. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే బిహార్ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీ చేసేందుకు సిద్ధమవుతోంది. గత ఎన్నికల్లో బిహార్‌లో 78 స్థానాల్లో పోటీ చేసిన బీఎస్పీ 1.5 శాతం ఓట్లను రాబట్టుకుంది. దానికి మిత్రపక్షంగా పోటీ చేసిన ఎంఐఎం మరో 2శాతం ఓట్లు రాబట్టుకుంది. దీంతో ఓట్లు చీలి జేడీయూ, బీజేపీకి అధిక సీట్లు వచ్చేందుకు మద్దతిచ్చినట్లయింది. ఇలా ప్రతి ఎన్నికల్లోనూ బీఎస్పీ తమకు ఇక్కట్లకు గురిచేస్తుండటం కాంగ్రెస్ పార్టీకి తలనొప్పి వ్యవహారంలా మారింది. ఈ నేపథ్యంలోనే యూపీలో పర్యటిస్తున్న రాహుల్ బీఎస్పీ అధినేత్రి మాయవతి లక్ష్యంగా విమర్శలు చేశారు. యూపీలో కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ కలిసి పని చేసి ఉంటే ఫలితాలు వేరుగా ఉండేవని, అయితే మాయావతి తమతో కలిసి రాలేదన్నారు. ఇది పరోక్షంగా బీజేపీ గెలుపుకు దోహదపడిందని చెప్పుకొచ్చారు. ఈ విమర్శలు ఇప్పుడు మాయావతి ప్రభావాన్ని మరో మారు చర్చకు పెట్టాయి.

ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ బీజేపీ బీ టీమ్‌గా పోరాడింది

- రాహుల్‌గాంధీపై ఎదురుదాడి చేసిన మాయావతి
- ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచన

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన ప్రకటనపై బీఎస్పీ అధినేత్రి మాయావతి ఎదురుదాడి చేశారు. రాహుల్ గాంధీ ముందు తన సొంత వ్యవహారాలు చూసుకోవాలని, ఆ తర్వాత బీఎస్పీపై ప్రశ్నలు వేయాలని అన్నారు. అంతేగాక ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ బీ టీమ్‌గా పోటీ చేసిందని, అందుకే బీజేపీ అధికారంలోకి వచ్చిందని మాయావతి అభివర్ణించారు. రెండు రోజుల క్రితం రాయ్‌బరేలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, 2024లో మాయావతి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో కలిసి పోరాడి ఉంటే బీజేపీ అధికారంలోకి వచ్చేది కాదని అన్నారు. కాగా తమతో కలిసి ఎన్నికల్లో ఎందుకు పోటీ చేయలేదో అర్థం కావడం లేదని రాహుల్ అన్నారు. ఈ ప్రకటనపై మాయావతి సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందిస్తూ, ఈసారి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీజేపీ బీ టీమ్‌గా పోటీ చేసిందని, దాని వల్లే ఇక్కడ బీజేపీ అధికారంలోకి వచ్చిందని అన్నారు. కాబట్టి కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఏ విషయంలోనైనా ఇతరులపై, ముఖ్యంగా బీఎస్పీపై విమర్శ చేసే ముందు ఆత్మ విమర్శ చేసుకుంటే మంచిదని హితవు పలికారు.

శంభాజీపై అభ్యంతర సమాచారం.. వీకీపీడియా ఎడిటర్లపై మహారాష్ట్రలో కేసు

ముంబై: ఛత్రపతి శంభాజీ మహారాజ్‌పై అభ్యంతరకర సమాచారాన్ని అప్‌లోడ్ చేసినందుకు నలుగురు వీకీపీడియా ఎడిటర్లపై మహారాష్ట్ర సైబర్ విభాగం పోలీసులు కేసులు నమోదు చేశారు. సంబంధిత సమాచారాన్ని తొలగించాలని అమెరికాలోని కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేసే వీకీపీడియో ఫౌండేషన్‌కు ఇటీవల నోటీసు పంపినట్లు అధికారులు తెలిపారు. భారత్‌లో పూజనీయుడిగా భావించే మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన ఛత్రపతి శివాజీ కుమారుడే శంభాజీ. ఆయన గురించిన తప్పుడు సమాచారం కారణంగా శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదమున్నదని ఆ నోటీసులో పేర్కొన్నారు. అయితే, వీకీపీడియా స్పందించకపోవడంతో నలుగురు ఎడిటర్లపై ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. శంభాజీ మహారాజ్ జీవిత కథ ఆధారంగా ఇటీవల రిలీజైన హిందీ సినిమా 'ఛావా' నేపథ్యంలో ఈ అభ్యంతరం వ్యక్తమైంది.

ఇజ్రాయెల్‌లో మూడు బస్సుల్లో పేలుళ్లు

మిలిటెంట్ల దాడిగా అనుమానం



బట్‌యాంలో పేలుడులో తగులబడిపోయిన బస్సు

టెల్ అవీవ్: బసెంట్రల్ ఇజ్రాయెల్‌లోని ఓ పార్కింగ్ స్థలంలో మూడు బస్సుల్లో గురువారం వరుస పేలుళ్లు జరిగాయి. ఓవైపు నలుగురు బందీల మృతదేహాల అప్పగింతతో ఇజ్రాయెల్ శోకసంద్రంలో మునిగిపోయిన రోజునే ఈ పేలుళ్లు జరిగాయి. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణహాని కాలేదని సమాచారం. బస్సులు ప్రయాణాన్ని ముగించుకుని పార్కింగ్ స్థలంలో ఉండగా పేలుళ్లు సంభవించాయి. మరో రెండు బస్సుల్లో పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయని, ఈ ఐదు బాంబులు ఒకేలా ఉన్నాయని అధికారులు తెలిపారు. బాంబులకు టైమర్లను అమర్చి పేల్చారని, పేలని బాంబులను బాంబ్ స్క్వాడ్ నిర్వీర్యం చేసిందని ఇజ్రాయెల్ పోలీసులు వెల్లడించారు. దీనిని తీవ్రవాదుల దాడిగా ఇజ్రాయెల్ అధికారులు అనుమానిస్తున్నారు. బస్సు పేలుళ్లు 2000వ దశకంలో పాలస్తీనా తిరుగుబాటు సమయంలో జరిగిన బాంబు దాడులను గుర్తుకు తెచ్చాయి. కానీ ఇప్పుడు ఇలాంటి దాడులు చాలా అరుదు. ఈ పేలుడు పదార్థాలు వెస్ట్‌బ్యాంక్‌లో ఉపయోగించిన పేలుడు పదార్థాలతో సరిపోలాయని పోలీసు అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఈ బాంబు పేలుళ్లతో ఇజ్రాయెల్ పోలీసులు అప్రమత్తమయ్యారు. దేశవ్యాప్తంగా బస్సులు, రైళ్లలో తనిఖీలను నిర్వహించారు. టెల్ అవీవ్ వెలుపల ఉన్న బాట్‌యామ్ నగరంలో అనుమానితుల కోసం గాలిస్తున్నారు. బస్సుల్లో పేలుడు పదార్థాలు అమర్చింది ఒకరేనా? ఎక్కువ మంది ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఎవరూ గాయపడకపోవడం ఒక అద్భుతమని బాట్‌యామ్ మేయర్ త్వికా బ్రోట్ అన్నారు.

వెస్ట్‌బ్యాంక్‌కు అదనపు బలగాలు...

బస్సు పేలుళ్లతో.. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఆపరేషన్ నిర్వహించాలని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సైన్యాన్ని ఆదేశించారు. ఇజ్రాయెల్ నగరాల్లో దాడులకు వ్యతిరేకంగా నివారణ చర్యలను పెంచాలని ప్రధాని ఇజ్రాయెల్ పోలీసులు సెక్యూరిటీ ఏజెన్సీలను ఆదేశించారని సైన్యం తెలిపింది. మూడు అదనపు బెటాలియన్లను మోహరించనున్నట్లు సైన్యం తెలిపింది. ఐడీఎఫ్ ప్రస్తుత పరిస్థితులను పర్యవేక్షిస్తోందని, దాడులను విస్తరించడానికి సిద్ధంగా ఉందని ఒక ప్రకటనలో తెలిపింది. గాజా యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి.. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లోని అనుమానిత పాలస్తీనా మిలిటెంట్లపై ఇజ్రాయెల్ పదేపదే సైనిక దాడులు నిర్వహించింది. ఆ అణచివేతలో భాగంగా ఆక్రమిత భూభాగం నుంచి పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్లోకి ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించింది. కాగా, ఉత్తర వెస్ట్ బ్యాంక్ నగరమైన తుల్కరెంకు చెందిన హమాస్ సైనిక విభాగం ఖాస్సామ్ బ్రిగేడ్స్ శాఖగా గుర్తింపు పొందిన ఒక బృందం టెలిగ్రామ్ ఇలా పోస్ట్ చేసింది: 'మా భూములపై ఆక్రమణ ఉన్నంత కాలం మా అమరవీరులకు కోసం ప్రతీకారం తీర్చుకోవడం మేము ఎప్పటికీ మర్చిపోము'అని పేర్కొంది. తుల్కరెం, నగరంలోని రెండు శరణార్థి శిబిరాలపై ఇటీవల ఇజ్రాయెల్ సైనిక దాడులకు పాల్పడింది. ఇక హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి చ్చిన జనవరి 19 నుంచి ఇజ్రాయెల్ వెస్ట్ బ్యాంక్‌లో విస్తృత సైనిక దాడి చేస్తోంది. 'ఆపరేషన్ ఐరన్ వాల్'క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. మరోవైపు గతంలో ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి కాల్పులు, బాంబు దాడులకు పాల్పడ్డారు.

ఢిల్లీ లేడీ డాన్ అరెస్ట్

డ్రగ్స్ తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు



న్యూఢిల్లీ: ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న లేడీ డాన్ జోయా ఖాన్‌ను ఢిల్లీ పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. లగ్జరీ బ్రాండెడ్ వస్తువులను మాత్రమే వాడుతూ విందులు వినోదాల్లో మునిగి తేలే ఈమెకు డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నాయి. భర్త హాషీమ్ బాబా తిహార్ జైలులో ఉండగా అతడి గ్యాంగ్‌ను నడిపిస్తూ వసూళ్ల దందా, ఇతర వ్యవహారాలను చక్కబెడుతూ లేడీ డాన్‌గా పేరు తెచ్చుకుంది. ఈమెపై ఎప్పటి నుంచో నేరారోపణలున్నా ఆధారాలు లేకపోవడంతో పోలీసులు అరెస్ట్ చేయలేకపోయారు. తాజాగా, ఢిల్లీలోని ఓ ప్రాంతంలో డ్రగ్స్‌ను సరఫరా చేసే పనిలో ఉందంటూ నిఘా వర్గాలు సమాచారం అందివ్వడంతో స్పెషల్ సెల్ ఏసీపీ సంజయ్ దత్, ఇన్‌స్పెక్టర్ సందీప్ దాబాస్ తమ బృందంతో వెళ్లి ఈశాన్య ఢిల్లీ ప్రాంతంలోని వెలకమ్ కాలనీలో వలపన్ని జోయాను పట్టుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.కోటి వరకు పలికే 270 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకుని, ఆమెను జైలుకు తరలించారు. ఈ డ్రగ్‌ను ఆమె యూపీలోని ముజఫరాబాద్ నుంచి తెప్పించి, ఇతరులకు విక్రయించేందుకు తీసుకెళుతోందని తేలింది. నదీర్ షా అనే వ్యక్తిని కాల్చి చంపిన షూటర్లకు ఆమె ఆశ్రయం ఇచ్చిందని అనుమానిస్తున్న పోలీసులు ఆధారాలు కనిపెట్టే పనిలో ఉన్నారు.

హాషీమ్‌కు మూడో భార్య

హాషీమ్ బాబా గ్యాంగ్, చెనూ గ్యాంగ్, నాసిర్ పెహల్వాన్ గ్యాంగ్ తదితర ముఠాలు ఈశాన్య ఢిల్లీ అడ్డాగా చేసుకుని ఎన్నో ఏళ్లుగా బలవంతపు వసూళ్లు, డ్రగ్స్ విక్రయాలు, కాంట్రాక్టు హత్యలు వంటి దందా నడుపుతున్నాయి. తరచూ ఈ ప్రాంతంలో ఈ గ్యాంగుల మధ్య ఘర్షణలు సైతం జరుగుతుంటాయి. హత్య, ఆయుధాల స్మగ్లింగ్, వసూళ్ల కేసులో పోలీసులు గ్యాంగ్‌స్టర్ హాషీమ్ బాబాను అరెస్ట్ చేసి తిహార్ జైలుకు పంపారు. జోయా ఖాన్ ఇతడి మూడో భార్య. మొదటి భర్తను వదిలేసి జోయా ఇతడిని 2017లో పెళ్లి చేసుకుంది. గతంలో అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం పోలీసులకు దొరక్కుండా అండర్ గ్రౌండ్‌లో ఉన్న సమయంలో సోదరి హసీనా పార్కర్ అతడి వ్యవహారాలన్నీ నడిపేది. అదేవిధంగా, హాషీం జైలులో ఉండగా గ్యాంగ్ బాధ్యతలను జోయా చేపట్టింది. తరచూ జైలులో ఉన్న భర్తను కలుసుకుంటూ బలవంతపు వసూళ్లు, కాంట్రాక్ట్ హత్యలు, డ్రగ్స్ దందా వంటివి నిరాటంకంగా కొనసాగిస్తోంది. అయితే, పోలీసులకు దొరక్కుండా ఎప్పటికప్పుడు తప్పించుకుంటోంది. ఖరీదైన బ్రాండెడ్ దుస్తులు, వస్తువులంటే ఇష్టపడే జోయా హైఫై విందులు వినోదాల్లో మునిగి తేలుతుంటుంది. ఇవన్నీ ఆమె సోషల్ మీడియా ఖాతాల్లో కనిపిస్తుంటాయి. జోయా కుటుంబానికీ నేర చరిత్ర ఉంది. తల్లి 2024లో సెక్స్ రాకెట్ కేసులో అరెస్టయి 2024లో బెయిల్‌పై బయటకు వచ్చింది. తండ్రిపై డ్రగ్స్ స్మగ్లింగ్ ఆరోపణలున్నాయి. హాషీమ్ బాబా గ్యాంగ్ సభ్యులు నలుగురైదుగురు జోయాకు అనుక్షణం రక్షణగా ఉంటారు.

రాష్ట్రపతిని కలిసిన ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ: ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా నియమితులైన రేఖా గుప్తా శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును రాష్ట్రపతి భవన్‌లో కలుసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి భవన్ 'ఎక్స్'లో విడుదల చేసింది. గోవా గవర్నర్ పి.ఎస్.శ్రీధరన్ పిళ్లై కూడా రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయ్యారని తెలిపింది. కాగా, సీఎం రేఖా గుప్తా అనంతరం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను అధికార నివాసంలో కలుసుకున్నారు.ఇందుకు సంబంధించిన ఫొటోలను ఉపరాష్ట్రపతి సెక్రటేరియట్ విడుదల చేసింది. రేఖా గుప్తా గురువారం ఢిల్లీ సీఎం ప్రమాణంగా ప్రమాణం చేయడం, అనంతరం రాష్ట్ర సెక్రటేరియట్‌లో బాధ్యతలు చేపట్టడం తెలిసిందే.

ఆస్పత్రి నుంచి సోనియా డిశ్చార్జి

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ(78) శుక్రవారం ఉదయం ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఆమె ఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరడం తెల్సిందే. రెగ్యులర్ చెకప్ కోసమే ఆస్పత్రిలో చేరారని, వైద్యుల బృందం ఆమెకు పరీక్షలు జరిపిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అనంతరం సోనియా గాంధీని డిశ్చార్జి చేసినట్లు వెల్లడించాయి.

ఈఎస్ఐలో కొత్తగా 17.01 లక్షల మంది

సాక్షి, న్యూఢిల్లీ: ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ)లో 17.01 లక్షల మంది కార్మికులు కొత్తగా చేరినట్లు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది. గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి వీరు కొత్తగా విధుల్లో చేరిన కార్మికులని ఓ ప్రకటనలో పేర్కొంది. వీరిలో 25 ఏళ్ల వయస్సున్న వారు 48.35 శాతం అంటే 8.22 లక్షల మంది ఉన్నారంది. ఇంకా 3.46 లక్షల మంది మహిళలు, 73 మంది ట్రాన్స్‌జెండర్ ఉద్యోగులు కూడా ఉన్నారని వివరించింది. అదేవిధంగా, ఈఎస్ఐ పథకం కింద కొత్తగా 20,360 సంస్థలు నమోదు చేసుకున్నాయని కార్మిక, ఉపాధి శాఖ తెలిపింది.



హిమాచల్ ప్రదేశ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం కులు జిల్లా మనాలిలో శుక్రవారం మంచు కురిసింది. పర్యాటకుల వాహనాలతో నెహ్రూ కుండ్ ఇలా నిండిపోయింది..!



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో ఈ నెల 26వ తేదీన మహా శివరాత్రి పర్వదినం నాడు జరిగే ఆఖరి పవిత్ర స్నానం కోసం భక్తుల రద్దీ పెరిగిపోతోంది. పెద్ద సంఖ్యలో వాహనాలు రావడంతో శుక్రవారం సంగమం వద్ద ఇలా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

అదానీ వివాదం దేశానికి సంబంధించింది

వ్యక్తిగతమన్న మోదీ వ్యాఖ్యలపై రాహుల్ మండిపాటు



శుక్రవారం రాయ్‌బరేలీలో స్థానికులతో మాట్లాడుతున్న రాహుల్

రాయ్‌బరేలీ: అదానీ గ్రూప్ వివాదం వ్యక్తిగతమంటూ ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. 'అదానీ వ్యవహారం నా వ్యక్తిగతం కాదు..దేశానికి సంబంధించిన వ్యవహారం'అంటూ కుండబద్దలు కొట్టారు. ఇటీవల అమెరికా పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ..అధ్యక్షుడు ట్రంప్‌తో అదానీపై వచ్చిన లంచాల ఆరోపణలపై చర్చించారా అని మీడియా ప్రశ్నించగా.. 'అది ఒక వ్యక్తికి సంబంధించిన అంశం, ఇద్దరు ప్రముఖ ప్రపంచ నేతలు కలుసుకున్నప్పుడు ఇటువంటివి చర్చకు రావు'అని పేర్కొనడం తెలిసిందే. ప్రధాని మోదీతో భేటీ అనంతరం ట్రంప్ కూడా అదానీ వ్యవహారాన్ని ప్రస్తావించకపోవడం గమనార్హం. రాహుల్ శుక్రవారం సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలోని లాల్ గంజ్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ..'నరేంద్ర మోదీ జీ, ఇది వ్యక్తిగత వ్యవహారం కాదు..దేశానికి సంబంధించినది. మీరు నిజంగా భారత ప్రధానే అయితే అదానీ వివాదం గురించి ఆరాతీసి ఉండేవారు. ఆరోపణలపై విచారణకు అవసరమైతే అదానీని అమెరికా పంపిస్తానని ట్రంప్‌కు చెప్పి ఉండేవారు. అలాంటిదేమీ లేకుండా, కేవలం వ్యక్తిగతమంటూ వదిలేశారు'అని రాహుల్ పేర్కొన్నారు. వ్యాపారవేత్త గౌతమ్ అదానీను తన మిత్రుడని పేర్కొన్న మోదీ, ఆయన గురించి ట్రంప్‌ను ఎలాంటి విషయాలు అడగలేదని కూడా చెప్పారని రాహుల్ అన్నారు. అమెరికాలో అదానీపై అవినీతి, దొంగతనం కేసు పెండింగ్‌లో ఉందని రాహుల్ తెలిపారు. సోలార్ పవర్ కాంట్రాక్టుల కోసం అమెరికా కంపెనీలు భారత్‌లోని అధికారులకు రూ.2,100 కోట్ల మేర లంచాలు ఇచ్చినట్లు గత బైడెన్ ప్రభుత్వంలోని న్యాయశాఖ ఆరోపించింది. ఇందులో అదానీ గ్రూప్‌కు కూడా సంబంధమున్నట్లు తెలిపింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూపు నిరాధారాలంటూ ఖండించింది.

యోగి ప్రభుత్వం డబుల్ ఇంజిన్ కాదు.. అసలు ఇంజినే లేదు

యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై రాహుల్ గాంధీ నిప్పులు చెరిగారు. యూపీలో ఉన్నది డబుల్ ఇంజిన్ ప్రభుత్వం కాదు..ఘోరంగా విఫలమైన అసలు ఇంజినే లేని ప్రభుత్వమంటూ ఎద్దేవా చేశారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో మంచిగా పనిచేస్తుండగా, యూపీ ప్రభుత్వం దేశంలోనే అత్యంత విఫలమైన ప్రభుత్వమని దుయ్యబట్టారు. యూపీ ప్రభుత్వం ప్రజల సమస్యల్ని పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలను తీసుకోవడం లేదన్నారు. మరో వైపు, కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణలో మునిగిపోయిందని చెప్పారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. కర్ణాటక, తెలంగాణ మాదిరిగా తయారు చేస్తుంది. నోట్ల రద్దు వల్లే అవినీతితో పాటు చదువుకున్న యువతలో నిరుద్యోగం పెరిగిపోయింది. ఉద్యోగావకాశాలను సృష్టించాలంటే మొదటగా చేయాల్సిన పని చిన్న పరిశ్రమలను బలోపేతం చేసిన రక్షణ కల్పించడమే' అని రాహుల్ సూచించారు.

యూపీలో రోడ్డు ప్రమాదం.. ఆరుగురు మృతి

దొడ్డబళ్లాపురం: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ మేళాకు భక్తులతో వెళ్తున్న వాహనం ట్రక్కును ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరంతా కర్ణాటక వాసులు. మిర్జామురాద్ సమీపంలోని జీటీ రోడ్డులో నిలిపి ఉన్న ట్రక్కును జీపు వేగంగా వచ్చి ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద తీవ్రతకు జీపు ముందు భాగం పూర్తిగా నుజ్జయింది. ఒక మహిళ తల తెగిపోయింది. ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసేందుకు పోలీసులు క్రేన్‌ను రప్పించాల్సి వచ్చింది. క్షతగాత్రులను బనారస్ హిందూ యూనివర్సిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా, బాధితులంతా బీదర్‌లోని లాడగేరి కాలనీకి చెందిన వారు.

క్లాస్‌మేట్‌ను కాల్చి చంపిన బాలుడు

ససరాం(బిహార్): రెండు వర్గాల విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణల్లో ఒక బాలుడు చనిపోగా మరొకరు గాయపడ్డారు. బిహార్‌లోని రోహతాస్ జిల్లాలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ససరాంలోని పరీక్ష కేంద్రంలో గురువారం పదో తరగతికి చెందిన ఇరు వర్గాల విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అనంతరం అమిత్ కుమార్, సంజిత్ కుమార్ అనే విద్యార్థులు ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా వాళ్ల క్లాస్‌మేట్ ఆటోను ఆపి, వెంట తెచ్చుకున్న పిస్టల్‌తో వారిపైకి కాల్పులు జరిపాడు. అమిత్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. సంజిత్ పరిస్థితి నిలకడగా ఉంది. కాల్పులు జరిపిన విద్యార్థి పోలీసుల అదుపులో ఉన్నాడు. తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. దాదాపు ఏడాది నుంచి అమిత్, సంజిత్ మరికొందరు కలిసి తనను వేధిస్తున్నారంటూ నిందితుడు తెలిపాడని పోలీసులు అన్నారు. అదే ఆటోలో ఉన్న మరో విద్యార్థిని కాల్చేందుకు ప్రయత్నించగా బుల్లెట్లు పొరపాటున అమిత్, సంజిత్‌కు తగిలినట్లు అతడు చెప్పాడన్నారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

కేంద్ర- రాష్ట్ర సంబంధాలు

ఒక సమాఖ్య వ్యవస్థ విజయవంతంగా పనిచేయడానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఎంత ముఖ్యమో, అంతర్రాష్ట్ర సంబంధాలూ అంతే ముఖ్యం అనే వాస్తవాన్ని గుర్తించిన రాజ్యాంగ నిర్మాతలు అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించడానికి, స్నేహపూరిత వాతావరణాన్ని కల్పించడానికి రాజ్యాంగంలో కొన్ని ఏర్పాట్లు చేశారు. అందులో ముఖ్యమైనవి..

- అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునళ్లు
- అంతర్రాష్ట్ర మండళ్లు
- పబ్లిక్ చట్టాలు, రికార్డులు, న్యాయస్థానాల ఆదేశాలను పరస్పరం గుర్తించే పద్ధతులు
- అంతర్రాష్ట్ర వాణిజ్య వ్యాపార సంబంధాలు

అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారం

ప్రకరణ 262 ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలను సత్వరమే పరిష్కరించడానికి పార్లమెంటు ఒక చట్టం ద్వారా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయవచ్చు. అలాంటి వివాదాలను నేరుగా ట్రిబ్యునలే పరిష్కరిస్తుంది. ఇందుకోసం 1956లో అంతర్రాష్ట్ర జలాల వివాదాల పరిష్కార చట్టం, రివర్ బోర్డు చట్టాన్ని రూపొందించారు. వీటికి పాక్షిక న్యాయాధికారాలు (Quasi-Judicial) ఉంటాయి.

ప్రకరణ 262(2) ప్రకారం పార్లమెంటు చేసిన చట్టాలపై సుప్రీంకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉండదు. కానీ, కేంద్రం తన శాసన విధులను నిర్వర్తించేలా ఆదేశించవచ్చు.

ఈ ట్రిబ్యునళ్ల ప్రధాన ఉద్దేశం వివాదాలను సత్వరమే పరిష్కరించడం. సాధారణంగా అంతర్రాష్ట్ర వివాదాలు సుప్రీంకోర్టు ప్రారంభ పరిధిలోకి వస్తాయి. అయితే నదీ జలాల పంపిణీ వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక ట్రిబ్యునళ్లు ఏర్పాటైతే, ఆయా రాష్ట్రాలు ట్రిబ్యునళ్లలోనే వివాదాలను పరిష్కరించుకోవాలి. వీటి తీర్పులపై సుప్రీంకోర్టులో కేవలం సలహా పూర్వకమైన అప్పీలు చేసుకోవచ్చు.

ఇప్పటివరకు దేశంలో ఎనిమిది అంతర్రాష్ట్ర నదీ జలాల ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేశారు.

- కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్ -1969 (దీని పరిధిలోకి వచ్చే రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ).
- గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్ - 1969 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ)
- నర్మదా నదీ జలాల ట్రిబ్యునల్- 1969 (రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర)
- రావి, బియాస్ నదీ జలాల ట్రిబ్యునల్- 1986 (పంజాబ్, హర్యానా)
- కావేరి నదీ జలాల ట్రిబ్యునల్- 1990 (కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి)
- కృష్ణా నదీ జలాల ట్రిబ్యునల్ 2-2004 (మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- వంశధార నదీ జలాల ట్రిబ్యునల్-2010 (ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
- మహాదాయి నదీ జలాల ట్రిబ్యునల్-2010 (గోవా, కర్ణాటక, మహారాష్ట్ర).



అంతర్రాష్ట్ర మండలి

ప్రకరణ 263 ప్రకారం అంతర్రాష్ట్ర మండలిని (Inter State Council) ఏర్పాటు చేస్తారు. ఇది కేంద్ర-రాష్ట్రాలు, అంతర్రాష్ట్రాల మధ్య వివిధ అంశాలపై విచారణ చేసి తగిన సూచనలు చేస్తుంది.

నిర్మాణం:

సర్కారియా కమిషన్ నివేదిక (1983-87) మేరకు జనతాదళ్ ప్రభుత్వం (వి.పి.సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు) 1990లో అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం కింద పేర్కొన్న విధంగా ఉంటుంది.

- ప్రధానమంత్రి - అధ్యక్షుడు
- అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు - సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు (శాసనసభలు ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు) -సభ్యులు
- కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు -సభ్యులు
- కేంద్ర ప్రభుత్వ హోంమంత్రి సహా ఆరుగురు కేబినెట్ మంత్రులు - సభ్యులు

విధులు:

- కేంద్ర, రాష్ట్రాల మధ్య ఉమ్మడి ప్రయోజన విషయాలను పరిశీలించి, చర్చించి నివేదిక ఇవ్వడం.
- అంతర్రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని సాధించే పద్ధతిని, చర్యలను సూచించడం.
- కౌన్సిల్‌కు నివేదించిన ఇతర సాధారణ విషయాలపై చర్చించి సూచనలు చేయడం.

కౌన్సిల్ ఏడాదికి మూడు పర్యాయాలు సమావేశం కావాలి. దీని విధులన్నీ సలహా విధులే. సమావేశంలో వివిధ అంశాలను ఏకాభిప్రాయ సాధన పద్ధతిలో నిర్ణయిస్తారు.

1996లో నిరంతర సలహాల కోసం ఒక స్థాయి సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. దీనికి కేంద్ర హోం శాఖా మంత్రి చైర్మన్‌గా ఉంటారు. అయిదుగురు కేంద్ర కేబినెట్ మంత్రులు, తొమ్మిది మంది ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర మండలికి ప్రత్యేక సచివాలయం ఉంది. దీనికి అధిపతిగా కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి ఉంటారు. ఈ సచివాలయమే జోనల్ కౌన్సిళ్లకు కూడా ఉమ్మడి సచివాలయంగా పనిచేస్తుంది.

ప్రకరణ 263 ప్రకారం రాష్ట్రపతి కింద పేర్కొన్న కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

- రాష్ట్రపతి సెంట్రల్ హెల్త్ కౌన్సిల్
- సెంట్రల్ లోకల్ గవర్నమెంట్ కౌన్సిల్
- అర్బన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్
- నాలుగు ప్రాంతీయ అమ్మకపు పన్ను కౌన్సిళ్లను కూడా ఏర్పాటు చేశారు.

అదేవిధంగా 2003లో సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్, సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ హోమియోపతి అనే సంస్థలను కూడా ఏర్పాటు చేశారు.

పబ్లిక్ రికార్డ్‌లు-న్యాయ ప్రక్రియలు

రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర అధికార పరిధి రాష్ట్ర భూభాగానికే పరిమితం కాబట్టి, రాష్ట్రాలు జారీ చేసిన చట్టాలను, రికార్డులను, ఇతర సర్టిఫికెట్లను ఇతర రాష్ట్రాలు కూడా గౌరవించే విధంగా ప్రకరణ 261లో కొన్ని ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టాలను రూపొందిస్తుంది.

అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య సంబంధాలు

రాజ్యాంగంలోని 13వ భాగంలో ప్రకరణ 301 నుంచి 307 వరకు అంతర్రాష్ట్ర వ్యాపార, వాణిజ్య అంశాలకు సంబంధించి కొన్ని రక్షణలు పేర్కొన్నారు. ప్రకరణ 301 ప్రకారం దేశంలో ఎక్కడైనా వాణిజ్యం, వ్యాపారం, వృత్తిని చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. అయితే కొన్ని రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాల కోసం ఈ స్వేచ్ఛలపై కూడా పరిమితులు విధించవచ్చు.

ప్రాంతీయ మండలాలు

జోనల్ కౌన్సిళ్లు చట్టపర సంస్థలు. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా వీటిని ఏర్పాటు చేశారు. దేశాన్ని 5 జోన్లుగా విభజించారు. వీటికి రాజ్యాంగ ప్రతిపత్తి లేదు. కేవలం చట్ట ప్రతిపత్తి (Statutory Status) మాత్రమే ఉంది. అవి:

- **ఉత్తర మండలం:** ఇందులో జమ్ము-కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాలు ఉన్నాయి. దీని ప్రధాన కార్యాలయం ఢిల్లీలో ఉంది.
- **దక్షిణ మండలం:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి. దీని ప్రధాన కార్యాలయం చెన్నైలో ఉంది.
- **పశ్చిమ మండలం:** గుజరాత్, మహారాష్ట్ర, గోవా, దాద్రా & నగర్ హవేలి, డామన్ & డయ్యూ. దీని ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది.
- **తూర్పు మండలం:** బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా. దీని ప్రధాన కార్యాలయం కోల్‌కతాలో ఉంది.
- **మధ్య మండలం:** ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్. దీని ప్రధాన కార్యాలయం అలహాబాద్‌లో ఉంది.
- **ఈశాన్య మండలం:** పైన పేర్కొన్న 5 జోన్లకు అదనంగా ఈశాన్య మండలాన్ని ప్రత్యేకంగా పార్లమెంటు చట్టం ద్వారా 1971లో ఏర్పాటు చేశారు. ఇందులో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర, సిక్కిం రాష్ట్రాలున్నాయి. సిక్కిం రాష్ట్రాన్ని ఎనిమిదో రాష్ట్రంగా (ఈశాన్య రాష్ట్రాల్లో) 1994లో ఈశాన్య మండలంలో చేర్చారు. దీని ప్రధాన కార్యాలయం షిల్లాంగ్ (మేఘాలయ)లో ఉంది.

నిర్మాణం:

ప్రతి జోనల్ కౌన్సిల్‌లో ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఇద్దరు ఇతర మంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలకులు, ప్రణాళికా సంఘం నామినేట్ చేసిన ఒక సభ్యుడు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులు, ఆయా రాష్ట్రాల అభివృద్ధి కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. కేంద్ర హోం శాఖా మంత్రి జోనల్ కౌన్సిళ్లకు ఉమ్మడి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అదేవిధంగా ఆ జోన్‌లోని రాష్ట్ర ముఖ్యమంత్రులు రొటేషన్ పద్ధతిలో ఒక సంవత్సర కాలానికి వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

విధులు:

- దేశంలో ప్రజల మధ్య భావ సమగ్రతను సాధించడం.
- మితిమీరిన ప్రాంతీయ వాదాన్ని, భాషా వాదాన్ని, రాష్ట్ర వాదాన్ని నియంత్రించడం
- రాష్ట్రాల విభజన తర్వాత ఏర్పడిన పరిణామాలను పరిష్కరించి, ఆర్థిక అభివృద్ధి, సమగ్రత మధ్య సమన్వయాన్ని సాధించడం.
- కేంద్రం సహకారంతో సామాజిక, ఆర్థిక అంశాల్లో ఏకరూపకతను సాధించడం.
- విభిన్న ప్రాంతాల మధ్య ఒకే రకమైన రాజకీయ సమానత్వాన్ని సాధించడం.
- జోనల్ కౌన్సిల్ విధులన్నీ సలహాపూర్వకమైనవే.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. కిందివాటిలో కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి రాష్ట్రాలకు ఇచ్చే పన్ను ఏది?
   ఎ) ఎగుమతి, దిగుమతి సుంకాలు
   బి) స్టాంపు డ్యూటీ
   సి) ఆదాయ పన్ను
   డి) రైలు ఛార్జీలపై విధించే పన్ను
2. శాంతి భద్రతలు ఏ జాబితాకు చెందినవి?
   ఎ) రాష్ట్ర జాబితా బి) కేంద్ర జాబితా
   సి) ఉమ్మడి జాబితా డి) ఏదీకాదు
3. అవశిష్ట అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) కేంద్రం బి) రాష్ట్రం
   సి) రాష్ట్రపతి డి) ఏదీకాదు
4. భారత, అమెరికా సమాఖ్యలకు ఉన్న సాధారణ లక్షణం ఏది?
   ఎ) ఏక పౌరసత్వం
   బి) రాజ్యాంగంలో మూడు జాబితాలు
   సి) ద్వంద్వ న్యాయ వ్యవస్థ
   డి) రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడానికి ఒక సమాఖ్య న్యాయ వ్యవస్థ
5. భారత రాజ్యాంగం సమాఖ్యపూరితమని తెలియజేసేది?
   ఎ) లిఖిత, దృఢ రాజ్యాంగం
   బి) స్వతంత్ర న్యాయవ్యవస్థ
   సి) కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికార విభజన
   డి) పైవన్నీ
6. భారత దేశంలోని రాష్ట్రాల మధ్య సహకారం సమన్వయాలకు ఉన్న రాజ్యాంగేతర, చట్టపరంకాని సాధనాలు ఏవి?
   1. జాతీయాభివృద్ధి మండలి
   2. గవర్నర్ల సమావేశం
   3. మండల కౌన్సిళ్లు
   4. అంతర్రాష్ట్ర మండలి
   ఎ) 1, 2 బి) 1, 2, 3
   సి) 3, 4 డి) 4
7. ఆదాయ పన్ను విధింపు, వసూలు, పంపిణీకి సంబంధించి కిందివాటిలో సరైంది?
   ఎ) కేంద్రం విధించి, వసూలు చేసి, ఆ మొత్తాన్ని కేంద్రం, రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది
   బి) అన్ని పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసిన మొత్తాన్ని ఖర్చు చేస్తుంది
   సి) అన్ని పన్నులను కేంద్రం విధించి, వసూలు చేసిన మొత్తాన్ని రాష్ట్రాలకు పంపిణీ చేస్తుంది
   డి) ఆదాయపు పన్నుపై వసూలు చేసిన సర్‌చార్జీని మాత్రం కేంద్రం రాష్ట్రాల మధ్య పంపిణీ చేస్తుంది

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) ఎ; 4) డి;
5) డి; 6) డి; 7) ఎ.

‘శోకాగ్ని’ పదంలోని సమాసం



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

తెలుగు

1. ‘కొండవీటి పొగ మబ్బు - తెలుగువాళ్ల గోల్డునిబ్బు’ అని శ్రీశ్రీతో ప్రశంసలు పొందినవారు?
   1) జాషువా
   2) విశ్వనాథ సత్యనారాయణ
   3) గురజాడ అప్పారావు
   4) రాయప్రోలు సుబ్బారావు
2. ‘శ్లేష కవితా చమత్కృతి’ ఎవరి కవితా గుణం?
   1) చేమకూర వేంకటకవి
   2) రామరాజ భూషణుడు
   3) తెనాలి రామకృష్ణుడు
   4) పింగళి సూరన
3. కాళ్లకూరి నారాయణరావు రచించిన ‘వర విక్రయం’ నాటకం ఒక ?
   1) పౌరాణికం 2) చారిత్రకం
   3) కల్పితం 4) సాంఘికం
4. ‘తెలుగు సాహిత్య విమర్శ అవతరణ - వికాసం’ అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించిన విమర్శకుడెవరు?
   1) కె.వి.ఆర్. నరసింహం
   2) ఎస్వీ రామారావు
   3) గుంటూరు శేషేంద్రశర్మ
   4) కోవెల సుప్రసన్నచార్య
5. ‘అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతి’ అని పేర్కొన్న అలంకారికుడు?
   1) ఆనందవర్ధనుడు
   2) అభినవ గుప్తుడు
   3) విశ్వనాథుడు
   4) భరతుడు
6. రామరాజ భూషణుడు రచించిన ‘హరిశ్చంద్రనలోపాఖ్యానం’ అనేది ఒక
   1) ద్వ్యర్థి కావ్యం 2) చంపూ కావ్యం
   3) త్ర్యర్థి కావ్యం 4) శాంతరస కావ్యం
7. ఈ ఏడాది తుఫాను వచ్చి పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇది ఏ రకమైన వాక్యం?
   1) కర్మణి వాక్యం 2) హేత్వర్థక వాక్యం
   3) శత్రర్థక వాక్యం 4) చేదర్థక వాక్యం
8. ‘స్త్రీల రామాయణ పాటలు’ అనే గ్రంథాన్ని సంకలనం చేసిందెవరు?
   1) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
   2) నండూరి సుబ్బారావు
   3) విశ్వనాథ సత్యనారాయణ
   4) ఆరుద్ర
9. ‘ఎ గ్రామర్ ఆఫ్ తెలుగు లాంగ్వేజ్’ అనే పేరుతో ఆంగ్లంలో తెలుగు భాషకు వ్యాకరణం రాసిందెవరు?
   1) కాల్డ్‌వెల్ 2) క్యాంప్‌బెల్
   3) సి.పి.బ్రౌన్ 4) మెకంజీ
10. వ్యక్తిని కానీ, వ్యవస్థను కానీ విమర్శించడం ఏ ప్రక్రియలో సాధారణం?
    1) కథానిక 2) నవల
    3) గల్పిక 4) వైజ్ఞానిక కల్పనా వ్యాసం
11. 1965-68 మధ్య కాలంలో తెలుగు సాహితీ లోకాన్ని దిగ్భ్రమకు గురి చేసినవారు?
    1) భావ కవులు
    2)అభ్యుదయ కవులు
    3) స్త్రీవాద కవయిత్రులు
    4) దిగంబర కవులు
12. విభక్తి పరమైనప్పుడు ‘గోయి’ మొదలైనవాటి తుది అక్షరం?
    1) ‘ఇ’ వర్ణమగును 2) ‘టి’ వర్ణమగును
    3) ‘ంటి’ వర్ణమగును 4) ‘తి’ వర్ణమగును
13. మనస్తత్వ శాస్త్రం ఆధారంగా ‘గోపీచంద్’ రాసిన నవల?
    1) యమపాశం
    2) పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా
    3) చీకటి గదులు
    4) అసమర్థుని జీవయాత్ర
14. ‘పసిడి పలుకులు, మిన్నేరు, సెలయేరు’ అనే జానపద రచనలు ఎవరు చేశారు?
    1) బిరుదురాజు రామరాజు
    2) ఆర్.వి.ఎస్. సుందరం
    3) నేదునూరి గంగాధరం
    4) జి.ఎస్. మోహన్
15. అభ్యుదయ కవిగా ‘భువనఘోష’ను వినిపించిన కవి?
    1) కె.వి. రమణారెడ్డి
    2) శ్రీశ్రీ
    3) రెంటాల గోపాలకృష్ణ
    4) ఆవంత్స సోమసుందర్
16. ‘శోకాగ్ని’ అనే పదంలోని సమాసం?
    1) షష్ఠీ తత్పురుష
    2) విశేషణ పూర్వపద కర్మధారయం
    3) ఉపమాన పూర్వపద కర్మధారయం
    4) రూపక సమాసం
17. కట్టమంచి రామలింగారెడ్డి ‘ముసలమ్మ మరణం’ ఒక?
    1) వీరగాథా కావ్యం
    2) జానపద కథా కావ్యం
    3) శాంతరస కావ్యం
    4) కరుణ రసాత్మక కావ్యం
18. ‘భారతామృతం కర్ణపుటంబుల నారగ్రోలియాంధ్రావళి మోదము బొరయునట్లు’గా భారతాంధ్రీకరణ చేసినవారు?
    1) నన్నయ 2) తిక్కన
    3) ఎర్రన 4) అధర్వణుడు
19. మూల ద్రావిడ ‘క’ కారం ‘చ’ కారంగా మారడం?
    1) వర్ణ వ్యత్యయం 2) తాలవ్యీకరణం
    3) వర్ణలోప దీర్ఘత 4) వర్ణ సమీకరణం
20. మహ్మదీయ ప్రభువులకు తెలుగు కావ్యాలను అంకితమిచ్చిన ప్రథమ కవి?
    1) పొన్నగంటి తెలగనార్యుడు
    2) అద్దంకి గంగాధరుడు
    3) కందుకూరి రుద్రకవి
    4) చింతలపూడి ఎల్లనార్యుడు
21. ముద్దు పళని రాసిన మోహన శృంగార ప్రబంధం?
    1) సత్యభామా సాంత్వనం
    2) రాధికా సాంత్వనం
    3) ఇళాదేవి సాంత్వనం
    4) రాధాగోపాళం
22. 1943లో తెనాలిలో జరిగిన అరసం ప్రథమ మహాసభకు అధ్యక్షత వహించినవారు?
    1) శ్రీరంగం శ్రీనివాసరావు
    2) తాపీ ధర్మారావు
    3) సురవరం ప్రతాపరెడ్డి
    4) దాశరథి కృష్ణమాచార్యులు
23. ‘భావ కవిత్వానికి నవ్య మార్గ ప్రవక్త’ అని ఎవరిని అంటారు?
    1) రాయప్రోలు సుబ్బారావు
    2) దేవులపల్లి కృష్ణశాస్త్రి
    3) నండూరి సుబ్బారావు
    4) కట్టమంచి రామలింగారెడ్డి
24. తొలి తెలుగు మైనారిటీ వాద కవిత, దాని రచయిత?
    1) జల్‌జలా - స్కైబాబా
    2) వలస - అఫ్సర్
    3) పుట్టుమచ్చ- ఖాదర్ మొహియుద్దీన్
    4) వెండి మేఘం- సలీం
25. ‘తెలుగు బాలెడ్ పొయిట్రీ’ అనే పేరుతో జానపద వ్యాసాలు ప్రకటించిన పాశ్చాత్యుడు?
    1) జె.ఎ.బోయల్ 2) సి.పి.బ్రౌన్
    3) ఆర్.ఎస్. బాగ్స్ 4) డబ్ల్యు.జె.థామ్సన్
26. ‘అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునంబార గుడ కళావిదుడ’ అని చెప్పుకొన్న కవి?
    1) నన్నయ 2) తిక్కన
    3) శ్రీనాథుడు 4) భట్టుమూర్తి
27. ‘జలరుహ నాభుడిట్లు రభసంబున నందన పారిజాతమును’ అనే పద్య పాదం ఏ వృత్తానికి చెందింది?
    1) మత్తేభం 2) శార్దూలం
    3) చంపకమాల 4) ఉత్పలమాల
28. సంగీత, సాహిత్య, నాట్య సంకేతాల సమ్మేళనం కలిగిన పుట్టపర్తి నారాయణాచార్యుల రచన?
    1) శివ తాండవం 2) సాక్షాత్కారం
    3) మేఘదూతం 4) పండరీ భాగవతం
29. వంగూరు సుబ్బారావు ఆంధ్ర పత్రికలో ప్రకటించిన వ్యాసం?
    1) సువర్ణ లేఖలు 2) శారద లేఖలు
    3) ప్రేమ లేఖలు 4) వసంత లేఖలు
30. ‘అనంతం’ అనేది శ్రీశ్రీ రాసిన
    1) రేడియో నాటిక 2) వ్యంగ్య కవితలు
    3) ప్రామాణిక విమర్శ వ్యాసాలు
    4) చారిత్రాత్మక ఆత్మకథ
31. ‘పెళ్లి - దాని పుట్టు పూర్వోత్తరాలు’ ఎవరి రచన?
    1) ఆచార్య తిరుమల రామచంద్ర
    2) తాపీ ధర్మారావు
    3) అయ్యగారి వీరభద్రరావు
    4) గుడిపాటి వెంకటాచలం
32. త్రిపురనేని శ్రీనివాస్ వెలువరించిన గురి చూసి పాడే పాట ఒక?
    1) భావకవితా సంకలనం
    2) దళిత సంకలనం
    3) స్త్రీవాద కవితా సంకలనం
    4) అనుభూతివాద కవితా సంకలనం
33. ‘నేనింత ఒక పిడికెడు మట్టే కావచ్చు. కానీ కలమెత్తితే నాకు ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది’ అని పేర్కొన్న కవి?
    1) తిలక్ 2) మోహన్ ప్రసాద్
    3) శేషేంద్రశర్మ 4) సినారె
34. ‘మొక్కజొన్న, చక్రకేళి’ అనే పదాలు ఏ అర్థ పరిమాణానికి ఉదాహరణ?
    1) అర్థ గౌరవం 2) మృదూక్తి
    3) అలంకారిక ప్రయోగం
    4) లోక నిరుక్తి
35. ‘అభినవ వాగను శాసనుడు’ అని ఎవరిని అంటారు?
    1) గురజాడ అప్పారావు
    2) కందుకూరి వీరేశలింగం
    3) గిడుగు రామ్మూర్తి పంతులు
    4) ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి
36. 'Poetry we will call musical thought' ఈ వాక్యానికి తెలుగు అనువాదం?
    1) మధురమైన భావమే కవిత్వం
    2) ఛందోబద్ధమైన లయ కవిత్వం
    3) మనోహరమైన అర్థమే కవిత్వం
    4) భావనా వ్యక్తీకరణమే కవిత్వం
37. సుప్రసిద్ధ మైనారిటీవాద కవి స్కైబాబా సంపాదకత్వంలో వెలువడిన కథల సంపుటి?
    1) జల్ జలా 2) వతన్
    3) వలస 4) పుట్టుమచ్చ
38. ‘ఇందీవరం’ అనే పదానికి పర్యాయ పదాలు?
    1) నల్లకలువ, నీలోత్పలం
    2) పొలం, శాలిక్షేత్రం, వరిమడి
    3) పర్వతం, నగం, అద్రి
    4) మలయం, ధరణీధరం
39. ‘హేతువాదాన్ని స్వీకరించే భాష కూడా జన్మసిద్ధం’ అని ప్రకటించిన భాషావేత్త?
    1) బ్లూంఫీల్డ్ 2) మాక్స్‌ముల్లర్
    3) యాస్కాచార్యుడు 4) నోమ్‌ఛామ్‌స్కీ
40. ‘మాట్లాడే భాషకు, రాసే భాషకు ఎక్కువ తేడా ఉండరాదు’ అనేది ఏ భాష ముఖ్య ఉద్దేశం?
    1) గ్రాంథికం 2) ప్రామాణికం
    3) వ్యవహారికం 4) శిష్ట వ్యవహారికం
41. బోధనను ప్రభావితం చేసి, చురుకైన అభ్యసనకు తోడ్పడేవి?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా లక్ష్యాలు
    3) బోధనా నైపుణ్యాలు
    4) కనీస అభ్యసన స్థాయిలు
42. ‘నేడు విద్యా విధానం ఉపాధ్యాయుడు కేంద్రంగా కాకుండా, శిశు కేంద్రంగా సాగాలని’ ఎవరు చెప్పారు?
    1) రూసో 2) పెస్టాలజీ
    3) బెంజిమన్ బ్లూమ్ 4) ఫ్రోబెల్
43. ఉపాధ్యాయుడి బోధనా సాఫల్యం ఏ సోపానంపై ఆధారపడి ఉంటుంది?
    1) మూల్యాంకనం 2) ప్రదర్శనం
    3) ఉన్ముఖీకరణ 4) పఠనాపాటవం
44. దేశంలో ఒకే విద్యా ప్రమాణాలను సాధించడానికి ప్రాథమిక దశ విద్యార్థుల కోసం వేటిని ప్రవేశపెట్టారు?
    1) బోధనోపకరణాలు
    2) బోధనా సోపానాలు
    3) కనీస అభ్యసన స్థాయిలు
    4) బోధనా లక్ష్యాలు
45. ఉపాధ్యాయుడు విద్యార్థులతో కత్తి గొప్ప దా? కలం గొప్పదా? లాంటి విషయాలపై వ్యాస రచన చేయించడం ఏ రకమైంది?
    1) విమర్శనాత్మక వ్యాసాలు
    2) ఆలోచనాత్మక వ్యాసాలు
    3) సంవాదాత్మక వ్యాసాలు
    4) వర్ణనాత్మక వ్యాసాలు
46. ఏ విధానంలో ‘బాలబాలికలు స్వయంగా అభ్యసిస్తారు. ఉపాధ్యాయులు కేవలం మార్గదర్శులు’ గా ఉంటారు?
    1) డాల్టన్ పద్ధతి 2) మాంటిస్సోరి పద్ధతి
    3) క్రీడా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
47. 1956లో త్రిభాషా సూత్రాన్ని రూపొందించినవారు?
    1) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
    2) జాతీయ ఉపాధ్యాయ శిక్షణా సంస్థ
    3) జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ
    4) కేంద్రీయ విద్యా విషయక సలహా సంఘం
48. ఉపవాచకం అధ్యయనం చేయాలంటే ఏ పఠనం ఆమోదయోగ్యం?
    1) బాహ్య పఠనం 2) క్షుణ్ణ పఠనం
    3) ప్రకాశ పఠనం 4) విస్తార పఠనం
49. సి.పి.బ్రౌన్ అభిప్రాయం ప్రకారం, ఏ జిల్లాలో మాట్లాడే తెలుగు భాషా రూపం ఆధునిక ప్రామాణిక భాషగా గుర్తింపు పొందింది?
    1) కృష్ణా, గుంటూరు
    2) కృష్ణా, ఉభయ గోదావరి
    3) కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి
    4) కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి
50. సహపాఠ్య కార్యక్రమాలు అనేవి?
    1) బోధనను సులువు చేస్తాయి.
    2) పాఠ్యప్రణాళికకు సన్నిహితంగా ఉండవు.
    3) భాషా సామర్థ్యాల ప్రకటనకు అవకాశం కల్పిస్తాయి.
    4) విద్యార్థుల్లో భాషాజ్ఞానం పెంపొందిస్తాయి.

సమాధానాలు

1) 2	2) 2	3) 4	4) 2	5) 1
6) 1	7) 2	8) 1	9) 2	10) 3
11) 4	12) 4	13) 4	14) 3	15) 1
16) 4	17) 4	18) 2	19) 2	20) 2
21) 2	22) 2	23) 4	24) 3	25) 1
26) 2	27) 3	28) 1	29) 4	30) 4
31) 2	32) 3	33) 3	34) 4	35) 3
36) 1	37) 2	38) 1	39) 4	40) 3
41) 1	42) 3	43) 3	44) 3	45) 3
46) 1	47) 4	48) 4	49) 2	50) 3

ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం?

కుతుబ్‌షాహీల పాలనా వ్యవస్థ

కుతుబ్‌షాహీలు పరదేశీయులు, ఇతర మతస్థులు అనే భావన ప్రజల్లో రానీయకుండా పరిపాలన చేసినట్లు దక్కన్‌లో వెలువడిన సమకాలీన సాహిత్యం వల్ల తెలుస్తోంది. కుతుబ్‌షాహీల పాలనా విధానం, రాజకీయ, ఆర్థిక, మత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించడానికి ఇండో-పారశీక చరిత్ర, అబ్దుల్లా కుతుబ్‌షా, ఔరంగజేబు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు, అక్బర్ నుంచి ఔరంగజేబు వరకు లభిస్తున్న మొగలుల చరిత్ర, గోల్కొండ కవుల సాహిత్యం దోహదపడుతున్నాయి. వీటితో పాటు గోల్కొండను సందర్శించిన బౌరే, టవర్నియర్, తెవ్‌నాట్, బెర్నియర్, మెత్త వోల్డ్, మనుస్సీ, మూర్‌లాండ్ లాంటి విదేశీ యాత్రికుల కథనాలు, వారి యాత్రానుభవాలు వీరి పాలన గురించి తెలియజేస్తున్నాయి. మధ్యయుగ చరిత్రను తెలియజేసే క్రానికళ్లు, మెకంజీస్ సేకరించిన కైఫీయతులు, సుల్తానులు జారీచేసిన ఫర్మానాలు కూడా ప్రధాన ఆధారాలుగా ఉన్నాయి.

కుతుబ్‌షాహీలు బహమనీ సుల్తానుల పాలనా విధానాన్నే అనుసరించారు. ప్రభుత్వ యంత్రాంగంలో సుల్తాన్ ప్రధానపాత్ర పోషించేవాడు. రాజ్యాధిపతిగా ఆయనే శాసనకర్త. సుల్తాన్ తనకు తాను దేవుని ప్రతిబింబం (జిలుల్లా)గా, దైవాంశ సంభూతుడిగా విశ్వసించి నిరంకుశంగా రాజ్యపాలన చేసేవాడు. రాజే సర్వాధికారి, సైన్యాధిపతి, ఉన్నత న్యాయాధిపతి. ప్రభుత్వ విధానాలను రూపొందించి ఫర్మానాలు జారీ చేయడంతోపాటు రాయబారులను, ఉన్నతోద్యోగులను సుల్తానే నియమించేవాడు. రాజ ఆస్థానం ఎల్లప్పుడూ ఆడంబర విలాసాలతో నిండి ఉండేదని సమకాలీన సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

సుల్తాన్ సర్వాధికారి అయినప్పటికీ దైవానికే సమాధానకర్తగా వ్యవహరించేవారు. ఖురాన్ గ్రంథం, సూఫీ మత ప్రభావం వల్ల ప్రజల యోగక్షేమాలు చూసేవారు. రాజధానిలో రాజ్య వ్యవహారాలు చర్చించి, విధాన నిర్ణయాలను అమలు చేయడానికి మజ్లిస్-దివాన్‌దారీ, మజ్లిస్-ఇ-కింగాష్ అనే పండిత పరిషత్తులు ఉండేవి. ఇందులో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతిజ్ఞులు, ఉన్నత ఉద్యోగులు సభ్యులుగా ఉండి సుల్తాన్‌కు రాజ్య వ్యవహారాల్లో సూచనలు, సలహాలు ఇస్తుండేవారు.

కుతుబ్‌షాహీలు గోల్కొండను రాజధానిగా చేసుకొని సుమారు 171 ఏళ్లపాటు పరిపాలించారు. వీరు ఆంధ్రదేశాన్ని సమైక్యం చేసి ఆంధ్ర సంస్కృతిని పోషించారు. తెలుగు ప్రజల ఆదరాభిమానాలను పొందారు. గోల్కొండ రాజ్యంలోని ప్రజల్లో మూడో వంతు హిందువులేనని గుర్తించి, వారి హృదయాలను చూరగొంటే తప్ప సుస్థిర పాలన చేయలేమని భావించారు. జాతి, మత భేదాలను పాటించకుండా అర్హత, సామర్థ్యం ఉన్న వారికి ఉన్నత ఉద్యోగాలిచ్చి ప్రోత్సహించారు.



సుల్తాన్ తర్వాతి స్థానం ప్రధానమంత్రిది. కుతుబ్‌షాహీల కాలంలో ప్రధానమంత్రిని వకీల్-ఇ-ముకాలఖ్ (లేదా) పీష్వా అని పిలిచేవారు. ఇతడు రాజ్యంలో సాధారణ పరిపాలనతో పాటు బహిర్గత, అంతర్గత వ్యవహారాలు నిర్వహించేవాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ముస్తాఫాఖాన్ ఆర్దిస్థానీ, మహమ్మద్ కులీకుతుబ్‌షా కాలంలో మీర్ మెమిన్ అస్త్రాబాది, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో షేక్ మహమ్మద్ ఇబన్‌ఖాతున్ లాంటి వారు ప్రధాన మంత్రులుగా పేరు పొందారు. ప్రధానమంత్రి తర్వాతి స్థానం మీర్ జుమ్లా (మంత్రి)కు ఉండేది. ఇతడు ఆర్థిక, రెవెన్యూ శాఖలతోపాటు రాజ్యంలో రాబడి, ఖర్చులకు సంబంధించిన కార్యకలాపాలను ప్రధానంగా నిర్వహించేవాడు. కొన్ని సందర్భాల్లో పీష్వా కంటే ఎక్కువ అధికారం చెలాయించేవాడు. హైదరాబాద్ నగర నిర్మాత మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలో మీర్జామహమ్మద్ అమీన్, అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మీర్ మహమ్మద్ సయీద్ లాంటి వారు ఆర్థికశాఖా మంత్రులుగా గొప్ప పేరు గడించారు. పీష్వా (లేదా) ప్రధానమంత్రి పేరును అబుల్ హసన్ తానీషా కాలంలో దివాన్‌గా మార్చారు. మాదన్న దివాన్‌గా పేరు గడించాడు. కోశాధికారిని 'ఖజాన్‌దార్'గా, గణాంక శాఖాధికారిని 'మజుందార్'గా, పోలీస్ కమిషనర్‌ను 'కొత్వాల్'గా, పౌర ఉద్యోగిని 'హవల్దార్'గా పిలిచేవారు. ప్రధాన రెవెన్యూ ఉద్యోగిని 'సర్‌ఖేల్' అని పిలిచేవారు. అన్ని రాష్ట్రాలపై ఇతడు పర్యవేక్షణాధికారిగా వ్యవహరించేవాడు. ప్రభుత్వ ఉత్తర, ప్రత్యుత్తరాలను పర్యవేక్షించడానికి డబీరులు అనే ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు. డబీర్ అంటే పండితుడు అని అర్థం. వీరిలో ఒకరు తప్పనిసరిగా హిందువు ఉండేవాడు. ఇతడు సుల్తాన్ జారీ చేసిన ఫర్మానాలను స్థానిక భాషల్లోకి అనువాదం చేసేవాడు. కొత్వాల్ రక్షక భటాధికారి. రాజ్యంలో

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

శాంతిభద్రతల పరిరక్షణ ఇతడి ప్రధాన విధి.

రాజ్యాన్ని తరఫ్‌లు (రాష్ట్రాలు)గా విభజించారు. అబుల్ హసన్ తానీషా కాలంలో ఆరు తరఫ్‌లు ఉండేవి. వీటిలో తెలంగాణా ప్రాంతం ఒకటి. రాష్ట్రాలను సర్కార్లు(జిల్లాలు)గా, సర్కార్లను పరగణాలు(తాలూకాలు)గా విభజించారు. రాష్ట్రానికి తరఫ్‌దార్ (గవర్నర్) అధిపతి. జిల్లా-తాలూకా అధికార్లను ఫౌజ్‌దార్లు అనేవారు. వీరికి సహాయంగా హవల్దార్లు ఉండేవారు. మచిలీపట్నం లాంటి రేవు పట్టణానికి హవల్‌దార్లు ఉండేవారు. ప్రధాన రేవు అధికారిని షా బందర్ అని పిలిచేవారు. సర్కార్లను సీమలు అని కూడా పిలిచేవారు. బెల్లంకొండ, వినుకొండ, నిజాంపట్నం, కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైన 22 సీమలు ఉండేవి. అబుల్ హసన్ కాలంలో 37 సర్కారులు, 517 పరగణాలు ఉండేవి.

రేవు పట్టణాల్లో షాబందర్, హవల్‌దార్లు సుంకాలు వసూలుచేసేవారు. రాజ్యంలో శిస్తు వసూళ్లను వేలంపాటల ద్వారా అమ్మేవారు. సర్కార్లను కొన్ని ప్రాంతాలుగా విభజించి ఇష్టమైన వారికి శిస్తు వసూలు అధికారాన్ని ఇచ్చేవారు. ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు లేదా ముగ్గురు మధ్యవర్తులు ఉండటంతో రైతుపై శిస్తుభారం విపరీతంగా పెరిగింది. దేశ్‌పాండే, ఠాణేదార్లు, దేశ్‌ముఖ్‌లు, మజుందార్లు, తలస్కర్ణి లాంటి వారి పాత్ర నిరంకుశంగా ఉండేది. వీరు గ్రామీణ రైతులను దోచుకు తినేవారు. అబుల్ హసన్ పాలనా కాలంలో మజ్లిస్-ఇ-దివాన్ (ప్రివీ కౌన్సిల్) ఏర్పడింది. ఇది రోజూ క్రమం తప్పకుండా సమావేశం అయ్యేది. ఈ సంఘంలో 20 మంది సభ్యులు ఉండేవారు. వీరికి వేతనాల కింద జాగీర్లు ఇచ్చేవారు.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఇంగ్లిష్ తూర్పు ఇండియా వర్తక సంఘానికి మచిలీపట్నంలో ఫ్యాక్టరీని స్థాపించడానికి అనుమతి ఇచ్చినవారెవరు? (గ్రూపు-2, 2008)
జవాబు: అబ్దుల్లా కుతుబ్ షా
2. బీరారు రాజ్యాన్ని స్థాపించిన వంశస్థులు? (గ్రూపు-2, 2005)
జవాబు: ఇమాద్ షాహీలు
3. ఆది మహాదేవుని దేవాలయం సమీపాన జన్మించిన నది ఏది? (గ్రూపు-2, 2005)
జవాబు: గోదావరి
4. భగవద్గీతను పర్షియన్ భాషలోకి తర్జుమా చేసినవారెవరు? (గ్రూపు-1, 2003)
జవాబు: దారాషికో
5. ప్రాకృత భాషలో సంకలనం చేసిన 'గాథా సప్తశతి' వేటి గురించి వివరిస్తుంది? (సివిల్స్ ప్రిలిమ్స్-2002)
జవాబు: శృంగారగాథలు
6. భారతదేశంపై దండెత్తిన మొదటి ముస్లిం రాజు ఎవరు? (గ్రూపు-2, 2000)
జవాబు: మహమ్మద్‌బిన్ కాశిమ్
7. కిందివాటిలో సరికాని జత ఏది? (నాన్ గెజిటెడ్ జనరల్ స్టడీస్-2005)
ఎ) నిజాం షాహీ - అహమ్మద్‌నగర్
బి) ఆదిల్ షాహీ - బీజాపూర్
సి) కుతుబ్ షాహీ - గోల్కొండ
డి) ఇమాద్ షాహీ - బీదర్
జవాబు: డి
8. కిందివాటిలో మహమ్మద్ కులీకుతుబ్ షా నిర్మించని కట్టడం? (గ్రూప్-1, 2003)
ఎ) గోల్కొండ బి) హైదరాబాద్
సి) చార్మినార్ డి) జుమా మసీద్
జవాబు: ఎ
9. 'చార్మినార్'ను దేనికి గుర్తుగా నిర్మించారు? (గెజిటెడ్-2005)
జవాబు: ప్లేగు వ్యాధి నిర్మూలనలో విజయం
10. ఔరంగజేబు గోల్కొండను జయించిన సంవత్సరం? (గెజిటెడ్-2005)
జవాబు: క్రీ.శ. 1687

వాస్తు, స్మారక నిర్మాణాలు

వాస్తుపరంగా విశిష్టమైన కుతుబ్ షాహీ శైలి వెలుగులోకి వచ్చింది. వీరు బహమనీ సుల్తాన్ల వాస్తు విధానాన్నే అనుసరించారు. పెద్ద గుమ్మటాలు, విశాలమైన ప్రవేశ ద్వారాలు, ఎత్తైన మినార్లు, అష్టకోణాకృతి నిర్మాణాలు ఈ శైలికి సంబంధించిన ముఖ్య లక్షణాలు. చార్మినార్, చార్‌కమాన్, మక్కామసీదు, టోలీ మసీదు, గోల్కొండ కోట, గోల్కొండ సమాధులు తదితరాలను ముఖ్యమైన వాస్తు కట్టడాలుగా పేర్కొనవచ్చు.

కుతుబ్‌షాహీ మూడో సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మూసీ నదిపై పురానాపూల్ (పాత వంతెన)ను 1578లో నిర్మించారు. ఇతడి కాలంలోనే హుస్సేన్‌సాగర్, బద్వేల్, ఇబ్రహీంపట్నంతో పాటు గోల్కొండ కోటలో ఇబ్రహీం మసీదును నిర్మించారు.

మహమ్మద్ కులీకుతుబ్ షా 1591లో మూసీ నది ఒడ్డున 'చిచలం' గ్రామంలో ప్లేగు వ్యాధి నివారణకు గుర్తుగా చార్మినార్‌ను నిర్మించాడు. 1594లో హైదరాబాద్‌లో జుమామసీదు, బాదుషాహీ అసూర్ ఖానా (పత్తర్‌గట్టీ), దారుల్‌షిఫా, చార్‌కమాన్ లాంటివాటిని నిర్మించారు. వీటిని రాయి, సున్నంతో నిర్మించారు. మహమ్మద్ కుతుబ్‌షా(1612-26)కాలంలో 1617లో దక్షిణ భారతదేశంలోనే అతిపెద్దదైన మక్కామసీదును నిర్మించారు.

కుతుబ్‌షాహీల స్మారక నిర్మాణాలు, గోల్కొండ కోట అంతర్భాగంలో భక్త రామదాసు బందీఖానా, రాణీమహల్, సుల్తానుల మరణానంతరం ఖననానికి ముందు స్నానం చేయించే గదులు నేటికీ ఉన్నాయి. కుతుబ్‌షాహీల సమాధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వాస్తు స్మారక నిర్మాణాలు. కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో అత్యంత విశాలమైన మైదానంలో నిర్మించినవి ఇవే. ఒకే రాజవంశానికి చెందిన సుల్తానుల సమాధులన్నీ ఒకే ప్రాంగణంలో నిర్మించడం ప్రపంచచరిత్రలో ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. సమాధి డోమ్ అంతర్భాగాన్ని కోణాకృతిలో ప్రత్యేక సాంకేతిక పద్ధతిలో నిర్మించారు.

Whose rank is first in a class test?

MODEL QUESTIONS

Directions (Q. No. 1-5): Study the following information carefully and answer the following questions.

P, Q, R, S, T and U are six members of a group in which there are three female members. Females work in three departments - Accounts, Administration and HR - and sit on three different floors - Ground floor, first floor and second floor. Person working in the same department are not on the same floor. On each floor two persons work. No two females work in the same department or sit on the same floor. Q and T work in the same department but not in HR. S works in Administration. T and P are on the ground floor and second floor respectively and work in the same department. S, a female does not sit on the first floor. R, a male works on ground floor. U, works on the first floor; and S and P work on the same floor.

1. Which of the following group of members are female?
1) S, T, U 2) R, S, T
3) Q, T, U 4) P, S, U
5) Can't be determined
2. Which of the following pair of person work in Administration?
1) R, S 2) Q, S 3) R, T
4) Data inadequate
5) None of these
3. Which of the following pair works on second floor?
1) P, S 2) R, S 3) Q, U
4) S, T 5) None of these
4. U works in which department?
1) Accounts 2) HR
3) Administration
4) Either HR or Administration
5) None of these
5. If U is transferred to Accounts and T is transferred to Administration, who is to be transferred to HR to maintain the original distribution of female on each floor.
1) R 2) S 3) Q or S
4) Data inadequate
5) None of these

Directions (Q. No. 6-8): Study the following information carefully and answer the given questions:

Six students A, B, C, D, E and F wrote an exam and the following is the data regarding their marks (maximum marks is 20).

- E got twice as much as A.
- A got one-and-a-half times as much as C.



- B got one-third of the marks scored by E.
- D got double that of C.
- F scored 6 marks more than A but is not the topper of the class. (All marks are integers)

6. Who is the topper of the class & how many marks did he obtain?
1) D - 15 2) E - 12 3) A - 18
4) D - 12 5) E - 18
7. How much more marks does A have to score to be the topper? (if only one person is on 1st position).
1) 9 2) 6 3) 8 4) 10 5) 12
8. What is the difference between the marks obtained by C and F?
1) 6 2) 7 3) 5 4) 8 5) 9

Directions (Q. No. 9-13): Each of the questions below consists of a question and three statements numbered I, II and III given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question and then mark the appropriate option as answer.

9. Six friends M, T, S, R, U and W are sitting around a circular table facing the centre. What is the position of S with respect to M?
I) M is between R and T.
II) R sits second to the left of W.
III) U does not sit on the immediate right of R.
1) Only I and II
2) Only II and III
3) Only III
4) Only I and III
5) All I, II and III together
10. What is the code for 'cold' in a code language?
I) 'icecream is cold' is written as 'tic jic lic'.
II) 'fruits are healthy' is written as 'mic fic eic'.
III) 'healthy is icecream' is written as 'jic mic lic'.
1) Only I 2) Only II
3) Only I and II 4) Only III and I
5) None of these

BANK EXAMS
REASONING

11. Among P, Q, R, S, T and U, whose rank is first in a class test?
I) P scored more than only R and S.
II) T's rank is 3rd highest.
III) U did not score the highest marks.
1) Only I 2) Only II 3) Only III
4) I, II and III even together are not sufficient to answer the question.
5) All I, II and III
12. Five persons Jitesh, Jeevan, Jeet, Jai and Jeena sit on a straight line, facing north, but not necessarily in the same order. How many persons sit between Jitesh and Jai?
I) Jeet sits second to the right of Jitesh. Jai is not an immediate neighbour of Jitesh.
II) Jeena sits on the extreme end of the line.
III) Jeet sits on the immediate right of Jeevan.
1) Only II 2) Only III
3) Only I and II
4) Only I and III
5) All I, II and III together
13. How is N related to X?
I) M is brother of N; M is grandson of W.
II) S is sister of N.
III) X is mother of M's father.
1) Only I 2) Only II 3) Only III
4) All I, II and III together
5) Even I, II and III together are not sufficient

Directions (Q. No. 14 - 18): Study the following information carefully and answer the given questions:

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement. (All the numbers are two-digit numbers.)

Input: set near 14 19 went 20 78 ago 80 toy 36 pink 42 colour
Step I: went set near 19 20 78 ago 80 toy 36 pink 42 colour 14
Step II: went toy set near 20 78 ago 80 36 pink 42 colour 14 19
Step III: went toy set pink near 78 ago 80 36 42 colour 14 19 20
Step IV: went toy set pink near colour 78 ago 80 42 14 19 20 36
Step V: went toy set pink near colour ago 78 80 14 19 20 36 42
Step VI: went toy set pink near colour ago 80 14 19 20 36 42 78
Step VII: went toy set pink near colour ago 14 19 20 36 42 78 80

Step VII is the last step of the above input, as the desired arrangement is obtained.

As per the rule followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 near.

(All the numbers are two-digit numbers.)

14. Which step number is the following output?
two thus so one near and 90 88 make 56 12 15 18 21
1) Step V 2) Step VI
3) Step IV 4) Step III
5) There is no such step
15. How many elements (words or numbers) are there between 'make' and '18' as they appear in last but one step?
1) 3 2) 4 3) 5 4) 2 5) 6
16. How many steps would be required to get the final output?
1) Five 2) Six 3) Four
4) Seven 5) None of these
17. Which of the following represents the position of 'and' in the fifth step?
1) Sixth from the left
2) Seventh from the left
3) Fourth from the right
4) Eighth from the left
5) Sixth from the right
18. Which word/number would be at fifth position from the right in Step VI?
1) 12 2) 18 3) 90
4) and 5) 15

Answers With Explanations

(1-5):

Person	Sex	Floor	Department
P	Male	Second floor	Accounts
Q	Male	First floor	Accounts
R	Male	Ground floor	HR/Administration
S	Female	Second floor	Administration
T(-)	Female	Ground floor	Accounts
U(-)	Female	First floor	HR


1) 1; 2) 4; 3) 1; 4) 2; 5) 2.

(6-8):
E → 18
F → 15
D → 12
A → 9
B/C → 6


6) 5; 7) 4; 8) 5;

9) 5;


From I



From I and II



From I, II and III




From all three statements, M sits second to the left of S. So, all three statements are necessary to answer the question.

10. 4; From I and III,
icecream is cold → tic jic lic ...(1)
healthy is icecream → jic mic lic ...(2)
icecream → jic or lic
is → lic or jic
So, the code for 'cold' is 'tic'.
Thus, statements **I** and **III** are sufficient


11. 5; From I. P > R, S
From I and II. – > – > T > P > R, S
From I, II and III.
Q > U > T > P > R, S
Hence all together are sufficient

12. 3;

Form I.




Form I& II



Thus I and II together are sufficient.

13. 5; **From I.** M is Brother of N and Grand-son of W and M is male.
From II. S is female and Sister of M,
From III. X is Grand mother of M.
So, in family tree, the sum of all three statements is as follows:



Here N's gender is not defined So, we can't say whether N is Grandson or Granddaughter of X.

(14-18):

The machine rearranges words and numbers in such a way that numbers are arranged from right side and words are arranged from left side. While numbers are arranged in ascending order, words are arranged in reverse alphabetical order.

Input: one 15 and 90 two 88 12 make 18 so 21 thus 56 nears.
Step I: two one 15 and 90 88 make 18 so 21 thus 56 near 12
Step II: two thus one and 90 88 make 18 so 21 56 near 12 15
Step III: two thus so one and 90 88 make 21 56 near 12 15 18
Step IV: two thus so one near and 90 88 make 56 12 15 18 21
Step V: two thus so one near make and 90 88 12 15 18 21 56
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88
Step VII: two thus so one near make and 12 15 18 21 56 88 90

14. 3;

15. 2;
Sixth step is the last but one.
There are four elements between 'make' and '18'.
The elements are : and, 90, 12 and 15

16. 4;

17. 2; **Step V:** two thus so one near make and 90 88 12 15 18 21 56
Thus, Seventh from the left is 'and'.

18. 5;
Step VI: two thus so one near make and 90 12 15 18 21 56 88.
Thus fifth from the right is 15